ఈనాడు

విజయవాడ 8-8-2017 మంగళవారం సిటీ సంపుటి 43 . సంచిక 360

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

శ్రీవారికి నూతన సర్వభూపాల వాహనం



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి నూతన సర్వభూపాల వాహనాన్ని తితిదే తయారు చేయించింది. ఇప్పటివరకు ఉన్న వాహనం బరువుగా ఉండడం, వాహనంలో వేంచేసిన ఉత్సవ మూర్తులు భక్తకోటికి సరిగ్గా కనిపించడంలేదనే కారణంతో కొత్త వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. 16 అడుగుల ఎత్తున్న ఈ వాహనానికి 9 కిలోల బంగారంతో తాపడం పనులు చేశారు. తమిళనాడుకు చెందిన నిపుణుడు కల్యాణ సుందరం దీన్ని తీర్చిదిద్దారు. రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఈ వాహనాన్ని తొలిసారిగా వినియోగించనున్నారు.

- న్యూస్‌టుడే, తిరుమల

పన్ను పలుకులు...



పాన్ కార్డు పరీక్ష

- 11 లక్షల కార్డులు తాత్కాలికంగా చెల్లుబాటు కావు
- నకిలీలు, బహుళకార్డులు తొలగించేందుకే: ఐటీ విభాగం

దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం దాదాపు 11.44 లక్షల శాశ్వత ఖాతా సంఖ్య (పాన్ కార్డు)లను తాత్కాలికంగా చెల్లుబాటు కాకుండా చేసింది. నకిలీ ధ్రువపత్రాలతో పొందారని అనుమానం ఉన్నవి, ఒకే వ్యక్తి, ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు కలిగి ఉన్నారని గుర్తించినవి వీటిలో ఉన్నాయి. తమ పాన్‌కార్డు చెల్లుబాటులో ఉందో, లేదో తెలుసుకునే వీలును ఐటీ విభాగం కల్పించింది. ఇందుకు ఆదాయపు పన్ను విభాగం, ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పరిశీలించుకోవచ్చు. ఇందుకు ఇ-ఫైలింగ్ హోం పేజీలో సర్వీసెస్ విభాగంలలో ఉండే 'నో యువర్ పాన్' అనే లింక్‌ను క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన (మిగతా 2లో)

రిటర్నుల ధమాకా

- 2016-17కు సంబంధించి 25 శాతం అధికంగా నమోదు
- 41.79 శాతం వ్యక్తిగత పన్ను ముందస్తు వసూళ్లు

ఈనాడు, దిల్లీ: గత ఆర్థిక సంవత్సరానికి (2016-17) సంబంధించిన ఆదాయపు పన్ను (ఐటీ) రిటర్నులు 2.82 కోట్లకుపైగా దాఖలయ్యాయి. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాఖలైన ఐటీ రిటర్నులు 2.26 కోట్లతో పోలిస్తే ఈ సంఖ్య 24.70% ఎక్కువ. ఈ నెల 5తో ఐటీ రిటర్నులకు గడువు ముగిసిన విషయం తెలిసిందే. గత ఏడాది ఐటీ రిటర్నుల్లో 9.9 శాతం వృద్ధి రేటు కనిపించింది. వ్యక్తుల పరంగా చూస్తే ఈ నెల 5 నాటికి 2.79 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 25.30 శాతం అధికం. ఇక ఆదాయపు పన్ను ముందస్తు వసూళ్లు కూడా గణనీయంగా పెరిగినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈనెల 5 నాటికి (మిగతా 2లో)

పోలవరం పరుగు

- ఏడాదిలో ఐకానిక్ వంతెన పూర్తి చేయాలి
- 3 నెలల్లో 28 జలవనరుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం
- 518 మంది కొత్త ఇంజినీర్లకు నియామక పత్రాలు అందజేత
- జోరువానలో పనులను పరిశీలించిన చంద్రబాబు

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే-పోలవరం

'ప్రపంచంలో పది అత్యుత్తమమైన వంతెనల్లో ఒకటిగా పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న ఐకానిక్ వంతెన ఉండాలి. దీనిని సంవత్సరకాలంలో పూర్తి చేయాలి. 1040 మీటర్ల పొడవున ఉండే దీనిపై పైలాన్‌ను నిర్మించాలి. దానిపైన సుమారు 300 మంది వీక్షించేలా ప్రత్యేక స్థలాన్ని, ఒక రెస్టారెంటు, విడిది క్షేత్రాలు నిర్మించాలి.

తూర్పుగోదావరి జిల్లాలో శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉంటే అవసరమైతే మరో 2 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేస్తాం.'



జోరువానలో పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పోలవరానికి ప్రతి నెలా ఎన్ని నిధులు కావాలో అన్నీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 45.15 అడుగులకు స్పిల్‌వే‌ను నిర్మించాలంటే భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌లకు రూ.28 వేల కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన అనంతరం ఆయన ప్రాజెక్టు గుత్తేదారులు, అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి కలెక్టర్ కాటంనేని భాస్కర్ తమకు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌లకు వెయ్యి కోట్లు కావాలని, తూర్పుగోదావరి కలెక్టర్ కార్తికేయ మిశ్రా తమ జిల్లాకు సంబంధించి పై రెండు అంశాలకు రూ.810 కోట్లు కావాలని కోరారు. వంతెన నిర్మాణంలో భాగంగా రెస్టారెంట్లు, ఇతర వీక్షణ ఏర్పాట్లకు మరో నాలుగు నెలలు అదనంగా సమయం కావాలని గుత్తేదారు ప్రతినిధి మారియో కోరారు.

ఆదర్శ ఇంజినీర్లుగా ఎదగాలి

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన 518 మంది ఇంజినీర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు స్థలంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీర్లను ఉద్దేశించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ఒక చరిత్ర అయితే ఎక్కడాలేని విధంగా జలవనరుల శాఖలో ఉద్యోగాలు పొంది పోలవరం వంటి ప్రాజెక్టువద్ద నియామకపత్రాలు అందుకోవడం ఒక చరిత్రేనన్నారు. కొత్త ఇంజినీర్లు ధవళేశ్వరం బ్యారేజీ కట్టిన సర్‌ఆర్థర్ కాటన్, కేఎల్‌రావు, శివరామకృష్ణయ్య, ప్రస్తుతం సేవలందిస్తున్న పోలవరం (మిగతా 2లో)

రోజుకు 50 కోట్లు తాగేస్తున్నారు!

- మద్యం వదలి... బీర్ల వైపు చూస్తున్న మందుబాబులు
- జులైలో రూ.1,574.92 కోట్ల విలువైన విక్రయాలు
- గతేడాది జులై నెలతో పోలిస్తే పెరిగిన ఆదాయం 14లో

చిట్టి ఊహలకు గట్టి రెక్కలు

- చిన్నారుల ఆలోచనల ప్రోత్సాహకానికి ఏటీఎల్‌లు
- తెలుగు రాష్ట్రాల్లో 47 ప్రయోగశాలలు సిద్ధం 16లో
- బాలల్ని ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

పేదల గుర్తింపునకు కొత్త లెక్క 13లో

త్వరలో మంత్రివర్గ నిర్ణయం



'చంద్రన్న కానుక'లో పేదలకు చీర, ధోవతి!

చేనేత సంక్షేమ మండలి, నిధి ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ప్రతి సంక్రాంతికి ఇచ్చే 'చంద్రన్న కానుక'లో పేదలకు రేషన్‌కార్డుపై చేనేత చీర, ధోవతిని ఇవ్వనున్నట్లు చేనేత శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. సంఘాల్లో అమ్మగా మిగిలిన వాటన్నింటినీ సేకరించి ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. చేనేతపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా కలిశారని పేర్కొన్నారు. పార్టీ ఎంపీలతో కలిసి ప్రధానిని కూడా కలుస్తామని అన్నారు. దీనిపై అవసరమైతే కేంద్రంపై పోరాటానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. చేనేత రుణ మాఫీకి రూ.100 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.75 కోట్లు విడుదల చేశామని చెప్పారు. అర్హులు ఎవరైనా ఉంటే నెలాఖరులోగా వివరాలను సమర్పించాలని సూచించారు. చేనేత కార్మికుల్లో (మిగతా 2లో)



ఒంటరితనం ప్రాణాంతకం!

సర్వరోగాలకు, సకల అనర్థాలకూ మూలం ఊబకాయం. కాని అంతకంటే ఒంటరితనమే అతిపెద్ద ముప్పు అని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. చాలాకాలంపాటు ఒంటరిగా గడిపేవారికి రక్తపోటు, కుంగుబాటు, మతిమరుపు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వారు తేల్చిచెప్పారు. ఆయుఃప్రమాణాలు పెరుగుతుండడంతో ప్రతిదేశంలో వృద్ధుల సంఖ్య అధికమవుతోంది. భార్యాభర్తల్లో ఒకరు చనిపోయి లేదా విడాకులు తీసుకొని, పిల్లలు ఎవరూ దగ్గర లేక ఒంటరిగా రోజుల గడపాల్సిన పరిస్థితి ఎందరికో ఎదురవుతోంది. ముఖ్యంగా ఐరోపా, అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని ప్రజలకు ఒంటరితనం పెనుసవాలుగా మారుతోంది. ఇప్పుడిప్పుడే మనదేశంలో కూడా ఈ సమస్య పెరిగిపెద్దదవుతోంది.

- ప్రత్యేక కథనం 2లో

సిగరెట్లు, మద్యం కంటే ప్రమాదం

యూకేలోని 'క్యాంపైన్ టు ఎండ్ లోన్లీనెస్' అనే సంస్థ ఒంటరితనం ఎంతో పెద్ద సమస్య అని గణాంకాలతో స్పష్టం చేస్తోంది.

- రోజుకు 15 సిగరెట్లు, మద్యం తాగితే ఆరోగ్యం ఎంతగా చెడిపోతుందో అంత నష్టం కేవలం ఒంటరితనం వల్ల కలుగుతుంది.
- ఒంటరిగా ఉండేవారికి అధిక రక్తపోటు ముప్పు పొంచి ఉంటుంది. నిద్రలేమి సర్వసాధారణం. కుంగుబాటు, మతిమరుపు, నిలకడలేమి.. వంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. గుండెపోటు వచ్చే అవకాశాలు కూడా అధికం.
- అందరితో కలిసి ఉండేవారితో పోల్చితే ఒంటరిగా ఉండే వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటోంది.
- వృద్ధులకు స్నేహితులు, బంధువులు, సహచరులను తరచు కలుసుకోవటం లేదు. వారంలో ఒకసారైనా సన్నిహితులను కలుసుకునే వృద్ధుల సంఖ్య 17 శాతం మాత్రమే. వృద్ధుల్లో అత్యధికులకు టీవీ మినహా మరో వ్యాపకం ఉండటం లేదు.
- ఉద్యోగస్తులు పదవీ విరమణ చేసిన తర్వాత అన్ని పనులు మానుకొని ఎక్కడో దూరంగా ఇల్లు కొనుక్కొని స్థిరపడాలనుకుంటూ ఉంటారు. కానీ అది సరైన ఆలోచన కాదని చురుకైన జీవితానికి దూరం కారాదని వైద్య నిపుణులు వివరిస్తున్నారు.



పడగెత్తిన పరిహారం

ఈనాడు, అమరావతి: పరిహారం రూపేణా పులిచింతల గుత్తేదారు కోటానుకోట్లు పొందనున్నారా? ఉన్నతాధికారులు, ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, సమన్వయలోపం వెరసి వడ్డీల రూపంలోనే గుత్తేదారుకు రూ.కోట్లు సమర్పించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది కిందట మచిలీపట్నం జిల్లా ప్రిన్సిపల్‌జడ్జి ఇచ్చిన తీర్పుపై జలవనరులశాఖ అధికారులు ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయలేదు. దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నదీ లేదు. దస్త్రం అడ్వొకేట్ జనరల్‌వద్దకు వెళ్లి ఈ మధ్యే వచ్చింది. ఇంతలోనే పులిచింతల గుత్తేదారు ఎం.ఎస్.ఎస్‌సీఎల్-సీర్ కంపెనీ ప్రతినిధులు మళ్లీ కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కిందటేడాది (మిగతా 2లో)

- పులిచింతల గుత్తేదారుకు డబ్బే డబ్బు
- ప్రారంభంలో 95 కోట్లు
- ఇప్పుడు 355 కోట్లు
- గట్టిగాను పోరాడరూ... నిక్కచ్చి నిర్ణయమూ తీసుకోరు
- తాజాగా న్యాయస్థానం నిర్ణయంతో మల్లగుల్లాలు

- 2012కు ముందు రూ.95 కోట్లుగా ఉన్న పరిహారం ఇప్పుడు రూ.355 కోట్లకు చేరింది. విచిత్రమేమిటంటే 2005లో గుత్తేదారు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్న పని విలువ కేవలం రూ.268.86 కోట్లు. అలాంటిది ఇప్పుడు గుత్తేదారుకు చెల్లించాల్సిన పరిహారమే రూ.355 కోట్లు. ఇందులో వడ్డీయే ఎక్కువ కావడం విశేషం.
- కిందటేడాది జూన్‌లో తీర్పు తర్వాత ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేసే విషయంలోనూ అధికారులు నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు ఈ దస్త్రం అడ్వొకేట్ జనరల్ వద్దకు వెళ్లింది. ఈ మధ్యనే ఆయన వద్ద నుంచి జలవనరుల శాఖకు చేరినట్లు సమాచారం. ఇప్పుడు ఆస్తులు అటాచ్ చేయడంతో దీనిపై ఉన్నత న్యాయస్థానానికి వెళతారా? లేదా చెల్లింపులు జరుపుతారా? అనేది చూడాలి.

ఇదీ సంగతి!



రాజకీయాలనూ మాఫియానూ ఎలా విడదీస్తారు... నన్ను నానుంచి ఎలా విడదీయగలరో చెప్పు చెప్పవయ్యా!


కష్టం.. నష్టం అన్నదాతకే

- గడువు పెంచినా... పెంచకపోయినా ఇబ్బందే
- రైతుకు భారమైన పంటల బీమా నిబంధన

ఈనాడు - అమరావతి

పంటల బీమా పథకం గడువు జులై31 నాటికి ముగిసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, తగ్గిన పంటల సాగును దృష్టిలో పెట్టుకుని మరి కొంత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. దీన్ని పరిగణనలోకి తీసుకుని గడువు పెంచితే కేంద్రం నుంచి రావాల్సిన ప్రీమియం వాటాపై ఆశలు ఒదులుకోవాల్సిందే. అలాగని పెంచకపోతే వర్షాలు కురిసిన తర్వాత పంట వేసి.. నష్టపోతే బీమా అందదు. ఈ రెండూ రైతుకు నష్టం... కష్టం కలిగించే అంశాలే.

గడువు పొడిగిస్తే కేంద్రం వాటా వదులుకోవాల్సిందే..



- గడువు పొడిగించాలంటే తాము చెల్లించాల్సిన వాటా ధనంపై ఆశలు వదులుకోవాలనేది కేంద్రం నిబంధన. ఈ మొత్తాన్ని కూడా రైతే భరించాల్సి వస్తోంది.
- వాస్తవానికి వాతావరణ, ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాలకు రైతు చెల్లించే ప్రీమియం 2 నుంచి 5శాతం ఉంటుంది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాను జత చేసి బీమా సంస్థలకు అందిస్తాయి.
- గతేడాది ఖరీఫ్, రబీల్లో చూస్తే రైతులు తమ వాటాగా రూ.243.83కోట్లు చెల్లించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.366.98 కోట్లు, కేంద్రం రూ.366.98 కోట్లు చెల్లించాయి.

కేంద్రానికి లేఖలు..

పంటల బీమా పథకం అమల్లో భాగంగా వేర్వేరు పంటలకు ప్రీమియం చెల్లించే గడువును కేంద్రం నిర్ణయిస్తుంది. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద వేరుశనగకు జులై 15 వరకే ప్రీమియం చెల్లించాలి. గడువు ముగిసే సమయానికి సాగైన విస్తీర్ణం 23శాతమే. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పేర్కొంటూ గడువు పెంచాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు గత నెలలోనే లేఖ రాసింది. దీనిపై ఇప్పటిదాకా ఎలాంటి సమాధానం లేదు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద వరి మినహా మిగిలిన పంటలకు జులై 31 వరకే (మిగతా 2లో)

జీఎస్టీ ప్రభావం

విలాసవంత కార్లు ప్రియం



దోశ పిండి చౌక



వివరాలు బిజినెస్ పేజీలో

రాష్ట్రంలో 4 ఫార్మా క్లస్టర్లు

- అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో కార్యదళం ఏర్పాటు
- ప్రతి నెలా ఏడో తేదీన ఫార్మారంగంపై సమీక్షిస్తా: సీఎం

ఈనాడు, అమరావతి: ఫార్మా రంగం అభివృద్ధికి రాష్ట్రంలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో భారీ ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. అచ్యుతాపురం-రాంబిల్లి, కృష్ణపట్నం, పులివెందుల, దిండి ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం ఫార్మా ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, డ్రగ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు, వివిధ ఫార్మాసంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించి ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో కార్యదళం ఏర్పాటుచేస్తామన్నారు. ఎంతమేర భూమి అవసరం, ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి? పెట్టుబడిదారులకు ఏ తరహా ప్రోత్సాహకాలు అందించాలనే దానిపైన ఈ కార్యదళం సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక అందిస్తుందని వివరించారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇస్తున్న నిధులను ఫార్మా రంగ అభివృద్ధికి వినియోగించుకునేందుకు ఎలా డీపీఆర్ ఇవ్వాలనే దానిపైన దిశానిర్దేశం చేస్తుందన్నారు. కొత్తగా ఎలాంటి అవకాశాలు ఉన్నాయి? ఉద్యోగ, ఉపాధి అవకాశాల ఎంత మేర ఉంటాయనే అంశాలను తన నివేదికలో పొందుపరుస్తుందని చెప్పారు.

- రాష్ట్రంలో ప్రస్తుతం 162 ఫార్మా యూనిట్లు ఉన్నాయి. రాబోయే రోజుల్లో వీటి సంఖ్యను రెండు, మూడింతలు పెంచేందుకు వీలుగా నాలుగు ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేసి, కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తాం.
- ఫార్ములేషన్, ఏపీఐ తదితర నాలుగు రకాల ఫార్మా కంపెనీలన్నీ ఒక్కో క్లస్టరులో ఒక్కో రకం యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రతి నెలా ఏడో తేదీన ఫార్మా రంగ అభివృద్ధిపై నేనే స్వయంగా సమీక్షిస్తా.
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.12 వేల కోట్ల మేర ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయి. 39,162 మంది ఈ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నారు.

ప్రతినిధుల వినతులు.. సీఎం హామీలు

ఎక్సైజ్ శాఖ పరిధిలోని ముడిపదార్థాలకు సంబంధించి శాఖాపరంగా తమకు కొన్ని ఇబ్బందులున్నాయని ఫార్మా సంస్థల ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకురాగా... ఇకపై ఆయా అనుమతులన్నీ ఆన్‌లైన్‌లో జారీ చేయాలని సీఎం చంద్రబాబు ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. అనుమతులు, ముడి పదార్థాల రవాణా తదితర అంశాలపై సత్వరం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు అంతరాయం సమస్యను ప్రస్తావించగా... విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటైతే నాణ్యమైన విద్యుత్తు సరఫరా కూడా సాధ్యపడుతుందన్నారు. రాంకీ వంటి థర్డ్ పార్టీ ప్రమేయాన్ని నియంత్రించాలని కోరగా... అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. రాంకీ నుంచి ఫార్మాసిటీని వెనక్కి తీసుకుని పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక సంస్థకు బాధ్యతలు అప్పగించాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు.



కొత్తగా ఎంపికైన యువ ఇంజినీర్లతో ప్రమాణం చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పడగెత్తిన పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

జూన్‌లో ఇచ్చిన తీర్పు అమలు చేయించాలని కోరారు. ఇందుకు వీలుగా జలవనరుల శాఖ ఆస్తులను అటాచ్ చేయాలని రెండు నెలల కిందట పిటిషన్ వేశారు. దీనిపై జులై నెలాఖరున ప్రిన్సిపల్ జడ్జి తీర్పునిచ్చారు. అందులో స్వరాజ్ మైదానంతో సహా విజయవాడలోని జలవనరులశాఖ ఆస్తులు 24 ఎకరాలు, జగ్గయ్యపేటలోని 17 ఎకరాలకు పైగా ఉన్న ఆస్తులను అటాచ్ చేశారు. దీంతో ఈ అంశం ముదురుపాకాన పడింది.

2010 నుంచే వివాదం

2005 నవంబరులో ప్రభుత్వం రూ.681.604 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు ఆమోదం ఇచ్చింది. ఆ తర్వాత మరో రెండు సార్లు అంచనాలు పెంచింది. ఈపీసీ విధానంలో గుత్తేదారు పనులు చేపట్టారు. ఆకృతుల్లో మార్పులు జరిగాయి. స్పిల్‌వేను 500.25 మీటర్లకు పెంచారు. గేట్లు 39 నుంచి 24కు తగ్గించారు. డీఎల్ వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. మూడు అదనపు మార్పులతో అనుబంధ ఒప్పందాన్ని ప్రభుత్వం కుదుర్చుకుంది.

- సిమెంట్, ఉక్కు, కార్మికులకు సంబంధించి అదనపు ధరలు ఇవ్వాలని గుత్తేదారు కోరారు. ఒప్పందంలో అందుకు అవకాశం లేదు. దీనిపై వివాద పరిష్కార బోర్డు ఏర్పాటుచేశారు. ఆ బోర్డు సిఫార్సుల మేరకు గుత్తేదారుకు తొలుత రూ.6.52 కోట్లు చెల్లించారు.
- ఆ తర్వాత మళ్లీ గుత్తేదారు 27 అదనపు అంశాలు లేవనెత్తగా రెండో వివాద పరిష్కార బోర్డు ఏర్పాటయింది. గుత్తేదారుకు రూ.95 కోట్లు చెల్లించాలని అది నిర్ణయించింది. దీన్ని ప్రభుత్వం ఆమోదించలేదు. ఆ తర్వాత ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ ఏర్పాటై రూ.122 కోట్లు ఏడాదికి 15శాతం వడ్డీతో చెల్లించాలని నిర్ణయించింది.
- ఆ నిర్ణయంపై జలవనరులశాఖ అధికారులు నిర్ణయం తీసుకోలేదు. 90 రోజుల్లోపు దాన్ని సవాలు చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశం లేకుండానే 2013 డిసెంబర్ 27న అప్పటి ఎస్ఈ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.
- ఒకవైపు న్యాయస్థానంలో కేసు ఉండగానే మరోవైపు ప్రభుత్వం పులిచింతల గుత్తేదారుకు పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2014 ఫిబ్రవరి 18న గుత్తేదారుకు చెల్లింపులు జరపాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.
- ప్రభుత్వం ఇచ్చిన ఈ మెమోయే న్యాయస్థానంలో గుత్తేదారుకు వరమైందని జలవనరుల శాఖ అధికారులు కొందరు విమర్శిస్తుంటారు. దీంతో కిందటేడాది జూన్‌లో ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలంటూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

నిపుణుల కమిటీ చెప్పింది ఏం చేశారు?

గుత్తేదారు వాదిస్తున్న 28 అంశాలపై నిపుణుల కమిటీ గతంలోనే నివేదిక ఇచ్చింది. అందులో ఎన్ని అంశాల్లో తప్పులున్నాయి? వాటిని ఏ విధంగా న్యాయస్థానంలో సవాలు చేయవచ్చు? వాటికి ఆధారాలు ఏమున్నాయో వివరంగా పేర్కొంటూ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకోకపోవడం ప్రశ్నార్థకమవుతోంది.

స్వరాజ్ మైదాన్ సహా 31 ఎకరాలు అటాచ్

విజయవాడలో కీలకమైన జలవనరుల శాఖకు చెందిన స్వరాజ్ మైదాన్ సహా దానికి సంబంధించిన వివిధ కార్యాలయాలు ఉన్న 24 ఎకరాలకు పైగా స్థలాన్ని, జగ్గయ్యపేటలో 17 ఎకరాల స్థలాన్ని అటాచ్ చేస్తూ కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారని జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు. వారం కిందట న్యాయస్థానం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని, తమకు వాటి ప్రతి ఇంకా అందాల్సి ఉందని వారు పేర్కొన్నారు. పులిచింతల ప్రాజెక్టు పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థ ఆ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చినా తనకు పరిహారం చెల్లించలేదంటూ రెండు నెలల కిందట మచిలీపట్నం ప్రిన్సిపల్ జడ్జి న్యాయస్థానంలో వ్యాజ్యం వేశారు. జలవనరులశాఖకు ఉన్న పై ఆస్తులను వేలం వేసి తన పరిహారం చెల్లించాలని గుత్తేదారు పిటిషన్‌లో కోరారు. గతేడాది జూన్‌లో ఇదే న్యాయస్థానం గుత్తేదారుకు అనుకూలంగా తీర్పిచ్చినా ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పోలవరం పరుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు వంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపికైన వారిలో 190 మంది మహిళా ఇంజినీర్లు ఉండటం తనకు చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. నీటి భద్రతను లక్ష్యంగా ఎంచుకోవాలని సూచిస్తూ దానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రంలో 28 ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, వీటిని రాబోయే మూడు నెలల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

జోరువానలో సీఎం పర్యటన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించిన పోలవరం ప్రాజెక్టు పర్యటన జోరువానలో సాగింది. వర్షంలోనూ ఆయన ఎక్కడా ఆగకుండా స్పిల్‌వే నిర్మాణ ప్రాంతానికి చేరుకుని పనులు పరిశీలించారు. పూర్తి బురదమయంగా మారిన రోడ్లలో అత్యంత ప్రమాదకరమైన ఎత్తయిన ప్రాంతాల్లో వాహనంపై పర్యటించారు. జలవనరుల శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మంత్రి కేఎస్ జవహర్, ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం: సీఎం

ఈనాడు, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లాలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పనులను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం పంపుహౌస్, ఫ్యాబ్రికేషన్, తదితర నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పైపులైన్లతో పాటు, పోలవరం ఎడమ ప్రధాన కాలువ జాతీయ రహదారిని దాటుతున్న ప్రాంతాల వద్ద పరిస్థితిని జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి నీటిని రోడ్డు దాటిస్తామని ఎస్ఈ సుగుణాకరరావు వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ఆగస్టు 15 నాటికి ప్రారంభించి ఏలేరుకు గోదావరి జలాలను అందిస్తామని తెలిపారు. 700 క్యూసెక్కులను విడిచిపెట్టడం ద్వారా 67,614 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను సమాజ శ్రేయస్సును కోరే జయప్రకాశ్ నారాయణ, సీపీఐ నారాయణ పరిశీలించి అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజ శ్రేయస్సు కోసం పనులు చేస్తున్నప్పుడు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం హెలికాప్టర్‌లో పోలవరం పయనమయ్యారు. ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, జలవనరుశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

పాన్ కార్డు పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

మేర, పేరు, పుట్టినతేదీ, పాన్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబరు వంటి వివరాలు ఇవ్వాలి. ఆ తరవాత మీ మొబైల్ నెంబరుకు వచ్చే రహస్య సంఖ్య (ఓటీపీ)ను నమోదు చేయాలి. అప్పుడు మీ పాన్ కార్డ్ చెల్లుబాటులో ఉందో, లేదో తెలుస్తుంది. ఒకవేళ ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు ఉంటే వెబ్‌సైట్ అదనపు సమాచారాన్ని కోరుతుంది. ఆ వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది.

రిటర్నుల ధమాకా

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత ఆదాయపు పన్ను ముందస్తు వసూళ్లు 41.79 శాతం పెరిగాయి. వ్యక్తిగత మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్) కింద వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 34.25 శాతం పెరిగినట్లు ఆర్థికశాఖ తెలిపింది. పెద్దనోట్ల రద్దుతో పాటు నల్లధనంపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల పన్ను ఎగవేతలు తగ్గినట్లు వివరించింది. మరింత మంది పన్ను పరిధిలోకి రావడం వల్ల రిటర్నుల సంఖ్య పెరిగినట్లు తెలిపింది.

ఒంటరితనం ప్రాణాంతకం!

ఒంటరితనం శారీరక, మానసిక ఆరోగ్యానికి ముప్పు తెస్తుందని అమెరికాలో శాస్త్రవేత్తలు నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. వారు త్వరగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని కూడా నిర్ధారణ అయింది. ఒంటరిగా ఉన్న వారిని ఎంపిక చేసి వారి శారీరక, మానసిక, ఆరోగ్య స్థితిగతులపై సమగ్ర పరిశీలన చేశారు. ఇటువంటి వారిలో సగంమందికి త్వరగా చనిపోయే ముప్పు ఉందని ఈ సందర్భంగా నిర్ధారణ అయింది. అదే సమయంలో భారీకాయం వల్ల చనిపోయే ప్రమాదం 30 శాతంమందికే ఉంటుందని తేల్చారు. పదవీ విరమణ లేదా పని చేయటం మానివేసిన వారికి ఒంటరితనం తీవ్రమైన సమస్య అవుతోంది. ఏదో ఒక పనిలో ఉన్నంతకాలం సహచరులు ఉంటారు. ఒంటరితనం అనిపించదు, కానీ ఎలాంటి వ్యాపకం లేకుండా ఇంటికే పరిమితమైపోయినప్పుడు మాత్రం ఇది సమస్యాత్మకంగా మారుతుంది, అంత కంటే దుర్భరమైన పరిస్థితి మరొకటి ఉండదు- అని సమస్యపై అమెరికాలోని బ్రిఘమ్ యంగ్ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జులైనే హోల్ట్-లున్‌స్టడ్ పేర్కొన్నారు.

- ఒంటరితనంతో బాధపడే వారి సంఖ్య అధికంగా ఉన్న ఫలితంగా బ్రిటన్‌ను ఒంటరితనానికి రాజధానిగా భావిస్తున్నారు.
- యూకేలో ఏజ్ యూకే అనే స్వచ్ఛంద సంస్థ ఒంటరితనానికి అతిపెద్ద ఆరోగ్య సమస్యగా పరిగణించాలని స్థానిక ప్రభుత్వాన్ని కోరింది. తద్వారా పది లక్షలకు పైగా ఉన్న వృద్ధులకు మేలు జరుగుతుందని పేర్కొంది.

యువతీ యువకులకూ శాపం

ఒంటరితనం కేవలం వృద్ధులకు మాత్రమే ఎదురయ్యే సమస్య కాదు. ఎంతోమంది యువతీ, యువకులనూ ఈ సమస్య వేధిస్తున్నట్లు శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. 18 నుంచి 34 ఏళ్ల మధ్యవయస్కుల్లో ఎంతోమందికి ఒంటరితనం శాపంగా మారుతున్నట్లు యూకేలోని 'మెంటల్ హెల్త్ ఫౌండేషన్' అనే సంస్థ విశ్లేషించింది. ఇటువంటి వారికి స్నేహితులు ఉండటం లేదని, ఎవరినీ కలుసుకోవటం, వేరువేరు రకాలైన వ్యాపకాలు పెట్టుకోవటం ఉండటం లేదని పేర్కొంది.

పరిష్కారం ఉందా...

- ఒంటరితనానికి ఏదో ఒక పని పెట్టుకోవటానికి మించిన మందు లేదు. ఎవరికి వారు తమకు ఇష్టమైన పని చూసుకొని దానిపై సాధ్యమైనంత అధిక సమయాన్ని వెచ్చించటం సరైన పరిష్కారంగా వైద్య నిపుణులు చెబుతున్నారు.
- తరచుగా స్నేహితులు, బంధువులు, తెలిసిన వారిని కలుసుకుంటూ ఉండటం, అభిప్రాయాలు, ఇష్టాఇష్టాలు పంచుకుంటూ ఉండటం ద్వారా ఒంటరితనాన్ని జయించవచ్చు.
- ఎవరో ఒకరు వస్తారని ఎదురుచూడకుండా మనమే నచ్చినవారిని కలుసుకునేందుకు ప్రయత్నించాలి. వారిని రమ్మని చెప్పటం లేదా మనమే వెళ్లి కలవటం, పరస్పరం నచ్చిన, నచ్చని అంశాలపై మాట్లాడుకోవటం చేయాలి.
- సెలవులు రాబోతుంటే ముందుగానే ఏం చేయాలో నిర్ణయించుకొని తదనుగుణంగా సన్నాహాలు చేసుకోవాలి. అంతేగానీ సెలవులను ఒంటరితనంతో వృథా చేసుకోవద్దు.
- స్నేహితులు, సన్నిహితులు, బంధువుల్లో పుట్టిన రోజు, ఇతరత్రా ముఖ్యమైన సందర్భాలను పెట్టుకొని ఆరోజు అందరితో కలిసి ఆహ్లాదకరంగా గడిపేందుకు ప్రయత్నించాలి.
- ఎప్పుడూ తెలిసిన వారినే కలవటం కాకుండా అప్పుడప్పుడూ కొత్తవారిని ఆహ్వానిస్తూ ఉండాలి. వారితో పరిచయం పెంచుకొని కలిసిమెలిసి ముందుకు సాగాలి.
- ఒంటరిగా గడపాల్సిన సమయం రాబోతుంటే దాని కోసం ముందుగానే సన్నద్ధం కావాలి. మంచి సంగీతం వినటం, చదవాలనుకున్న పుస్తకాలు ఉంటే చదవటం, ఇల్లు శుభ్రం చేసుకోవటం, ఇంకేమైనా పెండింగ్ పనులు ఉంటే చూసుకోవటం... వంటి కార్యక్రమాల్లో నిమగ్నం కావాలి.

– ఈనాడు ప్రత్యేక విభాగం

మన దేశంలోనూ సమస్యే!



వంద కోట్లమందికి పైగా జనాభా ఉన్న మనదేశంలో ఒంటరితనం సమస్యే కాదనే అభిప్రాయం కొందరిలో ఉంది. వాస్తవానికి జనాభా సంఖ్యతో దీనికి నిమిత్తం లేదు. దేశంలో వయసు పైబడిన ప్రతి ఇద్దరిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారని కొంతకాలం క్రితం దిల్లీలోని 'ఏజ్‌వెల్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ప్రతి అయిదుగురు వృద్ధుల్లో ఒకరికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన అవసరం కూడా కనిపిస్తున్నట్లు పేర్కొంది.

- దేశవ్యాప్తంగా 300 జిల్లాల్లో 15,000 మంది వృద్ధులను ఎంపిక చేసి పరిశీలించగా ఇందులో దాదాపు సగంమందికి ఒంటరితనం సమస్యగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. పట్టణ/నగర ప్రాంతాల్లోని వారికి ఇది మరీ సమస్యగా ఉంది.
- ఒంటరితనంతో బాధపడుతున్న వారు పట్టణ ప్రాంతాల్లో 64.1 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 39.19 శాతం ఉన్నట్లు తేలింది.
- ఒంటరితనానికి ప్రధాన కారణం ఒంటరిగా నివసించటమేనని ఈ సంస్థ పరిశీలనలో స్పష్టమైంది.
- మానసిక, ఆరోగ్య సమస్యల వల్ల ఎక్కువ మందిని కలవలేకపోవటం, ఎక్కడికీ వెళ్లలేకపోవటం వల్ల ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్న వారి సంఖ్య కూడా అధికంగా ఉంటోంది.

రాఖీ రోజున విషాదం



వినోద్ మృతదేహానికి రాఖీ కడుతున్న సోదరి శిరీష

తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టిన సోదరి

సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాఖీ పండుగ ఓ ఇంట తీరని విషాదం నింపింది. సోదరుడు అర్ధంతరంగా చనిపోగా.. ఓ సోదరి కన్నీటితో అతడి మృతదేహానికి రాఖీ కట్టిన ఉదంతం ఆ ఊరందరికీ కంటతడి పెట్టించింది. ఆదివారం సాయంత్రం సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులోకి ఓ కారు దూసుకుపోయింది. ఈ ఘటనలో గల్లంతయిన కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన కొక్కొండ వినోద్ (22) మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించారు. వినోద్ కొందరు మిత్రులతో కలిసి ఈ చెరువు వద్ద స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు వచ్చినపుడు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎనిమిదిమంది జాలర్లు గాలించి అతడి మృతదేహాన్ని వెలికితీశారు. అతడి శవాన్ని చూడడంతోనే తల్లిదండ్రులు, బంధువుల శోకం మిన్నంటింది. రాఖీ పండగ కావడంతో అతని సోదరి శిరీష తీరని దుఃఖంతో విలపిస్తూనే వినోద్ మృతదేహానికి రాఖీ కట్టడం చూపరులను కంటతడిపెట్టించింది.

క్యాన్సర్‌పై పోరులో సూక్ష్మ బంగారం అణువులు (గోల్డ్ నానో పార్టికల్స్) చక్కగా తోడ్పడగలవని పరిశోధకులు గుర్తించారు. ఔషధాల పనితీరును మెరుగుపరచడంలో, దుష్ప్రభావాలను తగ్గించడంలో ఇవి సాయం చేయగలవని కనిపెట్టారు. బ్రిటన్‌లోని ఎడిన్‌బరో వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు.

కష్టం..నష్టం అన్నదాతకే

(మొదటి పేజీ తరువాయి)

గడువిచ్చారు. అప్పటికి పంటల సాగు 43శాతమే ఉంది. అదే ఈ నెలాఖరు వరకూ గడువు పొడిగిస్తే వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో సాగు 80 శాతం వరకు అవుతుందని అంచనా. ఈ పథకం గడువు కూడా పెంచాలని రాష్ట్రం మరో సారి కేంద్రానికి వినతిపత్రం పంపింది. పరిశీలిస్తున్నాం... అనే సమాధానంతప్పితే స్పష్టమైన ఆదేశాలేవీఅక్కడ నుంచి రాలేదు.

- రాష్ట్రం కోరుతున్నట్లుగా ఇప్పుడు బీమా గడువు పొడిగిస్తే వాస్తవంగా తాను చెల్లించాల్సిన మొత్తానికి తోడు కేంద్రం వాటా కూడా రైతు నుంచే బీమా సంస్థలు వసూలు చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రమే ప్రీమియంలో వాటా అందుతుంది. మరో ఐదు శాతం వరకు ప్రీమియంను రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఇది చెల్లించినా భవిష్యత్తులో పంటనష్టం జరిగితే పరిహారం వస్తుంది. ఈ కోణంలోనే గడువు పెంచాలని యంత్రాంగం లేఖ రాసింది.

అన్నిటికీ ఒకటే లెక్కంటే ఎలా..

బీమా ప్రీమియం గడువు విషయంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ నిర్ణయమే అంతిమం. అన్ని రాష్ట్రాలకు ఒకటే గడువు ఇస్తుండటంతోనే ఈ సమస్య ఎదురవుతోంది.


- నిర్దేశిత సమయం పూర్తయిన వెంటనే బీమా అమలు మొదలవుతోంది. వేరుశనగ పైరుకు బీమా తీసుకుంటే జులై 15 నాటికి చివరి తేదీగా నిర్ణయించారు. వెంటనే 16వ తేదీ నుంచి వాతావరణ పరిస్థితుల్ని లెక్కలోకి తీసుకుని పంట నష్టం, దిగుబడులు లెక్కించడం ప్రారంభించారు. ఒకవేళ గడువు పొడిగించినా ఒకే ఖరీఫ్‌లో రెండు విధాలైన వాతావరణ పరిస్థితుల్ని ఆధారంగా తీసుకోవడం సాధ్యం కాని వ్యవహారం అని వ్యవసాయశాఖ స్పష్టం చేస్తోంది. గడువు పెంచినా వేరుశెనగ పరంగా ప్రయోజనం ఉండకపోవచ్చు.
- స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఒక్కో చోట ఒక్కో విధమైన వాతావరణ అననుకూలతలు ఎదురవుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌నే తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ సరైన వర్షపాతం లేక పంటల సాగు మందగించింది. మరి కొన్ని రాష్ట్రాల్లోనూ ఇవే సమస్యలు ఉండటంతో అక్కడా మినహాయింపు కోరుతున్నారు. ఇక్కడ గడువు పొడిగిస్తే మిగిలిన రాష్ట్రాలకూ వర్తింప జేయాల్సి ఉంటుందనేది వ్యవసాయశాఖ అభిప్రాయం. స్థానిక వాతావరణ పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకునే బీమా పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. అలాకాకుండా అందరికీ ఒకటే లెక్కంటే ఎలా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రాల వారీగా సాగు, వాతావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని గడువు పెంపుదలపై నిర్ణయం తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

'చంద్రన్న కానుక'లో పేదలకు చీర, ధోవతి!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే 75 వేల మందికి పింఛను అందుతోందని, 50 ఏళ్ల పైబడిన వారికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వడానికి మరో 25 వేల పింఛన్లను ముఖ్యమంత్రి మంజూరు చేశారని వెల్లడించారు. ప్రతి ఒక్క చేనేత కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమం అందేలా కొత్త పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్మిక సంక్షేమ మండలి మాదిరి చేనేత సంక్షేమ మండలి, సంక్షేమ నిధి ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నామన్నారు. చేనేత మార్కెటింగ్ విధానాన్ని విస్తృత పరిచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. చేనేతపై జీఎస్టీ ఎత్తివేతకు కేంద్రాన్ని ఒప్పించాల్సి ఉందని ఎంపీ నిమ్మల కిష్టప్ప అన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన చేనేత ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో చేనేతల వస్త్రాలతో దీన్ని నిర్వహించారు. కలంకారి, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ పట్టు తదితరాలతో శుభం డిజైన్స్ ఈ ఫ్యాషన్‌షోను రూపొందించింది.



సోమవారం రాత్రి చెన్నైలో కనిపించిన చంద్రగ్రహణ దృశ్యం

ఉప్మా మాటున విదేశీ నగదు అక్రమ రవాణా

దిల్లీ: 'ఉప్మా' మాటున రూ.1.29 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారం పుణే విమానాశ్రయంలో బయటపడింది. ఓ మహిళ, మరో ప్రయాణికుడు ఈ నగదును దుబాయి తరలిస్తుండగా ఆదివారం అధికారులు పట్టుకున్నారు. వై.నిషాంత్ అనే ప్రయాణికుని లగేజీపై అనుమానం వచ్చి పలుసార్లు తనిఖీ చేశారు. నల్లని పాలిథిన్ బ్యాగులో ఉన్న హాట్‌బాక్సును విప్పి చూసినప్పుడు పైకి ఉప్మా కనిపించింది. అయితే ఆ బాక్సు బాగా బరువుగా ఉండడంతో మళ్లీ తనిఖీ చేయగా లోపల 86,600 అమెరికా డాలర్లు, 15,000 యూరోలు కనిపించాయి. అదే విమానంలో వెళ్లాల్సిన హెచ్. రంగ్లాని బ్యాగులో ఉన్న హాట్‌బాక్సును తనిఖీ చేసినప్పుడు కూడా పైకి ఉప్మా కనిపించింది. లోపల చూస్తే 86,200 అమెరికా డాలర్లు, 15,000 యూరోలు దొరికాయి.

గ్రహం అనుగ్రహం

8–8–2017 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
పాడ్యమి: రా. 11-41 తదుపరి విదియ
ధనిష్ఠ నక్షత్రం: తె. 5-14 తదుపరి శతభిషం
అమృతఘడియలు: సా. 6-17 నుంచి 7-58 వరకు
వర్జ్యం: ఉ. 8-11 నుంచి 9-52 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-18 నుంచి 9-08 వరకు తిరిగి రా. 10-59 నుంచి 11-44 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-44; సూర్యాస్తమయం: సా. 6-28

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
తిరుపతి	23.2	34.4
హైదరాబాద్	24.5	33.8
కర్నూలు	25.2	34.2
అనంతపురం	25.6	37.9
గుంటూరు	26.0	33.0
రాజమహేంద్రవరం	26.0	37.0
శ్రీకాకుళం	26.5	37.0
విజయవాడ	26.8	37.0
తాడేపల్లిగూడెం	27.0	32.5
కడప	27.0	37.0
ఒంగోలు	27.6	36.4
నరసాపురం	28.1	35.3
విశాఖపట్నం	28.6	35.6
నెల్లూరు	29.0	33.0

ఉపాధ్యాయుల బదిలీల్లో సమస్యలపై 182 దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల్లో సమస్యలపై పాఠశాల విద్యాశాఖకు 182 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలనకు వాటిని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు పంపించారు. గుంటూరు, కర్నూలు, కడపజిల్లాల్లో 10చొప్పున ఒకేపోస్టుకు ఇద్దరికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చినట్లు గుర్తించారు. గుంటూరు జిల్లాలో డీఈఓ ఇచ్చిన ఓ బదిలీ ఉత్తర్వు వివాదాస్పదంగా మారింది. కడప జిల్లాలో 27మంది కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. ప్రకాశం జిల్లాలో దంపతుల ఉద్యోగుల కేసుల్లో బదిలీలు సక్రమంగా జరగలేదని ఫిర్యాదులు వచ్చాయి. ఉద్యోగుల పేర్లు ఒకేలా ఉండటంతో ఒకరి ఉత్తర్వులు మరొకరికి అందించారు. 40శాతం వికలాంగ ధ్రువీకరణ పత్రాల్లో బోగస్ వచ్చాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,05,957 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇందులో తప్పక బదిలీ అయ్యేవారు 59,970 మంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం జులై 31నాటికి బదిలీ పూర్తయి, ఆగస్టు 1న పాఠశాలల్లో చేరాల్సి ఉండగా జాప్యం జరిగింది. బదిలీ అయినవారు ఎప్పుడు ఉత్తర్వులు తీసుకోవాలి, ఎప్పుడు పాఠశాలల్లో చేరాలో స్పష్టమైన ఆదేశాలు పంపలేదు. ఎప్పుడు బదిలీ ఉత్తర్వులొస్తే అప్పుడు చేరాలంటూ అధికారులు చెప్పడం విశేషం.

స్థలాల రిజిస్ట్రేషన్‌కు సాంకేతిక సమస్య

- ప్రభుత్వ భూముల్లోనూ రాజధాని రైతులకు లేఅవుట్‌లు

ఈనాడు అమరావతి: రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇంతవరకు రైతుల పేరు మీద 291 స్థలాలకు మాత్రమే జరిగింది. రైతుల కోసం వేసిన లేఅవుట్‌లలో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, దేవాదాయశాఖకు చెందిన భూములు ఉండటంతో... ఆ స్థలాల్ని రిజిస్టర్ చేసేందుకు రిజిస్ట్రేషన్లశాఖ నిరాకరించింది. ఈ కేటగిరీలోని భూములు సెక్షన్ 22 ప్రకారం నిషిద్ధ జాబితాలో ఉన్నాయి. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అధికారులు ముందుగా ఈ పరిస్థితిని ఊహించకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తింది. రాజధాని పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ భూములపై హక్కుల్ని సీఆర్‌డీఏ పేరుమీదకు దఖలుపరచాలి. దాని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. తీరా రిజిస్ట్రేషన్ దగ్గరకు వచ్చేసరికి ఈ సాంకేతిక సమస్య ఎదురైంది. దీనిపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాజధాని నిర్మాణానికి ఎంచుకున్న 217 చ.కి.మీ.ల పరిధిలో సుమారు 12,400 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఈ భూముల్ని సీఆర్‌డీఏకి ప్రభుత్వం కేటాయించింది. సాంకేతికంగా ఎలీనియేషన్ ప్రక్రియ పూర్తి కాలేదు. సీఆర్‌డీఏ రైతులకు రెవెన్యూ గ్రామాల వారీగా లేఅవుట్‌లు వేసింది. వీటిల్లో పట్టా భూములతో పాటు, ప్రభుత్వ, అసైన్డ్ భూములు, రోడ్లు భవనాల శాఖకు చెందిన రహదారులు, డొంకరోడ్లు, చెరువులు, గ్రామాల మధ్య లింకు రోడ్లు వంటివన్నీ ఉన్నాయి. ఈ భూముల్ని సీఆర్‌డీఏకి ఎలీనియేట్ చేయాల్సిందిగా కోరుతూ గుంటూరు జిల్లా కలెక్టర్‌కు సీఆర్‌డీఏ కమిషనర్ ఇటీవలే ప్రతిపాదన పంపించారు. ఈ ప్రక్రియ పూర్తయి, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి కూడా అనుమతి లభిస్తేనే... ఆ స్థలాల రిజిస్ట్రేషన్ సాధ్యపడుతుంది.

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు 60 వేలకుపైగా నివాస, వాణిజ్య స్థలాలను సీఆర్‌డీఏ కేటాయించింది. లాటరీ ద్వారా స్థలాలు కేటాయించే ప్రక్రియను 2016 జూన్ నెలాఖరులో నేలపాడుతో ప్రారంభించింది. నిబంధనల ప్రకారం మొదట భూసమీకరణలో ఇచ్చిన భూముల్ని సీఆర్‌డీఏకి రిజిస్ట్రేషన్ చేయాలి. బదులుగా రైతులకు ఇచ్చిన ప్లాట్లను వారి పేరు మీద రిజిస్టర్ చేస్తుంది. ఆ తర్వాతే రైతులు ఆ స్థలాల క్రయ విక్రయాలు చేసుకునే అవకాశం కలుగుతుంది. స్థలాలు కేటాయింపులు చేసుకున్న మరుసటి రోజు నుంచే రిజిస్ట్రేషన్లు కూడా చేసుకోవచ్చని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ప్రత్యేకంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేసేంత వరకు సంబంధిత భూసమీకరణ అధికారుల కార్యాలయాల్లోనే వీటిని చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. ఇవేమీ జరగలేదు.

జరిగింది గోరంతే..! రాజధాని గ్రామాల రైతుల నుంచి 33 వేల ఎకరాలకుపైగా భూమిని సీఆర్‌డీఏ భూసమీకరణ విధానంలో తీసుకుంది. రైతులకు 60వేల స్థలాలు కేటాయించింది. సోమవారం వరకు 124మంది రైతులు 110.53 ఎకరాల్ని సీఆర్‌డీఏకి రిజిస్టర్ చేశారు. బదులుగా సీఆర్‌డీఏ 179 నివాస, 112 వాణిజ్య స్థలాల్ని వారి పేరిట రిజిస్టర్ చేసింది. రైతులకిచ్చిన లేఅవుట్‌లలో రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతుల పనులు ఇంకా మొదలవలేదు.

9 నుంచి మూడు రాష్ట్రాల్లో శ్రీనివాస కల్యాణాలు



తిరుపతి, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే) శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో శ్రీనివాస కల్యాణాలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 9వ తేదీన మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో, 10న అదే జిల్లాలోని జోగిపేట మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో, 11న ఖమ్మం జిల్లా ఎంకూరు మండలం గోళ్లపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో, చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికిపెంట గ్రామ ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో కల్యాణాలు జరగనున్నాయి. 12వ తేదీ తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా బేతంపల్లిలోని రామాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో, బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్‌లో, 13న కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితిసింగారం గ్రామంలోని జూనియర్ కళాశాల మైదానంలో, బెంగళూరులోని కడబాగ్రే ప్రాంతంలో, 14న కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని గ్రంథాలయ మైదానంలో, చిత్తూరు జిల్లా మదనపల్లె రూరల్ చిప్పిలి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణాలు జరగనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు.

ల్యాంకో పిటీషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తమ బ్యాంకు హామీ (గ్యారంటీ)ని నగదుగా మార్చుకోకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఐడీబీఐ బ్యాంకులను నియంత్రించాలన్న ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ అభ్యర్థనను ఉమ్మడి హైకోర్టు తిరస్కరించింది. ల్యాంకో ఇన్‌ఫ్రా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఐడీబీఐల నుంచి రూ.2 వేల కోట్ల వరకు రుణం తీసుకుంది. రుణాన్ని సకాలంలో చెల్లించకపోవడంతో రూ.88 కోట్ల బ్యాంకు గ్యారంటీని నగదుగా మార్చుకోవడానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఐడీబీఐ బ్యాంకులు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ ప్రయత్నాలను సవాలు చేస్తూ ల్యాంకో ఇన్‌ఫ్రా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు విచారణ చేపట్టారు. పవర్ ఫైనాన్స్ కంపెనీ తరపున సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పవర్ ఫైనాన్స్ ప్రభుత్వ రంగ సంస్థ అని, బ్యాంకు గ్యారంటీని నగదుగా మార్చుకోవద్దని ల్యాంకో చెప్పజాలదన్నారు. సంస్థ ఇచ్చిన రుణం తిరిగి చెల్లించని పక్షంలో తన సొమ్మును రాబట్టుకోవచ్చని, ఇందులో భాగంగా బ్యాంకు గ్యారంటీని నగదుగా మార్చుకోవచ్చన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి ల్యాంకో పిటీషన్ విచారణార్హం కాదంటూ కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గురువుల నిర్లక్ష్యంపై మంత్రి గంటా ఆగ్రహం

- విశాఖలో విద్యార్థి మృతి ఘటనపై విచారణ
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని వెల్లడి

విశాఖపట్నం(సీతంపేట), న్యూస్‌టుడే: పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు పరస్పరం దాడిచేసుకుని ఓ బాలుడి మరణానికి దారితీసిందని మంత్రి గంటా శ్రీనివాసరావు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ నగర పరిధి మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి తన బంధువులతో కలిసి ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పిడిగుద్దులు గుద్ది ఆ బాలుడి మరణానికి దారితీసిన నేపథ్యంలో సోమవారం మంత్రి గంటా పాఠశాలను సందర్శించారు. తనిఖీలు, విచారణ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, 4వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మరణించిన విద్యార్థి చిన్నా స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు, దాడిచేసిన ఎనిమిదో తరగతి విద్యార్థి స్నేహితులతో మంత్రి గంటా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వీరంతా మంత్రికి తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 29న ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడి గృహప్రవేశానికి పలువురు టీచర్లు వెళ్లారు. తరగతి గదులు పర్యవేక్షించాలని పదోతరగతి విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. చిన్నా ఎనిమిదో తరగతి బాధ్యత చేపట్టాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. శనివారం చిన్నా ఎనిమిదో తరగతి గదికి వెళ్లినపుడు మరోమారు గొడవ జరిగి మరణానికి దారితీసినట్లు విచారణలో వెల్లడైంది. దాడి చేసిన ఎనిమిదో తరగతి విద్యార్థి తరగతి గదిలో వెనకబెంచిలో కూర్చుంటాడని, ముభావంగా ఉంటాడని అదే తరగతి విద్యార్థులు వివరించారు. ఉపాధ్యాయులంతా పాఠశాల విడిచి గృహప్రవేశానికి వెళ్లడంపై మంత్రి గంటా ఆగ్రహం ప్రకటించారు. చిన్నా తెస్తున్న సంపాదన తమ కుటుంబాన్ని కొద్దోగొప్పో ఆదుకొంటోందని తల్లిదండ్రులు మంత్రి గంటా ముందు కన్నీరుపెట్టుకున్నారు. నిత్యం పాఠశాల విడిచిపెట్టాక సాయంత్రం తాముంటున్న వీధికి చెందిన ఓ ఆటోడ్రైవర్‌తో వెళ్లి సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయలు అప్పగిస్తాడని.. అలా ఆటోవాలా ఇచ్చే మొత్తం ఇంటికి తెస్తాడని తండ్రి రాము తెలిపారు. ఎవరితోనూ వివాదాలకు పోలేదని చెప్పారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జిల్లా విద్యాశాఖాధికారిణి నాగమణి తదితరులు ఉన్నారు.



మృతుడు చిన్నా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి గంటా

లోతైన దర్యాప్తు: అనంతరం మంత్రి గంటా విలేకరులతో మాట్లాడుతూ చిన్నవయస్సులో పాఠశాల విద్యార్థులు దాడులు చేసుకోవడం, చంపుకోవడం రాష్ట్రంలో ఇదే ప్రథమమన్నారు. మరణానికి దారితీసిన కారణాలపై లోతైన దర్యాప్తు చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో పలు పాఠశాలల్లో మాదకద్రవ్యాలు, ఈవ్‌టీజింగ్ సంస్కృతి ఉన్నట్లు తెలిసిందని, ఈ పోకడలపై దర్యాప్తుచేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. మరణించిన విద్యార్థి చిన్నా కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకొంటుందన్నారు.

ఈ సమావేశాల్లోనే బీసీ కమిషన్ బిల్లుకు ఆమోదం

బీసీ ప్రతినిధులకు కేంద్ర సహాయ మంత్రి హామీ

ఈనాడు, దిల్లీ : ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే జాతీయ బీసీకమిషన్ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందేలా చూస్తామని హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ గంగారామ్ బీసీసంఘం నాయకులకు హామీ ఇచ్చారు. సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల ప్రతినిధులు సోమవారం ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించినప్పుడు ఈ మేరకు స్పందించారు.

ఓబీసీ రిజర్వేషన్ల వర్గీకరణకు.. ఓబీసీ రిజర్వేషన్లను నాలుగు లేదా ఆరు గ్రూపులుగా వర్గీకరించడానికి కేంద్రం సుముఖంగా ఉందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారశాఖ సహాయమంత్రి రాందాస్ అథవాలే తెలిపారు. సోమవారం తనను కలిసిన ఆర్.కృష్ణయ్య బృందానికి ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ లేకపోవడంవల్ల అత్యంత వెనుకబడిన బీసీలకు సివిల్ సర్వీస్‌లు, బ్యాంకింగ్, రక్షణ శాఖ ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతోందని ఆర్.కృష్ణయ్య ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలుచేస్తున్నట్లుగానే జాతీయస్థాయిలో బోధనరుసుం పథకాన్ని అమలుచేయాలని కోరారు.

మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడి అరెస్టు

చర్ల, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉంజుపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు మడవి చుక్క అలియాస్ దివాకర్‌ను సోమవారం చర్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మారుమూల ఉంజుపల్లి అటవీ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్, ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన 'ఏరియా డామినేషన్'లో భాగంగా అటుగా వస్తున్న మడవి చుక్కను పట్టుకొని విచారించగా అతను మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడిగా తేలిందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని పూజారుకాకేడు గ్రామానికి చెందిన చుక్క పలు హత్యకేసుల్లో నిందితుడని ఎస్సై పేర్కొన్నారు. కొమ్మనాపల్లికి చెందిన కణితి సుబ్బయ్య, కణితి రాజులు, కుర్నపల్లికి చెందిన కొమరం పుల్లయ్య, పర్ణశాలకు చెందిన హోంగార్డు నీలం నరేశ్‌లతో పాటు గ్రేహౌండ్స్ సీఐ కరణం వరప్రసాద్‌ను చంపిన ఘటనల్లో చుక్కా పాల్గొన్నట్లు వెల్లడైందని వివరించారు. యంత్రాల దహనం కేసులతో పాటు కూంబింగ్ చేస్తున్న పోలీసులపై కాల్పులు జరిపిన ఘటనల్లోనూ చుక్క పాత్ర ఉందని ఎస్సై తెలిపారు. అతనిని కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

4,848 కోట్లతో బడుల్లో పనులకు సై..

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఫర్నిచర్, ప్రహరీ, అదనపు తరగతులు, గ్రంథాలయ గదులు, తదితరాల కల్పనకు హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్న పనులకు పరిపాలన అనుమతులు ఇస్తూ విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు జారీచేశారు. వీటికి త్వరలో టెండర్లు నిర్వహించనున్నారు. పనులు దక్కించుకున్న సంస్థలు 24 నెలల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందుకు రూ.4,848 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో 40శాతం మొత్తాన్ని 2017-18 నుంచి 2019-20 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగతాది 2020-2021 నుంచి 2024-25 వరకు ప్రస్తుతం ఉన్న బ్యాంకు వడ్డీ 6.50శాతంతో పాటు అదనంగా 3శాతం కలిపి చెల్లించనున్నారు. సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలోని ఇంజినీరింగ్ విభాగం ఈ పనులను చేపట్టనుంది.

అగ్రిగోల్డ్‌పై నెరవేరని ముఖ్యమంత్రి హామీ

- 16 నుంచి సెప్టెంబరు 19 వరకు చైతన్య యాత్రలు
- అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లు సంక్షేమ సంఘం నేతల నిర్ణయం

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ వ్యవహారంపై చర్చలు జరిపి జులై 22 నాటికి సమస్యను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకున్న వారికి రూ.5లక్షలు నష్టపరిహారం, ఖాతాదారులకు ప్రత్యేక చట్టం కూడా తీసుకొస్తామన్నారని గుర్తు చేశారు. నిందితుల కుటుంబసభ్యులను వెంటనే అరెస్టు చేసి, ఆస్తులు జప్తు చేస్తామని చెప్పినా ఇప్పటికీ కేసు ముందుకు సాగడం లేదన్నారు. ఖాతాదారులు మృతి చెందితే విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ తీరుపై ఈ నెల 16వ తేదీ నుంచి సెప్టెంబరు 19వ తేదీ వరకు అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మేధావులు, రాజకీయ నాయకులు, బాధితులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. సీఎం హామీ ఇచ్చిన తర్వాత సుమారు 30మంది బాధితులు మృతి చెందారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అగ్రిగోల్డ్ బాధితులు 142 మంది మృతి చెందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం, బాధితులకు న్యాయం చేయాల్సిన అధికార పక్షం ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సంఘం నాయకులు చంద్రశేఖర్, అగస్టీన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-ప్రగతిపై కర్ణాటక ఆసక్తి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ఈ-ప్రగతి కార్యక్రమంపై పొరుగు రాష్ట్రం కర్ణాటక ఆసక్తి చూపుతోంది. ఈ-ప్రగతిపై ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో మార్గదర్శకాలను రూపొందించి ఐఎస్‌బీ నిపుణులతో ఆంధ్రప్రదేశ్‌లో పాఠాలు చెప్పిస్తున్న సంగతి తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం కూడా ఇదే తరహాలో తమ రాష్ట్రంలో ఈ-ప్రగతిని అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఎస్‌బీ సహకారాన్ని కోరింది.

తెదేపా పాలన మహిళలకు భారం: రఘువీరా

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వం మహిళల కంట కన్నీరు పెట్టిస్తోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ఆరోపించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేతలు ఆయనకు సోమవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాఖీ కట్టారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మహిళా కాంగ్రెస్ నేతలు సుంకర పద్మశ్రీ, తదితరులు ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ట్విట్టర్ ద్వారా రాఖీ సందేశాలను పంపించారు. తెదేపా హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని రఘువీరా విమర్శించారు. గ్యాస్ ధర రూ.350 ఉన్నపుడు చంద్రబాబునాయుడు, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్ గ్యాస్ బండలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారని, ఇప్పుడు రూ.750 అయితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జనావాసాల్లో మద్యం దుకాణాలను తొలగించాలంటూ ఆందోళన చేసిన మహిళలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నంద్యాలలో మద్దతు కోసం పార్టీలకు లేఖలు: నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు మద్దతివ్వాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు వేర్వేరుగా రఘువీరా లేఖలు రాశారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవసరమైతే కలిసి పోటీ చేయాలనే ప్రతిపాదన చేస్తున్నట్లు తెలిపారు.

వంశధార నిర్వాసితులతో ప్రభుత్వం చర్చలు జరపాలి: సీపీఎం

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో భయపెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల ఆందోళనలను నిలువరించేందుకు 20 మంది డీఎస్పీలు, 70 మంది సీఐలు, 150 మందికి పైగా ఎస్సైలను మోహరించి.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పోలీసులను అక్కడి నుంచి తరలించి నిర్వాసితులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 2005లో ఒక్కో కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.53 వేల పరిహారం ఇచ్చారని, 12 ఏళ్ల తర్వాత ఇప్పుడూ అదే పరిహారం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. నిర్వాసిత గ్రామాల్లో ఒక్కో ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. రైతులు రూ.10 లక్షలు మాత్రమే అడుగుతున్నా, అది కూడా ఇవ్వకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా వెనుక ముఖ్యమంత్రి, ఆయన అనుచరులు ఉన్నారంటూ ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిపై ప్రతిపక్ష నేత జగన్ వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆలమట్టిలోకి మరింత తగ్గిన ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బేసిన్లలోని రిజర్వాయర్లలోకి ప్రవాహం మరింత తగ్గింది. ఆలమట్టిలోకి ఆదివారం 21 వేల క్యూసెక్కులు రాగా, సోమవారం 11,836 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో ఆగస్టు రెండోవారం కూడా శ్రీశైలంలోకి కొంత నీరొచ్చే అవకాశం లేదు. నారాయణపూర్‌లోకి 9,152 క్యూసెక్కులు రాగా, 15,841 క్యూసెక్కుల నీటిని కాలువలకు, విద్యుదుత్పత్తి ద్వారా బయటకు వదిలారు. వచ్చే నీటి కంటే బయటకు వదిలేది ఎక్కువగా ఉంది. జూరాలలో 6,703 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, 4,585 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదిలారు. జూరాలలోనూ, గోదావరి నుంచి పట్టిసీమ ద్వారా మళ్లించిన నీటితో కృష్ణా డెల్టాలో మాత్రమే కృష్ణా బేసిన్‌లో ఆయకట్టుకు నీటిని వదిలారు. తుంగభద్రలోకి 12,222 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. శ్రీశైలంలోకి ప్రవాహం లేదు. సాగర్‌లోకి 668 క్యూసెక్కులు వస్తుండగా కాలువకు 329 క్యూసెక్కులు, తాగునీటికి 339 క్యూసెక్కులు వదిలారు. సాగర్ మట్టం 500.50 అడుగులకు చేరింది. ఇదే పరిస్థితి కొనసాగితే సాగర్ నుంచి తాగునీటికి విడుదల చేయడం కష్టమవుతుంది. పులిచింతలలోకి 1,211 క్యూసెక్కులు స్థానిక వర్షాల వల్ల వస్తోంది. గోదావరిలో ధవళేశ్వరం వద్ద కూడా గోదావరి ప్రవాహం తగ్గింది.

ఈనాడు

సహేతుకతే సరైన ఒరవడి!

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ద్వారా తమ ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా ఏకతాటిపైకి తేగలిగిందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల అమిత సంతృప్తి వ్యక్తపరచారు. వాస్తవానికి స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద పన్నుల సంస్కరణను పట్టాలకు ఎక్కించే క్రమంలో బాలారిష్టాల దశను ఇంకా అధిగమించలేదు. కశ్మీర్ భేటీ దరిమిలా పలు అభ్యర్థనల్ని పరిశీలించి అదనంగా 66 రకాల వస్తువులపై పన్నుపోటును జీఎస్‌టీ మండలి ఉపసంహరించినా, రాయితీల ప్రదానం అంతటితో ముగియలేదు. సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన ఇ-వే బిల్లుల విధానానికి తాజాగా మార్గం సుగమం చేసిన దిల్లీ సదస్సులో ఇంకొన్ని కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. జౌళి, ట్రాక్టర్ల పద్దులో పన్నుభారం తగ్గించిన మండలి, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై జీఎస్‌టీని 18 శాతం నుంచి 12 శాతానికి సడలిస్తూ తీసుకున్న నిర్ణయం తెలంగాణను మెప్పించలేకపోయింది. లోగడ అయిదు శాతం మేర వ్యాట్ అంచనాలతో ఖరారై కొనసాగుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలకు పన్నెండు శాతం పన్ను వడ్డన తలకు మించిన భారమేనన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వాదన సహేతుకమైందే. జూన్ ముప్పైనాటికే ప్రారంభమైన ప్రాజెక్టు పనుల మీద జులై ఒకటి లగాయతు అమలులోకి వచ్చిన జీఎస్‌టీని రుద్దడమేమిటన్న సూటిప్రశ్నకు వస్తుసేవల పన్ను మండలి ఏం జవాబిస్తుందో! జీఎస్‌టీ ప్రవేశపెట్టక ముందు ధరవరలతో పోలిస్తే ఏ మేరకు ఉపశమనం కలిగిందో సూచిస్తూ వస్తూత్పత్తులపై వివరాలు ముద్రించాలంటూ కేరళ, పశ్చిమ్ బంగ, బిహార్ ఇటీవలి సదస్సులో పట్టుపట్టాయి. తొలివిడతగా 150 రకాల వస్తువుల విషయంలో ఆ మేరకు చర్యలు చేపడతామని మాటిచ్చిన మండలి- తెలంగాణ లేవనెత్తిన కీలక అంశంపైనా సానుకూలంగా స్పందించాలి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో తాగు, సాగునీటి పథకాలు, రహదారుల నిర్మాణం సహా వేర్వేరు దశల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులపై వేలకోట్ల రూపాయల పన్ను భారం సడలింపులోనూ ఉదారంగా వ్యవహరించాలి. రాష్ట్రాల సహేతుక వాదనల్ని పరిగణనలోకి తీసుకుని, ఇటువంటి వివాదాస్పద ప్రతిపాదనలన్నింటిపైనా మండలి పునరాలోచించాలి!

'వినియోగదారుడే రాజు' అన్న జీఎస్‌టీ మౌలిక స్ఫూర్తి కార్యాచరణలో అడుగడుగునా ప్రస్ఫుటం కావాలన్న సంకల్ప దీక్షతో సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్రాల అభిప్రాయాలకు కేంద్రం గొడుగుపట్టిన మాట నిజం. తొలుత దూరంగా ఉండిపోయిన జమ్మూకశ్మీర్‌ను వారం ఆలస్యంగా పన్ను పరిధిలోకి చేర్చడం సహా వివిధ ఘట్టాల్లో మోదీ ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణితో సాధించింది స్ఫూర్తిమంతమైన విజయం. ఆ కసరత్తులో భాగంగా ఎన్నో మార్పులు, చేర్పులు అవసరమయ్యాయి. అయినా ఇప్పటికీ ఇంకా అభ్యంతరాలు పైకి తేలడమేమిటని కొట్టిపారేసే వీల్లేదు. ఇటీవలి దాకా ఎరువులు, ట్రాక్టర్లు, బయోగ్యాస్, గ్రానైట్, నిర్మాణ పరికరాలు, స్థిరాస్తి రంగం, రెస్టారెంట్లు, జీడిపప్పు తదితరాలపై వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్ కన్నా జీఎస్‌టీ మోత అధికంగా ఉందని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరపెట్టాకనే పునస్సమీక్షకు మండలి అంగీకరించింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, రోడ్లు... వీటన్నింటిపైనా మునుపటి అయిదు శాతం వ్యాట్‌తో పోలిస్తే జీఎస్‌టీ వడ్డన రెండింతలకన్నా అధికం. అందుకే, ప్రధానికి లేఖతో పని సానుకూలపడకపోతే- న్యాయపోరాటానికీ తెలంగాణ సిద్ధపడుతోంది. తివాచీలు, వివిధ సంచులు, సూదుల తయారీపై 18శాతం దాకా జీఎస్‌టీ ఎందరో సాధారణ పౌరుల జీవికను దెబ్బతీసేదేనని కశ్మీర్ గళమెత్తుతోంది. 12వందలకు పైబడిన వస్తువులు, అయిదు వందల రకాల సేవలకు ఇదమిత్థంగా పన్నురేట్లు ఖరారైనా- శ్లాబులు వర్తింపజేయడంలో గందరగోళం నెలకొంది. కొన్ని వస్తువుల రేట్లు తగ్గినా, నికర ప్రయోజనం వినియోగదారులకు దక్కడంలేదన్న ఆరోపణలు జోరెత్తుతున్నాయి. డిజిటల్ సాంకేతికతకు నోచని అసంఖ్యాక సంస్థలు నేటికీ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. వీటిపైనా జీఎస్‌టీ మండలి చురుగ్గా దృష్టి సారించాలి!

దశాబ్దాల తరబడి దేశీయంగా పరోక్ష పన్నుల వ్యవస్థ చెల్లించేవారిని చెండుకుతినేదిగా భ్రష్టుపట్టింది. సమూల క్షాళనతో పన్ను ఉగ్రవాదం నుంచి విముక్తి ప్రసాదిస్తామంటూ సరళీకరణ ప్రక్రియకు మోదీ ప్రభుత్వం నడుం కట్టింది. వేర్వేరుగా సుంకాలు విధించే బదులు ఏకరూపత పాటిస్తూ విలువ జోడింపు పన్ను (వ్యాట్), వస్తు సేవల పన్ను విధానం అమలు పరుస్తున్న సుమారు 160 దేశాల్లో ఇప్పటికీ గరిష్ఠ రేటు ఇండియాదే. మలేసియా (ఆరు శాతం), సింగపూర్ (7), కెనడా (13-15), న్యూజిలాండ్ (15), ఫ్రాన్స్, యూకే (20)ల సరళి అనుసరణీయమన్న భావనతో సుబ్రహ్మణ్యన్ కమిటీ ప్రతిపాదించింది 15-15.5 శాతమే. వాస్తవంలో ప్రధాన వస్తు సేవలపై గరిష్ఠంగా 28, పాన్ మసాలాపై 135, సిగరెట్లమీద 290 శాతం మేర జీఎస్‌టీ విధింపు భారత్‌ను ప్రపంచంలో 'ప్రత్యేకం'గా నిలబెట్టింది. పన్నురేట్లు హేతుబద్ధ స్థాయిలో ఉంటే, చెల్లింపులు స్వచ్ఛందంగా నిజాయతీగా జరుగుతాయన్నది దేశ విదేశాల అనుభవాలు చాటుతున్న సత్యం. అత్యధిక దేశాలు రెండు లేదా మూడు రేట్లకే పరిమితమవుతూ పన్ను పరిధిని, వసూళ్ల రాశిని విస్తరించుకుంటున్నాయి. భారత్ సైతం పోనుపోను శ్లాబుల సంఖ్యను కనిష్ఠస్థాయికి కుదించి పన్నురేటును సహేతుకంగా స్థిరీకరించే దీర్ఘకాలిక లక్ష్యంతో ముందడుగు వేయాలి. దేశార్థిక వ్యవస్థలో అవినీతిని దునుమాడి, పారదర్శకత నెలకొల్పగలిగితేనే జీఎస్‌టీ ప్రాథమిక ధ్యేయం నెరవేరినట్లు! మున్ముందు వస్తుసేవల సుంకాల తగ్గుదలే గాని పెంపుదల ఉండబోదని గతంలో జైట్లీ జాతికి అభయమిచ్చారు. ఆ స్ఫూర్తికి కట్టుబాటు చాటుతూ, దేశ సుస్థిరాభివృద్ధిని లక్షించి ఎప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలతో బాధ్యతాయుతంగా మెలగడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వంతు!

ఉరిమే సవాళ్లపై ఆగ్నేయాస్త్రం!

ASEAN 50 2017

పది దేశాలు, ఎన్నో జాతులు, మతాలు, ధర్మాలు; అసంఖ్యాక సంస్కృతీ సంప్రదాయాలు; వందలాది దర్శనీయ స్థలాలు; విభిన్న ఆహారాలు, ఆహార్యాలు. అయినా, ఏకోన్ముఖ పయనం. ఇదీ సర్ణోత్సవ 'ఆసియాన్' గమనం.

ప్రాంతీయ సమగ్రత, సహకారం ప్రాతిపదికన ఆవిర్భవించిన అనేక అంతర్జాతీయ సంస్థలు కాలక్రమంలో క్రియాశీలతను కోల్పోవడం కొత్త విషయమేమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి సంస్థలు చాలావరకు మొక్కుబడి సమావేశాలు, సంయుక్త ప్రకటనలతోనే కాలక్షేపం చేయడం కళ్లముందు కనిపిస్తున్న వాస్తవం. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) వంటి సంస్థల సరళే ఇందుకు నిదర్శనం. ఆసియాన్ (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) ఇందుకు కొంతవరకు భిన్నం! ఇవాళ 50వ వసంతంలో అడుగుపెడుతున్న ఈ సంస్థ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ- నిర్దేశిత లక్ష్యాల సాధనకు అలుపెరగని కృషి చేస్తుండటం విశేషం. సభ్యరాజ్యాల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నా- కూటమి ధర్మాన్ని అనుసరించి యాభయ్యేళ్ల సుదీర్ఘకాలం ఓ సంస్థ మనుగడ కొనసాగించడం విశేషమే! ఇండొనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశ నిర్మాతల చొరవ, దూరదృష్టి ఫలితంగా 'ఆసియాన్' ఆవిర్భవించింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 1967 ఆగస్టు 8న ఆసియాన్ పురుడుపోసుకొంది. అనంతరం బ్రునై, వియత్నామ్, లావోస్, మియన్మార్, కాంబోడియా చేరడంతో ఆసియాన్ బలమైన సంస్థగా ఎదిగింది. పది సభ్యదేశాలు గల ఆసియాన్- ప్రాంతీయ సమగ్రత, సహకారం పెంపొందించే క్రమంలో భాగంగా భారత్, చైనా, దక్షిణకొరియా, జపాన్‌లను కలుపుకొని ముందుకు సాగుతోంది. ఆసియాన్ దేశాలు ఏటా శిఖరాగ్ర సమావేశాలు నిర్వహిస్తూ, కలిసికట్టుగా పురోగమిస్తున్నాయి. అయిదు దశాబ్దాల ఆసియాన్ ప్రస్థానంలో ఎన్నో ఒడుదొడుకులు, సమస్యలు, సవాళ్లు తారసపడతాయి.

'ఆసియాన్' 50 ఏళ్ల ప్రస్థానం



- ఆసియాన్ జనాభా 62.8 కోట్లు. ప్రపంచ జనాభాలో అది దాదాపు 10 శాతం.
- ఆసియాన్ దేశాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2.5 లక్షల కోట్ల డాలర్లు
- ఆసియాన్ ఆర్థిక వ్యవస్థ ఆసియాలో మూడో అతి పెద్దది. ప్రపంచంలో దీనిది ఆరోస్థానం. ఈ ప్రాంత జీడీపీ వృద్ధిరేటు ప్రపంచ సగటుకన్నా ఎక్కువ.
- ఆసియాన్ జనాభాలో సగానికన్నా ఎక్కువ 30 ఏళ్లలోపువారే.
- ఆసియాన్ దేశాల్లో జనాభాపరమైన తారతమ్యాలు పెద్దస్థాయిలో ఉన్నాయి. బ్రూనై జనాభా 4.17 లక్షలే. ఇండొనేసియా జనాభా 25.5 కోట్లు.
- వియత్నాం, కాంబోడియా, లావోస్, మియన్మార్‌ల ఉమ్మడి జీడీపీకన్నా ఇండొనేసియా జీడీపీ మూడు రెట్లు ఎక్కువ. మలేసియా, థాయ్‌లాండ్, సింగపూర్‌ల ఉమ్మడి జీడీపీకి దాదాపు సమానమైన జీడీపీని ఇండొనేసియా కలిగి ఉంది.
- ఆగ్నేయాసియాలో తయారీ రంగంలో థాయ్‌లాండ్‌దే అగ్రస్థానం. ఆ దేశంలో 4.2 లక్షల తయారీ సంస్థలు ఉన్నాయి. కాంబోడియాలో 71,000, వియత్నామ్‌లో 63,000, ఇండొనేసియాలో 24,000 తయారీ సంస్థలు ఉన్నాయి.
- ఆసియాన్‌లో 227 కంపెనీలు వందకోట్ల డాలర్లకు పైగా వార్షిక రాబడి కలిగి ఉన్నాయి.
- ప్రపంచ ఆర్థిక వేదిక విశ్వ పోటీతత్వ నివేదిక (2016-17)లో సింగపూర్ రెండోస్థానం సాధించింది. మలేసియా (18), థాయ్‌లాండ్ (32), ఇండొనేసియా (37), ఫిలిప్పీన్స్ (47), వియత్నాం (56) సైతం ఆ సూచీలో ప్రథమార్థంలో చోటు సంపాదించుకున్నాయి.
- దక్షిణ చైనా సముద్ర ప్రాంతంపై నియంత్రణ అంశం ఆసియాన్ దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మౌలిక వసతులు, సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐటీ) సామర్థ్యం పెంపు ఎలాగన్నది దీని ముందు సవాలుగా నిలిచింది.

భిన్నత్వంలో ఏకత్వం

ఆసియాన్ దేశాల మధ్య సారూప్యతలతో పాటు కొన్ని వైరుధ్యాలూ ఉన్నాయి. కాంబోడియా, వియత్నామ్, థాయ్‌లాండ్‌లలో బౌద్ధమతానిదే ఆధిపత్యం. ఇండొనేసియా, బ్రునైల్లో ముస్లిములది ప్రాబల్యం. కూటమి దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలు మెల్లగా పాదుకొంటున్నాయి. మియన్మార్, థాయ్‌లాండ్‌లలో పరిమిత ప్రజాస్వామ్యమే అమలవుతోంది. సైనిక నియంతృత్వం అక్కడ పొంచి ఉన్న ప్రమాదం. ఈ దేశాలు చిన్నవే అయినప్పటికీ కూటమిగా శక్తిమంతమైనవే. విస్తృత తీరప్రాంతం గల ఈ దేశాల్లో అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ పెట్టుబడులు పెట్టడం లాభదాయకమనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆసియాన్ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంత ఒప్పందం (ఏఎఫ్‌టీఏ) మైలురాయి వంటిది. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య (ఆర్‌సీఈపీ) ఒప్పందంవల్ల చైనా, జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో అనుసంధానానికి అవకాశం కలిగింది. ఫలితంగా ఏటికేడు అక్కడ కొనుగోలు శక్తి ఇనుమడిస్తోంది. భిన్న మతాలు, వర్గాలతో కూడిన దేశాల కూటమి- ఎంతకాలం సుస్థిరంగా మనుగడ కొనసాగించగలదన్న సందేహాల నడుమ ప్రస్థానం ప్రారంభించి యాభయ్యేళ్లపాటు మనగలగడం అద్భుతమేనని చెప్పాలి! ఐరోపా సమాఖ్య (ఈయూ) తరవాత అత్యంత విజయవంతంగా పనిచేస్తున్న రెండో ప్రాంతీయ కూటమి ఇదే. ఈ కూటమిలో వియత్నామ్ వామపక్ష భావజాలానికి ప్రతీకగా నిలిచింది. కూటమిలోని ప్రధాన దేశాలు ఇండొనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్ ఇందుకు వ్యతిరేకం అయినప్పటికీ విద్య, ఆరోగ్యం, దౌత్యం తదితర రంగాల్లో పరస్పర సహకారం విస్తృతం చేసుకునేందుకు సభ్య దేశాలు తరచూ సమావేశమవుతుంటాయి. సుహార్తో(ఇండొనేసియా), మహతీర్ మహమ్మద్(మలేసియా), లీ(సింగపూర్)వంటి శక్తిమంతులైన నాయకుల దిశానిర్దేశం కూటమి ప్రగతిని కొత్తపుంతలు తొక్కించింది.

అమెరికా, చైనాల ఆధిపత్య పోరు ఆసియాన్ దేశాలపై ఎంతో కొంత ప్రభావం కనబరచే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. మరోవంక సూకీ శకం ప్రారంభమయ్యాక కూడా మియన్మార్‌లో రొహింగ్యా ముస్లిములపై దాడులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆ దేశం ఇప్పటికీ సైనికస్వామ్యం నీడలోనే కొనసాగుతుండటం కలవరపరుస్తున్న అంశం. తీవ్రస్థాయి విభేదాలు, సరిహద్దు సమస్యలనేవి లేకపోవడం కూటమికి కలిసివస్తున్న అంశం. దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ ఆధిపత్యాన్ని ఫిలిప్పీన్స్, బ్రునై, మలేసియా, వియత్నామ్‌లు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయంపై ఫిలిప్పీన్స్ ఏకంగా అంతర్జాతీయ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆసియాన్‌లోని మెజారిటీ దేశాలకు ఉమ్మడి శత్రువు చైనాయే కావడం- వాటి మధ్య ఐక్యతకు పాదు చేస్తున్న కీలకాంశం.

భారత్‌తో సుదృఢ బంధం

ఆసియాన్‌తో భారత్ అనుబంధానికి దశాబ్దాల చరిత్ర ఉంది. గడచిన రెండున్నర దశాబ్దాలుగా ఈ అనుబంధం కొత్తపుంతలు తొక్కుతోంది. 1992లో ప్రధానిగా పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రారంభించిన 'లుక్ ఈస్ట్' (తూర్పువైపు చూపు)తో ఈ బంధం సరికొత్త రూపు సంతరించుకొంది. మోదీ ప్రభుత్వం 'లుక్ ఈస్ట్'ను 'యాక్ట్ ఈస్ట్' (తూర్పువైపు అడుగు)గా మార్చి మరింత క్రియాశీలంగా ముందుకు వెళుతోంది. ఉన్నతాధికార యంత్రాంగం, మంత్రుల స్థాయి పర్యటనలతోపాటు దేశాధినేతల రాకపోకల ఫలితంగా భారత్, ఆసియాన్‌ల మధ్య సాన్నిహిత్యం బలపడుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతిగా ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రణబ్ ముఖర్జీ, ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఆసియాన్‌లోని పదింట తొమ్మిది దేశాల్లో పర్యటించడం వాటితో భారత్‌కు గల అనుబంధానికి దర్పణం పడుతోంది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక 2015, 2016ల్లో మలేసియా, లావోస్ వేదికగా జరిగిన ఇండియా-ఆసియాన్ సదస్సులలో పాల్గొని ఉభయ పక్షాల మధ్య మైత్రీబంధాన్ని మోదీ మరింత సుదృఢం గావించారు. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ) సాకారమయ్యేందుకు భారత్ మద్దతు ఇస్తుందని భరోసా పలికారు. భారత్-ఆసియాన్‌ల మధ్య భౌగోళిక, డిజిటల్ అనుసంధానానికి 100 కోట్ల డాలర్ల రుణం ప్రకటించారు. సముద్రజలాలపై హక్కులకు సంబంధించి 1982నాటి ఐరాస తీర్మానం, అంతర్జాతీయ నిబంధనలకు లోబడి దేశాలన్నీ నడచుకోవాలని స్పష్టం చేయడం ద్వారా దక్షిణ చైనా సముద్ర వివాదంపై ఆసియాన్ దేశాలకు అండగా నిలిచారు. ఆ రకంగా చైనా వైఖరిని మోదీ నేరుగానే ఎండగట్టినట్లయింది. ఆసియాన్ దేశాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, ద్వైపాక్షిక వాణిజ్యాభివృద్ధికి భారత్ గట్టి చొరవ చూపుతోంది. ఇందులో భాగంగా భారత్-మియన్మార్-థాయ్‌లాండ్ మధ్య హైవే ప్రాజెక్టు పనులు 2018 నాటికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఆసియాన్‌తో 2014-15లో భారత్ వాణిజ్యం 76.52 బిలియన్ డాలర్లు. దీన్ని మరింత పెంచేందుకు దిల్లీ నాయకత్వం కృషిచేస్తోంది. ఆసియాన్-భారత్ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి నిధిని ప్రస్తుతం ఉన్న 10లక్షల డాలర్లనుంచి 50లక్షల డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. అంతరిక్ష రంగంలో భారత్-ఆసియాన్‌ల మధ్య సహకారానికి ఉద్దేశించిన ప్రాజెక్టు వియత్నామ్‌లో ఏర్పాటు కానుంది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఆసియా అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలని భారత్ నిర్ణయించింది. వచ్చే ఏడాది స్వాతంత్ర్య సంబరాలకు ఆసియాన్ దేశాల అధినేతలను ఆహ్వానించాలనీ భారత్ నిర్ణయించింది. ఆసియాన్‌తో మైత్రీబంధానికి భారత్ అమిత ప్రాధాన్యమిస్తోందనడానికి ఇవన్నీ నిదర్శనాలే!

చైనాకు వ్యతిరేకంగా సంఘీభావం

బిమ్స్‌టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో ఆపరేటివ్) వంటి అంతర్జాతీయ వేదికలపైనా ఆసియాన్‌తో కలిసి భారత్ చురుగ్గా పనిచేస్తోంది. అంతర్జాతీయ వేదికలమీదా ఆసియాన్ దేశాలపట్ల భారత్ సానుకూల వైఖరితో వ్యవహరిస్తోంది. దక్షిణ చైనా సముద్ర వివాదంపై అంతర్జాతీయ ట్రైబ్యునల్ ఆదేశాలను ఖాతరు చేయని చైనా వైఖరిని ఎండగట్టేందుకు భారత్ మద్దతు ఆసియాన్ దేశాలకు అత్యవసరం. అందుకే భారత్‌కు మరింతగా చేరువయ్యేందుకు ఆసియాన్ దేశాలూ గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. చైనాకు దీటుగా ఎదుగుతున్న భారత్‌వల్ల- భవిష్యత్తులో తమకు ప్రయోజనం చేకూరుతుందని ఆసియాన్ దేశాలు బలంగా నమ్ముతున్నాయి. భారత్-ఆసియాన్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయి. వస్తు సరఫరాకు సంబంధించి 2009లో ఇరుపక్షాల మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరింది. అయిదేళ్ల తరవాత సేవలపైనా స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదరడం బలపడుతున్న బంధానికి నిదర్శనం. భారత్‌కు ఉన్న అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఆసియాన్ ఒకటి. భారత్ ఎగుమతుల్లో ఆసియాన్ వాటా 8.91 శాతం. భారత్-ఆసియాన్‌ల మధ్య వాణిజ్యం 2022నాటికి 200 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. వియత్నామ్, మలేసియా వంటి దక్షిణ చైనా సముద్ర తీర దేశాలు భవిష్యత్తులో భారత ఇంధన అవసరాలు తీర్చే అవకాశం ఎంతైనా ఉంది. వియత్నామ్‌తో ఒప్పందం ఫలితంగా భారత్ ఇప్పటికే దక్షిణ చైనా సముద్రంలో చమురు వెలికితీత కార్యక్రమం చేపట్టింది. ఈ విషయంలో 'డ్రాగన్' అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ భారత్‌కు ముందుకు వెళ్ళడం గమనార్హం. భారత్-ఆసియాన్ మధ్య వాణిజ్యం రెండేళ్లుగా మందగించినప్పటీ ఇటీవల మళ్ళీ పుంజుకొంది. ఆసియాన్- భారత్ బంధం బలపడటం ఉభయులకూ మేలు కలిగించడంతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికీ ఎంతగానో దోహదపడుతుంది!

- గోపరాజు మల్లపరాజు

మత్తు ఎప్పటికి చిత్తు?



ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు

మాదక ద్రవ్య మాఫియా కోరలు చాస్తూ దేశంలో వేగంగా విస్తరిస్తోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ వినియోగం అధికంగా ఉన్నట్లు తాజా అధ్యయనాలు చాటుతున్నాయి. పంజాబ్ ఇప్పటికే డ్రగ్స్ కోరల్లో చిక్కి విలవిల్లాడుతోంది. బాధితుల్లో 15 ఏళ్లలోపు పిల్లలూ ఉంటున్నారు. మానవాళిని పట్టిపీడిస్తున్న సమస్యల్లో ఉగ్రవాదం తరవాతి స్థానం మాదక ద్రవ్యాలదేనని ఐక్యరాజ్య సమితి సైతం స్పష్టీకరించింది. హైదరాబాద్‌లో పాఠశాల స్థాయికి సైతం డ్రగ్స్ అమ్మకాలు చేరాయన్న వార్త భయపెడుతోంది. కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేవారు, ఉన్నతోద్యోగులు, కొంతమంది వాణిజ్య, రాజకీయ, సినీ ప్రముఖులూ మాదక ద్రవ్యాలకు బానిసలు అయినట్లు వచ్చిన సమాచారం సంచలనం సృష్టిస్తోంది. పాశ్చాత్య సంస్కృతిపై మోజు, ఆడంబర జీవితాలు, అర్ధరాత్రి పార్టీలు, సులభ ధనార్జన, వివిధ వ్యాపకాలతో తీరికలేని తల్లిదండ్రులు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిత్తి వంటివి యువత పెడతోవ పట్టడానికి కారణమవుతున్నాయి.

సరదాగా తొలిసారి డ్రగ్స్ రుచి చూసినవారిలో 90 శాతం, వాటికి శాశ్వత బానిసలవుతున్నారన్నది అధ్యయనాల సారాంశం. డ్రగ్స్ కొనలేని పేదవారు ఆ క్రమంలో అమ్మకందారులుగా మారిపోతున్నారు. 1999, 2006, 2016 సంవత్సరాల్లో వేర్వేరు పిటిషన్లపై తీర్పులిచ్చిన సుప్రీంకోర్టు- సమాజంలో డ్రగ్స్ సంబంధిత నేరాలు పెచ్చరిల్లడంపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మాదక ద్రవ్య వ్యాపారం ద్వారా కూడబెడుతున్న సొమ్మును దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి విద్రోహ శక్తులు ఉపయోగించుకొంటున్నాయని న్యాయస్థానం నిష్ఠుర సత్యం పలికింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మూలాలు, సరఫరా-వినియోగం, సమస్యాత్మక ప్రాంతాల గురించి సరైన అధ్యయనం జరగలేదు. ఏటా వేలమంది విద్యార్థుల జీవితాలు బలైపోతున్నా ఆ తీవ్రతను తెలియజేసే వివరాలు, గణాంకాలు ఏవీ ఆయా శాఖల వద్ద లేవు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుడు 3,580 కిలోల గంజాయి, నాలుగు కిలోల కొకైన్, 96 కిలోల ఎఫిడ్రిన్, 231 కిలోల యాంఫిటమిన్, 470 కిలోల అల్ప్రాజోలం పట్టుబడ్డాయి. అంతకు ఎన్నో రెట్ల సరకు వినియోగదారులకు నిక్షేపంగా చేరిపోయి ఉంటుంది. తెలంగాణ సర్కారు ఏర్పాటు చేసిన 'సిట్' విచారణలో డ్రగ్స్ మూలాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. దాడులూ విపరీతంగా జరుగుతున్నాయి. దేశ విదేశాలకు చెందిన విక్రయదారులు పట్టుబడుతున్నారు. విశాఖలోని కొన్ని పార్కులు, బీచ్ ప్రాంతంలో వాడి పడేసిన ఇంజక్షన్లు కనిపిస్తుండటం కలవరం కలిగిస్తోంది. ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాల ఇంజినీరింగ్ వసతి గృహాలు; విజయవాడ, విశాఖలోని కొన్ని విద్యాసంస్థలు, రెండు నగరాల శివార్లలో రహస్యంగా నిర్వహించే రేవ్ పార్టీలు డ్రగ్స్ అమ్మకాలకు అడ్డాగా మారాయన్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. కాకినాడలో డ్రగ్స్ ఉనికి బయటపడటం, మెడికల్ షాపుల యజమానులే



గట్టి చర్యలకు తరుణం

వాటిని అమ్ముతున్నట్లు తేలడం కలకలం సృష్టించింది.

డ్రగ్స్ విక్రయాల కోసం యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండటం తీవ్ర కలవరం రేకెత్తించే పరిణామం. ఈ దృష్ట్యా ప్రభుత్వం సంబంధిత శాఖలను సాంకేతికంగా బలోపేతం చేయాలి. డార్క్‌నెట్, డీప్‌వెబ్‌ల సాయంతో బిట్ కాయిన్స్ రూపేణా సమాంతర మారక వ్యవస్థను మాఫియా నడుపుతోంది. కేంద్రానికి చెందిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో విభాగం హైదరాబాద్‌లో ఉన్నా అదో నామమాత్ర వ్యవస్థగా మిగిలిపోయింది. అమెరికాలోని షికాగో నుంచి 'డార్క్‌నెట్' లావాదేవీల ద్వారా ఖరీదైన మాదక ద్రవ్యాలు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలను నిలువరించడం కష్టమని నార్కోటిక్ నియంత్రణ విభాగం చేతులెత్తేయడం విడ్డూరం.

యువతే దేశానికి అమిత బలం అని పాలకులు పదేపదే ఉద్ఘాటిస్తుంటారు. ఇప్పుడు అదే యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా పటిష్ఠ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉంది. మత్తుకు బానిసై 2014, 2015లలో దేశవ్యాప్తంగా 7,317 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులే. దేశంలో డ్రగ్స్ ప్రచ్ఛన్న వార్షిక వ్యాపార పరిమాణం స్వల్పకాలంలోనే రూ.15 వేల కోట్ల నుంచి రూ.25 వేలకోట్లకు విస్తరించింది. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విస్తృతి కట్టలు తెంచుకుని పల్లెలకూ పాకింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు అలాంటి దుస్థితి ఎదురుకాకుండా పాలకులు అప్రమత్తం కావాలి. సంబంధిత శాఖలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయాలి. ప్రత్యేక కార్యాచరణ బృందాలను నెలకొల్పాలి. శీఘ్రగతి విచారణ న్యాయస్థానాలను అవతరింపజేయాలి. రెండు రాష్ట్రాల అధికారులు, సిబ్బంది మధ్య డ్రగ్స్ రాకపోకలను నియంత్రించే సమాచార సమన్వయం పెరగాలి. బాధిత పిల్లల సమాచార సేకరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. దాని ద్వారా వారికి పునరావాస కేంద్రాల్లో చికిత్స అందజేయాలి. డ్రగ్స్‌కు అలవాటుపడిన తమ పిల్లల వివరాలను ఈ విభాగానికి స్వచ్ఛందంగా తల్లిదండ్రులు అందజేసేలా చైతన్య కార్యక్రమాలను ప్రసార సాధనాల ద్వారా ప్రచారం చేయాలి. కాంబోడియా, వియత్నాం, మెక్సికో, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాల ప్రభుత్వాలు బాధితుల పునరావాసం కోసం ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. వారి అనుభవాల నుంచి నేర్చే పాఠాలు తెలుగు రాష్ట్రాలకు ఎంతగానో ఉపకరిస్తాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి బృందాలు దీనిపై అధ్యయనం చేయడం మంచిది. డ్రగ్స్ నేరాలకు ప్రస్తుత చట్టంలో పదేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా అతి పెద్దశిక్ష. నేరం పునరావృతమైతే జీవితఖైదు విధిస్తారు. ఈ శిక్షలను మరింత కఠినతరం చేయాలి. నిర్భయ ఉదంతం తరవాత మృగాళ్ల అత్యాచారానికి పాల్పడితే ఉరిశిక్ష విధించేలా మనదేశం చట్టంలో మార్పులు చేసింది. మాదక ద్రవ్యాల అమ్మకాలకు సంబంధించి చట్టాలను రాటుతేల్చాలి. డ్రగ్స్ మాఫియాకు సహకరించే అవినీతి అధికారులపైనా తీవ్రచర్యలు తీసుకోవాలి. డ్రగ్స్ విస్తృతికి యథాశక్తి దోహదపడుతున్న చలనచిత్రాలను సెన్సార్‌స్థాయిలోనే నిలువరిస్తే మంచిది. మద్యం ముదిరి మాదక ద్రవ్యం అయినట్లుగా ఉన్న పరిస్థితులను మార్చాలంటే మద్యం అమ్మకాలకూ క్రమేణా కళ్లెం బిగించాలి. అప్పుడే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అసంఖ్యాక యువకులు సమర్థ మానవ వనరులుగా మారతారు. రాష్ట్రాల పురోభివృద్ధిలో భాగస్వాములవుతారు!

(రచయిత- విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

ఈనాడు లేఖలు

కనీస గుర్తింపు అవసరం

అంతర్జాతీయ విజయాలను సొంతం చేసుకున్న క్రీడాకారులకు ప్రభుత్వం నగదు పారితోషికాలను, పెద్దయెత్తున ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. ఉద్యోగాలు, పదోన్నతులు ఇస్తోంది. దేశ విదేశాల్లో క్రీడాయవనికపై మరింతగా రాణించడానికి శిక్షణ సౌకర్యాలు కల్పిస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న విషయంలో రెండోమాటకు తావులేకున్నా, జాతీయ స్థాయిలో రాణిస్తున్నవారికి మాత్రం కనీస గుర్తింపు దక్కకపోవడం బాధాకరం. ప్రభుత్వ ప్రోత్సాహకాలు స్వీకరిస్తున్నవారు పోటీలు, శిక్షణ కార్యక్రమాలు లేనప్పుడు జిల్లాల్లో పర్యటించి స్థానిక క్రీడాకారుల్లో స్ఫూర్తినింపాలి. తద్వారా రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి పాటుపడాలి.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా

చైనా తగని దూకుడు

సరిహద్దుల్లో చైనా కయ్యానికి కాలు దువ్వుతోంది. తమ దేశంలోకి భారత సైన్యమే చొచ్చుకువస్తోందంటూ అసత్య ప్రకటనలు గుప్పిస్తోంది. కవ్వింపు చర్యల ద్వారా రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు యుద్ధం చేయాల్సివస్తే- మన సైన్యంవద్ద ఆయుధ సామగ్రి పది రోజులకు మించి సరిపోదన్న 'కాగ్' నివేదిక సారాంశం ఆందోళన కలిగిస్తోంది. ఏటా కేంద్ర బడ్జెట్లో దేశ రక్షణ కొరకు భారీగా నిధులు కేటాయిస్తున్నా ఇలాంటి దురవస్థ ఎందుకు వచ్చిందో తెలియదు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సైనిక పాటవం గల దేశంగా గుర్తింపు పొందిన భారత్ వైపు కన్నెత్తి చూడాలంటేనే శత్రురాజ్యాలు భయపడేలా త్రివిధ దళాలను ప్రభుత్వం తీర్చిదిద్దాలి.

- సయ్యద్ జుల్ఫికర్ అలీ, కలువాయి, నెల్లూరు జిల్లా

కళలు-కలలు

చంద్రుడిలోని పదహారు కళలే గాక, లోకంలోని అరవై నాలుగు కళలూ మనిషి జీవితంలో అంతర్భాగాలు! చంద్రుడిలో వర్ధిల్లినట్లే, మానవ జీవితంలోనూ రోజుకొక్క కళ పరిఢవిల్లుతుంది. సంపూర్ణ జీవన వికాసానికి అది దోహదపడుతుంది. శిశుప్రాయంలోని కళ వర్ధిల్లితేనే, బాల్యప్రాయం వికసిస్తుంది. బాల్యదశ విరబూస్తేనే, యౌవన సుమం విచ్చుకొంటుంది. ఆ ప్రసూన పరిమళాలు ఎద నిండా నిండిన తరవాతే, వార్ధక్య ఫలం ఫలిస్తుంది. క్రమ వికాసమే కాదు, క్రమ పరిణామమూ నిత్య జీవన కళే!

కళలకు, కలలకు అన్యోన్య స్నేహం ఉంది. కలలు కనడానికి కళాభినివేశం ఆస్కారమిస్తుంది. కలలు కంటూ ఉన్నంత కాలం కళాభిరుచి కొనసాగుతూనే ఉంటుంది. మానవ సహజ స్వభావానికి అతీతంగా, తారలా వెలిగే ప్రతిభారేఖ 'కళ' అనిపించుకొంటుంది.

మనిషి ఉదయాన్నే నిద్రలేవడం, రాత్రికి నిద్రపోవడం- నిత్యకృత్యాలు. యథావిధిగా కొనసాగే ఆ పనులకు ప్రత్యేక ప్రణాళిక, ప్రయత్నం ఉండవు. వాటికి భిన్నమైన మనో వికాసానికి, విలక్షణ వ్యక్తిత్వానికి, శారీరక ఆరోగ్యానికి, భాషణ నైపుణ్యానికి, భావావిష్కరణ చాతుర్యానికి కళలు అవసరమవుతాయి. అవి లేని జీవితం చంద్రుడు లేని రాత్రి వంటిది. చంద్రకళలతో వెలిగే విభావరి అందం వర్ణనాతీతం. జాబిల్లి లేని రేయి ఉసూరుమనిపించి, ఉత్సాహాన్ని హరిస్తుంది. ఉత్సాహం లేని రాత్రిని గడిపిన మనిషికి మరుసటి ఉదయమూ బద్ధకాన్నే కలిగిస్తుంది. అందువల్ల రేయింబవళ్లు నిత్య కళాత్మకంగా భాసిల్లేదే అర్థవంతమైన మానవ జీవితం.

జీవనయానంలో ఒక్క క్షణం వెలుగు కొరవడినా, అశాంతి నీడ ఆవరిస్తుంది. అప్పుడు వికృత రూపాలే కనిపిస్తాయి. మనిషిలో గల ఉత్సుకతను అవి నీరుగారుస్తాయి. అనుక్షణం కళలతో భాసిల్లే బతుకు ఆహ్లాదకరమైన జలధిలో సంతోషనౌక వంటిది. ఆ నౌకాప్రయాణంలో మానవుడు అనేక కలలు కంటాడు. అప్పుడు అసంభవాలు సంభవాలుగా, సంభవాలు అసంభవాలుగా కనిపిస్తాయి. స్వప్నాల్లో కనిపించిందంతా సత్యం కాకపోవచ్చు. అది యథార్థమూ కావచ్చు. అయినా, కలలు కనడం అనేది మనిషి జీవితంలో ఒక భాగం. అది గుణమే కానీ దోషం కాదు. ఆకాశంలో విహరించాలని అతడు కలలు కనడం తప్పు కాకున్నా, వాటిని సాక్షాత్కరింపజేసే ప్రయత్నం నిజజీవితంలో కొనసాగాలి. అప్పుడే కలలకు సార్థకత.

'స్వప్నసృష్టి సత్యసృష్టి వంటిది' అని బ్రహ్మసూత్రాల్లో వేదవ్యాసుడు చెబుతాడు. కలల్లో



అంతర్యామి

కనిపించేవి జగత్తులో జరిగేవే అని, మనిషి మనసుకు గోచరం కాని విషయాలు జగత్తులో ఉండవని, అవే కలలుగా కనిపిస్తాయని ఆయన మాటల అంతరార్థం. కనిపించే జగత్తులా కలలూ శాశ్వతాలు కావని, అవి కొంత కాలం స్మృతిలో ఉండి నశించేవేనని విజ్ఞుల మాట. ఊహలతో కన్న కలల్ని ఆచరణలో ప్రత్యక్షం చేసి, జీవన పరమార్థమైన శాశ్వతానందాన్ని పొందాలి. అదే కలలకు, కళలకు గల అవినాభావ సంబంధం!

కలలైనా, కళలైనా- అవి మానవ స్వభావాల్ని ఆవిష్కరించేవే కాని, ఆకాశం నుంచి అమాంతం ఊడిపడేవి కావు. రాబోయే కీడును, మేలును మనసు ఒక్కోసారి ముందుగానే ఊహిస్తుంది. రామాయణంలోని త్రిజట స్వప్నవృత్తాంతం దీనికి ఉదాహరణ. రాముడి చేతిలో రావణుడికి మృత్యువు తప్పదన్న సూచనను ముందే అందించిన ఆ కల- సార్థక స్వప్నం అయింది.

కీర్తి సాధించి అత్యున్నత శిఖరాలు అధిరోహించిన మహనీయులందరూ జీవితాల్లో కలలు కన్నవారే, కళల్ని ఆరాధించినవారే. లక్ష్యసిద్ధికి సోపానాల వంటి కలలు, కళలు ఎప్పటికీ నిత్యావసరాలు. ఉజ్జ్వల భవితను ఆశించే విద్యార్థులు బంగారు కలలు కనకుంటే, వారికి స్ఫూర్తి ఎలా లభిస్తుంది? 'కలలు కనండి, వాటిని సార్థకం చేసుకోండి' అని చాటిన కలాం మాటలు అందరికీ శిరోధార్యాలు. బంగారు కలలు కంటూ, వజ్రాల కళలను సాకారం చేసుకుంటూ, ఆనందామృత జలధిలో ఓలలాడటమే మానవ జీవన పరమార్థం!

- డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ



విజయవాడ చుట్టగుంటలోని రేషన్ దుకాణంలో ఈ-పోసు యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు

మంత్రి ప్రత్తిపాటి వెల్లడి

విజయవాడ, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులను అతి తక్కువ ధరలకు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. విజయవాడలోని చుట్టుగుంట, కృష్ణలంక ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను మంత్రి సోమవారం పరిశీలించారు. సరకుల పంపిణీలో సర్వర్లతో ఇబ్బందులు వస్తున్నాయని గుర్తించి సమస్యను పరిష్కరించాలని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ రవిబాబును ఆదేశించారు. వేలిముద్రలు పడకపోతే వారి ఫొటోలు తీసి కైజాలా యాప్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం మంత్రి ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ కోసం అంతర్జాతీయ, జాతీయ సంస్థలైన డిమార్ట్స్, వాల్‌మార్ట్, బెస్ట్‌ప్రైజ్, బిగ్‌బజార్ తదితర ఎనిమిది సంస్థలతో చర్చిస్తున్నామన్నారు. వారి ద్వారా రేషన్ దుకాణాలకు నిత్యావసర సరకులను పంపిణీ చేయించి.. వచ్చే లాభంలో 60శాతం సంస్థలకు, 40 శాతం డీలర్లకు ఇచ్చేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో హైఅలర్ట్

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు శంషాబాద్ విమానాశ్రయంలో హైఅలర్ట్ ప్రకటించినట్లు సోమవారం విమానాశ్రయం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ అధికారుల ఆదేశాల మేరకు విమానాశ్రయంలో సందర్శకుల పాసులను అర్ధాంతరంగా నిలిపి వేశారు. సాయుధ బలగాలను భారీ సంఖ్యలో మోహరించారు. విమానాశ్రయం లోపలికి వచ్చే రెండు ప్రధాన ద్వారాల వద్ద వాహనాల తనిఖీని పెంచారు.

పేదలకు 'గ్రామీణ మాల్స్'

- రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు ఇతర సరకులూ విక్రయించే యోచన
- రాజస్థాన్ తరహాలో అమలుకు సన్నద్ధత
- పంపిణీదారులకిచ్చే ధరకే కార్డుదారులకు సరకులు, వస్తువులు
- కంపెనీలతో స్పష్టంగా మాట్లాడాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఒక్కొక్కటిగా సరకులకు కత్తెరపడింది. ఇప్పుడు కేవలం బియ్యం మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తున్న పరిస్థితి. ఈ వ్యవస్థ నిర్వీర్యమైపోతోందన్న ఆందోళన నెలకొన్న నేపథ్యంలో...దీన్ని బలోపేతం చేయడంతోపాటు, పేద కార్డుదారులకు మార్కెట్ కంటే తక్కువ ధరకే బ్రాండెడ్ వస్తువులు/సరకులను పంపిణీ చేసేందుకు వీలుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ గ్రామీణ మాల్స్ విధానాన్ని అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. రాజస్థాన్ తరహాలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో కార్పొరేట్ సంస్థలు సరకులను చౌకధర దుకాణాలకు సరఫరా చేసేందుకు టెండర్లను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆహ్వానించింది. ముందుగా కార్పొరేట్ సంస్థలతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులతో చర్చించింది.

ప్రతిపాదనల్లో...

- సుమారు 150 రకాల బ్రాండెడ్ సరకులను ఎమ్మార్పీపై 30 నుంచి 40శాతం ధర తగ్గించి సరఫరా చేయాలి. ఇలా తగ్గిన ధరలో 60 శాతం కార్డుదారులకు, మిగిలిన 40శాతం రేషన్ డీలర్లకు కమీషన్‌గా అందజేయాలి.
- ఒక్కో చౌకధర దుకాణం నెలకు కనీసం రూ.5వేల విలువైన సరకులను తీసుకోవాలని కంపెనీలు ప్రతిపాదిస్తున్నాయి.
- ఒక నెల అరువుపై ఇవ్వాలని రేషన్‌డీలర్లు కోరారు.
- అలా ఇవ్వాలంటే హామీగా కొంతమొత్తాన్ని ముందుగా చెల్లించాలని కంపెనీలు పౌరసరఫరాల సంస్థకు తెలిపాయి.

రాజస్థాన్‌లో ఇలా...

గ్రామీణమాల్స్ ప్రయోగాన్ని రాజస్థాన్‌లో 2015 అక్టోబరు 31న అన్నపూర్ణ భండార్ యోజన పేరుతో 5వేల మంది చౌకధర దుకాణాలలో ప్రారంభించారు. దేశ ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇదే తొలి అతిపెద్ద పీపీపీ ప్రాజెక్టుగా ప్రారంభమైంది.

- ఈ దుకాణాల్లో ఆహార పదార్థాలతోపాటు మొత్తం 150 రకాల బ్రాండెడ్ వస్తువులు, సరకులను విక్రయిస్తున్నారు.
- ప్రస్తుతానికి అక్కడ కంపెనీలు ఎమ్మార్పీపై 2 నుంచి 30శాతం వరకు తగ్గించి సరఫరా చేస్తున్నాయి.
- వీటి విక్రయం ద్వారా కొంతమంది డీలర్లు నెలకు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఆర్జిస్తున్నట్లు అక్కడకు వెళ్లి అధ్యయనం చేసి వచ్చిన ఏపీ పౌరసరఫరాల సంస్థ కన్సల్టెంట్ ప్రతినిధులు గుర్తించారు.

ఇలా జరిగితే నష్టమే...

- గతంలో కందిపప్పు రాయితీపై పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ సేకరించింది. ఆ క్రమంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. రాయితీ రూపంలో ప్రభుత్వంపై రూ.కోట్లు భారం పడింది.. కార్డుదారులకు మాత్రం నాసిరకం కందిపప్పు అందింది.
- గ్రామీణ మాల్స్ విధానంలోనూ సరకులను సరఫరా చేయడంలో కంపెనీలకు మేలు చేసేందుకు బ్రాండ్ల సంఖ్యను, స్థానిక బ్రాండ్లను పెంచే పరిస్థితి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ సరకులను కొంటేనే బియ్యం ఇస్తామని డీలర్లు ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఉండొచ్చు.



రాజస్థాన్‌లో అన్నపూర్ణ బండారు యోజన్ పేరుతో సాగుతున్న రేషన్ దుకాణాలు

తమిళనాడులో రాయితీనే కొనసాగింపు

తమిళనాడు పీడీఎస్‌లో గతంలో గ్రామీణ మాల్స్ తరహా విధానాన్ని అమలుచేసినా కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో నిలిపివేశారు. అయితే వాటి స్థానంలో నిత్యావసరాలైన కందిపప్పు, మినపపప్పు, పామోలిన్ ఆయిల్‌ను మార్కెట్ ధరలో దాదాపు సగం ధరకే కిలో చొప్పున రాయితీపై పంపిణీ చేస్తున్నారు.

శాశ్వత ప్రాతిపదికగా ఉండాలి: సీఎం

"ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి, సరకులకు సరఫరా చేసే కంపెనీలు ఖచ్చితంగా చేస్తాయా? లేదా, ఆయా కంపెనీలకు చెందిన పంపిణీదారుల నుంచి ఏమైనా సమస్యలొస్తే ఆ కంపెనీలు సరఫరా నుంచి తప్పుకొనే అవకాశం ఉండొచ్చు, వారి పంపిణీదారుకు, మనకు(రేషన్ డీలర్లకు) ఒకే ధరతో సరకులు సరఫరా చేస్తే పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. వీటన్నింటిపైనా కంపెనీలతో స్పష్టంగా మాట్లాడి ముందడుగు వేయాలి"అని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు.

కనీస వేతనమైనా లభించేలా..

"కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ.18వేలుగా పేర్కొంది. మేము పెట్టుబడి పెట్టి, పని చేస్తే కనీస వేతనం మేర కూడా ఆదాయం రాకపోతే కుటుంబ నిర్వహణ ఎలా? కనీస వేతనం స్థాయిలోనైనా ఆదాయం కల్పించేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలి."

– లీలామాధవరావు, జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వహణదారుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు.

శస్త్రచికిత్సకు కి'రాక్'!

స్టాక్‌హోం: శస్త్రచికిత్స నిర్వహించే సమయంలో చాలామంది వైద్యులు సంగీతం వినడం సర్వసాధారణమే. ఇలా సంగీతం వినేవారిలో ఎక్కువ మంది 'రాక్' సంగీతం వింటారట. ఆన్‌లైన్ సంగీత అంగడి స్పూటిఫై, ఫిగర్-1 పరిశోధక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 90 శాతానికిపైగా వైద్యులు శస్త్రచికిత్స సమయంలో సంగీతం వింటుండగా.. వారిలో 49శాతం మందికి 'రాక్' సంగీతం ఉండాల్సిందే. రాక్ సంగీతంలో ప్రముఖ బ్యాండ్‌లైన మెటాల్లికా, లెడ్ జెప్పెలిన్, ఏసీ/డీసీ, స్కార్పియన్ల పాటలను వైద్యులు పదేపదే ఎంచుకుంటున్నారు. ఇక మిగిలిన సంగీత విభాగాలకు వస్తే.. పాప్ (48%), శాస్త్రీయ సంగీతం (43%), జాజ్ (24%) పాటలు వింటున్నారు. శస్త్రచికిత్స సమయంలో సంగీతం వినడం వల్ల అలసట అనిపించదని వైద్యులు పేర్కొన్నారు. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసే సమయంలో లేదా శస్త్రచికిత్స చేసేటప్పుడు పరిస్థితి సంక్లిష్టంగా మారినా వెంటనే సంగీతం ఆపేస్తామని కూడా వైద్యులు స్పష్టంచేశారు.

ఏయూలో పర్యావరణ బయోటెక్నాలజీ-2017 సదస్సు

నవంబరులో నిర్వహణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: పర్యావరణ హితం కోసం పర్యావరణ బయోటెక్నాలజీ -2017 అంతర్జాతీయ సదస్సును నవంబరు 23 నుంచి 25 వరకు ఆంధ్రవిశ్వవిద్యాలయం(ఏయూ) నిర్వహించనుందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను ఆయన సోమవారం ఉదయం ఆవిష్కరించారు. పర్యావరణ హితంతోపాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, ప్రకృతి వనరులు, వ్యర్థాల సమర్థ నిర్వహణ తదితరాలపై సదస్సులో చర్చిస్తారన్నారు. దాదాపు 500 మంది దేశవిదేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. అలాగే నవంబరు 7 నుంచి 9 వరకు ఏపీ సైన్స్ కాంగ్రెస్‌ను ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహిస్తోందన్నారు. 2018 ఫిబ్రవరిలో వరల్డ్ ఓషన్ సైన్స్ కాంగ్రెస్ సదస్సును ఆంధ్ర విశ్వవిద్యాలయ నిర్వహిస్తుందని తెలిపారు.

ముగిసిన గ్రూపు-3 ప్రధాన పరీక్షలు

ఈనాడు, అమరావతి: గ్రూపు-3 (పంచాయతీ కార్యదర్శి) ప్రధాన పరీక్షలు ముగిశాయి. ఆదివారం తొమ్మిది, సోమవారం నాలుగు జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్షలు జరిగాయి. 91% వరకు హాజరు నమోదైంది. ప్రశ్నపత్రాల 'కీ'ని ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. దీనిపై అభ్యంతరాలను ఈ నెల 16వ తేదీలోగా రాతపూర్వకంగా తెలియజేయాలని కార్యదర్శి వైవీఎస్టీ శాయి సూచించారు. అభ్యంతరాలకు తగిన ఆధారాలను చూపించాలని పేర్కొన్నారు.

పూర్తయిన మలివిడత కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మలివిడత కౌన్సెలింగ్ పూర్తయింది. ఎంబీబీఎస్‌లో 264 సీట్లు, దంత వైద్య కోర్సులో 473 సీట్లున్నాయి. ఈ సీట్లను ఆశిస్తూ 13,633 మంది దరఖాస్తుచేశారు. సీట్లకేటాయింపు జాబితా కూడా సిద్ధమైంది. మరోవైపు యాజమాన్య కోటా 'బి' 'సి' కేటగిరి సీట్ల భర్తీకి మలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే అవకాశం ఉంది.

ట్రిపుల్‌ఐటీలకు అదనంగా 366 సీట్లు కేటాయింపు

- ప్రాతినిధ్యం లేని 122 మండలాల నుంచి ఎంపిక
- ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకోం: మంత్రి గంటా

ఈనాడు, అమరావతి: రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ట్రిపుల్‌ఐటీల్లో విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించాలని, ఈ క్రమంలో ఎలాంటి లోపాలకు, అవినీతికి తావు ఇవ్వవద్దని అధికారులకు మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సూచించారు. ట్రిపుల్‌ఐటీల్లో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు మీడియాలో వస్తున్న కథనాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో సోమవారం ఆర్జీయూకేటీ ఉపకులపతి రామచంద్రరాజు, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ పాండాదాస్, ట్రిపుల్‌ఐటీల సంచాలకులు, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంటా మాట్లాడుతూ.. ఉపకులపతి, సంచాలకులు ప్రభుత్వంతో సంబంధం లేదన్నట్లు వ్యవహరించవద్దని, ఇష్టమొచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సంచాలకులతో సమావేశం నిర్వహించాలని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

మండలాలకు సీట్ల కేటాయింపు: ట్రిపుల్‌ఐటీల్లో ప్రాతినిధ్యం లేని మండలాలకు అవకాశం కల్పించేందుకు కొత్తగా 366 సీట్లను సృష్టిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 122 మండలాల నుంచి ఓసీ, బీసీ, ఎస్సీ/ఎస్టీలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 366 సీట్లను కేటాయించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేయనున్నట్లు మంత్రి గంటా ప్రకటించారు. శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలకు కొత్తగా సంచాలకులుగా నియమితులైన హరశ్రీరాములు, బసవయ్యకు ఆయన నియామక పత్రాలు అందించారు.

కొత్త విధానంలో బెరైటీస్ ధరల ఖరారు

ఈనాడు, అమరావతి: బెరైటీస్ ధర నిర్ణయంలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర, డాలర్ విలువ ఆధారంగా బెరైటీస్ ధరలను ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి బ్యాటరీ కార్లు వస్తున్నందున భవిష్యత్తులో చమురు వాడకం తగ్గనుంది. బెరైటీస్ వాడకం సైతం ఇదే స్థాయిలో తగ్గిపోనుంది. అంతర్జాతీయంగా మారుతున్న పరిణామాలకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారి బెరైటీస్ ధరను పునఃసమీక్షించాలని ఏపీఎండీసీ నిర్ణయించింది. దీన్ని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం కూడా ఆమోదించింది. లోగడ ఏడాదికోసారి ధరలను ఖరారు చేసేవారు. దీనివల్ల సమస్యలు వచ్చేవి.

బాలికలకు 18 ఏళ్ల వరకు తప్పనిసరి విద్య

- చట్టసభల్లో సమానావకాశాలు
- ఆస్తిలో సమాన హక్కు
- పది అంశాలతో అమరావతి తీర్మానం

ఈనాడు – అమరావతి

మహిళా సాధికారత కోసం అమరావతి తీర్మానం (డిక్లరేషన్) సిద్ధమైంది. పది అంశాలతో దీన్ని రూపొందించారు. ముసాయిదాలో మార్పుచేర్పులతో తుది తీర్మానాన్ని సిద్ధం చేశామని, ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో దీన్ని ఆవిష్కరిస్తారని శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రముఖులు, ఐఏఎస్ అధికారిణులు, విద్యార్థినులతో శాసనసభ సమావేశ మందిరంలో సోమవారం కోడెల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం కోడెల విలేకరులతో మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో పవిత్రసంగమం వద్ద నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంటులో మహిళా సాధికారతకు సంబంధించి వచ్చిన సూచనలను ప్రాతిపదికగా చేసుకుని ఈ తీర్మానాన్ని రూపొందించామన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలోనూ మూడుసార్లు సమావేశాలు నిర్వహించి తీర్మానానికి తుదిరూపు ఇచ్చామని చెప్పారు. సమావేశంలో మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, శాసనసభ ప్రత్యేక కార్యదర్శి పి.రామాచార్యులు, మహిళా ఉన్నతాధికారులు సుమితాదావ్రా, ఏఆర్ అనూరాధ, కె.సునీత, సంధ్యారాణి, వి.ప్రతిమ, అలెన్‌జాన్, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డీఎం మమత, ప్రొఫెసర్ డీబీ కృష్ణకుమారి, వివిధ కళాశాలల అధ్యాపకురాళ్లు పాల్గొన్నారు.

తీర్మానంలోని అంశాలివి..

1. **స్త్రీ విద్య:** బాలికలకు 18 ఏళ్ల వరకు తప్పనిసరి విద్య. విద్యారంగంలో అన్ని స్థాయిల్లో బాలురతో సమాన అవకాశాలు. బాలికలకు అందుబాటులో వృత్తి, నైపుణ్య విద్య. బాలికలు, స్త్రీ విద్యకు తగిన నిధులు కేటాయించేలా నిర్దుష్ట విధానం.
2. **న్యాయపరమైన హక్కులు:** మహిళల సమస్యల పరిష్కారానికి అవసరమైన వ్యవస్థల ఏర్పాటు. వారసత్వ ఆస్తిపై సమాన హక్కు కల్పించేలా కొత్త చట్టాల రూపకల్పన. ఉన్న చట్టాలకు సవరణ. మహిళా హక్కుల పరిరక్షణ చట్టాల సక్రమ అమలు. కేసుల సత్వర పరిష్కారం.
3. **ఆరోగ్యం, పౌష్టికాహారం:** మహిళలకు పౌష్టికాహారం అందించేందుకు వీలుగా అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం. అవి మహిళలకు అందుబాటులో ఉండేలా చూడటం. కుటుంబనియంత్రణపై అవగాహన. ప్రసవాలు వందశాతం ఆస్పత్రులలోనే జరిగేలా చూడటం. బిడ్డ పుట్టాక మొదటి వెయ్యి రోజుల్లో వారి ఆరోగ్యం, పౌష్టికాహారాన్ని అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించడం.
4. **పారిశ్రామికవేత్తలుగా మహిళలు:** పాఠశాల, కళాశాల స్థాయిలో వారికి తగిన నైపుణ్యాలు, విజ్ఞానం అందించేలా విధానాల రూపకల్పన. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వ్యాపారరంగంలో ప్రవేశించేందుకు అవసరమైన వాతావరణం కల్పించడం. పన్ను రాయితీలు, ఆర్థిక సహకారం, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జోన్ల అభివృద్ధి.
5. **ఆవిష్కరణల్లో మహిళలు:** బాలికలకు ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ. శాస్త్ర, సాంకేతిక, ఉన్నత విద్యా రంగాల్లో అవకాశాలు. పరిశోధన, వినూత్న ఆవిష్కరణల్లో బాలికలకు ఉన్న ఆసక్తిని చిన్న వయసులోనే గుర్తించి ప్రోత్సహించడం.
6. **రాజకీయాల్లో మహిళలు:** న్యాయ, రాజకీయపరమైన హక్కులపై అవగాహన కల్పించడం. చట్టసభలు, స్థానిక సంస్థలు, ఇతర నిర్ణాయక ప్రక్రియల్లో సమాన భాగస్వామ్యం. నాయకత్వ లక్షణాలు పెంచడం.
7. **సామాజిక భద్రత:** బాలికలు, మహిళలపై జరుగుతున్న హింసాకాండపై అవగాహన కల్పించడం. విద్యాలయాల్లో ఆత్మరక్షణ పద్ధతులు బోధించడం. మహిళల అక్రమ రవాణా, వారిని హింసించడం, సైబర్‌క్రైం, ప్రసారమాధ్యమాల్లో అసభ్యంగా చూపించడం వంటి వాటిపై కఠిన చర్యలు చేపట్టడం. బీమా, పింఛను వంటి సదుపాయాల ద్వారా సామాజిక భద్రత కల్పించడం.
8. **సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు:** కచ్చితమైన సమాచారం ఆధారంగా మహిళల సామాజిక- ఆర్థిక సాధికారతకు విధానాల రూపకల్పన. జీవనోపాధికి భద్రత కల్పిస్తూ తగిన నిధులతో వ్యూహాల రూపకల్పన.
9. **సామాజిక అభివృద్ధి:** బాలికలు, మహిళల పట్ల బాధ్యతతో, గౌరవభావంతో మెలిగేలా సమాజాన్ని సమాయత్తం చేయడం. వారి ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేలా విధానాల రూపకల్పన.
10. **డిజిటల్ అక్షరాస్యత:** మహిళల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంచడం.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న నగర సంయుక్త పోలీసు కమిషనర్ డి.నాగేంద్ర కుమార్, స్వాధీనం చేసుకున్న కరెన్సీ నోట్లు

రద్దయిన నోట్లు భారీగా స్వాధీనం

- విశాఖలో రూ.1.91 కోట్ల నగదు గుర్తింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రద్దయిన కరెన్సీ నోట్లను విశాఖలోని ఓ అపార్టుమెంట్‌లో భద్రపరిచారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నగదుతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో నగర సంయుక్త పోలీసు కమిషనర్ డి.నాగేంద్ర కుమార్ వివరాలు తెలిపారు. 'విశాఖలోని బర్మా క్యాంపు ప్రాంతానికి చెందిన గెడ్డం కల్యాణ్‌కుమార్, గుడ్లా వెంకటరమణ, మాధవధార ప్రాంతానికి చెందిన కండిబొట్టి నవీన్ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నారు. నోట్లు రద్దు అనంతరం రిజర్వ్‌బ్యాంకు ఎన్‌ఆర్‌ఐలు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్‌బీఐ కౌంటర్లలో 2017 జూన్ 30 వరకు నగదు మార్పు చేసుకోవడానికి గడువు పొడిగించింది. ఇదే అదనుగా అక్రమ మార్గంలో సొమ్మును సంపాదించాలని ఈ ముగ్గురూ నిర్ణయించుకున్నారు. నగరంలోని పలువురి నుంచి రూ.1.91కోట్ల పాత కరెన్సీని రూ.36 లక్షలకు కొనుగోలు చేశారు. తర్వాత ఆర్‌బీఐ కౌంటర్ల వద్దకు వెళ్లి పాత నగదు మార్పిడి చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అనంతరం రూ.70,19,000 విలువైన పాత వెయ్యి నోట్లు, రూ.1,20,81,000 విలువైన పాత ఐదు వందల నోట్లకట్టలను తీసుకొచ్చి అక్కయ్యపాలెం ప్రాంతంలోని వేణుగోపాల్ అపార్టుమెంట్ ఫ్లాట్ నెంబర్ ఎఫ్‌ఎఫ్-2లో భద్రపరిచారు. దీనిపై సమాచారం రావడంతో ముందస్తు నిఘా పెట్టి దాడులు నిర్వహించినట్లు' తెలిపారు.

జగన్‌పై 'సస్పెక్ట్ షీటు' తెరవాలి: తెదేపా

విజయవాడ, న్యూస్‌టుడే: వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిపై నిరంతరం పోలీసు నిఘా ఉంచాలని, అతనిపై ఆంధ్రప్రదేశ్ పోలీస్ మాన్యువల్ 600-1 ప్రకారం సస్పెక్ట్ షీటు తెరవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ వర్ల రామయ్య కోరారు. విజయవాడలో సోమవారం శాసనమండలి సభ్యులు బుద్దా వెంకన్న, బచ్చుల అర్జునుడు తదితరులతో కలిసి డీజీపీ నండూరి సాంబశివరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రామయ్య విలేకరులతో మాట్లాడారు. 11 సీబీఐ కేసుల్లో, 5 ఈడీ కేసుల్లో చార్జిషీట్లు ఉన్న జగన్ నంద్యాల సభలో మాట్లాడిన తీరు సభ్యసమాజాన్ని ఉలిక్కిపడేలా ఉందన్నారు. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ నాయకుడి మాటల్లా లేవని, బెజవాడ బ్లేడ్‌బ్యాచ్ మాట్లాడినట్లు ఉందన్నారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ జగన్ డ్రామా కంపెనీ ప్రశాంత కిషోర్ నేతృత్వంలో నాటకాలాడుతున్నారన్నారు. ఇలాగే మాట్లాడుతుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. మరో ఎమ్మెల్సీ అర్జునుడు మాట్లాడుతూ జగన్ లాంటి ప్రతిపక్ష నేత రాష్ట్రానికి ఉండటం దురదృష్టకరమన్నారు.



డీజీపీ సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా ఏపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, బుద్దా వెంకన్న, బి.అర్జునుడు

కర్ణాటక మంత్రిని ప్రశ్నించిన ఐటీ అధికారులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ఇంధనశాఖ మంత్రి శివకుమార్ ఆస్తులపై ఇటీవల సోదాలు నిర్వహించిన ఆదాయపుపన్ను శాఖ.. సోమవారం ఆయనను నాలుగు గంటలపాటు ప్రశ్నించింది. బెంగళూరులోని ఆదాయపు పన్నుశాఖ కార్యాలయంలో జరిగిన విచారణ కార్యక్రమానికి శివకుమార్‌తో పాటు ఆయన సోదరుడు సురేశ్, మామ తిమ్మయ్య, వ్యక్తిగత జోతిష్యుడు ద్వారకానాథ్ హాజరయ్యారు. ఒకరి తర్వాత మరొకరిని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

గుజరాత్ ఎమ్మెల్యేలు తిరుగు పయనం

బెంగళూరు, న్యూస్‌టుడే: గుజరాత్ శాసనసభలో కాంగ్రెస్ సభ్యుల 'బెంగళూరు శిబిరం' ముగిసింది. ఆ రాష్ట్రం నుంచి రాజ్యసభ మూడు స్థానాలకు మంగళవారం నిర్వహించనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వారంతా ఆదివారం అర్ధరాత్రి దాటాక పయనమయ్యారు. పది రోజులుగా బెంగళూరులోనే ఉన్న 44 మంది ఎమ్మెల్యేలు రెండు విడతలుగా బయలుదేరి వెళ్లారు. వారంతా తొలుత దిల్లీ వెళ్లి.. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి..గుజరాత్‌కు పయనమయ్యేలా ఇక్కడ ప్రణాళిక రచించారు. వారికి ఇక్కడ ఆతిథ్యమిచ్చిన కర్ణాటక ఇంధన మంత్రి డి.కె.శివకుమార్ ఆదాయపుపన్ను శాఖ అధికారుల దాడుల నేపథ్యంలో వారి వెంట వెళ్లలేకపోయారు. నగర శివార్లలోని ఈగల్టన్ రిసార్టులో బస చేసిన ఎమ్మెల్యేలకు భారీ భద్రత కల్పించారు. విమానాశ్రయం వరకు వెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాల్ని సమకూర్చింది. అహ్మదాబాద్ శివార్లలోని జ్ఞానానంద రిసార్టుకు ఈ ఎమ్మెల్యేలను తరలిస్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి నేరుగా శాసనసభకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇంటర్ ఉచిత పుస్తకాల ముద్రణ నిలిపివేత

- పాఠ్యాంశాలు మార్పుతోనే ఇలా అంటున్న ఇంటర్ విద్యాశాఖ
- ఇబ్బందుల్లో పేద విద్యార్థులు
- బహిరంగ మార్కెట్లో అధికధరలు

ఈనాడు – అమరావతి

ఇంటర్ విద్యార్థులకు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా అందించే ఉచిత పాఠ్యపుస్తకాల సరఫరాను నిలిపివేయడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఎంబీబీఎస్ ప్రవేశాలకు నీట్ నిర్వహించడం.. ఇంజినీరింగ్‌కు భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఒక్కటే ప్రవేశ పరీక్ష నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నందున వచ్చే ఏడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపులతోపాటు ఆర్ట్స్ గ్రూపుల్లోనూ కొన్ని పాఠ్యాంశాలు మార్పులు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఉచిత పాఠ్య పుస్తకాల ముద్రణ నిలిపివేశారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులు.. జూనియర్ కళాశాలలకు అందించడంలో తీవ్ర జాప్యం చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివేవారు పుస్తకాలు ఇస్తేనే టీసీలు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. గతేడాది పంపిణీ చేయగా మిగిలిన 10శాతం పుస్తకాలతోపాటు కళాశాలలను వదిలివెళ్లేవారు.. మొదటి ఏడాది నుంచి ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించే వారి నుంచి పుస్తకాలను తీసుకుని విద్యార్థులకు అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అధికారుల ఆదేశాలు వచ్చేసరికే కొందరు విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. కొందరు విద్యార్థులు తమకు ఉన్నత చదువులకు ఈ ఇంటర్ పుస్తకాలు ఉపయోగపడతాయంటూ ఇచ్చేందుకు నిరాకరించగా.. కొన్ని సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులైన వారు ఆయా పుస్తకాలు తిరిగి ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా సేకరించిన పుస్తకాలు 50-60శాతం మందికి మాత్రమే సరిపోయాయి. మిగతా 40శాతం మంది బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్తగా వచ్చేవారికి ఎలా..: ఇంటర్ ప్రవేశాలను ఆగస్టు 16వ తేదీ వరకు పొడిగించారు. దీంతో కొత్తగా వచ్చేవారికి పుస్తకాలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి ఇవ్వాలని ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. జూన్‌లో తరగతులు ప్రారంభమైనా ఇంతవరకు చాలామంది వద్ద పుస్తకాలు లేకుండా చదువులు సాగుతున్నాయి. కొన్నిచోట్ల కొరతగా ఉన్న పుస్తకాన్ని ఒకరోజు ఒకరికి మరొక రోజు మరొకరికి ఇస్తున్నట్లు పలువురు లెక్చరర్లు పేర్కొంటున్నారు. ఎక్కువగా సైన్సు గ్రూపునకు చెందినవి, ఆర్ట్స్‌లో ఆర్థిక శాస్త్రం, కామర్స్ పుస్తకాలకు కొరత నెలకొంది.

★ కర్నూలు జిల్లాకు మొత్తం 1.65లక్షల పుస్తకాలు అవసరం కాగా.. 33,500పుస్తకాలు సర్దుబాటు చేశారు. గతేడాది మిగిలిన పాతనిల్వను మొదట ఎయిడెడ్ కళాశాలలకు ఇచ్చేశారు. దీంతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు పాతపుస్తకాల సేకరణపైనే ఆధారపడాల్సి వచ్చింది. విశాఖపట్నం జిల్లాలో చాలావరకు విద్యార్థులకు అందించారు.

★ నిరుపేద విద్యార్థులు కొత్త వాటిని కొనుగోలు చేయలేక.. పాతపుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాతపుస్తకాలు అమ్మే దుకాణాలకు డిమాండ్ ఏర్పడింది.

గైడ్లతో సరిపెడుతున్నారు: పుస్తకాలు కొనలేని వారు కొందరు క్వశ్చిన్ బ్యాంకులు, గైడ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో లెక్చరర్లు చెప్పే పాఠాలకు విద్యార్థులు అనుసరిస్తున్న విధానానికి పొంతన లేకుండాపోతుంది. పాతపుస్తకాలు అందిస్తున్నా వాటిల్లో కొన్ని పేజీలు ఉండడం లేదని విద్యార్థులు ఫిర్యాదులు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో విక్రయించేందుకు ముద్రించే వాటిలోనూ జాప్యం జరగడంతో మొదట్లో పుస్తకాలు లభించలేదు. దీంతో కొందరు జూన్ మాసంలో తెలంగాణకు చెందిన పుస్తకాలను కొనుక్కున్నారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరులాంటి ప్రధాన నగరాల్లో ఇప్పటికీ ఇంటర్ మొదటి ఏడాది సంస్కృతం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ గ్రూపునకు చెందిన పుస్తకాలు పూర్తిస్థాయిలో లభ్యం కావడం లేదు. పుస్తకాల కొరత నేపథ్యంలో కొన్నిచోట్ల బహిరంగ మార్కెట్‌లో పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు మొదటి ఏడాది బైపీసీ సెట్టు రూ.710, ఎంపీసీ రూ.900వరకు విక్రయించాల్సి ఉండగా చాలాచోట్ల రూ.300 నుంచి రూ.500 వరకు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

వారికీ 60ఏళ్లకు పదవీ విరమణ!

ఈనాడు, అమరావతి: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ, ఇంటర్మీడియట్ బోర్డు, విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థల్లో పని చేసి, 58ఏళ్లు రావడంతో పదవీవిరమణ పొందిన ఉద్యోగుల సేవలను 60ఏళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మే 5వ తేదీ నుంచి ఇది వర్తిస్తుంది. అంతకు ముందు కాలాన్ని సెలవుగా భావిస్తారు. ఈ ఉత్తర్వులు ఇవ్వడంపై ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మధుసూధనరావు, యూ.సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

ఏకీకృత సర్వీసు నిబంధనల్లో కలపొద్దంటూ నిరసనలు: ఎంటీఎఫ్

ఏకీకృత సర్వీసు నిబంధనల్లో పురపాలక ఉపాధ్యాయులను కలపాలనే అంశాన్ని వ్యతిరేకిస్తూ మంగళ, బుధవారాల్లో పాఠశాలల్లో నిరసనలు చేపట్టనున్నట్లు పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామకృష్ణ, ఎం.రవిసిద్ధార్థా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాఠశాల విరామ సమయంలో 'క్విట్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్' కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.


ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ ఛైర్మన్‌గా అంబికా కృష్ణ

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ సినిమా, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) ఛైర్మన్‌గా పి.వి.వి.పి.కృష్ణారావు (అంబికా కృష్ణ)ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

ఎంసెట్ ర్యాంకుల్లో వెలగని 'తెలుగు'

- వెనుకంజలో తెలుగు మాధ్యమ విద్యార్థులు
- గత మూడేళ్లల్లో వెయ్యిలోపు ర్యాంకు వచ్చింది ఒక్కరికే

ఈనాడు - అమరావతి



ఏపీ ఎంసెట్ ర్యాంకుల్లో తెలుగు మాధ్యమ విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ఈ మాధ్యమంలో ప్రైవేటు కళాశాలల్లో చదివిన వారికీ ర్యాంకులు లభించట్లేదు. ప్రైవేటులో ఆంగ్ల మాధ్యమం చదివిన వారే ర్యాంకులు, మంచి ఇంజినీరింగ్ కళాశాలల సీట్లు ఎగరేసుకుపోతున్నారు. గ్రామీణ నేపథ్యం.. నిరుపేద వర్గాలకు చెందిన వారే ఎక్కువగా తెలుగు మాధ్యమంలో చేరుతున్నారు. వారు ఎక్కడో చివరి ర్యాంకుల్లో నిలుస్తున్నారు. మంచి ర్యాంకులు రాకపోవడంతో పేరున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందలేకపోతున్నారు. దీంతో ఇంజినీరింగ్ చదివినా నైపుణ్యం లేక మంచి ప్యాకేజీతో ఉపాధి లభించని పరిస్థితి ఏర్పడుతోంది. గత మూడేళ్ల ర్యాంకుల జాబితాను పరిశీలిస్తే వెయ్యిలోపు ర్యాంకు వచ్చిన తెలుగు మాధ్యమ విద్యార్థి ఒక్కరే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జూనియర్ కళాశాలలపై సరైన తనిఖీ వ్యవస్థ లేకపోవడం.. విద్యార్థుల హాజరుపైనా దృష్టిపెట్టకపోవడంతో మార్కులు, ర్యాంకుల్లో వెనుకబడుతున్నట్లు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. మాతృభాషను పరిరక్షించుకోవాలని భాషా ప్రేమికులు ఒకపక్క పోరాటలు చేస్తుంటే. ప్రభుత్వం మాత్రం తెలుగు మాధ్యమ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం లేదు. అన్ని స్థాయిల్లోని వారు వీరి పట్ల ఉదాసీనంగానే వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గత మూడేళ్లలో పరిస్థితి ఇలా...

- ★ 2015లో 30వేల లోపు ర్యాంకుల్లో 48మంది తెలుగు మాధ్యమంలో చదివినవారు ఉన్నారు. ఇందులో 20,001-30వేల ర్యాంకుల మధ్య అత్యధికంగా 34 మంది; 10,001-20 వేల మధ్య ర్యాంకుల్లో 12 మంది ఉన్నారు. 7001-8వేల మధ్య ఒకరు, 8001-9వేల మధ్య మరొకరు ఉన్నారు. వీరిలో కూడా ప్రభుత్వ కళాశాలల్లో చదివినవారు 11మంది మాత్రమే ఉండగా.. మిగత వారు ప్రైవేటులో తెలుగుమాధ్యమంలో చదివిన వారు.
- ★ 2016లో 30వేల లోపు ర్యాంకులలో 35 మంది ఉన్నారు. 6001-7వేలు ర్యాంకుల్లో ఒకే ఒక్క విద్యార్థి ఉండగా.. 10001-20 వేల మధ్య ర్యాంకులొచ్చిన వారు ఏడుగురు, 20001 నుంచి 30000 మధ్య ర్యాంకులు పొందిన వారు 27 మంది ఉన్నారు.
- ★ 2017లో 30వేలలోపు ర్యాంకులు వచ్చిన వారి సంఖ్య కొంచెం పెరిగినప్పటికీ 2015తో పోల్చితే తక్కువగానే ఉంది. 30వేలలోపు ర్యాంకులలో 45మంది ఉండగా వెయ్యిలోపు ర్యాంకుల్లో ఒకరు ఉండడం కొంచెం ఊరటనిచ్చే అంశం. ప్రభుత్వ కళాశాలల్లో చదివి 10వేల లోపు ర్యాంకు వచ్చిన వారు ఒక్కరూ లేరు. 10001 నుంచి 20000 మధ్య ర్యాంకు వచ్చిన వారు 11 మంది, 20001-30వేల మధ్యలోర్యాంకులు వచ్చినవారు 33మంది ఉన్నారు.

ప్రైవేటుదే ర్యాంకుల హవా

మంచి ర్యాంకులు సాధిస్తున్న ఆంగ్లమాధ్యమ విద్యార్థుల్లోనూ ఎక్కువ ప్రైవేటు కళాశాలలకు చెందినవారే ఉంటున్నారు. ఎంసెట్-2017లో 0-100 ర్యాంకుల్లో ప్రభుత్వ కళాశాలల నుంచి ఒక్కరూ లేకపోగా ప్రైవేటు కళాశాలలకు చెందిన వారు 103మంది ఉన్నారు. వెయ్యి ర్యాంకుల్లోపు వారు ప్రైవేటు నుంచి 935మంది ఉంటే ఇందులో ప్రభుత్వ కళాశాలల నుంచి ఇద్దరు ఉన్నారు. మార్కులు, ర్యాంకులు సంపాదిస్తున్న ప్రైవేటు కళాశాలల పిల్లలే ఇంజినీరింగ్‌లో మంచి కళాశాలల్లో సీట్లను పొందుతున్నారు.

నియమనిష్ఠలు వీడొద్దు

శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకుడు సిద్ధేశ్వరానంద భారతి

ఈనాడు, దిల్లీ: భగవంతుడి ఆరాధనలో నియమనిష్ఠలు వీడొద్దని శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకుడు జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి తెలిపారు. సోమవారం శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని వారణాశిలోని కాశీ ఆంధ్ర ఆశ్రమంలో సిద్ధేశ్వరానంద భారతి పాదపూజ నిర్వహించారు. గన్నవరం శ్రీభువనేశ్వరీ పీఠాధిపతులు సత్యానంద భారతి, నారాయణానంద భారతి, వాసుదేవానంద భారతి, దత్తాత్రేయానంద భారతి, పూర్ణజ్ఞానానంద సరస్వతి, మాతాజీ రమ్య యోగిని, మాతాజీ సుకన్య యోగినిలు పాదపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద అనుగ్రహభాషణం చేస్తూ.. నియమనిష్ఠలతో ఆరాధన చేసినవారు భగవంతుడి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

నేడు 'విద్యుత్‌సౌధ'ను ప్రారంభించనున్న గవర్నర్, సీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో విజయవాడలోని గుణదలలో నిర్మించిన 'విద్యుత్ సౌధ'ను గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందులో ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో కార్యాలయాలు ఉన్నాయి. ప్రధాన భవనానికి వెనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) ఉంది. ఎస్ఎల్‌డీసీ ద్వారానే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, పంపిణీ పర్యవేక్షణ ఉంటుంది.

గిరిజనులకు వైద్య సేవలు అందించడానికి తరలిరండి

సేవాసంస్థలకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల పిలుపు

శ్రీశైలం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గిరిజనులకు వైద్యసేవలు అందించడానికి ప్రేమతో తరలిరావాలని సేవాసంస్థలకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు జిల్లా శ్రీశైలం మండలంలోని సున్నిపెంట ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ భవనంలో గిరిజనులకు మెరుగైన వైద్య, ఆరోగ్యసేవలు అందించే విషయమై సమీక్షా సమావేశం జరిగింది. వైద్యఆరోగ్యశాఖ ప్రభుత్వ సలహాదారు జితేంద్రశర్మ, ప్రజారోగ్యశాఖ సంచాలకులు అరుణకుమారి, గిరిజనసంక్షేమశాఖ కమిషనర్ పద్మ, రామకృష్ణమిషన్, చిన్మయ, పరమహంస యోగానంద నిత్యాలయ, ఆర్.డి.టి., సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు పేదలు, గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను ముఖ్యకార్యదర్శికి వివరించారు. రాష్ట్రంలోని గిరిజనులకు తమ మిషన్ల ద్వారా మరిన్ని సేవలు అందించడానికి అంగీకరించాయి. వారి నుంచి ప్రతిపాదనలు అధికారులు స్వీకరించారు. రానున్న 20 రోజుల్లో క్షేత్రస్థాయిలో గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు, శస్త్రచికిత్సలు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య పేర్కొన్నారు.

పార్టీలకు కార్పొరేట్ విరాళాల్ని నిషేధించాలి

- అప్పుడే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట
- పెద్దనోట్ల రద్దు లక్ష్యం నెరవేరలేదు
- అవినీతి కన్నా లాబీయింగ్ మరింత ప్రమాదకరం
- హిందూ మాజీ ఎడిటర్ ఎన్.రామ్
- పరిస్థితులు మారుతున్నాయి...
- అవినీతి స్థాయిని తగ్గించవచ్చు: మంత్రి కేటీఆర్



ఎన్ రామ్ రచించిన 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, మేయర్ బొంతు రామ్మోహన్, శ్రీరాం కర్రి

ఈనాడు, హైదరాబాద్: రాజకీయ పార్టీలకు కార్పొరేట్ విరాళాలు నిషేధించే వరకు దేశంలో రాజకీయ అవినీతి కొనసాగుతుందని హిందూ మాజీ సంపాదకుడు ఎన్.రామ్ పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రస్తుతమున్న చట్టాలు సరిపోవని, వీటిని అమలు చేయాల్సిన యంత్రాంగం పూర్తిస్థాయిలో లేదన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని నిరోధించడంలో ఎన్నికల కమిషన్ నిస్సహాయ స్థితిలో ఉందని అభిప్రాయపడ్డారు. సోమవారమిక్కడ హైదరాబాద్ పార్క్, ఐటీపీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజకీయ అవినీతిపై తాను రాసిన 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకాన్ని ఎన్.రామ్ ఐటీశాఖ మంత్రి కేటీఆర్, మేయర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజకీయ అవినీతి, తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్రి శ్రీరామ్ అధ్యక్షత వహించారు.

అవినీతి బహుముఖం: అవినీతి బహుళ రూపాల్లో ఉందని, అవినీతికి, రాజకీయానికి దగ్గరి సంబంధం ఉందని ఎన్.రామ్ అభిప్రాయపడ్డారు. పెద్దనోట్ల రద్దుతో నల్లధనం వెలికితీయడం, ఉగ్రవాదులకు నిధులు అడ్డుకోవడం లక్ష్యాలు నెరవేరలేదని.. కానీ ఈ నిర్ణయం రాజకీయంగా లబ్ధిచేకూర్చిందన్నారు. "ఎన్నికల్లో నిధుల ప్రవాహం, రాజకీయ పార్టీలకు విరాళాలు, ఎన్నికల్లో పరిమితికి మించి చేస్తున్న ఖర్చుతో అవినీతి పెరుగుతోంది. పారదర్శకత కోసమంటూ తీసుకువచ్చిన ఆర్థిక బిల్లులో రాజకీయ పార్టీల విరాళాలకు బాండ్లు ఇస్తామన్నారు. ఈ బిల్లు పారదర్శకంగా లేనందున రాజకీయ అవినీతిని తగ్గించలేం. అవినీతి కన్నా లాబీయింగ్ అత్యంత ప్రమాదకరమైనది. మీడియా అవినీతి, సర్దుకుపోయే జర్నలిజం అవినీతిని నిర్మూలించలేవు. గతంలో చెల్లింపు వార్తలు ఎన్నికల వరకే పరిమితం కాగా.. ఇప్పుడు రోజూ ఇదో వ్యవస్థగా కొనసాగుతోంది. అవినీతిపై ప్రజల్లో పూర్తిస్థాయి తిరుగుబాటు వస్తుందని ఆశించలేం. సంక్షేమ పథకాలతో లబ్ధి జరుగుతుందన్న భావనతో వారంతా అవినీతిని లక్ష్యపెట్టడం లేదు. లోక్‌పాల్, లోకాయుక్త తీసుకువచ్చినా అమలు సరిగా లేదు. యూపీఏలో జరిగిన కుంభకోణాలు భాజపాకు రాజకీయంగా లాభం చేకూర్చాయి" అని పేర్కొన్నారు.

పరిస్థితులు మారుతున్నాయి..: కేటీఆర్

దేశంలో పరిస్థితులు మారుతున్నాయని, 2027 నాటికి కుంభకోణాలు మాట ఉండకపోవచ్చని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో తాగేందుకు నీరు, విద్యుత్తు లైన్లు, రోడ్లు లేవన్నారు. పట్టణాల్లో కనీస సదుపాయాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. "అమెరికాలోనూ రాజకీయ విరాళాలున్నాయి. అక్కడ ట్రంప్, హిల్లరీ కలిపి బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అనుకూలంగా విదేశీ విధానాలు ఉండేలా కొన్ని సందర్భాల్లో లాబీయింగ్ గ్రూపులకు నిధులు చెల్లిస్తుంటారు. ఎన్నికల్లో అభ్యర్థుల నిర్వహణ ఖర్చుపై కమిషన్, కేంద్ర ప్రభుత్వం వాస్తవిక దృష్టితో అవసరమైన మార్పులు చేయాల్సి ఉంది. అవినీతి వల్ల కలిగే అనర్థాల గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే తెలియజేయాలి. దీన్ని పూర్తిగా అంతం చేయలేకపోయినా... తీవ్రతను తగ్గించే అవకాశముందని" అని మంత్రి అన్నారు.

రాజధానిలో వివాహాల సందడి

హోటళ్లలో గదులన్నీ ఫుల్ ● మరో వారం రోజులు ఇదే పరిస్థితి

ఈనాడు, అమరావతి: శ్రావణమాసం కావడంతో రాష్ట్ర రాజధానిలో వివాహాల సందడి మొదలైంది. బుధ, గురు, శుక్రవారాల్లో పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలోని హోటళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. విజయవాడ, గుంటూరుల్లోని అన్ని హోటళ్లలో గదులు, ఫంక్షన్‌హాళ్లు పూర్తిగా నిండిపోయాయి. ఆగస్టు 13, 15, 16 తేదీల్లోనూ వివాహాలు ఎక్కువగానే ఉన్నాయి. విజయవాడలో ఫోర్ స్టార్ హోటళ్లు మూడున్నాయి. వీటిలో 300 గదులున్నాయి. మూడు నక్షత్రాల హోటళ్లు విజయవాడలో 14, తెనాలిలో ఒకటి ఉన్నాయి. వీటిలో 650 వరకూ గదులున్నాయి. రెండు నక్షత్రాలు, ఓ మోస్తరు హోటళ్లు విజయవాడలో 25, గుంటూరులో ఏడున్నాయి. వీటన్నింటిలోనూ గదులు పూర్తిగా నిండిపోయాయి. చిన్న హోటళ్లు, లాడ్జులు 200 వరకూ ఉండగా.. 2వేల వరకూ గదులున్నాయి. వీటికీ ప్రస్తుతం భారీ డిమాండ్ ఏర్పడింది. రాజధానిగా మారిన తర్వాత.. ఇరు నగరాల్లోని హోటళ్లకు మామూలు రోజుల్లోనే ఆక్యుపెన్సీ రేషియో 70శాతం పైగానే ఉంటోంది. అసెంబ్లీ సమావేశాలు జరిగినా, విజయవాడ, గుంటూరుల్లో ఏ రాజకీయ పార్టీ సమావేశాలు, సదస్సులు జరిగినప్పుడు ఇవి కిటకిటలాడుతున్నాయి. గుంటూరు నగరంతో పాటూ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో వంద వరకూ గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. రెండు, మూడు పడక గదులతో ఉన్న ఈ గెస్ట్‌హౌస్‌లన్నీ ప్రస్తుతం నిండిపోయాయి. వివాహాల సమయం కావడంతో ప్రస్తుతం హోటళ్లలో గదులన్నీ నిండిపోయాయని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అధ్యక్షులు, ఫార్చ్యూన్ మురళీ పార్క్ అధినేత ముత్తవరపు మురళీకృష్ణ వెల్లడించారు.



నీటిశుద్ధి ప్లాంట్ రేకుల కింద విద్యార్థులకు బోధన



ఒకే గదిలో కొనసాగుతున్న మూడు తరగతులు

అవస్థల బడి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట అధికారులు వాటిని మూసేస్తున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట మాత్రం వసతులు కల్పించడం మరిచారు. చిత్తూరు జిల్లా తిరుపతిలోని అక్కారంపల్లి ప్రాథమిక పాఠశాలలో 66 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్నారు. గదులు చాలకపోవడంతో ఒకే గదిలో మూడు తరగతులు.. పక్కనే మూతపడిన నీటి శుద్ధిప్లాంట్ షెడ్డులో 1, 2 తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో మూడు తరగతులు కొనసాగిస్తుండటంతో పాఠాలు సరిగా అర్థంకాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక ఎండ తీవ్రతతో నీటి పథకం రేకుల షెడ్డు కింద ఉండలేక చిన్నారులు అల్లాడిపోతున్నారు. వర్షం వస్తే ఐదు తరగతులు ఒకే చోట నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఈనాడు, తిరుపతి

లారీలు సిద్ధం కాకుండానే రిజిస్ట్రేషన్..

- అయిదుగురు ఎంవీఐలపై వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అయిదుగురు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల(ఎంవీఐ)పై సస్పెన్షన్ వేటు పడింది. నిబంధనలకు విరుద్ధంగా 36 వాహనాలకు అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారనే ఆరోపణలున్నాయి. అందులో 15 వాహనాలు హైదరాబాద్‌లో ఉండగా, 21 వాహనాలు విజయవాడలో ఉన్నాయి. వంట గ్యాస్ సిలిండర్లను రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకునేందుకు గుత్తేదారులు.. రవాణా శాఖ అధికారులు మిలాఖతై వాహనాల బాడీబిల్డింగ్ పనులు పూర్తి కాకున్నా, పూర్తయినట్లు నివేదికల్లో పేర్కొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. టెండరు దాఖలు చేయాలంటే వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్(ఆర్సీ)ను దరఖాస్తుతో జతచేయాలి. గుత్తేదారులు లారీలను కొనుగోలు చేసినప్పటికీ సిలిండర్లను రవాణా చేసేందుకు వీలుగా నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం కొన్ని వాహనాల్ని విజయవాడ ఆటోనగర్‌లో, మరికొన్నింటిని హైదరాబాద్‌లో అప్పగించారు. సదరు పనులు జరిగే సమయంలోనే టెండర్లు దాఖలు చేసే గడువు ముగిసే అవకాశం ఉండటంతో అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కయినట్లు తెలుస్తోంది. వాహనాల కొనుగోలు సమయంలోనే వాటి బాడీబిల్డింగ్ ఏ తీరుగా నిర్మాణం చేపట్టనున్నారో నమోదు చేస్తారు. ఆ పనులు పూర్తయిన తరవాత నిబంధనల్లో పేర్కొన్నట్లు ఉన్నాయా? లేదా? అన్నది తనిఖీ చేసి, నిర్ధారించుకున్న తర్వాతే అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఆర్సీని జారీ చేయాలన్నది నిబంధనగా ఉంది. అధికారుల అక్రమాల వ్యవహారం వెలుగులోకి రావటంతో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ డీటీసీ ప్రవీణ్‌రావును విచారణాధికారిగా నియమించింది. ఆయన అక్రమాలు వాస్తవమేనని నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను పరిశీలించి బాధ్యులైన ఎంవీఐలు.. చంద్రశేఖర్(ఖైరతాబాద్), షకీల్‌అహ్మద్(బండ్లగూడ), ఎం.సురేష్‌రెడ్డి(ఉప్పల్), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(వికారాబాద్), బి.శంకర్(ఖమ్మం)లను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెండ్ చేసిన మాట వాస్తవమేననీ, వారికింకా ఉత్తర్వులు అందలేదని రవాణాశాఖ సంయుక్త కమిషనర్(విజిలెన్స్) సి.రమేష్ పేర్కొన్నారు.

ఎంతకాలం నిర్బంధిస్తారు: ముద్రగడ

- గేటువద్ద బైఠాయించి నిరసన

కిర్లంపూడి, న్యూస్‌టుడే: బందెలదొడ్డిలో పశువులను బంధించినట్లు తమను ఎంతకాలం నిర్బంధిస్తారంటూ పాదయాత్రను అడ్డగించిన పోలీసు అధికారులపై మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో తన ఇంటి నుంచి ఐకాస నాయకులు, కాపు సంఘాల నాయకులతో కలసి ముద్రగడ పాదయాత్రకు బయలుదేరారు. రోజూ తరహాలోనే పోలీసు అధికారులు గేటువద్ద అడ్డగించారు. 13 రోజులుగా నిర్బంధించడం ఏమాత్రం పద్ధతిగా లేదని పెద్దాపురం డీఎస్పీ రామారావు, రంపచోడవరం ఏఎస్పీ నయీమ్ అస్మితో ముద్రగడ వాగ్వాదానికి దిగారు. మేము అడుగుతున్న ప్రశ్నలలో ఒక్కదానికి కూడా సమాధానం చెప్పకుండా ఇంకా ఎంతకాలం ఇలా సాగదీస్తారని ప్రశ్నించారు. అనంతరం గేటువద్ద ముద్రగడతో సహా అందరూ బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐకాస రాష్ట్ర కోకన్వీనరు ఆకుల రామకృష్ణ, నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, గుండా వెంకటరమణ, గోపు అచ్యుతరామయ్య, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో తన ఇంటి గేటు వద్ద ఐకాస, కాపు సంఘాల నాయకులతో కలసి బైఠాయించిన ముద్రగడ పద్మనాభం

చంద్రబాబు మహిళా వ్యతిరేకి : రోజా

విజయవాడ: మహిళలను వేధిస్తున్న మంత్రులకు, ఎమ్మెల్యేలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళా వ్యతిరేకి అని వైకాపా ఎమ్మెల్యే రోజా విమర్శించారు. విజయవాడ గాంధీనగర్‌లోని వైకాపా జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఒకపక్క రాష్ట్రంలో మహిళలను వేధింపులకు గురవుతుంటే.. మరోవైపు మహిళా సాధికారత అంటూ చంద్రబాబు వల్లమాలిన ప్రేమ నటిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వ పాలనలో ఒక ఐఏఎస్ అధికారిణి తనను వేధిస్తున్నారని కేంద్రానికి విన్నవించుకోవడమే దీనిని నిదర్శనమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి నిత్యం మహిళా ఉద్యోగులను వేధిస్తున్నా చంద్రబాబుకు చీమకుట్టినట్లయినా లేదన్నారు.

ఆందోళనతోనే రోజా విమర్శలు: యామిని బాల, మీసాల గీత

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నికల్లో ఓటమి తథ్యమన్న ఆందోళనతోనే వైకాపా ఎమ్మెల్యే రోజా ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తున్నారని తెదేపా ఎమ్మెల్యేలు యామిని బాల, మీసాల గీత విమర్శించారు. రాఖీ పండుగను కూడా ఆమె రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. తన నోటి దురుసుతనం కారణంగా ఏడాది పాటు అసెంబ్లీ నుంచి సస్పెండ్ అయినా..ఆమె బుద్ధిమారలేదని వ్యాఖ్యానించారు.

వైకాపా గుర్తింపు రద్దు చేయాలి

పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ లింగారెడ్డి డిమాండ్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చి చంపాలంటూ వ్యాఖ్యానించిన వైఎస్ జగన్‌పై... రాజ్యంపై దాడి చేయడం, రాజద్రోహం నేరాలపై పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ ఎం.లింగారెడ్డి సూచించారు. ఎన్నికల సమయంలో అనైతిక వ్యాఖ్యలు చేసినందున ఎన్నికల సంఘం వైకాపా గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఇలాంటి కుట్ర కేసులో తెర వెనక ఉన్నవాళ్లూ శిక్షార్హులేననీ, జగన్‌కి సలహాదారుగా ఉన్న ప్రశాంత్ కిషోర్ కూడా ఇందుకు బాధ్యులేనన్నారు.


రూ.1600 కోట్లతో సమగ్ర జల, వ్యవసాయ ప్రాజెక్టుకు ఆమోదం

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర జల, వ్యవసాయ రూపాంతీకరణ ప్రాజెక్టు అమలు చేసేందుకు రూ.1600 కోట్లతో పాలనామోదం ఇస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయకట్టు అభివృద్ధి సంస్థ కమిషనర్ ప్రతిపాదన మేరకు కార్యదర్శి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో క్షేత్రస్థాయిలో నీటిపారుదల ద్వారా వ్యవసాయాభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.750 కోట్లు, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించేలా చూసేందుకు రూ.540 కోట్లు, మత్స్య ఉత్పత్తికి టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలకు రూ.150 కోట్లు, ప్రాజెక్టు నిర్వహణకు రూ.110 కోట్లు, మిగిలిన మొత్తం ఇతరత్రా కార్యక్రమాలకు వినియోగించనున్నారు.

కనుబొమల్ని దిద్దుకోండిలా...

అందంగా కనిపించాలంటే కనుబొమల్ని చక్కగా తీర్చిదిద్దుకుంటే చాలనుకుంటున్నారు నేటితరం మహిళలు. నిజానికి వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీన్ని పాటిస్తున్నారు కూడా. ఈ క్రమంలో కొందరు సొంతంగా ఇంట్లోనే పెరిగిన కనుబొమల్ని తీసుకుంటే... మరికొందరేమో పార్లర్లను ఆశ్రయిస్తుంటారు. ఏది ఏమైనా ఈ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం తప్పనిసరి.

- ఏదైనా సందర్భం ఉన్నప్పుడు కనీసం రెండు రోజులు ముందుగా కనుబొమలను తీర్చిదిద్దుకోవడం మంచిది. దానిమూలంగా వచ్చిన మార్పు సహజంగా కనిపిస్తుంది.



అలానే తరచూ చేయించుకునే అవసరం ఉన్నవారు... ఓ పద్ధతిప్రకారం నెలకోసారి చేయించుకోవడం మంచిది.

- మరికొందరేమో కనుబొమలు ఓసారి బ్యూటీపార్లర్‌లో తీయించుకున్నాక కొన్నినెలల పాటు అదనంగా పెరిగిన వాటిని ప్లక్కర్‌తో తీసేస్తుంటారు. దీనివల్ల వాటి సహజ ఆకృతి దెబ్బతినే ప్రమాదం ఉంది. తరచూ తీయడం వల్ల అవి సరిగ్గా పెరగకపోవచ్చు కూడా. అందుకే ఎంత తీరిక లేకపోయినా పార్లర్‌లోనే వాటిని దిద్దుకోవడం మంచిది.
- కనుబొమల్ని సొంతంగా తీర్చిదిద్దుకోవాలనుకునేవారు వాటిని వ్యతిరేక దిశలో తీసుకోవాలి. లేదంటే అవి అందవిహీనంగా కనిపించే అవకాశం ఉంది. అంతేకాదు.. నొప్పి, చర్మం కమిలిపోవడం, దద్దుర్లు వంటి సమస్యలూ ఎదురవుతాయి.
- కనుబొమల్ని మీకు మీరే తీసుకునే ముందు వాటిపై కొద్దిగా పెట్రోలియంజెల్లీ లేదా మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఆ తరవాత కూడా ఐసుముక్కతో అద్దుకుంటే మంట ఉన్నా తగ్గుతుంది. అలానే ట్వీజర్‌లని ఉపయోగించడానికి ముందు యాంటీ సెప్టిక్ లోషన్‌తో కానీ వేణ్నీళ్లతో కానీ శుభ్రం చేయడం మంచిది.
- ఐబ్రో పెన్సిల్‌ని వాడేముందు.. కనుబొమల మీదుగానే దిద్దుకోవాలి తప్ప.. మరీ వెడల్పుగా కాదు. వీలైనంతవరకూ వాటి ఆకృతి ఏ మాత్రం చెడిపోకుండా చూసుకోవాలి. అప్పుడే అవి సహజంగా, అందంగా కనిపిస్తాయి.

వసుంధర

బాపురే సూపురే!

ఆకలి బాగా వేయడానికే కాదు.. జ్వరం, జలుబూ, దగ్గు లాంటి సమస్యలు ఉన్నప్పుడూ వేడివేడి సూప్ కప్పు తాగమంటారు వైద్యులు. అలాగని వాటిని హోటళ్ల నుంచి తెప్పించుకోవాల్సిన అవసరంలేదు. మన వంటింట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలూ, టొమాటోలూ, క్యారెట్లతోనే సులువుగా తయారు చేసుకోవచ్చు.



టొమాటో, క్యారెట్‌తో...

కావల్సినవి: క్యారెట్లు, - రెండు, టొమాటోలు - రెండు, ఉల్లిపాయ - ఒకటి, వేయించిన మిరియాల పొడి - అరచెంచా, జీలకర్ర పొడి - చెంచా, తరిగిన కొత్తిమీర - రెండు చెంచాలు, ఉల్లికాడల తరుగు - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత.

తయారీ: టొమాటో, క్యారెట్, ఉల్లిపాయలను పెద్ద ముక్కలుగా తరిగి మిక్సీలో వేసి, పావుకప్పు నీళ్లు పోసి ముద్దలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని అడుగు మందంగా ఉన్న గిన్నెలోకి తీసుకుని రెండు కప్పుల నీళ్లు పోసి పొయ్యిమీద పెట్టాలి. ఈ గుజ్జు ఉడికి, చిక్కగా అయ్యాక మిరియాలపొడీ, తగినంత ఉప్పూ, జీలకర్రపొడీ వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలయ్యాక కొత్తిమీర తరుగూ, ఉల్లికాడల తరుగు వేసి దింపేస్తే చాలు.



సోయకూర, పెసరపప్పు...

కావల్సినవి: సోయకూర - కట్ట, పెసరపప్పు - పావుకప్పు, వేయించిన మిరియాలపొడి - అరచెంచా, జీలకర్రపొడి - చెంచా, నిమ్మరసం - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - ఒకటి, నూనె - రెండు చెంచాలు, ఉప్పు- తగినంత.

తయారీ: తరిగిన సోయకూరా, పెసరపప్పూ, రెండు కప్పుల నీళ్లూ కుక్కర్‌లో తీసుకుని మెత్తగా ఉడికించుకోవాలి. పొయ్యిమీద అడుగు మందంగా ఉన్న గిన్నె పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక పచ్చిమిర్చి ముక్కలూ, జీలకర్రపొడీ, మిరియాలపొడీ వేయాలి. దీనికి ఉడికించిన సోయాకూర, పెసరపప్పు మిశ్రమం, మరికొంచెం నీళ్లూ పోసి పొయ్యిమీద పెట్టాలి. అది కాస్త చిక్కగా అయ్యాక తగినంత ఉప్పు వేయాలి. రెండు నిమిషాలయ్యాక దింపేసి నిమ్మరసం కలపాలి.



బీరకాయ, బియ్యప్పిండి...

కావల్సినవి: బీన్స్ - నాలుగు, క్యాబేజీ - చిన్న ముక్క, క్యారెట్ - ఒకటి, బీరకాయ - సగం ముక్క, బియ్యప్పిండి, మొక్కజొన్నపిండి - రెండు చెంచాల చొప్పున, నూనె - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - ఒకటి, వేయించిన జీలకర్ర పొడి, మిరియాలపొడి - చెంచా చొప్పున, ఉప్పు - తగినంత, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు.

తయారీ: కూరగాయలన్నింటిని చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. పొయ్యిమీద అడుగు మందంగా ఉన్న గిన్నె పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక పచ్చిమిర్చి తరుగూ, జీలకర్ర పొడీ, మిరియాల పొడి వేయాలి. వెంటనే తరిగిన కూరగాయ ముక్కలూ, తగినంత ఉప్పూ, కప్పు నీళ్లు పోసి మంట తగ్గించాలి. కూరగాయ ముక్కలు కాస్త ఉడికాయనుకున్నాక బియ్యప్పిండీ, మొక్కజొన్న పిండిని ఓ కప్పులోకి తీసుకుని అరకప్పు నీళ్లు పోసి కలపాలి. దీన్ని ఉడుకుతోన్న కూరగాయ ముక్కల్లో వేసి మంట తగ్గించాలి. చిక్కగా అయ్యాక నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసి దింపేస్తే చాలు.



శీలా శంకర్, అమెరికా
www.swiftnutrihealth.com



పాలకూర, కందిపప్పుతో...

కావల్సినవి: పాలకూర - రెండు కట్టలు, కందిపప్పు - కప్పు, వేయించిన మిరియాలపొడి - అరచెంచా, వేయించిన జీలకర్ర పొడి - చెంచా, నిమ్మరసం - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - ఒకటి, నూనె- రెండు చెంచాలు, ఉప్పు - తగినంత.

తయారీ: పాలకూర తరుగూ, కందిపప్పూ, రెండు కప్పుల నీటిని కుక్కర్‌లో తీసుకుని మూడునాలుగు కూతలు వచ్చేవరకూ ఉడికించుకోవాలి. పొయ్యిమీద అడుగు మందంగా ఉన్న గిన్నె పెట్టి నూనె వేయాలి. అందులో పచ్చిమిర్చి ముక్కలూ, జీలకర్రపొడీ, మిరియాలపొడీ వేయాలి. తరవాత ఉడికించిన కందిపప్పూ, పాలకూరా, కప్పు నీళ్లు పోయాలి.. ఇది కాస్త చిక్కగా అయ్యాక నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి దింపేయాలి.



రాజ్మా, చిక్కుడు గింజలతో...

కావల్సినవి: రాజ్మా - కప్పు, చిక్కుడు గింజలు - కప్పు, టొమాటోలు- రెండు, ఎండుమిర్చి - రెండు, ఉల్లిపాయ- ఒకటి, నిమ్మరసం - రెండు చెంచాలు, వేయించిన జీలకర్ర పొడి - చెంచా, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు-తగినంత.

తయారీ: రాజ్మా గింజల్ని పన్నెండు గంటలపాటు నానబెట్టుకోవాలి. తరవాత ఉప్పు వేసి కుక్కర్‌లో చిక్కుడు గింజలతో సహా ఐదారు కూతలు వచ్చేవరకూ ఉడికించుకుని తీసుకోవాలి. చల్లారాక ఆ రెండింటినీ ముద్దలా చేసుకోవాలి. అడుగు మందంగా ఉన్న గిన్నెను పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఎండుమిర్చీ, ఉల్లిపాయ, టొమాటో ముక్కలు వేసి వేయించాలి. అన్నీ బాగా వేగాక రాజ్మా ముద్ద, రెండు కప్పుల నీళ్లు పోసి చిక్కగా అయ్యేవరకూ ఉడికించుకోవాలి. తరవాత జీలకర్రపొడీ, నిమ్మరసం, మరికొంచెం ఉప్పు వేయాలి. ఇది కాస్త చిక్కగా అవుతున్నప్పుడు కొత్తిమీర తరుగు వేసి దింపేయాలి.

విడిపోయామని అందరికీ చెప్పడం ఎలా?

? నేను మూడువేలమంది ఉద్యోగులున్న సంస్థలో పని చేస్తున్నా. ఆర్నెల్ల క్రితం అదే సంస్థలో వేరే విభాగంలో... పక్క బిల్డింగ్‌లో పనిచేసే అబ్బాయితో నాకు పెళ్లి కుదిరింది. అది పెద్దలు కుదిర్చిందే అయినా.. కొన్ని కారణాల వల్ల అతను నాకు సరిపోడనే ఉద్దేశంతో పెళ్లి వద్దనుకున్నా. పెళ్లి కుదిరిందనే సంగతి అందరికీ తెలుసు కానీ.. చేసుకోవడం లేదనేది కేవలం మా పై అధికారికి మాత్రమే చెప్పా. ఇప్పుడు ఈ విషయాన్ని సహోద్యోగులకు ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. పైగా మా సహోద్యోగుల్లో సగం మంది సోషల్ మీడియాలో ఉంటారు. ఇప్పుడు అందులో సింగిల్ అని పెట్టడం వల్ల వాళ్లడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది కదా.. పైగా అతను నిర్వహణా విభాగంలో ఉన్నాడు. అతని వల్ల నా ఉద్యోగానికి ఏదయినా సమస్య ఎదురుకావచ్చనే భయం కూడా ఉంది. ఇప్పుడు నేనేం చేయాలో నాకు అర్థంకావడంలేదు.

- ఓ సోదరి



✔ ఒకవేళ అతను మిమ్మల్ని బెదిరించడం, వేధించే ప్రయత్నం చేస్తే అప్పుడు హెచ్‌ఆర్‌ని సంప్రదించి మీ సమస్యను తెలియజేయొచ్చు. అంతవరకూ అవసరం లేదనేది నా అభిప్రాయం. ఇక, మీ సహోద్యోగుల సంగతి అంటారా.. ఏదో ఒక రోజు విషయం వారికే తెలుస్తుంది. అడగకా మానరు. అంతవరకూ మీరు మౌనంగా ఉండటం మంచిది. ఒకవేళ ఈ విషయం మీ విధులకు సమస్యగా మారుతుంటే దాన్నుంచి ఎలా బయటపడాలనేది ఆలోచించండి. అవసరం అనుకుంటే మరీ దగ్గరి స్నేహితుల సాయం తీసుకోవడం మంచిది. అప్పుడే దీన్నుంచి కొంత బయట పడగలుగుతారు. ఇక, ఫేస్‌బుక్ లేదా ఇతర సోషల్‌మీడియాలో మీరు ఒంటరి అనే విషయాన్ని పెట్టొచ్చు.. అవసరం లేకపోవచ్చు. పెట్టినా కొందరు మాత్రమే చూసేలా కొన్నిరకాల సెట్టింగ్‌లు ఉంటాయి. వాటిని ఎంచుకోవచ్చు. ఒకవేళ పనిలో భాగంగా అతనితో మాట్లాడాల్సి వస్తే.. దాన్ని వృత్తికి మాత్రమే పరిమితం చేయండి తప్ప.. వ్యక్తిగత చర్చలకు అవకాశం ఇవ్వకండి. వృత్తి, వ్యక్తిగత జీవితానికి మధ్య చిన్న గీత తప్పనిసరిగా గీసుకోవడం మంచిది. లేదంటే అది మిగిలిన వారికీ ఇబ్బంది కలిగించొచ్చు. ఒక సహోద్యోగిని మీరెలా గౌరవిస్తారో.. అతడితోనూ అదేవిధంగా వ్యవహరించండి. అవసరం వస్తే హుందాగా, పరిణతితో వ్యవహరించేందుకు ప్రయత్నించండి. ఇక, మీకు అతనితో తరచూ మాట్లాడే అవకాశం ఉండదనుకుంటే పరవాలేదు. లేదంటే అతను పనిచేసే విభాగం, భోజనం చేసే చోటకు కొన్నాళ్లు వెళ్లకపోవడం మంచిది.

-kavitha.eenadu@gmail.com



7న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,350	29,400
ఆర్నమెంట్	-------	-------	27,300	27,300
వెండి (కిలో)	-------	-------	38,600	38,800
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,450	29,450	29,010	29,000
ఆర్నమెంట్	27,230	27,270	27,110	27,120
వెండి (కిలో)	38,500	38,600	37,350	37,300
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,460	29,480	-------	-------
ఆర్నమెంట్	27,100	27,120	2,711 గ్రా	2,712 గ్రా
వెండి (కిలో)	39,500	39,500	39.90 గ్రా	39.80 గ్రా

ముక్కాలిపీటతో... సన్నగా!

ఇంట్లో మనం ఎంత పనిచేసినా అలసట తప్ప బరువు తగ్గే సూచనలు మాత్రం పెద్దగా కనిపించవు. కానీ మీ రోజువారీ పనులతో పాటూ వీటినీ చేసి చూడండి. చాలా తక్కువ సమయంలోనే మార్పు కచ్చితంగా కనిపిస్తుంది.

సాధారణంగా నడుము కింద భాగంలో పేరుకున్న కొవ్వు మనల్ని లావుగా కనిపించేలా చేస్తుంది. పిరుదులూ, తొడల్లో పేరుకున్న కొవ్వు అదుపులో ఉండాలంటే స్టెపప్ వ్యాయామాలు చక్కగా ఉపయోగపడతాయి. దీనికోసం పెద్దగా పరికరాలు అవసరం లేదు. చిన్న ముక్కాలిపీట తీసుకుంటే సరిపోతుంది. చేతులు రెండూ నడుము మీద పెట్టి ఒక కాలిని పీటపై ఉంచి రెండో కాలుని కింద ఉంచాలి. తర్వాత రెండు కాళ్లూ పీటమీద ఉంచి మళ్లీ కింద పెట్టాలి. ఇలా కాలు మార్చి కాలు చేస్తుంటే కండరాలు బలపడటమే కాదు.. కొవ్వు కూడా కరుగుతుంది.

- **హైఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్..** దీన్నే హెచ్‌ఐఐటీ వ్యాయామం అంటారు. ఈ వ్యాయామాలని కేవలం పదినిమిషాలు చేసినా చాలు బోలెడు ఫలితం ఉంటుంది. కానీ పూర్తిగా వీటిమీదే ఆధారపడి పొమ్మని కాదు. మీరు చేసే రోజువారీ వ్యాయామాలు చేస్తూనే వీటిని కూడా చేయాలి. పరుగూ, తాడాట, ట్రెడ్‌మిల్, సైకిలు తొక్కడం, యోగా వంటివి ఈ కోవలోకి వస్తాయి.
- **పొజిషన్ ప్లైస్:** రోజువారీ పనుల్లో భాగంగా అనేక భంగిమల్లో మన శరీరాన్ని ఉంచుతాం. కానీ ఈ పొజిషన్‌ప్లైస్ భంగిమలు కాస్త భిన్నంగా ఉంటాయి. కాళ్లను పూర్తిగా వెడల్పు ఉంచి.. నిలబడటం లేదా గాల్లో కుర్చీలో కూర్చుని ఉన్నట్టుగా ఉండటం... కాళ్లని పక్కలకు చాపి మోకాళ్లని వంచాలి. ఇలా అరనిమిషం పాటూ ఉంటే శరీరంలోని కొవ్వు సులభంగా తగ్గుతుంది. వీటినే స్క్వాట్స్ అని కూడా అంటారు.



- **పుషప్స్:** బోర్లా పడుకుని రెండు కాళ్లని దగ్గరగా ఉంచుకోవాలి. రెండు చేతులపై భారం వేసి కాళ్లని కదపకుండా శరీరాన్ని పైకీ, కిందకు తీసుకురావాలి. ఇలా చేయడం వల్ల చేతులూ, భుజాల్లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది.

అరగంట చాలు...

కత్తిని సానపెట్టేకొద్దీ పదునెక్కుతుంది. అలానే మెదడునూ పదునుపెడితే చక్కని ఆలోచనలు చటుక్కున తడతాయి. మరిదాని కోసం మీరేం చేయాలి అంటారా?

ఒంటరిగా కూర్చుని ఆలోచించగలిగితే... చక్కని ఆలోచనలు వస్తాయట. అందుకే రోజులో కనీసం ఓ అరగంట పాటైనా ఒంటరిగా ఉండి.. మీతో మీరు మాట్లాడుకునేందుకు ప్రయత్నించండి. అప్పుడే ఆత్మవిశ్వాసం పెరిగి కొత్త ఆలోచనలు వస్తాయి.



- ఉదయాన్నే నిద్రలేచ్చాక ఏం చేస్తారు... ఆలస్యమయిపోతుందని నేరుగా వంటగదిలోకి వెళ్లిపోతారు. పనిలోకి దిగిపోతారు. కానీ ఇకనుంచి ఓ అరగంట నడిచే ప్రయత్నం చేయండి. దీని వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారు. మెదడూ చురుగ్గా పనిచేయగలుగుతుంది.
- తీసుకునే ఆహారానికీ పద్ధతుండాలి. అప్పుడే కదా! శక్తి శరీరానికి అందేది. ఆరోగ్యంగా ఉండేది. ఆ ప్రభావమే మెదడుపైనా ఉంటుంది. అందుకే తక్కువ గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వండి.
- మెరుగైన ఆలోచనా శక్తికి కంటి నిండా నిద్ర అవసరం. దానివల్ల అలసట తగ్గడమే కాదు.. ఒత్తిడీ తగ్గి రోజంతా చురుగ్గా ఉంటారు.

16 పతకాలు వస్తాయనుకోలేదు!



పుస్తకాల్లో చట్టాల్ని చదివి.. వాటితో ప్రపంచాన్నీ, ప్రజల సమస్యల్నీ చూస్తుంటారు చాలామంది! వాళ్లని... సమాజాన్ని పీడిస్తున్న ఫలానా సమస్యకి పరిష్కారం అడిగి చూడండి.. చట్టాలూ, సెక్షన్‌లు వల్లెవేస్తారుకానీ అసలైన మార్గమేంటో స్పష్టంగా చెప్పరు. శ్రుతి అశోక్ అలాకాదు. ఆమె ప్రజాసమస్యల ఆధారంగా, వాటికి పరిష్కారమే ధ్యేయంగా చట్టాల్ని చదవడం మొదలుపెట్టింది. ఆ అరుదైన అధ్యయన విధానమే ఆమెకి బీఏ ఎల్ఎల్‌బీ స్నాతకోత్సవంలో ఏకంగా పదహారు స్వర్ణాలు సాధించిపెట్టింది! అదెలా సాధ్యమైందో ఆమె మాటల్లోనే..



నిజం చెప్పొద్దూ! ఇంటర్మీడియట్(పీయూసీ)లో చేరేదాకా నాకు రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ అంటే కేవలం పదాలు మాత్రమే. తొమ్మిది, పదో తరగతిలో వాటి గురించి ఏదో పరిచయమైనా అవన్నీ మార్కుల కోసం ఏవో ముక్కునపట్టినవి తప్ప అంత లోతుగా చదవలేదు. ఇంటర్‌లో ఉన్నప్పుడు కాలేజీ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నా. కనీస పోషకాహారం, విద్య, ఆరోగ్యం దొరకని ఎందరో చిన్నారుల్ని అప్పుడే చూశాను. అక్కడి నిర్వాహకులతో మాట్లాడుతుంటే ఇలాంటి చిన్నారులకంటూ ఎన్నో హక్కులుంటాయని, వాటిని పరిరక్షించే చట్టాలున్నాయని, వీటిని అమలు చేసే ప్రత్యేక వ్యవస్థలున్నాయని తెలుసుకున్నా! ఇన్ని ఉన్నా ఇక్కడ పిల్లల్లో పోషకాహారలోపం ఎందుకు ఇంతలా పెరిగిపోతోంది... మురికివాడలు నానాటికీ ఎందుకిలా విస్తరిస్తున్నాయి... అంటువ్యాధులు ఎందుకు ప్రబలుతున్నాయి... ఆ ఆసక్తితో రాజ్యాంగ చట్టాలపై మరింత దృష్టి సారించా. ఇంటర్ ముగించేటప్పటికి క్లాట్ పరీక్ష గురించి తెలిసింది. దాన్ని చదివి బీఏ ఎల్‌ఎల్‌బీలో చేరిపోయాను.

ఇందుకోసమే హాస్టల్‌లో..

మా పూర్వీకులది చెన్నై. నాన్న అశోక్ ఐటీ కన్సల్టెంట్. అమ్మ మంజు గృహిణిగా ఉంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటుంది. ఆమెతోపాటూ నేనూ భాగస్వామిని కావడం మొదలుపెట్టాను. ప్రతిరోజూ కాలేజీకి వెళ్లి.. వివిధ సేవా సంస్థలకీ తోచిన సాయం చేయాలన్నది నా ఆలోచన. బెంగళూరులో మాది కోరమంగల. నా కాలేజేమో నాగర్‌బావిలో ఉండేది! ఉదయం ఏడు గంటలకు బయలుదేరితే కానీ తరగతికి హాజరు కాలేను. కాలేజీ తరవాత ఇంటికి చేరాలంటే రాత్రయ్యేది. మరి సేవాకార్యక్రమాలు ఎలా చేయను? అందుకే కాలేజీ హాస్టల్‌లో ఉండిపోయా. విద్యార్థి బృందం, కాలేజీ యాజమాన్యం అనుమతితో ప్రతిరోజూ మక్కళ్ జాగృతి, సేవ్ ఫర్ సోల్(ఎస్ఓఎస్) సంస్థలకు వెళ్లేదాన్ని. వారి సమస్యల చిట్టా తయారు చేసుకుని, వాటిని పరిష్కరించే చట్టాలపై అధ్యయనం చేయటం మొదలుపెట్టా! డిగ్రీ పూర్తయ్యేదాకా ఇదే పని నాకు. బహుశా ఈ అధ్యయనమే కాన్‌స్టిట్యూషనల్ లా, పబ్లిక్ లిటిగేషన్ లా, ప్రాపర్టీ ట్రాన్స్‌ఫర్ లా వంటి సబ్జెక్టుల్లో మంచి మార్కులు వచ్చేందుకు దోహదపడిందేమో!

ఆ పాఠ్య ప్రణాళికతోనే..

నాలాంటి విభిన్న దృక్పథం ఉన్నవారికి ఎన్ఎల్ఎస్ఐయూ బోధనా విధానం ఎంతో ఉపయోగపడుతుంది. గంటలకొద్దీ బోధనా, బోర్డులపై రాతలేవీ ఇక్కడ ఉండవు. క్షేత్రపర్యటనలే పాఠాలు.. గ్రంథాలయాలే తరగతి గదులిక్కడ! ఆ విధానమే నాకు 7కు 6.52 సీజీపీఏ గ్రేడ్ తెచ్చిపెట్టింది. సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేసుకునేంత వరకు నాకు పదహారు పతకాలు వచ్చాయన్న విషయమే తెలియదు. మా అమ్మా నాన్నలైతే ఎంత సంబరపడ్డారో! అందుకే నాకు రూ.15 లక్షల వార్షిక వేతనం అందజేస్తామని ఓ కార్పొరేట్ సంస్థ ముందుకొచ్చినా వద్దన్నా! ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఒక ఏడాది ఎల్ఎల్ఎం తర్వాత మళ్లీ కర్ణాటకకే వచ్చి న్యాయ సేవలు అందించాలన్నది నా లక్ష్యం. ప్రస్తుతం న్యాయ రంగంలో మహిళలకు అనుకున్న స్థాయిలో ప్రాధాన్యం లేదు. దాన్ని పెంచేందుకు అన్ని రకాలా కృషి చేయాలని ఉంది నాకు.

– ముకుంద, బెంగళూరు

రక్తహీనత రాకుండా...

మహిళల్లో రక్తహీనత తరచూ కనిపించే సమస్య. అధ్యయనాల ప్రకారం.. యాభైశాతానికి పైగా మహిళల్లో ఈ సమస్య ఉంటుందట. మరి దాన్నుంచి బయటపడాలంటే... ఇనుము పోషకం శరీరానికి పుష్కలంగా అందేలా చూసుకోవాలి. దానివల్ల మరికొన్ని లాభాలూ ఉన్నాయి.

- శరీరానికి కావాల్సిన పోషకాల్లో ముఖ్యమైంది ఇనుము. దీని లోపం వల్లే రక్తహీనత ఏర్పడుతుంది. అలసటా, ఆయాసం, తలనొప్పీ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు.. వంటివన్నీ దీని లక్షణాలే. అవి తరచూ కనిపిస్తోంటే.. రక్తహీనత ఉందేమోనని సందేహించాలి. దానికి సంబంధించిన పరీక్ష చేయించుకోవడం మంచిది.
- గర్భిణుల్లో ఈ సమస్య ఉంటే గనుక ఆ ప్రభావం పుట్టబోయే పాపాయిపైనా పడుతుంది. కాబట్టి వైద్యులు సూచించే ఐరన్‌మాత్రల్ని తప్పనిసరిగా వేసుకోవాలి.
- ఇనుమును తగిన మోతాదులో తీసుకోవడం వల్ల హీమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ఈ హిమోగ్లోబినే శరీరం మొత్తానికి కావాల్సిన ప్రాణవాయువుని సరఫరా చేస్తుంది. ముఖ్యంగా మెదడు చురుగ్గా పనిచేయాలంటే తగినంత ప్రాణవాయువు అందాలి. కాబట్టి.. ఇనుము మన మేధస్సు, మానసిక ఎదుగుదలకి కీలకం.
- ఇనుము మీ శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది. కండరాల ఆరోగ్యం కూడా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఐరన్ తక్కువైతే కండరాలు సరిగా పనిచేయక మీరే పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చేసినా త్వరగా అలసిపోతారు.
- మనం తీసుకునే పదార్థాల ద్వారా శరీరానికి కావాల్సిన ఇనుము అందనప్పుడు వైద్యుల సలహా మేరకు ఇనుము, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలి.

వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలిం సిటీ, అనాజ్‌పూర్, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512
vasundhara@eenadu.net

రూ.1,000 కోట్లతో బిస్కెట్ ప్లాంటు: బ్రిటానియా

కోల్‌కతా: బ్రిటానియా ఇండస్ట్రీస్ దేశంలో అతి పెద్ద బిస్కెట్ తయారీ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. మహారాష్ట్రలోని రంజన్‌గావ్ ఫుడ్ పార్క్‌లో దీన్ని నెలకొల్పుతామని, రానున్న 4-5 ఏళ్లలో ఈ ప్లాంటుపై రూ.1,000 కోట్లు పెట్టుబడి పెడతామని బ్రిటానియా ఇండస్ట్రీస్ ఛైర్మన్ నస్లీ వాడియా వార్షిక సాధారణ సమావేశంలో వాటాదార్లకు వెల్లడించారు. తద్వారా 3,000 మందికి ఉద్యోగాలు లబించే అవకాశం ఉంది. ఇక్కడ బిస్కెట్లు, కేకులు, రస్క్ వంటి వాటిని ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. గ్రీస్‌కు చెందిన చిపిటాతో కలిసి ఏర్పాటు చేస్తున్న ఉమ్మడి సంస్థ కూడా ఇదే ఫుడ్ పార్క్‌లో ఉందని, వచ్చే ఏడాది జూన్ నుంచి దీని కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు.



జులై పసిడి బాండ్ల ట్రేడింగ్ నేటి నుంచి

ముంబయి: జులైలో జారీ చేసిన సార్వభౌమ పసిడి బాండ్ల ట్రేడింగ్, నేటి నుంచి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ప్రారంభం కానుంది. గత నెల 6న సార్వభౌమ పసిడి బాండ్ల పథకం 2017-18, సిరీస్ 2ను ప్రభుత్వం ప్రకటించింది. జులై 10- 14 మధ్య వీటికి దరఖాస్తులు స్వీకరించింది. అదేనెల 28న పసిడి బాండ్లు జారీ చేసింది. వీటి ట్రేడింగ్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నేటి నుంచి ప్రారంభం కానుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. జులై సిరీస్‌కు ముందు 8 విడతల్లో పసిడి బాండ్ల జారీ ద్వారా ప్రభుత్వం రూ.5,400 కోట్లు సమీకరించింది.

ఆధారే సులువైన మార్గం

- కేవైసీ ప్రక్రియ సరళీకృతానికి కసరత్తు
- ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ విజయన్



ముంబయి: బీమా రంగంలో ఖాతాదారు ధ్రువీకరణకు వినియోగించే కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి)కి ఆధార్ తప్పనిసరి కానప్పటికీ, ఈ ప్రక్రియకు అదే అత్యంత సులువైన మార్గమని భారత బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తెలిపింది. 'కేవైసీ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. అయితే ఆధార్ కంటే సులువైనది ఏముంద'ని ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ టి.ఎస్.విజయన్ పేర్కొన్నారు. సీఐఐ నిర్వహించిన 19వ బీమా సదస్సు అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. నమోదిత కంపెనీల్లో ఎల్‌ఐసీ వాటా పరిమితిపై ఆయన స్పందించారు. 'నిబంధనల ప్రకారమైతే 15 శాతం కంటే మించకూడదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఇంతకుమించి పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఇస్తున్నాం. కొంత సమయం తర్వాత 15 శాతానికి పెట్టుబడి పరిమితి తగ్గించుకోవాల్సిందిగా సూచిస్తున్నామ'ని విజయన్ చెప్పారు. ఏ పెట్టుబడైనా వాటాదార్లు, పాలసీదార్లకు ప్రయోజనం చేకూర్చేవిధంగా ఉండాలని తెలిపారు. ఏజెంట్ల వ్యవస్థ బలోపేతానికి మానవ వనరులు, సాంకేతికతను జోడించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'ఏజెంట్ల రూపంలో 20 లక్షల మందికి పైగా ఆదాయాన్ని ఆర్జిస్తున్న విషయాన్ని ఇక్కడ గుర్తించాలి. ఒకవేళ సాంకేతికతను ప్రవేశపెట్టినప్పటికీ మానవ వనరుల బలం కొనసాగాల్సిన అవసరం ఉంటుంద'ని పేర్కొన్నారు. ఎల్‌ఐసీ ఛైర్మన్ వి.కె.శర్మ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సాంకేతికతతోనే ఏజెంట్ వ్యవస్థకు సంబంధించి మోసాలు నియంత్రించలేమని అన్నారు.

అక్టోబరు నుంచి గో ఎయిర్ విదేశయానం



కోల్‌కతా: అక్టోబరు నుంచి విదేశాలకు విమానాలు నిర్వహించాలని గోఎయిర్ ప్రణాళికలు రూపొందించింది. తొలుత ఆసియా ప్రాంతంలోని గమ్యస్థానాలకు సర్వీసులు ప్రారంభించాలన్నది తమ యోచనగా గోఎయిర్ మేనేజింగ్ డైరెక్టర్ జె వాడియా తెలిపారు. 144 ఎయిర్‌బస్ నియో ఏ320 విమానాలకు గోఎయిర్ ఆర్డరు ఇచ్చింది. ప్రస్తుతమున్న 24 విమానాలకు ఇవి జతవుతాయని వాడియా తెలిపారు. పబ్లిక్ ఇష్యూ యోచన కూడా చేయడం లేదని చెప్పారు.

ఐఆర్‌డీఏఐ-సహారా లైఫ్‌పై శాట్ విచారణ 10న

ముంబయి: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్‌కు తన వ్యాపారాలను విక్రయించాలన్న ఐఆర్‌డీఏఐ ఆదేశాలను సవాలు చేస్తూ సహారా లైఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 10న చేపట్టనున్నట్లు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్(శాట్) తెలిపింది. ఐఆర్‌డీఏఐ ఆదేశాలను పాటించడానికి ఇచ్చిన గడువు(ఆగస్టు 21)లోగా విచారణ పూర్తి చేయాలన్నది శాట్ అభిమతంగా ఉంది. సహారాలైఫ్‌ను ఆగస్టు 21న లేదా అంతకు ముందే స్వాధీనం చేసుకోవాలని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్‌ను ఐఆర్‌డీఏఐ జులై 28న కోరిన సంగతి తెలిసిందే. జులై 31కే ఆ పనిచేయాలని ఐఆర్‌డీఏఐ తన ఆదేశాల్లో పేర్కొన్నప్పటికీ.. పాలసీదార్లకు 15 రోజుల మారటోరియం(రెన్యువల్ ప్రీమియంను కట్టడానికి) ఇచ్చింది. క్లెయిముల సెటిల్‌మెంట్ నిమిత్తం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆ గడువును 21 రోజులుగా మార్చింది. సహారా లైఫ్ రూ.78 కోట్ల మేర ఖాతాలకు మళ్లించుకుందని.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్‌కు వ్యాపారాన్ని బదిలీ చేయడం పాలసీదార్ల ప్రయోజనాల రక్షణకు అవసరమని ఐఆర్‌డీఏఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

ఎరోస్ వినోద వ్యాపార విక్రయం!

రేసులో యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్

దిల్లీ: ఎరోస్ గ్రూపు తన కంటెంట్ వ్యాపారాన్ని విక్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్‌లు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ విక్రయం జరిగితే, లావాదేవీ విలువ 100 కోట్ల డాలర్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. సినిమాలు, సంగీతానికి సంబంధించి తన వద్ద ఉన్న పూర్తి కంటెంట్‌ను విక్రయించే నిమిత్తం యాపిల్ సహా మరికొన్ని ప్రముఖ కంటెంట్ వ్యాపార సంస్థలతో ఎరోస్ గ్రూపు సంప్రదింపులు జరుపుతోందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇవి ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయని తెలిపాయి. కంటెంట్ వ్యాపార విక్రయంపై స్పందించేందుకు ఎరోస్ గ్రూపు, నెట్‌ఫ్లిక్స్‌లు అందుబాటులోకి రాలేదు. ఊహాగానాలపై స్పందించబోమని యాపిల్ తెలిపింది. భారత కంటెంట్ వ్యాపార విపణిపై పట్టు సాధించేందుకు అమెజాన్, నెట్‌ఫ్లిక్స్‌లు తమ వంతు ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే.

కారు మబ్బులు కమ్ముతున్నాయ్

ఎస్‌యూవీలు, విలాస కార్లు ప్రియం!

- జీఎస్‌టీ సెస్సు 25 శాతానికి పెంపు
- జీఎస్‌టీ మండలి నిర్ణయం
- అంతక్రితం 1-15 శాతమే
- ధరలు పెంచుతాం: వాహన తయారీదార్లు

ఏమైంది ? (1)

ఆశ నిరాశ కావడం అంటే ఇదేనేమో. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ వల్ల మధ్య స్థాయి, పెద్ద, విలాసవంత కార్లు, ఎస్‌యూవీల ధరలు కాస్త తగ్గాయి. అవన్నీ మళ్లీ ప్రియం కానున్నాయి. జీఎస్‌టీలో వీటిపై గరిష్ఠ సెస్ 15 శాతమే. తాజాగా దానిని 25 శాతానికి పెంచడమే ఇందుకు కారణం.

అంతక్రితం ఎంతంటే ? (2)

కార్లపై 28% జీఎస్‌టీ, సెస్ 1-15% కలిపి మొత్తం పన్ను 43 శాతమే అవుతుంది. జీఎస్‌టీకి ముందు మోటార్ వాహనాలపై మొత్తం పన్ను గరిష్ఠంగా 52-54.72 శాతంగా ఉంది. దీనికి సీఎస్‌టీ, ఆక్ట్రాయ్ కింద మరో 2.5% అదనం. దీనితో పోలిస్తే జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక, మొత్తం పన్ను తగ్గింది. మళ్లీ ఇప్పుడు భారం పెరుగుతోంది.

ఆర్థిక శాఖ ఏమంటోంది ? (3)

'జీఎస్‌టీ అమలు తర్వాత మోటార్ వాహనాలపై మొత్తం పన్ను(జీఎస్‌టీ+పరిహార సెస్) కాస్తా.. అంతకుముందు కంటే తగ్గింది. ఆగస్టు 5న జరిగిన సమావేశంలో ఈ విషయం జీఎస్‌టీ మండలి దృష్టికి వచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న సెస్ 15 శాతాన్ని.. 25 శాతానికి పెంచాలని సిఫారసు చేసింద'ని ఆర్థిక శాఖ పేర్కొంది.

ఎప్పట్నుంచి పెంపు ? (4)


కొత్త రేట్లు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయన్నది జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుందని ఆర్థిక శాఖ తెలిపింది. ఎందుకంటే జీఎస్‌టీ చట్టం, 2017లోని సెక్షన్ 8ను అందుకు అనుగుణంగా సవరించాల్సి ఉంటుంది.

ఏ వాహనాలపై

- అన్ని మధ్య స్థాయి, పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, మోటార్ వాహనాలు (పది కంటే ఎక్కువ మందిని, 13 కంటే తక్కువ మంది ప్రయాణించేవి).
- 1500 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న హైబ్రిడ్ వాహనాలు; మధ్య స్థాయి హైబ్రిడ్ కార్లు(1500 సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్నవి).

అన్ని కార్లకు జీఎస్‌టీ 28 శాతంగా ఉన్నప్పటికీ.. పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, మధ్య స్థాయి, హైబ్రిడ్ కార్లపై 15 శాతం సెస్సు అదనంగా విధించారు. చిన్న పెట్రోలు కార్ల(4 మీటర్ల లోపు, 1200 సీసీ కంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం)పై 1 శాతం సెస్, చిన్న డీజిల్ కార్ల(4 మీటర్ల లోపు; 1500 సీసీ ఇంజిన్ సామర్థ్యం లోపు)పై 3 శాతం సెస్ ఉంటోంది. ఈ కార్లపై వసూలు చేసిన సెస్‌తో పాటు పొగాకు, బొగ్గుపై వసూలు చేసే సెస్‌ను కలిపి జీఎస్‌టీ అమలు వల్ల నష్టపోయే రాష్ట్రాలకు పరిహారంగా ఇస్తారు. ఇందుకోసం పార్లమెంటు ప్రత్యేక శాసనం చేసింది. ప్రస్తుతం ఈ శాసనానికి మార్పు చేసి కొత్త సెస్ విధిస్తారన్నమాట.

కొసమెరుపు: జీఎస్‌టీ అనంతరం పన్ను రేట్లు తగ్గడంతో చాలా వరకు ఎస్‌యూవీ తయారీదార్లు తమ వాహనాల ధరను రూ.1.1-3 లక్షల దాకా తగ్గించారు. ఇపుడు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం

- వాహన తయారీదార్ల ఆందోళన
- తిరిగి పరిశీలించాలని విజ్ఞప్తి

పెద్ద, విలాసవంత కార్లపై సెస్‌ను 25 శాతానికి పెంచడం స్వేచ్ఛా విపణి స్ఫూర్తికి విరుద్ధమని ఆయా కంపెనీల తయారీదార్లు పేర్కొన్నారు. దీని వల్ల 'భారత్‌లో తయారీ' కింద చేపట్టబోయే విస్తరణ ప్రణాళికలపై ప్రభావం పడుతుందని వారు అంటున్నారు. తాజా నిర్ణయం మొత్తం పరిశ్రమపై ప్రతికూలతలను చూపెడుతుందని టయోటా కిర్లోస్కర్, మెర్సిడెస్ బెంజ్, ఆడి, బీఎమ్‌డబ్ల్యూలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. జీఎస్‌టీ అమలుకు ముందు ధర కంటే, కొన్ని కార్లు ప్రియం కావొచ్చని అంచనా వేస్తున్నారు. ఎవరెవరు ఏమంటున్నారంటే..

ఆర్థిక వృద్ధికి వాహన రంగం సహాయపడలేని స్థితికి వస్తుంది. తాజా నిర్ణయం వల్ల కొన్ని కంపెనీలకు ప్రయోజనాలు చేకూర్చి.. మిగతా వాటికి ప్రతికూలతలను పంచాలని చూస్తున్నారు.

- శేఖర్ విశ్వనాథన్, టయోటా కిర్లోస్కర్ మోటార్ వైస్ ఛైర్మన్

మా కంపెనీ తీవ్ర నిరుత్సాహానికి గురైంది. భారత్‌లో తయారీ కింద మేం చేపట్టబోయే భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం చూపుతుంది. భారత్‌లో ప్రపంచ స్థాయి కార్లను తయారు చేసి, విక్రయించాలన్న లక్ష్యానికి ఇది గండి కొడుతుంది.

-రోలాండ్ ఫోల్గర్, మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ

తాజా నిర్ణయం వల్ల మా వ్యాపార ప్రణాళికలపై పునః పరిశీలన చేయాల్సిన పరిస్థితి వస్తోంది. స్వేచ్ఛా విపణి స్ఫూర్తికి విరుద్ధంగా ఈ అడుగు పడడం దురదృష్టకరం. ఈ ప్రతిపాదనను తిరిగి పరిశీలించమని విజ్ఞప్తి చేస్తున్నాం.

- రాహిల్ అన్సారీ, ఆడి ఇండియా అధిపతి

దేశంలోని ఏ పరిశ్రమ వృద్ధికైనా పన్ను సంస్కరణల్లో దీర్ఘకాల స్థిరత్వం ఉండడమే ముఖ్యం. జీఎస్‌టీ అమలును మేం ఆహ్వానిస్తున్నాం. మోటార్ వాహనాలపై ఎప్పటికప్పుడు మార్పులు చేస్తే పరిశ్రమపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

- విక్రమ్ పావా, బీఎమ్‌డబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్

దోశ పిండిపై జీఎస్‌టీ తగ్గింపు

- రెండు డజన్లకుపైగా వస్తువులపైనా
- జీఎస్‌టీ మండలి నిర్ణయం

దిల్లీ

రోజువారీ ఉపయోగించే పలు ఆహారోత్పత్తులపై పన్ను రేట్లను తగ్గించాలని జీఎస్‌టీ మండలి యోచిస్తోంది. ఇడ్లీ/దోశ పిండి, వంట గదిలో ఉపయోగించే గ్యాస్ లైటర్ తదితర రెండు డజన్లకు పైగా వస్తువులపై పన్నురేటు తగ్గించాలని అనుకుంటోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆయా వర్గాల నుంచి ఎదురైన వ్యతిరేకతలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

బ్రాండెడ్ కాని ఆహార వస్తువులను జీఎస్‌టీ నుంచి మినహాయించారు. బ్రాండెడ్, ప్యాకేజ్డ్ ఆహార వస్తువులపై 5% పన్ను వర్తిస్తోంది. ఈ నేపథ్యంలోనే చాలా వరకు వ్యాపారాలు తమ బ్రాండ్ల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడం ద్వారా పన్ను పడకుండా చూసుకుంటున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఏదైనా రిజిస్టర్ బ్రాండ్‌పై జీఎస్‌టీ విధించడానికి, నిర్ణాయక తేదీని 2017 మే 15గా గుర్తించాలని ఫిట్‌మెంట్ కమిటీ జీఎస్‌టీ మండలికి సిఫారసు చేసింది. హైదరాబాద్‌లో సెప్టెంబరు 9న జరిగే సమావేశంలో జీఎస్‌టీ మండలి దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఆగస్టు 5న జరిగిన సమావేశంలో కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించారని, మరికొన్నిటిపై సెప్టెంబరు 9న నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.



జౌళికి ప్రోత్సాహం: జౌళి జాబ్‌వర్క్స్ (నేత, కట్టింగ్, నిట్టింగ్, ఎంబ్రాయిడరీ)పై జీఎస్‌టీ 18 శాతం ఉండగా.. దానిని 5 శాతానికి సవరిస్తూ జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకుంది. దీనిపై భారత జౌళి పరిశ్రమ సమాఖ్య(సీఐటీఐ) హర్షం వ్యక్తం చేసింది. దుస్తులు, శాలువాలు, కార్పెట్లపై చేసే అన్ని జాబ్‌వర్క్స్‌పై ఇది వర్తిస్తుంది.

ఇవి ఇలా మారొచ్చు

	ప్రస్తుతం జీఎస్‌టీ	సవరణ
ఎండు చింతపండు	12	5
కస్టర్డ్ పౌడర్	28	18
అగర్‌బత్తి, ఆతరహా ఉత్పత్తులు	12	5
ప్లాస్టిక్ రెయిన్‌కోట్, రబ్బర్ బాండ్లు, కంప్యూటర్ మానిటర్లు, కిచెన్ గ్యాస్ లైటర్లు	28	18
మట్టి బొమ్మలు	28	5
చీపుర్లు, బ్రష్‌లు	5	0
జపమాల	18	5
ఆయిల్ కేకులు, హోమ సామగ్రి	0	5

మెరిసిన టాటా స్టీల్

- నికర లాభం రూ.921 కోట్లు
- ఆదాయంలో 19 శాతం వృద్ధి

దిల్లీ

ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ ఆర్థిక ఫలితాల్లో రాణించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.921.09 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.3,183.07 కోట్ల నికర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. కార్యకలాపాల ఆదాయం అధికం కావడం వల్లే లాభాలు పెరిగాయని కంపెనీ తెలిపింది. మొత్తం ఏకీకృత కార్యకలాపాల ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.30,973.3 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే మూడు నెలల కాలంలో ఆదాయం రూ.25,970.7 కోట్లుగా ఉందని బీఎస్ఈకిచ్చిన సమాచారంలో టాటా స్టీల్ వెల్లడించింది.



పెరిగిన వ్యయాలు: మొత్తం వ్యయాలు రూ.25,003.7 కోట్ల నుంచి రూ.28,844 కోట్లకు చేరుకున్నాయి. 'మా అమ్మకాలు 28 శాతం పెరిగాయి. కళింగనగర్ తయారీ కేంద్రం దన్నుగా నిలవడం ఇందుకు దోహదపడింది. మార్కెట్ వాటా సైతం వృద్ధి చెందింది' అని టాటా స్టీల్ భారత్, దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ టీవీ నరేంద్రన్ తెలిపారు. బ్రాండెడ్ ఉత్పత్తులు, రిటైల్, సొల్యూషన్ల విభాగం 19 శాతం వృద్ధి సాధించిందని, మొత్తం ఆదాయంలో ఇది 48 శాతం తోడ్పడిందని అన్నారు. 'గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంతో చూస్తే.. పాత నిల్వలు బాగా పేరుకుపోయాయి. జీఎస్‌టీ అమల్లోకి రావడంతో అమ్మకాల పరిమాణం గణనీయంగా తగ్గింది. దేశీయంగా బలమైన డిమాండ్, అంతర్జాతీయ ధరలు మెరుగ్గా ఉండటంతో.. ధరలు స్వల్పంగా పుంజుకున్నాయి' అని నరేంద్రన్ పేర్కొన్నారు.

జీఎస్‌టీ ప్రభావమూ..: జూన్ 30 నాటికి కంపెనీ స్థూల రుణం రూ.87,812 కోట్లుగా నమోదైంది. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఇది 4,798 కోట్లు అధికం. విదేశీ మారక ప్రభావం, జీఎస్‌టీ అమలుతో దేశీయంగా నిల్వలు పేరుకుపోవడం, ఐరోపాలో సీజన్‌పరమైన మార్పులు ఇందుకు కారణమయ్యాయని కంపెనీ వెల్లడించింది. అయితే నికర రుణ భారం స్వల్పంగా తగ్గి రూ.71,703 కోట్లకు చేరింది. ఉక్కు డెలివరీ 28 శాతం వృద్ధితో 2.75 మిలియన్ టన్నులకు పెరిగింది. జీఎస్‌టీ అమలుతో సరకు తక్కువగా తీసుకోవడం, కొన్ని ప్లాంట్ల మూసివేత వంటి వాటి వల్ల అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఇది 14 శాతం తగ్గింది. లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 7 శాతం పెరిగి 2.79 మిలియన్ టన్నులకు చేరింది.

భారత ఉక్కు విపణి భవిష్యత్ సానుకూలంగా ఉండొచ్చని నరేంద్రన్ అంచనా వేశారు. కొత్త ఉక్కు విధానం కింద ప్రభుత్వ ప్రాజెక్టులకు దేశీయంగా తయారుచేసిన ఉక్కు వినియోగించడం, మౌలిక, అందుబాటు గృహాలపై ప్రభుత్వ పెట్టుబడులు ఇందుకు కలిసొచ్చే అవకాశం ఉందని అన్నారు. వడ్డీ రేట్లు తగ్గడం ద్వారా వినియోగం పెరగొచ్చని, మంచి వర్షపాతం, రైతు రుణాల మాఫీ వంటి వాటితో గ్రామీణ గిరాకీ పెరగొచ్చని నరేంద్రన్ వెల్లడించారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో టాటా మోటార్స్‌లో కంపెనీ వాటా రూ.3,778 కోట్లకు విక్రయించామని కంపెనీ ఈడీ కౌశిక్ ఛటర్జీ తెలిపారు.

బీఎస్ఈలో 4.26 శాతం లాభంతో రూ.600 వద్ద ముగిసింది.

చైనా టైర్లపై దిగుమతి నిరోధక సుంకం

- టన్నుకు 277.53-452.33 డాలర్ల సుంకం
- ఆర్థిక శాఖకు డీజీఏడీ సిఫారసు

దిల్లీ: చైనా నుంచి తక్కువ ధరకు దిగుమతి అవుతున్న టైర్ల వల్ల దేశీయ పరిశ్రమ దెబ్బతినకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహన టైర్లపై టన్నుకు సుమారుగా రూ.17,700- 29,000 (277.53-452.33 డాలర్ల) మేర దిగుమతి నిరోధక సుంకాన్ని విధించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ యాంటీ డంపింగ్ అండ్ అలైడ్ డ్యూటీస్ (డీజీఏడీ) ఆర్థిక శాఖకు సిఫారసు చేసింది. ఇతర దేశాల నుంచి తక్కువ ధరకు తెస్తున్న దిగుమతుల వల్ల, దేశీయ కంపెనీల్లో నిల్వలు పేరుకుపోయినట్లు తమ పరిశీలనలో తేలిందని డీజీఏడీ పేర్కొంది. అందువల్లే దేశీయ టైర్ల ధరలకు సమానంగా దిగుమతుల ధర ఉండేలా చూడాలని ఆటోమోటివ్ టైర్ మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్ (ఏటీఎమ్ఏ) తమను కోరిందని తెలిపింది. 2012-13లో 4,146 టన్నుల టైర్లు చైనా నుంచి దిగుమతి కాగా, 2014-15లో ఇవి 52,092 టన్నులకు చేరాయని డీజీఏడీ నివేదికలో పేర్కొంది. ఇప్పటికే ఉక్కు, వస్త్రాలు, రసాయనాలపైనా దిగుమతి నిరోధక సుంకం వసూలు చేస్తున్న సంగతి విదితమే. పారదర్శక వ్యాపారం జరగడానికే చర్యలు తీసుకుంటున్నామని, దిగుమతులపై ఆంక్షలు విధించడానికో, దేశీయంగా ధరలు పెంచడానికో కాదని డీజీఏడీ వివరించింది.

అయిదేళ్లలో రూ.2.5 లక్షల కోట్ల రుణాల రద్దు: ఆర్థిక శాఖ

దిల్లీ: గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) రూ. 2.5 లక్షల కోట్ల రుణాలను సాంకేతికంగా రద్దు (రైట్ ఆఫ్) చేశాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక ఆధారంగా ఈ సమాచారాన్ని వెల్లడించింది. 2016-17లో ఎస్‌బీఐ దాని అనుబంధ బ్యాంకులతో పాటు 27 పీఎస్‌బీలు రూ.81,683 కోట్ల రుణాలను సాంకేతికంగా రద్దు చేశాయని, గత ఐదు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇదే అధికమని ఆర్‌బీఐ తెలిపింది. ఇందులో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు రద్దు చేసిన మొత్తమే రూ.27,574 కోట్లు కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది 41 శాతం అధికం. గత అయిదు ఏళ్లలోనూ ఇదే గరిష్ఠం.



ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం గత అయిదేళ్లలో సాంకేతిక రుణాల రద్దు ఇలా

సంవత్సరం	మొత్తం (రూ.కోట్లలో)
2012-13	27,231
2013-14	34,409
2014-15	49,018
2015-16	57,586
2016-17	81,683
మొత్తం	రూ. 2,49,927 కోట్లు

బ్యాంకుల వారీగా 2016-17లో సాంకేతిక రుణాల రద్దు ఈ విధంగా ఉన్నాయి.

బ్యాంకు	మొత్తం (రూ.కోట్లలో)
పంజాబ్ నేషనల్ బ్యాంక్	9,205
బ్యాంక్ ఆఫ్ ఇండియా	7,346
కెనరా బ్యాంక్	5,545
బ్యాంక్ ఆఫ్ బరోడా	4,348
కార్పొరేషన్ బ్యాంక్	3,574
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	3,066
ఐడీబీఐ బ్యాంక్	2,868

సెన్సెక్స్ ▼ 52	నిఫ్టీ ▼ 09	రూపాయి 63.80 ▼	బంగారం 28,520 ▼	వెండి 37,060 ▼	ముడి చమురు 52.06 ▼
32274	10057	(ఒక అమెరికా డాలరుకు) 22 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 170	ముంబయిలో కిలో రూ.లలో 890	(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	22,112	+19
నాస్‌డాక్	6,377	+25
నిక్కీ 225 (జపాన్)	7,525	+13
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,321	−06
షాంఘై(చైనా)	3,280	+17
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,532	+20
డాక్స్ (జర్మనీ)	12,257	−41

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.95	67.20
పౌండ్ స్టెర్లింగ్	75.65	87.73
యూరో	68.37	79.29
జపనీస్ యెన్/100	52.34	60.72
ఆస్ట్రేలియా డాలరు	46.03	53.26
సింగపూర్ డాలరు	42.60	50.46
థాయ్ బాత్/100	174.08	208.20
బహ్రెయిన్ దీనార్	157.02	179.85
కువైట్ దీనార్	174.49	217.28
సౌదీ రియాల్	15.41	18.27
యూఏఈ దిర్హమ్	15.77	18.44
మలేషియా రింగిట్	13.25	16.30

సోమవారం నిఫ్టీ కదలికలు



క్లిష్ట ఔషధాలపై అరబిందో దృష్టి

- పరిశీలనలో 115 ఏఎన్‌డీఏలు
- శాస్త్ర ఆధారిత కంపెనీ దిశగా అడుగులు

ఈనాడు, హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానంలో పట్టు, మరింత నాణ్యత, నియంత్రణ సంస్థల ప్రమాణాలకు అనుగుణంగా మరింత మెరుగైన ఉత్పత్తుల తయారీ ద్వారా మార్కెట్‌లో అగ్రగామిగా నిలవాలని అరబిందో ఫార్మా భావిస్తోంది. ఇప్పటికే విక్రయిస్తున్న ఉత్పత్తులతో పాటు కొత్తవి విడుదల చేయడం ద్వారా మార్కెట్ వాటా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం కంపెనీకి చెందిన 115 అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్లు (ఏఎన్‌డీఏలు) అమెరికా ఎఫ్‌డీఏ సమీక్షలో ఉన్నాయి. ఇంజెక్షన్లు, శ్వాస సంబంధ (ఇన్‌హలేషన్), కంటి సంబంధ (ఆప్తాలమిక్స్) ఔషధాలను అమెరికాలో విడుదల చేసేందుకు 38 ఏఎన్‌డీఏలు పరిశీలనలో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. భిన్నమైన సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాలతో సంక్లిష్ట పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) ఉత్పత్తుల్లోకి ప్రవేశించాలని, తద్వారా విలువ సృష్టించాలని కంపెనీ యోచిస్తోంది. ఐరోపా విపణిలో ఔషధాలు ప్రవేశపెట్టడానికి సొంత దరఖాస్తులు దాఖలు చేయాలని, తద్వారా మార్కెట్ వాటా పెంచుకోవాలని భావిస్తోంది. అభివృద్ధి చెందిన మార్కెట్లలో కంపెనీ విక్రయాలకు అనుగుణంగా యాక్టివ్ ఫార్మా ఇంగ్రేడియెంట్ల (ఏపీఐ) ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోనుంది. అన్ని ప్రధాన మార్కెట్లలో గత ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల వృద్ధిరేటు సంతృప్తికరంగా ఉందని అరబిందో ఫార్మా వైస్ ఛైర్మన్



కె.నిత్యానంద రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఔషధాలు 150కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నట్లు చెప్పారు.

10వ యూనిట్ ప్రారంభం

నాయుడుపేటలో మరో పెద్ద తయారీ సదుపాయం యూనిట్-10ను, బయోసిమిలర్ల తయారీ యూనిట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి తెచ్చి ఉత్పత్తి ప్రారంభించనుంది. కాంప్లెక్స్ ఉత్పత్తుల్లోకి అడుగుపెట్టే

- ★ 58 కేన్సర్ ఔషధాలు అభివృద్ధి ప్రక్రియలో ఉన్నాయి.
- ★ 8 హార్మోన్ ఉత్పత్తులను కంపెనీ అభివృద్ధి చేస్తోంది.
- ★ చర్మ, శ్వాస, ముక్కు సంబంధ విభాగంలో 31 ఉత్పత్తులు అభివృద్ధి దశలో ఉన్నాయి.
- ★ స్పెషాలిటీ ఇంజెక్షన్ల విభాగంలో 4 ఉత్పత్తులపై కసరత్తు జరుగుతోంది.

వ్యూహంలో భాగంగా బయోసిమిలర్ల రంగంలోకి అరబిందో అడుగు పెట్టిన విషయం తెలిసిందే. వచ్చే దశాబ్ద కాలంలో అనేక బయోలాజిక్స్ మేధో సంపత్తి హక్కుల గడువు తీరిపోతుందని, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి మరిన్ని బయోసిమిలర్లను తీసుకురానున్నామని కంపెనీ పేర్కొంది. బయోసిమిలర్ల అభివృద్ధికి కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకూ సాధించింది భవిష్యత్తులో సాధించనున్న అభివృద్ధి, విస్తరణ, కొత్తగా విడుదల చేయనున్న ఔషధాలకు ప్రారంభం మాత్రమేనని నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు. 'కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, మరింత క్లిష్ట ఔషధాలపై (కాంప్లెక్స్ ఉత్పత్తులు) దృష్టిపెడుతున్నాం. ఉత్పత్తి అభివృద్ధి సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా కంపెనీ పోటీతత్వాన్ని మరింత పెంచుతామని' అన్నారు.

35 ఔషధాలను విడుదల చేశాం..

'గత ఆర్థిక సంవత్సరంలో అమెరికాలో 35 ఉత్పత్తులను విడుదల చేశాం. 61 ఏఎన్‌డీఏలకు అనుమతి పొందాం. 31 ఏఎన్‌డీఏలను దాఖలు చేశామ'ని అరబిందో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.గోవింద రాజన్ తెలిపారు. కొత్తగా ప్రారంభించిన న్యూట్రాస్యూటికల్స్, ఓటీసీ (ఓవర్ ద కౌంటర్) వ్యాపారాల అమ్మకాలు, లాభాలు ఆకర్షణీయంగా పెరగాయన్నారు. కంపెనీ తయారు చేస్తున్న ఫార్ములేషన్లకు అవసరమైన 70 శాతం ముడి ఔషధాలను (ఏపీఐ) సొంతగా సమకూర్చుకుంటున్నట్లు వివరించారు. శాస్త్ర (సైన్స్) ఆధారిత కంపెనీగా మారే ప్రయాణాన్ని కంపెనీ ప్రారంభించిందని గోవింద రాజన్ తెలిపారు.

నాట్కో ఫార్మా డివిడెండు 62.5%

- త్రైమాసిక లాభం రూ.94 కోట్లు
- ఆదాయంలో 30% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు నాట్కో ఫార్మా మధ్యంతర డివిడెండు ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.25 (62.5 శాతం) మధ్యంతర డివిడెండు చెల్లించాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. మధ్యంతర డివిడెండు చెల్లించాలని, దీనికి ఆగస్టు 18ని రికార్డు తేదీగా తీసుకోవాలని సోమవారం జరిగిన సమావేశంలో బోర్డు నిర్ణయించినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. అమెరికా విపణిలో టామిఫ్లూ జనరిక్ ఔషధ విక్రయాలు, హెపటైటిస్ సి ఔషధాల అమ్మకాల అండతో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2017 జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి నాట్కో ఫార్మా ఏకీకృత నికర లాభం రూ.93.7 కోట్లకు పెరిగింది. 2016-17 తొలి త్రైమాసిక లాభం రూ.47.5 కోట్లతో పోలిస్తే 97 శాతం వృద్ధి నమోదైంది. అయితే 2016-17 నాలుగో త్రైమాసిక లాభం రూ.177 కోట్లతో పోలిస్తే తగ్గింది. సమీక్ష త్రైమాసికానికి ఏకీకృత ఆదాయం దాదాపు 30 శాతం పెరిగి రూ.345.5 కోట్ల నుంచి రూ.448.7 కోట్లకు చేరిందని నాట్కో ఫార్మా పేర్కొంది. ఇన్‌ఫ్లూయింజా చికిత్సకు వినియోగించే టామిఫ్లూ జనరిక్ గొట్టాలను అమెరికాలో విక్రయించడానికి 2016 డిసెంబరులో పరిమిత కాల ప్రత్యేక హక్కులు (ఎక్స్‌క్లూజివిటీ) పొందింది. దీంతో 2017 మార్చితో ముగిసిన మూడు నెలల్లో టామిఫ్లూ విక్రయాలు, కంపెనీ నికర లాభం ఆకర్షణీయంగా పెరగడానికి దోహదం చేశాయి. గిలీడ్, రోషేతో న్యాయస్థానానికి వెలుపల కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 30 ఎంజీ, 45 ఎంజీ, 75 ఎంజీ టామిఫ్లూ గొట్టాలను అమెరికాలో విడుదల చేయడానికి నాట్కోకు వీలు కలిగింది. 2015కు అమెరికాలో టామిఫ్లూ నోటి ద్వారా తీసుకునే గొట్టాల మార్కెట్ విలువ 40 కోట్ల డాలర్లు ఉన్నట్లు అంచనా. గత రెండు త్రైమాసికాల్లో అమెరికాలో ఓసెల్టామివిర్, టామిఫ్లూ విక్రయాలు నాట్కో ఫార్మా ఆదాయం, లాభం పెరగడానికి దోహదం చేశాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

బీఎస్‌ఈలో షేరు ధర 1.22 శాతం పెరిగి రూ.960.80 వద్ద ముగిసింది.

అమరరాజా లాభం రూ.100 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అమరరాజా బ్యాటరీస్ అమ్మకాలు పెరిగినప్పటికీ.. నికర లాభం క్షీణించింది. 2017 జూన్‌తో ముగిసిన మూడు నెలలకు రూ.1,671.28 కోట్ల స్థూల అమ్మకాలపై రూ.99.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో అమ్మకాలు రూ.1,456.33 కోట్లు, నికర లాభం రూ.130.65 కోట్ల మేరకు ఉన్నట్లు కంపెనీ తెలిపింది. దీని ప్రకారం అమ్మకాలు 14.76 శాతం పెరగ్గా.. నికర లాభం 23 శాతం క్షీణించింది. బ్యాటరీలలో వినియోగించే ప్రధాన ముడి పదార్థం లెడ్ ధరలు పెరగడం, లాభం తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాహన బ్యాటరీలకు వచ్చేసరికి అన్ని విభాగాల్లో అమ్మకాలు పెరిగాయి. వాహన విక్రయాలు పెరగడం ఇందుకు కారణం. పారిశ్రామిక బ్యాటరీల విభాగంలో విక్రయాలు కొద్దిగా మందగించాయి. 'అధిక లెడ్ ధరలు, పారిశ్రామిక బ్యాటరీల గిరాకీ మందగించడం కొద్దిగా ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీ అన్ని విభాగాల్లో వ్యయ నియంత్రణ, సామర్థ్యాల పెంపుపై దృష్టి కేంద్రీకరించాలని భావిస్తున్నాం' అని అమరరాజా బ్యాటరీస్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా తెలిపారు. ఏడాది కాలంలో లెడ్ ధరలు 20 శాతానికి పైగా పెరగడం కంపెనీ వ్యయాలపై ప్రతికూల ప్రభావం చూపిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎస్‌ఈలో షేరు ధర 2.10 శాతం పెరిగి రూ.822.55 వద్ద ముగిసింది.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017-18	నికర లాభం/(నష్టం) 2016-17	మొత్తం ఆదాయం 2017-18	మొత్తం ఆదాయం 2016-17
ఎవరెడీ ఇండస్ట్రీస్	13.56	22.36	357.66	371.79
వెల్‌స్పన్ ఇండియా (కన్సా)	128.56	208.68	1,552.64	1,611.49
డాక్టర్ లాల్ పాథ్ ల్యాబ్స్(కన్సా)	44.40	40	256.80	229.20
ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్	(45.46)	315.48	1,045.66	1,272.71
వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా	132.72	121.95	1,639.54	1,424.85
జిందాల్ స్టెయిన్‌లెస్	74.38	49.43	2,438.27	1,653.18

నేటి బోర్డు సమావేశాలు



★ బ్యాంక్ ఆఫ్ ఇండియా ★ కావేరీ సీడ్ ★ ఎన్‌సీసీ ★ ఆస్ట్రాజెనికా ఫార్మా ★ గ్లాక్సోస్మిత్ క్లైన్ కన్స్యూమర్ ★ ఫ్యూచర్ రిటైల్ ★ టాటా టెలీసర్వీసెస్ ★ దాంపూర్ షుగర్ మిల్స్ ★ మెక్‌లాయిడ్ రసెల్ ★ జాగరణ్ ప్రకాశన్ ★ ఫస్ట్‌సోర్స్ సొల్యూషన్స్ ★ పీవీపీ వెంచర్స్ ★ జీటీపీఎల్ హాత్‌వే ★ ఆస్ట్రాల్ పాలీ టెక్నిక్ ★ ఉమాంగ్ డెయిరీస్ ★ ప్రిజం సిమెంట్ ★ జిందాల్ స్టీల్ ★ సెంచురీ టెక్స్‌టైల్స్ ★ బలరాంపూర్ ఇండస్ట్రీస్ ★ బిర్లా కేబుల్ ★ టాటా కెమికల్స్ ★ మంగళం సిమెంట్ ★ యూనివర్సల్ కేబుల్స్ ★ సుందరం క్లేటాన్ ★ ముత్తూట్ ఫైనాన్స్ ★ చంబల్ ఫెర్టిలైజర్స్

ఊగిసలాటలో నష్టాలే

సమీక్ష

రోజులో అధిక భాగం ఊగిసలాట మధ్య కదలాడిన సూచీలు.. చివరకు నష్టాలతో ముగిశాయి. చెప్పుకోదగ్గ పరిణామాలు లేక పోవడం, మదుపర్ల లాభాల స్వీకరణ ఇందుకు కారణమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారక విలువ తగ్గడం సెంటిమెంటును దెబ్బతీసింది. ఫలితంగా ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ 1.75 శాతం నష్టపోగా, టీసీఎస్, విప్రో షేర్లు సైతం బలహీనపడ్డాయి. రక్షాబంధన్ సందర్భంగా బులియన్, లోహ సహా కమొడిటీ మార్కెట్లు పనిచేయలేదు. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

ఆద్యంతం ఊగిసలాటే: సెన్సెక్స్ ఉదయం 32377.80 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో ఇంట్రాడేలో 32396.14 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయికి చేరిన సూచీ.. అనంతరం ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఆరంభ లాభాలు పోగొట్టుకుని.. చివరకు 51.74 పాయింట్ల నష్టంతో 32,273.67 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ సైతం 9 పాయింట్ల నష్టంతో 10,057.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,046.35- 10,088.10 పాయింట్ల మధ్య కదలాడింది.

జేపీ అసోసియేట్స్ భళా: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాల్లోకి రావడంతో జేపీ అసోసియేట్స్ షేరు దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 19.92 శాతం పెరిగి రూ.30.40 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 14.40% లాభంతో రూ.29 వద్ద స్థిరపడింది.
✦ వర్ల్‌పూల్ షేరు 7.39 శాతం పెరిగినా, చివరకు 2.97 శాతం లాభపడి రూ.1,190.85 దగ్గర ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 డీలాపడ్డాయి. ఎన్‌టీపీసీ 1.64%, డాక్టర్ రెడ్డీస్ 1.51%, ఎం అండ్ ఎం 1.34%, టాటా మోటార్స్ 1.07%, లుపిన్ 0.81%, భారతీ ఎయిర్‌టెల్ 0.77%, టీసీఎస్ 0.72%, హిందుస్థాన్ యునిలీవర్ 0.72%, ఏషియన్ పెయింట్స్ 0.62% చొప్పున నష్టపోయాయి.

నేటి మార్కెట్

కీలక పరిణామాలు కొరవడటం, ఫలితాల సీజన్ చివరకు రావడంతో నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. నేడు నిఫ్టీకి 10100- 10200 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు. 9900- 10000 పాయింట్ల మధ్య మద్దతు లభించే అవకాశం ఉంది. నిఫ్టీ 9900 పాయింట్ల దిగువకు చేరి, రెండు మూడు రోజులు అక్కడే కొనసాగితే.. దిద్దుబాటు వచ్చే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. మెరుగైన వర్షపాతం కారణంగా ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు రాణించొచ్చని ట్రేడర్లు భావిస్తున్నారు. సోమవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన టాటా స్టీల్ ఫలితాల ప్రభావం నేడు షేరుపై ఉండొచ్చు.

మార్కెట్ కబుర్లు


- ✦ **ఐడియా సెల్యులార్, వొడాఫోన్ ఇండియాల** 23 బిలియన్ డాలర్ల విలీన ఒప్పందానికి షరతులతో కూడిన అనుమతులను సెబీ, ఎక్స్ఛేంజీలు ఇచ్చాయి.
- ✦ భారతీ ఇన్‌ఫ్రాటెల్‌లో 3.7 శాతం వాటాను రూ.2500 కోట్లకు విక్రయించాలని **భారతీ ఎయిర్‌టెల్** భావిస్తోంది.
- ✦ అనుమానిత 331 డొల్ల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని స్టాక్ మార్కెట్లకు **సెబీ** ఆదేశాలు జారీ చేసింది.
- ✦ **జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా** పబ్లిక్ ఇష్యూ నిమిత్తం సెబీ వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. మొత్తం 12.40 కోట్ల షేర్లలో 1.7 కోట్లు తాజా షేర్లు కాగా.. 10.7 కోట్ల షేర్లను ప్రభుత్వం అమ్ముతుంది. ఐపీఓ అనంతరం సంస్థలో ప్రభుత్వం వాటా 14.22 శాతం తగ్గుతుంది.
- ✦ ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్) నుంచి రూ.763.57 కోట్ల కాంట్రాక్టును దక్కించుకున్నట్లు **హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్** పేర్కొంది.
- ✦ జూన్ త్రైమాసికానికి ఫలితాలను అనుకున్న సమయానికి ఇవ్వలేకపోతున్నామని.. ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సెబీకి **హెచ్ఎమ్‌టీ** విజ్ఞప్తి చేసింది.

టాటా స్టీల్



రూ.585 వద్ద ప్రారంభమై రూ.584-601.65 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.575.85తో పోలిస్తే రూ.24.20(4.20%) లాభంతో రూ.600.05 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,10,12,730.

భారతీ ఇన్‌ఫ్రాటెల్



రూ.406.50 వద్ద మొదలై రూ.395.60-408.50 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.406.55తో పోలిస్తే రూ.8.70 (2.14%) నష్టంతో రూ.397.85 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 24,53,089.


52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
బజాజ్ ఫిన్‌సర్వ్	5,495.00	బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్	4,134.10
బ్రిటానియా ఇండస్ట్రీస్	4,211.85	డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	2,200.00
బజాజ్ హోల్డింగ్స్	2,575.00	యాడ్‌ల్యాబ్స్	57.70
అవంతీ ఫీడ్స్	1,845.00	జిందాల్ పాలీ ఇన్వెస్ట్‌మెంట్	60.65
బీఈఎంఎల్	1,747.90	ఇంటెన్స్ టెక్నాలజీస్	95.95
సెంచురీ టెక్స్‌టైల్	1,238.85	ఈసీఈ ఇండస్ట్రీస్	190.55

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
07/08	3,790	3,989	−199	2,572	2,264	308
03/08	5,534	5,510	24	3,069	3,458	−389
02/08	4,062	3,588	474	2,671	2,904	−233
01/08	4,516	5,461	−946	4,313	2,923	1,391
31/07	5,485	6,682	−1,197	4,865	3,096	1,768

7వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	321	విశాఖపట్నం	335
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	వరంగల్	323
బెంగళూరు	360	చిత్తూరు	365
8న		చెన్నై	372
విజయవాడ/గోదావరి	328	నమక్కల్	365

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1817.35 (1813.35) 257138
ADANI PORT & 414.25 (406.65) 3863466
AMBUJA CEMEN 279.50 (277.45) 1632831
ASIAN PAINTS 1149.65 (1157.30) 576280
AUROBIND PHA 724.45 (725.30) 1316319
AXIS BANK LT 505.80 (508.10) 5293884
BAJAJ AUTO L 2889.25 (2874.65) 169287
BANK OFBAROD 160.05 (158.95) 4382843
BHARTI AIRTE 417.45 (420.90) 1170962
BHARTI INFRA 397.85 (406.55) 2453089
BOSCH LTD 24353.85 (24560.20) 8954
BPCL 527.70 (517.90) 4681753
CIPLA 566.50 (568.70) 769606
COAL INDIA L 251.50 (249.20) 3336900
DR. REDDYS 2206.95 (2239.55) 736078
EICHER MOTOR 31969.85 (31637.25) 35910
GAIL 381.60 (377.75) 3238309
HCL TECH 886.00 (890.65) 823485
HDFC 1725.40 (1731.35) 2372097
HDFC BANK 1788.55 (1790.25) 479665
HERO MOTOCOR 3952.70 (3956.55) 644961
HINDALCO IND 227.65 (225.25) 4951339
HINDUSTAN UN 1186.30 (1192.10) 868190
ICICI BANK 300.15 (296.25) 11870705
INDIABULLS H 1199.50 (1213.20) 578775
INDIAN OIL 431.20 (418.95) 8854820
INDUSINDBANK 1650.50 (1664.70) 386830
INFOSYS LTD 968.25 (983.75) 3036872
ITC 279.85 (280.75) 8451267
KOTAK MAHIND 997.90 (996.20) 619240
LARSEN & TOU 1179.95 (1175.85) 1035670
LUPIN 985.05 (992.80) 1416550
M&M 1400.75 (1418.05) 1493977
MARUTI SUZIK 7838.65 (7770.30) 327318
NTPC LTD 174.45 (177.35) 3630569
ONGC 165.90 (166.40) 3289743
POWER GRID C 225.95 (224.60) 2598508
RELIANCE IND 1616.35 (1622.15) 2180018
SBI 311.20 (305.25) 11420767
SUN PHARMA 505.55 (506.40) 2279879
TATA CONSULT 2503.45 (2522.80) 942760
TATA MOT DVR 250.35 (255.00) 1556807
TATA MOTORS 430.00 (435.60) 6461815
TATA POWER 80.00 (80.25) 3124773
TATA STEEL L 600.05 (575.85) 11012930
TECH MAHINDR 406.35 (409.00) 1312508
ULTRATECH 4049.95 (4081.35) 159843
VEDANTA LIMI 287.70 (288.85) 5848430
WIPRO 287.75 (289.40) 1470499
YES BANK LTD 1799.85 (1807.95) 1331197
ZEE ENTERTAI 540.65 (541.85) 809866

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1405.90 (1426.20) 26755
ASHOK LEYLAN 111.20 (109.20) 8251146
BAJAJ FINANC 1798.15 (1723.45) 1504033
BAJAJ FINSER 5433.05 (5308.15) 243057
BEL 181.80 (178.95) 1801442
BHEL 138.90 (137.25) 2710873
BRITANNIA 4107.80 (3917.40) 891341
CADILA HEALT 533.05 (532.90) 455871
COLGATE PALM 1071.85 (1073.50) 119734
CONTAINER 1184.40 (1179.60) 285967
CUMMINS INDI 946.15 (936.60) 210437
DABUR INDIA 319.45 (307.30) 2371502
DIVIS LAB 684.05 (682.15) 427725
DLF LIMITED 191.35 (189.80) 4263872
EMAMI LIMITE 1150.25 (1151.25) 141480
GLAXOSMI CON 5458.00 (5479.85) 3182
GLAXOSMI PHA 2399.80 (2425.10) 6545
GLENMARK PHA 688.75 (689.30) 589918
GODREJ CONSU 967.20 (960.85) 412422
HAVELLS INDI 494.90 (492.55) 882186
HINDUSTAN ZI 285.15 (285.90) 1733736
HPCL 458.10 (432.60) 11129918
ICICI PRU LI 437.40 (438.90) 474686
IDEA CELLULR 93.05 (92.70) 4899324
INTERGLOBE A 1287.65 (1276.00) 332341
JSW STEEL LT 229.05 (228.25) 3218107
LIC HOUS.FIN 687.55 (684.65) 1963882
MARICO LIMIT 334.25 (324.85) 3052279
MCDOWELL 2573.20 (2596.10) 271272
MOTHERSON 339.55 (336.80) 1479574
NHPC LTD 31.00 (30.15) 4128274
NMDC LTD 125.75 (125.20) 1568811
OIL INDIA 287.25 (284.25) 200014
ORACLE FIN S 3595.25 (3603.25) 8578
P&G HYG&HEAL 8099.25 (8195.25) 1126
PETRONET LNG 213.00 (207.55) 5043356
PIDILITE IND 813.55 (808.25) 251391
PIRAMAL ENTE 2963.50 (2940.05) 103363
PNB 152.10 (151.05) 5372108
POWER FIN CO 136.70 (128.45) 9487982
RURAL ELEC C 181.30 (174.15) 7277590
SAIL 62.40 (61.70) 3876935
SHREE CEMENT 18122.85 (18059.75) 8372
SHRIRAM TRAN 988.10 (992.15) 414385
SIEMENS 1359.55 (1364.50) 82168
SUN TV LTD 754.60 (786.30) 1869755
TITAN IND 614.85 (611.20) 2467527
TORRENT PHAR 1290.00 (1276.25) 66371
UNITED BREWE 823.05 (815.70) 135035
UPL LIMITED 877.65 (887.05) 664918

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 178.15 (176.95) 543244
ADANI ENTERP 140.10 (138.00) 2242614
ADANI POWER 32.90 (32.90) 5312933
ALL BANK 71.85 (71.45) 1452479
AMARA RAJA 821.25 (805.80) 1235383
ANANT RAJIND 60.80 (59.95) 860838
ANDHRA BANK 55.65 (56.10) 1525843
APOLLO HOSPI 1268.05 (1258.10) 83444
APOLLO TYRES 285.50 (262.25) 18908914
APTECH 215.50 (204.05) 652089
BAJAJ ELECT. 331.95 (325.90) 81490
BAJAJ HIND 16.05 (15.65) 8257228
BAJAJ HOLDIN 2562.30 (2416.65) 66226
BALAJI TELE 164.15 (167.55) 586827
BALLARPUR IN 16.15 (15.75) 933140
BALRAMPUR CH 178.95 (173.70) 3018899
BANK OF MAHA 27.70 (27.80) 88577
BANK OFINDIA 158.05 (158.45) 2783549
BATA INDIA 641.30 (631.35) 1085338
BGR ENERGY S 142.95 (142.85) 53863
BHARAT FORGE 1161.55 (1155.45) 503083
BHUSHAN STEE 72.50 (68.10) 1292389
BIOCON LTD 354.25 (357.00) 1723793
BOMBAY DYE 82.90 (81.50) 1552475
CANARA BANK 352.55 (351.60) 850397
CEAT LIMITED 1814.35 (1740.35) 1597924
CENTRAL BANK 86.70 (87.55) 1081724
CHAMBAL FERT 141.50 (140.55) 806524
CHENNAI PETR 417.85 (403.40) 2886864
CITY UNIBANK 171.10 (168.05) 441096
CORPO BANK 48.70 (48.90) 177926
COX & KINGS 275.65 (274.25) 54977
D B REALTY L 40.85 (40.35) 641849
DELTA CORP L 175.60 (165.45) 4884413
DENA BANK 33.35 (33.40) 388832
DHANALAKBANK 38.05 (37.70) 612694
EDELWEISS CA 229.20 (225.15) 3811506
EDUCOMP SOLU 8.85 (8.90) 93707
EID PARRY 314.50 (320.00) 185620
EIH 131.05 (132.30) 62639
ESSAR SHIPPI 27.05 (27.20) 36901
ESTER INDUST 36.25 (36.65) 23475
EXIDE INDUST 215.70 (215.80) 2256570
FEDERAL BANK 114.50 (114.25) 5649172
FINOLEX CABL 492.65 (482.90) 42595
G E SHIP LTD 385.20 (386.40) 34805
GAMMON INDIA 9.35 (9.15) 613564
GAMMON INFRA 4.95 (4.40) 5170270
GATI LIMITED 119.65 (120.10) 336213
GAYATRI PROJ 167.75 (170.50) 17158
GITANJALIGEM 62.80 (62.80) 169389
GMR INFRASTR 18.55 (17.65) 25559596
GODREJ IND 638.00 (649.95) 298077
GRASIM IND 1125.10 (1126.30) 697990
GUJ ALK&CHEM 399.70 (399.75) 44852
HCL INFOSYS 47.10 (47.20) 482080
HEXA TECH 253.55 (252.10) 583922
HIMACHAL FUT 18.20 (16.90) 9707409
HINDU MOTORS 8.25 (8.05) 383492
HOUSING DEV 69.25 (75.75) 36548682
IDBI 57.15 (57.00) 1115660
IDFC 58.55 (57.55) 3173240
IFCI 26.00 (26.15) 1634733
IL&FS TRANS 88.95 (88.70) 173011
IND SWIFTLAB 36.10 (36.15) 5831
INDBULLS REL 266.15 (247.60) 23748707
INDIA CEM 200.05 (198.50) 4338600
INDIAN BANK 304.80 (304.20) 722067
INDO RAMA SY 30.85 (30.55) 22728
INDRAPRASTHA 1196.40 (1180.25) 404513
IND-SWIFTLTD 9.10 (9.25) 12887
INGERSOLL-R 830.80 (844.80) 7886
IOB 24.65 (24.55) 536042
IPCA LAB 464.00 (461.90) 16630
IRB INFRA DE 225.00 (221.20) 1752474
J&K BANK 81.20 (80.80) 153012
JAI CORP 82.30 (81.50) 358048
JAIN IRRIGAT 101.35 (102.10) 3651041
JAYPEE INFRA 21.85 (20.85) 4874716
JAYSHREE TEA 102.30 (101.15) 86869
JET AIRWAYS 633.90 (609.40) 2693245
JINDAL SAW 96.20 (93.40) 1219084
JINDAL STEEL 143.55 (138.35) 14571995
JK LAKSHMI C 446.10 (449.55) 96454
JK PAPER LIM 95.45 (90.60) 1307406
JM FINANCIAL 123.95 (123.10) 469359
JP ASSOCIATS 28.95 (25.35) 155900716
JSW ENERGY L 69.00 (68.25) 5240877
JUBILANT FOO 1264.55 (1279.30) 352060
JUBILANT ORG 699.85 (698.10) 188295
JYOTHY LABS 384.55 (384.40) 75539

ఘనం (+)

నిఫ్టీ	7న	మార్పు %
TATA STEEL	600.05	4.20
INDIAN OIL CORP	431.20	2.92
SBI	311.20	1.95
BPCL	527.70	1.89
ADANI PORT	414.25	1.87
ICICI BANK	300.15	1.32
HINDALCO	227.65	1.07

గ్రహణం (-)

నిఫ్టీ	7న	మార్పు %
BHARTI INFRATEL	397.85	-2.14
TATA MOTORS DVR	250.35	-1.82
NTPC	174.45	-1.64
INFOSYS	968.25	-1.58
DR. REDDYS LAB	2206.95	-1.46
TATA MOTORS	430.00	-1.29
M & M	1400.75	-1.22

KARNATA BANK 154.90 (148.70) 2207205
KEC INTL LTD 298.85 (298.80) 1595387
KOLTE PATIL 160.10 (159.40) 66471
KPIT CUMMINS 123.30 (124.10) 692760
L&TFIN.HOLD 176.40 (174.00) 3878232
LAK VIL BANK 176.75 (177.20) 549659
M & M FINANC 424.35 (423.55) 1569741
MANAPPURAM G 106.30 (102.80) 8098109
MMTC LIMITED 58.10 (58.65) 350689
MOSER-BEAR 5.10 (5.25) 260331
MPHASIS LTD 599.20 (597.70) 37114
MRPL 132.20 (129.85) 2665024
MTNL 19.45 (19.50) 614607
NCC LIMITED 90.15 (86.95) 6925876
NETWORK18 FI 54.80 (54.10) 363435
NEULAND LAB 1381.65 (1422.25) 6529
NIIT LTD 91.25 (91.60) 401632
NIIT TECHNOL 499.60 (502.80) 278026
OMAXE LTD 204.30 (203.95) 572120
ONMOBILE GLO 63.55 (62.35) 317415
ORIENT PAPER 97.60 (94.70) 185981
ORIENTALBANK 139.85 (138.95) 1277690
PARSVNATH DE 23.80 (23.00) 536468
PATEL ENGG 81.35 (78.45) 303129
PFIZER 1798.35 (1800.75) 5490
POLARIS SOFT 240.25 (233.50) 137189
POWERTRADING 123.35 (117.70) 3806190
PRAJ IND 75.45 (74.80) 194255
PRISM CEMENT 118.25 (118.15) 55869
PROVOGUE (IN 4.30 (4.15) 230612
PUNJ LLOYD 21.45 (21.35) 1234994
PUNJAB & SIN 52.45 (52.45) 49279
PURAVANKARA 77.15 (77.75) 332502
PVP VENTURES 5.05 (5.00) 301396
PVR LIMITED 1430.45 (1400.20) 290183
RADICO KHAIT 151.45 (145.60) 805162
RAJ OIL MILL 1.45 (1.50) 86206
RAJESH EXPOR 739.35 (740.15) 281167
RALLIS INDIA 242.50 (244.75) 73738
RAMCO IND 225.85 (222.55) 94842
RAMCO SYS 386.25 (382.10) 69679
RAMKY INFRA 95.90 (96.50) 131337
RAYMOND 776.95 (769.15) 165175
RELIANCE CAP 781.40 (744.10) 5686320
RELIANCE COM 23.90 (23.30) 10010204
RELIANCE INF 542.20 (530.45) 1504888
RELIANCE POW 42.85 (42.45) 1636304
ROLTA INDIA 56.50 (56.40) 266662
SAGAR CEMENT 819.90 (828.70) 744
SAREGAMA 411.40 (409.95) 140447
SHANTHI GEAR 136.90 (134.65) 25767
SHIPPNG CORP 88.75 (89.10) 2840605
SHREE RENUKA 19.30 (18.85) 9348959
SINTEX IND 36.10 (33.60) 25027265
SOBHA DEVELO 384.20 (386.35) 276467
SOUTHINDBANK 29.25 (29.25) 4055767
STERLITE TEC 238.00 (219.85) 2662689
SUJANA METAL 2.00 (1.85) 271837
SUN PHARMA 382.65 (356.45) 991576
SUND FASTNER 390.30 (400.50) 156499
SUZLON ENERG 17.30 (17.65) 44847538
SYND. BANK 71.65 (69.55) 8480248
TATA CHEM 607.00 (606.35) 352116
TATA COFFEE 127.80 (127.15) 189260
TATA COMMUN 651.30 (641.35) 389012
TATA GLOBAL 170.45 (166.45) 2548868
TATA METALIK 665.30 (640.45) 363255
TATA TELESER 7.55 (7.45) 2004125
THE INDIAN H 129.05 (128.00) 224778
TORRENT POWE 201.60 (187.25) 5062608
TRIVENI ENGG 106.75 (97.80) 8855485
TTK PRESTIGE 6296.65 (6389.10) 2192
TV TODAY NET 237.50 (239.55) 55107
TV18 BROADCA 38.65 (38.20) 2401601
TVS MOTOR 602.90 (599.30) 598149
UCO BANK 32.55 (32.45) 198263
UNION BANK 146.35 (145.10) 2344223
UNITECH 8.80 (8.25) 65259055
UNITED BANK 19.15 (19.05) 202597
USHA MARTIN 22.35 (21.85) 1114514
VADILAL INDU 914.50 (921.95) 15690
VENKYS 2187.50 (2150.95) 217604
V-GUARD IND 185.15 (181.65) 706102
VIJAYA BANK 67.35 (67.70) 597883
VIP 199.60 (194.30) 371358
VOLTAS 536.85 (541.70) 784124
ZEE LEARN LI 43.95 (43.85) 120945
ZUARI GLOBAL 131.65 (134.10) 6801
ZYDUS WELLNE 892.15 (885.20) 5623

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 839.55 (878.80) 14064
AMAR RAJA BA 822.55 (805.65) 86778
ANDHRA BANK 55.70 (56.05) 132049
ANDHRA CEMEN 9.97 (9.84) 49169
ANDHRA PAPER 307.80 (310.45) 2986
ANDHRA PETRO 26.75 (26.95) 60934
ANDHRA SUGAR 352.70 (337.05) 13014
ASTRA MICROW 131 (132.45) 23155
AUROBINDO PH 724.15 (725.20) 167925
AVANTEL SOFT 238.30 (224.10) 7379
AVANTI FEEDS 1803.20 (1782) 23934
BALAJI AMIN 323.95 (320.75) 33306
BARTRONICS 15.05 (15.05) 15905
BHAGIRA CHEM 177.60 (171.10) 14386
BN RATHI SEC 33.65 (36) 11918
BRILLIANT SE 7.72 (7.36) 46533
CAMBRIDGE TE 71.35 (72.80) 2677
CIL SECURI 40.95 (41.25) 6892
CONT COFFEE 281.85 (279.05) 1723
COROMAN FERT 443.65 (446.65) 132432
CYIENT LIMIT 524.55 (525.75) 4592
DIVI'S LAB 683.20 (681.60) 55549
DR REDDY 2210.30 (2244.10) 50996
GATI CORPN 119.95 (120.20) 77187
GMR INFRASTR 18.55 (17.65) 2478497
GOLDST INFRA 87.35 (79.45) 59922
GOLDSTONE EN 10.91 (9.92) 17882
GRANULES (I) 132.30 (131.60) 35378
GVK POWER 13.48 (12.35) 9549638
HBL NIFE POW 47.60 (47) 22707
HERITAGE FOO 1296.45 (1260.20) 1508
HYD INDUS 1111.70 (1104.75) 6443
IDL INDUSTRS 518.85 (517.80) 2752
ILFS ENGINEE 44.65 (44.55) 13386
INNAREDY COM 2.99 (2.91) 9076
IVRCL INFRAS 6.31 (6.32) 586109
KAKATIYA CEM 384.55 (370.95) 9980
KAVERI SEED 695.25 (697.90) 24286
KCP LTD 103.10 (101.70) 14128
LANCO INDUS 369.35 (369.90) 5167
LANCO INFRAT 1.15 (1.20) 6116098
LAURUS LABS 577.85 (581.45) 9098
MADHUCON PRO 32.05 (31.80) 16190
MIC ELECTRON 8.15 (7.95) 63075
MOLD-TEK.TEC 50.90 (50.55) 4733
MOLDTK PLA 283.70 (278.90) 3876
NAGARJAGRICH 35.50 (37.05) 39261
NATCO PHARMA 960.80 (949.20) 93860
NAVA BH VENT 134 (131.75) 32209
NCC 89.95 (87.10) 329398
NCL IND 213.55 (204.65) 19947
NETTLINX 115.15 (110.35) 11586
NEULAND LAB 1388.80 (1425) 717
NIHAR INFO 16.90 (16.50) 1850
NILE 624.45 (622.05) 2640
OIL COUNTRY 45.50 (46.80) 201
PANYAM CEMEN 63.15 (63.05) 18433
PENNER IND 54.40 (54.80) 33900
PHYTOCHEM I 59.55 (60.70) 1801
PIONEER DIST 227 (220.55) 1313
PITTI LAMIN 53.60 (54.20) 2097
POKARNA 1304.15 (1285) 253
PRISM CEMENT 118.45 (118.45) 10236
PRUDENTL PHA 4.52 (4.57) 94561
RAIN INDUSTR 132.65 (129) 166652
RAJ PACKAGIN 56.75 (57.25) 2266
SAMKRG PIST 291.15 (289) 6562
SAMPRE NUTRI 45 (44.70) 6513
SATVAH. ISPA 43.15 (44) 2087
SPHERE GLOBA 54.05 (52.90) 19008
SREE RAYAL A 29.60 (29.90) 274754
STEEL EXCHAN 85.95 (89.55) 267255
SUJANA METAL 1.94 (1.82) 172101
SUJANA TOWER 4.47 (4.60) 3300
SUJANA UNIVE 1.12 (1.16) 13031
SURYALAKSH.C 107.65 (105.65) 4614
SUVEN PHARMA 167.75 (168.50) 24388
TAJ GVK HOTE 164.05 (164.95) 3425
TANLA 34.80 (35.10) 79325
TERA SOFTWAR 70 (70.05) 2995
VAMSHI RUBB 64.55 (66.15) 6239
VICEROY HOTE 19.75 (18.70) 84454
VIMTA LABS 139.75 (136.30) 3711
VISAKA IND 487.80 (488.30) 5013
VIVIMED LABS 123.10 (123.15) 124798
YBRANT DIGIT 7.01 (6.80) 96502
ZENTECH 57.50 (55.85) 84596

ఈనాడు సినిమా


ఎన్టీఆర్

'లవ్'లో పడేశాడు

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జై లవకుశ'. రాశీ ఖన్నా కథానాయిక. బాబి దర్శకత్వం వహిస్తున్నారు. కల్యాణ్‌రామ్ నిర్మాత. ఈ చిత్రంలో ఎన్టీఆర్ మూడు పాత్రల్లో కనిపించబోతున్నారు. 'జై'కి సంబంధించిన ఫస్ట్‌లుక్ ఇది వరకే విడుదలైంది. సోమవారం రాఖీ సందర్భంగా లవకుమార్ ఫస్ట్‌లుక్ ఆవిష్కరించారు. 'జై' పాత్ర మాస్ లుక్‌తో అదరగొడితే - 'లవ' లుక్ క్లాస్‌గా కనిపిస్తోంది. లవకుమార్ పాత్రని పరిచయం చేస్తూ ఓ టీజర్ సిద్ధం చేశారు. త్వరలోనే ఆ టీజర్ చూపిస్తారు. మరి మూడో పాత్ర కుశాల్ ఎలా ఉండబోతున్నాడో చూడాలి. 'జై లవకుశ' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఈ దసరాకి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

పంచ్ డైలాగ్

అమ్మాయిల్ని ఇంప్రెస్ చేస్తే పడరు... వాళ్లు ఇంప్రెస్ అయితే పడతారు!

చిత్రం: శతమానం భవతి - పంపినవారు: బిక్కునూరి రాజేశ్వర్, పొన్కల్

చిరునామా:
సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ:
cinema@eenadu.net


కాజల్

మొదటి ఫోన్... అమ్మకే

"ప్రతి ఒక్కరి జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి. ఒత్తిడికి లోనవ్వడం సహజం. అలాంటి దశలో మనచుట్టూ 'నా' అనుకొనేవాళ్లుంటే చాలా స్వాంతన దొరుకుతుంది. నా అదృష్టం కొద్దీ నా జీవితంలో అలాంటి వాళ్లని చాలా మందిని సంపాదించుకొన్నా" అంటోంది కాజల్. ఆమె నటించిన 'నేనే రాజు నేనే మంత్రి' త్వరలో విడుదల కాబోతోంది. కాజల్ మాట్లాడుతూ "పరిశ్రమలో బెస్ట్ ఫ్రెండ్స్ అంటూ ఎవరూ లేరు. కాకపోతే అందరితోనూ నేను స్నేహంగానే ఉంటా. అందరిపై నాకు మంచి అభిప్రాయమే ఉంది. అందరూ నా గురించి బాగానే ఆలోచిస్తారు. నా కుటుంబం నా బలం. నాకెలాంటి ఇబ్బంది వచ్చినా వాళ్లకే చెప్పుకొంటా. ఏదైనా సమస్య వచ్చినప్పుడు తొలి ఫోన్ అమ్మకే చేస్తా. తనతో కాస్త మాట్లాడితే మనసు తేలికైపోతుంది. 'ఓస్.. ఇది చిన్న సమస్యే కదా. ఎందుకింత భయపడిపోయా' అనిపిస్తుంది. ఆ తరవాత మళ్లీ మామూలే. ఒత్తిడికి గురైనప్పుడు ఒంటరిగా ఉండడం ఏమంత మంచిది కాదు. అందుకే అలాంటి సమయంలో ఇంటిపట్టునే ఉంటా" అంటోంది.

ఆ జాగ్రత్త తీసుకోకపోవడం వల్లే...

"సాధారణంగా యాక్షన్ సన్నివేశాల్లో నటించేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకొంటుంటా. అయినప్పటికీ 'ఆచారి అమెరికా యాత్ర' షూటింగ్‌లో చిన్న ప్రమాదం సంభవించింది. అమ్మానాన్నల్ని, కుటుంబ సభ్యుల్ని చాలా బాధపెట్టా. వాళ్లకి నా క్షమాపణలు" అన్నారు మంచు విష్ణు. ఇటీవల 'ఆచారి అమెరికా యాత్ర' షూటింగ్‌లో విష్ణు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఓ వీడియోని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. "నేను తీసుకోని ఓ చిన్న జాగ్రత్త వల్ల ప్రమాదం జరిగింది. డాక్టర్లు నాలుగు నుంచి ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోమన్నారు. చిన్న చిన్న గాయాలయ్యాయి. త్వరలోనే కోలుకొని, ఇదివరటి కంటే ఉత్సాహంగా సెట్లో అడుగుపెడతా. ప్రమాదానికి సంబంధించిన వీడియోని త్వరలో విడుదల చేస్తా. అది చూస్తే అసలేం జరిగిందన్నది అర్థమవుతుంద"న్నారు.


మంచు విష్ణు

నిఖిల్ పెళ్లి కుదిరింది



టాలీవుడ్‌కి పెళ్లి కళ రాబోతోంది. నాగచైతన్య - సమంత త్వరలోనే ఓ ఇంటి వాళ్లు కాబోతున్నారు. ఇప్పుడు యువ కథానాయకుడు నిఖిల్ పెళ్లి కూడా కుదిరింది. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు నిఖిల్. జీవితంలోనూ స్థిరపడాలన్న నిర్ణయానికి వచ్చాడు. తన పెళ్లి హైదరాబాద్‌కు చెందిన తేజస్వినితో ఫిక్స్ అయ్యింది. అక్టోబరు 24న వీరిద్దరికీ పెళ్లి చేయాలని కుటుంబ పెద్దలు నిర్ణయించుకొన్నారు. ఈనెల 24న హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరగబోతోంది. తేజస్విని ఇంజినీరింగ్ పూర్తి చేసింది. వీళ్లది పెద్దలు కుదిర్చిన వివాహమే. పెళ్లి వేడుక ఎక్కడ జరగబోతోందన్నది త్వరలో తెలుస్తుంది. నిఖిల్ నటించిన 'కేశవ' ఇటీవలే విడుదలైంది. ప్రస్తుతం చందూమొండేటి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు.

కృష్ణంరాజుకు పురస్కారం



ప్రముఖ నటుడు కృష్ణంరాజు యువకళావాహిని జీవన సాఫల్య పురస్కారం అందుకోబోతున్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందించనున్నట్టు సంస్థ అధ్యక్షులు వై.కె.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే కార్యక్రమంలో సినీ ప్రముఖులు మణిశర్మ, రామజోగయ్య శాస్త్రి, బుర్రా సాయిమాధవ్, సాయిచంద్‌లను ఈ సంస్థ సన్మానించనుంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, జస్టిస్ జి. భవాని ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

"తొలి అడుగుల్లోనే నన్ను ప్రేక్షకులు కథానాయకుడిగా స్వీకరించారు. ఆ తర్వాత పరాజయాలు వచ్చాయి. కథల ఎంపికలోనే పొరపాట్లు జరుగుతున్నాయనే విషయం అర్థమయ్యేది. వాటిని సరిదిద్దుకొన్నాక మళ్లీ విజయాలొచ్చాయి. ఇప్పుడు విజయాల్ని నిలబెట్టుకోవడమే నా ముందున్న లక్ష్యం" అంటున్నాడు నితిన్. 'అఆ'తో తన స్థాయిని పెంచుకొన్న ఆయన ఈ నెల 11న 'లై'తో సందడి చేయబోతున్నారు. ఈ సందర్భంగా నితిన్ 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విషయాలివీ...



పవన్ మాట్లాడతారు... నేను వింటుంటానంతే!

లై అంటే అబద్ధం కదా, మరి మీరు అబద్ధాలు ఎప్పుడు చెబుతుంటారు?

అందరిలాగే అవసరం వచ్చినప్పుడు ఓ అబద్ధం చెబుతుంటా (నవ్వుతూ). చిన్నప్పుడు కళాశాలకి వెళతానని చెప్పి సినిమాకి వెళ్లడం, పరీక్షల మార్కులు వచ్చాయా అని అడిగితే ఇంకా రాలేదని చెప్పడం బాగా అలవాటైన అబద్ధాలు. ఆ రోజులు ఇప్పుడు గుర్తుకొస్తే నవ్వొస్తుంది.

అమ్మాయిలు అబద్ధాలకే పడిపోతారని ప్రచార చిత్రంలో అన్నారు. అనుభవంతో చెబుతున్నట్టున్నారు...

అనుభవం అని కాదు (నవ్వుతూ). నాకు తెలిసింది చెబుతున్నా. కాకపోతే అమ్మాయిల విషయంలో మాత్రం నేనెప్పుడూ అబద్ధాలు చెప్పను. కనీసం ప్రేమ విషయంలోనైనా నిజాయతీగా ఉండాలనేది నా అభిప్రాయం.

'లై' సినిమా కూడా అబద్ధాల గురించేనా?

అబద్ధాలతో పాటు, చాలా విషయాలుంటాయి. ప్రతి నాయకుడికీ, కథానాయకుడికీ మధ్య సాగే మైండ్‌గేమ్, డ్రామా మెదడుకి పనిపెట్టేలా ఉంటుంది. అర్జున్ ఈ సినిమాకి చాలా ప్లస్సయ్యారు. అమెరికాలో 70 రోజులు చిత్రీకరణ జరుపుకొన్న సినిమా ఇది.

'లై'లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

ఎ.సత్యం అనే ఓ ఆవారా కుర్రాడిగా కనిపిస్తా. వాడుక భాషలో నా పాత్ర పేరు అసత్యం అన్నమాట. అమెరికా వెళ్లి బాగా డబ్బున్న అమ్మాయిని పెళ్లి చేసుకొని, అక్కడే స్థిరపడాలనేది అతని ప్రణాళిక.

'అఆ' తర్వాత 'లై' కథనే ఎంచుకోవాలని ఎందుకనిపించింది?

నాకైతే 'అఆ' తర్వాత ఒక ఆర్నెళ్లపాటు అంతా గందరగోళంగా అనిపించింది. అప్పుడు త్రివిక్రమ్‌గారి దగ్గరికి వెళ్లి, 'హిట్టిచ్చారు కానీ... ఇప్పుడు ఎలాంటి సినిమా చేయాలో తేల్చుకోలేకపోతున్నా' అని చెప్పా. "'ఇష్క్' నుంచి సున్నితమైన కథల్లోనే నటిస్తున్నావు కదా... ఈసారి మాత్రం అలాంటి సినిమా చేయొద్దు, అదే ముద్ర పడిపోయే ప్రమాదం ఉంటుంద"ని చెప్పారు. అప్పుడు నాకు స్పష్టత వచ్చింది. ఆ వెంటనే హను రాఘవపూడి 'లై' కథ చెప్పాడు. అర్ధగంటపాటు కథ వినగానే సినిమా చేయాలని నిర్ణయించుకొన్నా.

ఈ సినిమా కోసం గుబురు గెడ్డంతో కనిపిస్తున్నారు?

నా సినీ జీవితంలో హలా గెడ్డం పెంచడం ఇదే తొలిసారి. సినిమాలో మూడు రకాలుగా కనిపించాల్సి ఉంటుంది. పొడవాటి గెడ్డంతో మొదట్లో ఇబ్బందిగా అనిపించేది. తెరపై ఆ అవతారం ప్రత్యేకంగా కనిపిస్తుంది.

సున్నితమైన కథలు, యాక్షన్ కథలు... నటుడిగా ఈ రెండింటి మధ్య ఎలాంటి వ్యత్యాసం చూశారు?

యాక్షన్ కథల్లో నటించడం నాకు కొత్త కాదు. కానీ ఇది మాత్రం నాకు తగిన యాక్షన్ కథ. కొడితే ఆరేడు మంది ఎగిరిపడిపోయేలా కాకుండా, చాలా సహజంగా ఉంటుంది. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం బ్యాంకాక్‌కి వెళ్లి రెండు వారాలు శిక్షణ తీసుకొన్నా. కెచ్చా మాస్టర్ తీర్చిదిద్దిన యాక్షన్ ఘట్టాలతో నా బాడీ లాంగ్వేజ్ కూడా మారిపోయింది.

'తమ్ముడు'లో రైల్వే కూలీ వేషంలో ఉన్న పవన్

> "పార్టీలకి వెళుతుంటా. అంతే తప్ప ఎప్పుడూ పార్టీలే లోకం అనుకోను. పరాజయాలు ఎదురైనప్పుడే నటులు వ్యసనాలకి బానిసలవుతారనేది నేను నమ్మను. నాకు వరుసగా పరాజయాలు ఎదురవుతున్నప్పుడు ఇంకా కసితో పనిచేసే వాణ్ని. 8 పలకల దేహాన్ని తీర్చిదిద్దుకున్నా, ఫ్లోర్లన్నీ ఊడ్చి ఊడ్చి డ్యాన్సులు చేశా".

కల్యాణ్‌ని పోలినట్టుగా మీరు ప్రచార చిత్రంలో కనిస్తున్నారు. అభిమానుల్ని అలరించడానికేనా?

పవన్‌కల్యాణ్‌పై నాకున్న ప్రేమని అలా ప్రదర్శిస్తుంటా. నా ప్రతి సినిమాలోనూ ఎక్కడో ఒక చోట పవన్ కల్యాణ్‌ని గుర్తు చేసుకోవల్సిందే. 'లై'లోని ఓ పాటలో పవన్ కల్యాణ్‌లా కూలీ గెటప్పులో కనిపిస్తా.

పవన్ కల్యాణ్ 'జానీ' పరాజయాన్ని చవిచూసిందని మీరు కన్నీళ్లు పెట్టుకొన్నట్టు పాటల వేడుకలో సుకుమార్ చెప్పారు. పవన్‌కల్యాణ్‌ని కలిసినప్పుడు ఇలాంటి విషయాల్ని మీరు చెబుతుంటారా?

పవన్‌కల్యాణ్‌ని కలిసినప్పుడు నేను పెద్దగా మాట్లాడను. ఆయన మాట్లాడుతుంటారు, నేను వింటుంటానంతే. ఎప్పుడైనా కలిసినప్పుడు 'ఈ లుక్‌లో బాగున్నావు, సినిమా కోసమేనా?' అని అడుగుతుంటారంతే.

ఒకప్పుడు వరుస పరాజయాలు, ఇప్పుడు విజయాలు. ఈ రెండు అనుభవాలు ఒక నటుడిగా మీపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుంటాయి?

విజయాల్లో ఉన్నప్పుడే ఎక్కువ భయాలుంటాయి. పరాజయాలు ఎదురవుతున్నప్పుడు చేస్తున్న సినిమా ఎలాగోలా గట్టెక్కితే చాలనే ధోరణిలో ఆలోచిస్తుంటాం. అదే విజయం తర్వాతైతే 'విజయాన్ని నిటబెట్టుకోవాలి, గత సినిమా స్థాయికి తగ్గకూడదు...' అంటూ ప్రత్యేకంగా కొన్ని భయాల మధ్య పనిచేయాల్సి ఉంటుంది.

కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా ఎలా ఉండబోతోంది?

అదొక ప్రేమకథా చిత్రం. అది నా 25వ సినిమా. పవన్‌గారు నిర్మిస్తున్న మొదటి సినిమా. ఒక అభిమానికి అంతకంటే సంతోషమైన విషయం ఏముంటుంది?

"ఎవరో ఒకరు కొత్తదారిలో అడుగులు వేయాలి. అప్పుడే మంచి పాత్రలు చూసే అవకాశం దక్కుతుంది. ఎవరూ చేయట్లేదు కదా, మనమెందుకు చేయాలి? అనుకొంటే రొటీన్ సినిమాలే వస్తాయం"టున్నారు జగపతిబాబు. కథని మలుపుతిప్పే కీలకమైన పాత్రల్లో జగపతిబాబు హవా కొనసాగుతోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన 'జయ జానకి నాయక'లోనూ ప్రముఖ పాత్ర పోషించారాయన. ఈనెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సోమవారం జగపతిబాబు హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.

అవును... బాలీవుడ్‌కి వెళ్తున్నా!



"లెజెండ్‌తో నా కెరీర్‌ని మలుపు తిప్పాడు బోయపాటి శ్రీను. మరోసారి అంత ప్రాధాన్యం ఉన్న పాత్ర ఇచ్చారు. ప్రతి సినిమా లెజెండ్ కాదు. అయితే.. 'జయ జానకి నాయక' కూడా గొప్ప సినిమా అవుతుంది. 'లెజెండ్'లో ఈగో ఉన్న పాత్ర నాది. ఇందులో పరువు కోసం ప్రాణాలిచ్చే వ్యక్తిగా కనిపిస్తా. ప్రతినాయకుడా, కాదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే"

- "కొత్త కథానాయకుడా? స్టార్ హీరోనా అని ఆలోచించను. కథానాయకుడి తరవాత నా పాత్రకు ప్రాధాన్యం ఉంటే చాలు. నిడివి ఎంత అనేది కూడా సమస్య కాదు. ఎంత శక్తిమంతంగా నా పాత్ర తీర్చిదిద్దారు అనేదే ముఖ్యం. ఈ సినిమాతో సాయి శ్రీనివాస్ తప్పకుండా స్టార్ అవుతాడు. బోయపాటి శ్రీను ఓ హెడ్ మాస్టారు. ఆయన ప్రతి సన్నివేశాన్నీ చేసి చూపిస్తారు. ప్రతీ పాత్ర కొత్తగా ఉండాలని తపిస్తారు. అందుకే మా పని సులభం అవుతుంది"
- "ప్లానింగ్ అనేది పెద్దగా నమ్మను. ఏం జరగాలో అదే జరుగుతుంది. మన శక్తిమేర పనిచేయాలంతే. నాకు అమితాబ్‌బచ్చన్ ఆదర్శం. క్లిష్టపరిస్థితుల మధ్య ఎదిగారు. 'నీ గొంతు బాలేదు. హీరోగా పనిచేయవు' అని ఎగతాళి చేసిన చోటే స్టార్‌గా మారారు. మొదట్లో నన్నూ అలానే అనేవారు. ఇప్పుడు ఆ గొంతే ప్లస్ అయ్యింది"
- "ఓ చోట కుదురుగా ఉండడం నాకు ఇష్టం ఉండదు. 24 గంటలూ ఏదో ఓ పనిచేయాల్సిందే. అందుకే తెలుగు సినిమాలే కాదు, తమిళం, మలయాళ చిత్రాల్లోనూ నటిస్తున్నా. బాలీవుడ్ నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. త్వరలో ఓ సినిమా చేస్తున్నా. ఆ వివరాలు నేనే ప్రకటిస్తా. అఖిల్ సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నా. నా కెరీర్‌లో అదో మర్చిపోలేని పాత్ర అవుతుంది"
- "'పటేల్ సార్' నిరాశ పరిచింది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకొన్నా. మావైపు నుంచి కూడా కొన్ని తప్పులు జరిగాయి. టైటిల్ చూసి థ్రిల్లర్, హారర్ అనుకొన్నారు. తీరా చూస్తే అదో కుటుంబ కథా చిత్రం. ప్రేక్షకులు బిరియానీ కోసం వస్తే భోజనం పెట్టాం. అందుకే అంచనాలు తారుమారు అయ్యాయి"

ఉత్కంఠభరితంగా...


మనీష్‌బాబు, తేజస్విని

మనీష్‌బాబు, తేజస్విని నాయకానాయికలుగా నటించిన చిత్రం 'ప్రతిక్షణం'. నాగేంద్రప్రసాద్ దర్శకుడు. జి. మల్లికార్జునరెడ్డి నిర్మాత. రఘురాం స్వరకర్త. ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథి రాజ్‌కందుకూరి మాట్లాడుతూ "ప్రచార చిత్రాన్ని చూస్తే 'ప్రతిక్షణం' ఉత్కంఠతో సాగే చిత్రమని అర్థమవుతోంది. పాటలూ బాగున్నాయ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "నూటికి నూరు పాళ్లు టైటిల్‌కి న్యాయం చేసే హారర్ చిత్రమిది. ప్రేమ, వినోదం మేళవించామ"న్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ "పాటలు, ప్రచారచిత్రం చూడగానే ఓ పెద్ద సినిమా చూస్తున్నామా అనే భ్రమ కలిగింది. ప్రేక్షకులు కచ్చితంగా ఉత్కంఠకి లోనవుతార"న్నారు. సాయి వెంకట్, అమృతరావు, పద్మిని, రఘురాం, శివ వై. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాకూ ఓ మనసుంది


తనిష్క

సుజయ్, తనిష్క, చంద్రకాంత్, రష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'నాకూ మనసున్నది'. దేవ శంకర్ గౌడ్ నిర్మాత. రాజశేఖర్ దర్శకుడు. ఉదయకిరణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. తొలి సీడీని భానుచందర్ విడుదల చేశారు. "కాన్సెప్ట్ బాగుంది. పాటలూ ఆకట్టుకొన్నాయి. నిర్మాణ విలువలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రం విజయవంతమవ్వాల"ని అతిథులు ఆకాంక్షించారు. "విభిన్నమైన ఆలోచనలతో సాగే చిత్రమిది. ఓ దెయ్యం మనిషిని ప్రేమిస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్నామ"న్నారు దర్శకుడు. భానుచందర్, కవిత, రామకృష్ణ గౌడ్, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కీలక పదవి తప్ప అన్నీ నిర్వహించా

- కష్టపడటం వల్లే నాకు అవకాశాలు వచ్చాయి
- యువత ప్రవర్తన సకారాత్మకంగా ఉండాలి
- మనమంతా మహిళలపై ఆధారపడినవారమే
- తిరుపతి, నెల్లూరు పర్యటనల్లో వెంకయ్యనాయుడు
- వీఆర్‌సీ కళాశాల ఆవరణలో ఘన సత్కారం




శ్రీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో వెంకయ్యనాయుడు ★ నెల్లూరులోని వీఆర్‌సీ కళాశాల ఆవరణలో జరిగిన ఆత్మీయ సత్కారంలో వెంకయ్యనాయుడికి ఆయన చిత్రపటం బహూకరిస్తున్న రాష్ట్ర మంత్రులు నారాయణ, సోమిరెడ్డి, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, వైకాపా, భాజపా నేతలు, వివిధ సంస్థలు, సంఘాల నాయకులు

ఈనాడు–తిరుపతి, తిరుమల–న్యూస్‌టుడే, ఈనాడు–నెల్లూరు: దేశంలో కీలకమైన ఒక పదవి తప్ప అన్ని పదవులు నిర్వహించానని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆ పదవులన్నీ వాటంతటవే తన దగ్గరకు వచ్చాయన్నారు. దీనంతటికీ కేవలం కష్టపడటమే కారణమన్నారు. "ఉన్నంతకాలం ప్రజల్లో ఉంటే చాలనుకున్నాను. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా వెళ్తున్నా. తర్వాత నేను ఇలా స్వేచ్ఛగా రావడం.. ఇంతమంది యువతను కలవడం తక్కువగా ఉండొచ్చు. అయినా రాజ్యాంగబద్ధమైన పదవిని రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంగా నిర్వహిస్తా... యువతకు నేను చెప్పేదొక్కటే మీరు ఈ దేశపు ఆస్తి. మీ ప్రవర్తన సకారాత్మకంగా ఉండాలి. లక్ష్యం ఉన్నతంగా ఉండాలి. అప్పుడే దేశం ముందుకెళ్తుంది"అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన సోమవారం తిరుపతిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం సొంత జిల్లా నెల్లూరులో పర్యటించారు. మొదటి అధికారిక కార్యక్రమంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థుల నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. తర్వాత 300 పడకల ప్రసూతి ఆస్పత్రిని ప్రారంభించారు. మెడికల్ కళాశాల విదార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. "స్త్రీని గౌరవించడం, వారికి సమున్నత స్థానం కల్పించడమే ఈ దేశ గొప్పదనం. మొదట వారికి అవకాశమిస్తే కదా.. వారి సత్తా ఏంటో తెలిసేది. మనమంతా మహిళలపై ఆధారపడిన వాళ్లమే"నని పేర్కొన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వ వైద్యశాలల్లోనే చికిత్స పొందాలన్నారు. దీనివల్ల ప్రజల్లో ఆస్పత్రులపై నమ్మకం పెరుగుతుందని, ప్రతి ప్రభుత్వ కళాశాల, ఆస్పత్రులు స్విమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి అని వెంకయ్యనాయుడు సూచించారు.

వెంకయ్యకు రాఖీ కట్టిన అమెరికా మహిళ

వెంకయ్యనాయుడు స్విమ్స్ విద్యార్థులవసతిగృహం ప్రారంభించి ప్రసంగించిన తర్వాత వేదిక దిగుతుండగా అక్కడే ఉన్న నర్సింగ్ అసిస్టెంట్ చార్లెస్ సుసిన్ రాబర్ట్ అనే అమెరికన్ మహిళ వెంకయ్య దగ్గరకు వచ్చి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి ఆశీస్సులతోనే ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యా

సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన తనకు దేశంలో అత్యున్నతమైన, రాజ్యాంగబద్ధంగా రెండో బాధ్యతైన ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశం శ్రీవారి ఆశీస్సులతోనే వచ్చిందని, ఇది తన జీవితంలో మరచిపోలేని ఘట్టమని ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని సోమవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అంతకుముందు వెంకయ్యనాయుడుకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు అందచేసి సత్కరించారు. తిరుపతిలో కార్యక్రమాలు ముగిసిన తర్వాత ఆయన నెల్లూరుకు పయనమయ్యారు.

ఇక రాజ్యాంగ పరిధికి లోబడి వ్యవహరించాలి

"నెల్లూరు పేరు విన్నా, ఈ నేలలో అడుగుపెట్టినా ఎన్నో జ్ఞాపకాల దొంతరలు.. రాజకీయంగా ఎదుగుతున్న సమయంలో స్టోన్‌హౌస్ పేట శెట్టెమ్మ అంగడిలో పులిబొంగరాలు.. తెల్ల దోశలు రోడ్డు పక్కన నిలబడి తిన్న రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఇక మీదట కొన్ని కట్టుబాట్లు.. రాజ్యాంగ పరిధికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. నేను ఇప్పుడు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు. ఇకపై రాజకీయాల గురించి మాట్లాడే అవకాశం నాకు ఉండదు. విద్యార్థి నాయకుడిగా వీఆర్‌సీ వేదికపై నా ప్రసంగంతోనే నా రాజకీయ జీవితం ప్రారంభమైంది. అదే ప్రాంతంలో మీ నుంచి ఆత్మీయ పౌర సత్కారాన్ని అందుకుంటున్నా" అని ఎం.వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలిసారి సొంత జిల్లా నెల్లూరుకు వచ్చిన ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఆయన ఎదుగుదలకు వేదికైన వీఆర్‌సీ కళాశాల ఆవరణలోనే అపూర్వ సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగంలోని ముఖ్య విషయాలు.

ఆ క్షణాలు ఇప్పటికీ గుర్తున్నాయి

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత సొంత జిల్లాకు వచ్చిన సందర్భంగా వీధుల్లో చిన్నారులు.. పుర ప్రజలు చూపిన ఆదరణ మరువలేనిది. నెల్లూరు గడ్డలోనే ఏదో శక్తి ఉంది. అప్పట్లో నేను గడిపిన క్షణాలు ఇప్పటికీ గుర్తున్నాయి. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే. తర్వాత అంతా కలిసి పనిచేయాలన్న భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి. పార్లమెంటు.. రాజ్యసభ.. అసెంబ్లీ.. శాసనమండలిలో చర్చ కచ్చితంగా జరగాలన్నదే భావన. చర్చ తర్వాత ప్రభుత్వం దిగిరాకుంటే.. నిరసన ప్రదర్శనలు చేయాలి. చివరగా.. భవిష్యత్తులో కూడా రాష్ట్రానికి చేయదగిన సాయం అందించటానికి కృషి చేస్తాను.

ఆత్మీయ సత్కారం

ఉపరాష్ట్రపతిగా ఎన్నికపై వెంకయ్యనాయుడును పలువురు ప్రముఖులు పార్టీలకు అతీతంగా కమిటీగా ఏర్పడి సత్కరించారు. జిల్లాకు చెందిన వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికకావటం గర్వకారణంగా ఉందని పలువురు కొనియాడారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా రాయించిన తీసుకువచ్చిన సన్మానపత్రాన్ని వేదికపై చదివారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్‌పై వెంకయ్య అందరిచేత ప్రమాణం చేయించారు. అంతకుముందు 1500 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని వీధుల్లో ప్రదర్శిస్తూ.. రోడ్డు నిండా పుష్పాలను చల్లి ఘన స్వాగతం పలికారు.



సభలో ప్రసంగిస్తున్న వ్యవస్థాపక ఛాన్స్‌లర్ టి.ఆర్.పచ్చముత్తు

ఎస్.ఆర్.ఎంను ప్రపంచస్థాయి వర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

వ్యవస్థాపక ఛాన్స్‌లర్ టి.ఆర్.పచ్చముత్తు

మంగళగిరి, న్యూస్‌టుడే: శ్రీరామస్వామి మెమోరియల్ విశ్వవిద్యాలయం(ఎస్.ఆర్.ఎం.)ను ప్రపంచ స్థాయి వర్సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వ్యవస్థాపక ఛాన్స్‌లర్ టి.ఆర్.పచ్చముత్తు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో టి.ఆర్.పచ్చముత్తు మాట్లాడారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేందుకు పలు విదేశీ ఉత్తమ విశ్వవిద్యాలయాలతో తమ సంస్థ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్య నాలుగేళ్ల కాలంలో ఒక సెమిస్టరును ఆయా అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల్లో చదువుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఇక్కడ చేరిన విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి.సత్యన్నారాయణన్ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు రూపశిల్పులై ఉపాధిని కల్పించే వారిగా ఎదగాలని ఆకాంక్షించారు. సింగపూర్‌కు చెందిన నన్యాంగ్ వర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆచార్యుడు బి.వి.ఆర్.చౌదరి మాట్లాడుతూ.. సింగపూర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య పరస్పర సహాయ, సహకారాలు మరింత బలపడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే అమరావతిలోని ఎస్.ఆర్.ఎం. వర్సిటీతో అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఆర్.ఎం.వర్సిటీ ఉపకులపతి సందీప్ తివారీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం మాజీ ఛాన్స్‌లర్ నిఖోలస్ బి డిర్క్స్, అమెరికాలోని ఎం.ఐ.టి. ఆచార్యుడు ఎం.ఎస్.విజయ్‌కుమార్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ ప్రశాంత్ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

ఈసారి యాత్రికులు 2.60 లక్షలు

శ్రీనగర్: పవిత్ర హిమ లింగాన్ని దర్శించుకునే అమర్‌నాథ్ వార్షిక యాత్ర సోమవారం శ్రావణ పౌర్ణమితో ముగిసింది. ఈ సందర్భంగా గుహ వద్ద వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్ర పూర్తయిన తీరును జమ్ముకశ్మీర్ గవర్నర్, అమర్‌నాథ్ ఆలయ మండలి ఛైర్మన్ ఎన్.ఎన్.వోహ్రా అధికారులతో సమీక్షించారు. జూన్ 29 నుంచి 40 రోజుల వ్యవధిలో 2,60,003 మంది హిమ లింగాన్ని సందర్శించుకుని పూజలు చేశారని అధికారులు ఆయనకు తెలిపారు. జులై 10న అనంతనాగ్ జిల్లాలో యాత్రికుల బస్సుపై ఉగ్రవాదుల దాడి, అదే నెల 16న జరిగిన రహదారి ప్రమాదం మినహా ఈసారి యాత్ర సజావుగా పూర్తయిందని గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వేర్వేరు ఘటనల్లో 29 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. భవిష్యత్తులో ప్రాణనష్టం వాటిల్లకుండా మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రాష్ట్రానికి సమీపంలో ఆవర్తనాలు

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తర ఛత్తీస్‌గఢ్ దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సముద్రమట్టానికి 4.5 కిలో మీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తర కర్ణాటక, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. వీటికి తోడు కోస్తా, రాయలసీమ మీదుగా అల్పపీడన ద్రోణి ఉందని, వీటి కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. రానున్న 4 రోజులు చాలా చోట్ల వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అద్దంకిలో 7 సెం.మీ, జంగమహేశ్వరపురంలో 6, వెంకటగిరి, ఇచ్ఛాపురం, తాడేపల్లిగూడెం, కోడూరు, చిన్నమండెంలో 5 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

దిల్లీలో 'జన్మభూమి-మాఊరు'కు విశేష స్పందన

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యల పరిష్కారానికి దేశ రాజధాని దిల్లీలో ప్రారంభించిన 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సోమవారం సాయంత్రం ఐదింటికి ప్రజావాణి ప్రారంభించిన రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తనకు ఉపాధి కల్పించాలని దిల్లీలో నివసిస్తున్న కృష్ణా జిల్లా పెడెనకు చెందిన బట్టు శ్యామలకుమారి కోరారు. సుప్రీం కోర్టులో తమకు అనుకూలంగా వైద్య ఆరోగ్యశాఖ లేఖ ఇచ్చేలా అధికారులతో మాట్లాడాలని కడప ఫాతిమా కళాశాల విద్యార్థులు కోరారు. దేశ రాజధానిలో నివసిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని వారివారి స్వగ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి 'జన్మభూమి-మాఊరు' ప్రారంభించామని రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామని, ప్రతి సోమవారం సాయంత్రం నేరుగా తనను కూడా కలుసుకోవచ్చని వివరించారు.

విద్యార్థులకు విడుదలకాని రవాణా ఛార్జీలు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని పాటిస్తూ బడులను మూసేస్తున్న ప్రభుత్వం విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు చెల్లించాల్సిన రవాణా ఛార్జీలను మాత్రం ఇవ్వడం లేదు. పాఠశాలలను విలీనం చేస్తున్న సమయంలో రవాణా ఛార్జీల చెల్లింపునకు ప్రతిపాదనలు పెడుతున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో మారుమూల పల్లెలకు చెందిన పిల్లల తల్లిదండ్రులకు విద్యా భారం తప్పడం లేదు. ఏటా జిల్లాల నుంచి రూ.కోట్లలో బిల్లులు వస్తుండగా మొక్కుబడిగా నిధులు విదిల్చి చేతులు దులిపేసుకుంటున్నారు. హేతుబద్ధీకరణ పేరుతో బడుల విలీనంపై దృష్టిపెడుతున్న ఉన్నతాధికారులు ఆ తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఇలా చేయాలి..: విద్యా హక్కు చట్టం ప్రకారం కిలోమీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాల ఉండాలి. మూడు కిలోమీటర్లలోపు ప్రాథమికోన్నత, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల ఉండాలి. అలా లేని పక్షంలో దూరంగా వెళ్లి చదువుకునే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లించాలి. సర్వశిక్ష అభియాన్ నుంచి నిధులు విడుదల చేయాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. ఏటా బకాయిలు పేరుకుపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ.300 చెల్లించాలి. ప్రభుత్వ పాఠశాలలు 10 నెలలు కొనసాగుతాయని అనుకుంటే ఈ లెక్కన రూ.3 వేలు చెల్లించాలి. ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. ఉపాధ్యాయులు పంపుతున్న బిల్లులకు విడుదలవుతున్న నిధులకు పొంతన ఉండడం లేదు. వస్తున్న నిధుల్లోనూ జాప్యం చోటుచేసుకుంటోంది.

పేరుకుపోతున్న బకాయిలు..

- ★ నెల్లూరు జిల్లాలోని హృదయగిరి బీసీకాలనీ పాఠశాలలో సుమారు 200 మంది వరకు పిల్లలున్నారు. ఇక్కడికి ఎక్కువగా చుట్టుపక్కల నుంచి విద్యార్థులు వస్తారు. ఈ పాఠశాల విద్యార్థులకు 2013-14 తర్వాత నుంచి రవాణా ఛార్జీల చెల్లింపు జరగడం లేదు.
- ★ గుంటూరు మండలంలోని అలపర్రుఆగ్రహారం, మహ్మద్‌అలీపాలెంలలో 2015-2016 వరకు చెల్లించిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. గతేడాదితోపాటు ఈ ఏడాదీ బకాయిలు చెల్లించాల్సి ఉంది. అప్పుడప్పుడు ఉన్నతాధికారులు ఎంతోకొంత మంజూరు చేస్తున్నారు. దీంతో వచ్చిన వాటినే అందరికీ సర్దుబాటు చేస్తున్నారు. సరైన విధానమంటూ ఉండడం లేదు. ప్రభుత్వ బడులకు వచ్చేవారిలో ఎక్కువగా పేద, నిరుపేద పిల్లలే ఉంటారు. ఇలాంటి వారికి బడులు అందుబాటులో లేకపోగా.. రవాణాఛార్జీలు సైతం ఇవ్వకపోతే బడి మానేసే అవకాశాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

అంకెల్లో వాడుకోగలరు..

- ★ రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జీలు పొందాల్సిన విద్యార్థులు 71,403 మంది.
- ★ కేంద్రం రవాణా ఛార్జీల కింద అనుమతి ఇచ్చిన మొత్తం రూ.22 కోట్లు.
- ★ మొదటి విడత కింద విడుదల చేసిన మొత్తం రూ.2.20 కోట్లు.
- ★ రూ.10 లక్షలు చొప్పున.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలకు చెల్లింపులు.
- ★ రూ.20 లక్షలు చొప్పున కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూరుగోదావరి, ప్రకాశం జిల్లాలకు చెల్లింపులు.
- ★ 2015లో హేతుబద్ధీకరణలో విలీనమైన పాఠశాలలు 1436.
- ★ 2017లో విలీనమైన బడులు 1125.

ఆద్యంతం ఉత్కంఠ.. ఆనక ఊరట

- నంద్యాలలో నామినేషన్ల పరిశీలన పూర్తి
- తెదేపా-వైకాపా పరస్పర ఫిర్యాదులు
- ఇద్దరి నామినేషన్లు సక్రమమేనని తేల్చిన ఎన్నికల సంఘం

కర్నూలు, నంద్యాల పట్టణం: కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నికల్లో సోమవారం రసవత్తర ఘట్టాలు చోటుచేసుకున్నాయి. తెదేపా, వైకాపా అభ్యర్థుల నామినేషన్లపై పలు అభ్యంతరాలు రావడంతో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. ప్రత్యర్థి అభ్యర్థుల నామినేషన్లు చెల్లవంటూ తెదేపా-వైకాపా పరస్పరం ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసుకున్నాయి. దీంతో ఉపఎన్నిక నామినేషన్ల పరిశీలన సందర్భంగా నంద్యాలలో అనుక్షణం వాడీవేడి చర్చలు జరిగాయి. వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు రవిచంద్రకిషోర్‌రెడ్డి నామినేషన్లు చెల్లబోవంటూ తెదేపా తరఫు న్యాయవాదులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. నామినేషన్లతోపాటు సమర్పించే అఫిడవిట్లలో ఫారం-26కు అవసరమైన స్టాంపు వేశారు కానీ.. రెండో అదనపు అఫిడవిట్‌కు స్టాంపు వేయలేదనేది తొలి ఫిర్యాదు. నామినేషన్‌కు జత చేసిన పబ్లిక్ నోటరీకి సంబంధించి సంతకం చేసిన న్యాయవాది రాంతులసీరెడ్డి నోటరీ లైసెన్సు 2013 డిసెంబరుతో కాలపరిమితి ముగిసిందని రెండో ఫిర్యాదు. దాన్ని నవీకరించనందున (రెన్యువల్) నోటరీపై రాంతులసీరెడ్డి సంతకం చెల్లదంటూ వాదనను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినిపించారు. మరోవైపు తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఆదాయపు పన్ను వివరాలు పూర్తిగా జత చేయలేదంటూ వైకాపా తరఫు న్యాయవాదులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రెండు వర్గాల ఫిర్యాదులను స్వీకరించిన ఎన్నికల సంఘం అధికారులు రెండు గంటలపాటు ఇరుపక్షాల నామినేషన్లను పక్కన పెట్టారు. మిగిలిన నామినేషన్ల పరిశీలన పూర్తయ్యాక తెదేపా, వైకాపా ఫిర్యాదులపై న్యాయ సలహా తీసుకున్నారు. కొత్తగా వచ్చిన ఎన్నికల నిబంధనల ప్రకారం రెండు అఫిడవిట్లు అవసరం లేదని, శిల్పా మోహన్‌రెడ్డి తన నామినేషన్‌తో పాటు ఇచ్చిన రెండో అఫిడవిట్‌ను మొదటి అఫిడవిట్‌లో భాగంగా పరిగణిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. నోటరీ చేసిన రాంతులసీరెడ్డి లైసెన్సు నవీకరణ కోసం 2016లో దరఖాస్తు చేసుకున్నారని, అనుమతి రాకపోయినా తిరస్కరించనందున నోటరీగానే పరిగణించి వైకాపా అభ్యర్థి నామినేషన్‌ను ఆమోదిస్తున్నామని తెలిపారు. తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి చెల్లించే ఆదాయపు పన్ను వివరాలు పూర్తిగా జత చేయలేదన్న వైకాపా అభ్యంతరాలు బలంగా లేవంటూ ఆయన నామినేషన్‌ను ఆమోదించారు. ఇద్దరి నామినేషన్లు సక్రమమేనని చివరికి ఎన్నికల సంఘం తేల్చిచెప్పడంతో ఉత్కంఠకు తెరపడింది. తెదేపా తరఫున న్యాయవాదులు రామచంద్రరావు, మనోహర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి వాదనలు వినిపించారు. వైకాపా తరఫున తులసీరెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, విజయ్‌శేఖర్‌రెడ్డి వాదించారు.

నిబంధనలను వివరించాం

ఎన్నికల సంఘం నిబంధనలను తెలుపుతూ వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్‌లో నిబంధనలు పాటించని విషయాన్ని రిటర్నింగ్ అధికారికి వివరించాం. అఫిడవిట్‌తోపాటు అదనపు అఫిడవిట్లు శిల్పా మోహన్‌రెడ్డి ఇచ్చారు. అందులో ఒకదానిపై నాన్ జ్యుడీషియల్ స్టాంపు లేదు. నోటరీ చేసిన న్యాయవాదికి 2013లోనే నోటరీ కాలం పూర్తయింది. 2016లో న్యాయవాది తన నోటరీ కోసం నవీకరణ దరఖాస్తు చేసుకోవడంతో అనుమతి రాకున్నా తిరస్కరించలేదన్న కోణంలో నామపత్రం సక్రమమేనని రిటర్నింగ్ అధికారి చెప్పారు. ఇది అంత సమంజసం కాదనేది మా అభిప్రాయం.

– వెదుర్ల రామచంద్రరావు, తెదేపా తరఫు న్యాయవాది

నిబంధనలు పాటించాం..

శిల్పా మోహన్‌రెడ్డి తన నామినేషన్‌లో అన్ని నిబంధనల మేరకే వ్యవహరించారు. చిన్నచిన్న తప్పులు పరిగణనలోకి తీసుకోవద్దనేది ఎన్నికల సంఘం నిబంధనలలోనే ఉంది. ఈ అంశాలను రెండు పార్టీలకు వివరించి నామపత్రాలు సక్రమమేనని రిటర్నింగ్ అధికారి తేల్చారు.

– తులసీరెడ్డి, వైకాపా తరఫు న్యాయవాది

ఏడు కంపెనీల బలగాల్ని కోరాం: భన్వర్‌లాల్

ఈనాడు–అమరావతి: నంద్యాలకు ఏడు కంపెనీల కేంద్ర పారామిలటరీ బలగాల్ని పంపమని కోరామని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతోపాటు రాష్ట్రానికి చెందిన ఏపీఎస్పీ బలగాల్ని మాత్రమే బందోబస్తుకు ఉంచనున్నామన్నారు.

రొయ్య రైతులకు మొండిచేయి..!



- ఇన్‌లాండ్ హేచరీల అనుమతులకు మీనమేషాలు
- కేంద్ర కమిటీలు ధ్రువీకరించినా దృష్టిపెట్టని మత్స్యశాఖ

యలమంచిలి – న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఉభయగోదావరి, విశాఖపట్నం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో విస్తరించిన చేపలచెరువుల రూపేణా రాష్ట్రానికి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. అభివృద్ధి పరంగా ఆక్వారంగం దూసుకెళ్తున్నా సాగుకు కీలకమైన నాణ్యమైన రొయ్యపిల్లలను పొందలేక రైతులు నష్టాలపాలవుతున్నారు. రొయ్యపిల్లలను వృద్ధిచేసి.. విక్రయించే హేచరీలు పుట్టగొడుగుల్లా పెరిగిపోవడం, నాణ్యతకు నీళ్లు వదలడం వల్ల సరైన సీడ్ లభించక అనతికాలంలోనే సాగును ముగించాల్సిన దుస్థితిని తరచూ ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో కొందరు ఆక్వారైతులు సొంత హేచరీలను(ఇన్‌లాండ్ హేచరీలు) నిర్మించుకుని, నాణ్యమైన రొయ్యపిల్లలను తామే వృద్ధిచేసుకుని, స్వీయ అవసరాలకుపోను మిగిలినదంతా సహచర రైతులకు అందించాలని సంకల్పించారు. నిబంధనల మేరకు నిర్మించినా ఈ హేచరీల నుంచి సీడ్ ఉత్పత్తికి అనుమతులు లభించటం లేదు. ఇలాంటివి గోదావరి జిల్లాల్లో 11 వరకు ఉన్నాయి. వీటన్నిటినీ ఏడాది కిందట కేంద్ర కమిటీ తనిఖీ చేసి సీడ్ ఉత్పత్తికి తలూపినా రాష్ట్రస్థాయిలో మాత్రం అనుమతులు ఇవ్వకపోవడం విచిత్రం.

రూ.65 వేల కోట్లు	–	ఆక్వారంగం ద్వారా రాష్ట్రానికి లభిస్తున్న ఆదాయం
7 లక్షల ఎకరాలు	–	రాష్ట్రంలో విస్తరించిన ఆక్వాచెరువులు
10 లక్షల మంది	–	రాష్ట్రవ్యాప్తంగా ఆక్వాపై ఆధారపడిన రైతులు, కూలీలు
380	–	రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హేచరీలు
160	–	అనుమతులు లేనివి (సుమారు)

ముడుపులతోనే జాప్యం..

ప్రైవేటు హేచరీల యాజమాన్యాలు మత్స్యశాఖ అధికారులకు ముడుపులు ముట్టజెప్పడం వల్లే ఇన్‌లాండ్ హేచరీలకు అనుమతులు ఇవ్వడం లేదని ఆక్వారైతులు ఆరోపిస్తున్నారు. కేంద్ర కమిటీ పరిశీలించాక కూడా అనుమతులకు కాలయాపన ఎందుకని, ఒక్కో హేచరీ నిర్మాణానికి రూ.4కోట్లు వంతున వెచ్చించినా ప్రభుత్వ సహకారం కరవైందని వారు వాపోతున్నారు.

సొంత హేచరీలతో ప్రయోజనాలు..

- రైతుకు అవసరమైన, నాణ్యమైన రొయ్యపిల్లలనే ఉత్పత్తి చేసుకోవచ్చు. మిగిలినదంతా తోటి రైతులకు పంపిణీ చేయొచ్చు. దీనివల్ల కాలుష్యం తగ్గుతుంది.
- వ్యయప్రయాసలను నియంత్రించుకోవచ్చు. ఉదాహరణకు పశ్చిమగోదావరి జిల్లా రైతులు కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాల నుంచి సీడ్ తేవడం వల్ల అధిక ధర పెట్టాల్సివస్తోంది. రవాణాలో కొన్ని రొయ్యపిల్లలు చనిపోతున్నాయి.

కమిటీలన్నీ నిర్ధరించాయి

దిల్లీ కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీచేసి ఇన్‌లాండ్ హేచరీలు బాగానే ఉన్నట్లు నిర్ధరించింది. సంబంధిత దస్త్రం రాష్ట్రస్థాయి అధికారుల దగ్గరకు వెళ్లింది. అక్కడి నుంచి అనుమతులు రావాలి.

– డా॥ ఎస్.అంజలి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు, ఏలూరు

ఆక్వా చట్టం రావాలి



రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం ఆక్వా చట్టాన్ని తేవాలి. చక్కని ఆదాయం వస్తున్నా రాష్ట్రప్రభుత్వం ఆక్వాలో ఆ స్థాయి సంస్కరణలు తేవడం లేదు. ఇన్‌లాండ్ హేచరీలకు అత్యవసరంగా అనుమతులివ్వాలి.

– లకంసాని సుబ్బాజి, అమలాపురం, తూర్పుగోదావరి

పెట్టుబడులు పెట్టి ఖాళీగా..



రూ. కోట్లు పెట్టి ఇన్‌లాండ్ హేచరీలను నిర్మించాం. కేంద్ర కమిటీ వచ్చి తనిఖీలు చేసి ధ్రువీకరించినా రాష్ట్రస్థాయి కమిటీ పట్టించుకోవడం లేదు. మత్స్యశాఖ మంత్రికీ సమస్యను విన్నవించాం.

– రుద్రరాజు పెదవర్మ, ఆక్వా రైతు, చించినాడ, పశ్చిమగోదావరి

సుఖీభవ

పాక్షిక మోకీలు మార్పిడి

ఒంట్లో ఎక్కడ నొప్పి తలెత్తినా ఇబ్బందే. ఇక మనం లేచి నిలబడటానికి, కాళ్లు ముడుచుకొని కూచోవటానికి.. అటూఇటూ తేలికగా తిరగటానికి తోడ్పడే మోకీళ్లలో నొప్పి మొదలైతే? పట్టుమని నాలుగడుగులు కూడా వేయలేక చతికిల పడిపోతుంటే? మందులు వేసుకుంటున్నా ఏమాత్రం నొప్పి తగ్గకపోతుంటే? అంతకన్నా నరకం మరొకటి ఉండదు. ప్రస్తుతం ఎంతోమంది వృద్ధులు ఇలాంటి బాధనే అనుభవిస్తున్నారు. మలివయసు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఈ నొప్పుల నుంచి బయటపడేయటానికి అందుబాటులోకి వచ్చిన వరదాయిని మొత్తం మోకీలు (టోటల్ నీ) మార్పిడి! మోకీళ్లలోని మృదులాస్థి దెబ్బతిని, తీవ్రమైన నొప్పులతో తెగ సతమతమయ్యేవారికిది శాశ్వత పరిష్కారాన్నీ అందిస్తోంది. అయితే ఇందులో దెబ్బతిన్న భాగాన్నే కాదు, ఆరోగ్యంగా ఉన్న ఇతర భాగాన్నీ తొలగిస్తుండటమే పెద్ద చిక్కు. అలాగే కండరబంధనాలనూ తీసేస్తుండటంతో కదలికలూ పరిమితమైపోతున్నాయి. అందువల్ల మృదులాస్థి కొంతవరకే దెబ్బతిన్నవారికి పూర్తి మోకీలు మార్పిడి అవసరమా? అన్న సందేహం తలెత్తుతోంది. దీనికి పరిష్కారం చూపటానికి ముందుకొచ్చిందే పాక్షిక మోకీలు (పార్షియల్ నీ) మార్పిడి. మోకీలులో ఆరోగ్యంగా ఉన్న భాగాన్ని, కండర బంధానాలను ముట్టుకోకుండా.. దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే తొలగించి.. దాని స్థానంలో కృత్రిమ పరికరాన్ని అమర్చటం దీని ప్రత్యేకత. పూర్తి మోకీలు మార్పిడితో సమానమైన ఫలితాలు కనబడుతుండటంతో దీనికి ఇటీవలి కాలంలో ప్రాచుర్యమూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పాక్షిక మోకీలు మార్పిడిపై సమగ్ర కథనం ఈ వారం మీకోసం.

మార్పిడి కొంతైనా మేలే!



గ్రాఫిక్: బాలు



డా॥ రమేశ్‌చంద్ర కాట్రగడ్డ
ఆర్థోపెడిక్ సర్జన్
జాయ్ హాస్పిటల్
సోమాజిగూడ
హైదరాబాద్

మోకీలు.. మన ఒంట్లో అతి సంక్లిష్టమైన కీలు. అన్ని కీళ్ల కన్నా పెద్దది, బలమైంది కూడా. అటు తుంటి ఎముకకూ ఇటు కింది కాలు ఎముకకూ మధ్య ఇరుసులా పనిచేస్తూ.. తేలికగా కదలటానికి తోడ్పడుతుంటుంది. మనం నిలబడినప్పుడు, నడుస్తున్నప్పుడు, పరుగెత్తుతున్నప్పుడు శరీర బరువును మోస్తూ, ఒత్తిడిని భరిస్తూ కూడా అతి సున్నితంగా కదలటం దీని ప్రత్యేకత. మనం హాయిగా నడవగలుగుతున్నామంటే, మోకాళ్లు ముడుచుకొని కూచుంటున్నామంటే, అలవోకగా పక్కలకు తిరుగుతున్నామంటే అంతా మోకీలు చలవే. చూడటానికి ఒకటేనని అనిపించినా.. ఇది పలు ఎముకలు, కండరాలు, మృదులాస్థి, కండర బంధనాలు, అనుసంధాన కణజాలాల సమాహారం. ఇవన్నీ కలిసికట్టుగా, చక్కటి సమన్వయంతో పనిచేస్తూ మన అవసరాలకు అనుగుణంగా ఎన్నెన్నో కదలికలకు తోడ్పడతాయి. అందుకే మోకీలులో ఏ చిన్న సమస్య తలెత్తినా జీవితం కుంటుపడినట్టే అనిపిస్తుంది. ముఖ్యంగా కీళ్లవాపులు (ఆర్థ్రయిటిస్) మొదలైతే ఆ బాధ వర్ణనాతీతం. సమస్య తీవ్రమైతే అడుగు తీసి అడుగు వేయటమే గగనమైపోతుంది. మన సమాజంలో చాలామంది వృద్ధులు దీంతో బాధపడుతున్నవారే. తీవ్రమైన నొప్పుల మూలంగా- కూచుంటే లేవలేక, లేస్తే కూచోలేక.. ఎక్కడికీ వెళ్లలేక, నలుగురితో కలవలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనంతటికీ కారణం వయసు మీద పడుతున్న కొద్దీ మోకీళ్లు అరిగిపోవటమే.

ఏమిటీ సమస్య?

ఎందుకో తెలియదు గానీ.. గత 20 ఏళ్లుగా మోకీళ్ల అరుగుదల, వాపు సమస్య రోజురోజుకీ పెరుగుతూ వస్తోంది. మనదేశంలో సుమారు 30% మంది దీని బారినపడి నలిగిపోతున్నారని అంచనా. కీళ్లు అరగటం వల్ల తలెత్తే మొదటి ఇబ్బంది నొప్పి. ముఖ్యంగా ఏదైనా పనిచేసినప్పుడు లేదా ఎక్కువసేపు కదలకుండా ఉన్నప్పుడు నొప్పి మరింత వేధిస్తుంటుంది. కీళ్లు బిగుసుకుపోవటం, వాపు, కదలికలు తగ్గటం వంటి లక్షణాలూ ఉండొచ్చు. ఇంతకీ ఇది ఎందుకొస్తుంది? మన మోకీలు ఎముకల చివర్లలో మృదులాస్థి (కార్టిలేజ్) అనే సున్నితమైన ఎముక ఉంటుంది. ఇది ఎముకలు ఒకదానికి మరోటి రుద్దుకోకుండా, అవి మృదువుగా కదలటానికి తోడ్పడుతుంటుంది. అలాగే ఎముకల మధ్య 'మినిస్కస్' అనే దళసరి 'వాషర్' లాంటి పొర కూడా ఉంటుంది. మృదులాస్థి, మినిస్కస్ పొరలు మన శరీర బరువును, కదలికల ఒత్తిడిని ఎప్పటికప్పుడు గ్రహిస్తూ.. కదలికలు సాఫీగా సాగేలా చూస్తాయి. అయితే వయసు మీద పడుతున్నకొద్దీ జుట్టు తెల్లబడటం వంటి మార్పుల మాదిరిగానే మృదులాస్థి క్షీణించటమూ మొదలవుతుంది. క్రమేపీ వాషర్ కూడా దెబ్బతింటుంది. దీంతో మోకీలు కదిలినపుడు ఎముకలు రెండూ ఒకదాంతో మరోటి రుద్దుకొని విపరీతమైన నొప్పికి దారితీస్తుంది. ఇదే ఆర్థ్రయిటిస్‌కు మూలం. ఒకసారి ఈ మృదులాస్థి క్షీణిస్తే తిరిగి సరిచేయటం దాదాపు అసాధ్యం. అందుకే దీనికి శాశ్వత పరిష్కారం చూపించే మోకీలు మార్పిడికి ప్రాధాన్యం పెరుగుతోంది.




మార్పిడి ఒక్కటే మార్గమా?

మోకీళ్లు బాగా అరిగిపోయి, తీవ్రమైన నొప్పులతో బాధపడేవారికి మోకీలు మార్పిడి ఎంతగానో ఉపయోగపడుతుందనటంలో సందేహం లేదు. అయితే అందరికీ దీన్ని చేయటం కుదరదు. ఇతరత్రా చికిత్సలేవీ పనిచేయనప్పుడే.. చివరి అవకాశంగానే దీన్ని పరిగణనలోకి తీసుకుంటారు. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ముందుగా- మోకీళ్లపై భారం పడేలా చేసే పనులకు (మెట్లు ఎక్కటం వంటివి) దూరంగా ఉండటం.. అధిక బరువును తగ్గించుకోవటం వంటి జీవనశైలి మార్పులను సూచిస్తారు. కొన్ని ప్రత్యేకమైన వ్యాయామాలు కీళ్లు బిగుసుకుపోవటాన్ని తగ్గిస్తాయి, కదలికలను మెరుగుపరుస్తాయి. అందువల్ల ఫిజియోథెరపీ కూడా సిఫారసు చేస్తారు. వేడి కాపు పెట్టటం, సాధారణ నొప్పి మందులు, మలాములతోనూ ఫలితం కనబడొచ్చు. అవసరమైతే మోకీలులోకి ఇంజెక్షన్లు ఇచ్చి కూడా ప్రయత్నిస్తారు. కొందరికి ఎక్స్‌రేలో మోకీలు పెద్దగా క్షీణించినట్టు కనబడకపోయినా నొప్పితో విలవిలలాడుతుంటారు. వీరిలో కొందరికి మూలకణ చికిత్సతోనూ ప్రయోజనం ఉండొచ్చు. ఇలాంటి పద్ధతులతో ఎలాంటి ఫలితం లేకపోతే.. పైగా మోకీలు వంకరవటం, ఎముక పెచ్చులు ఊడటం వంటివీ కనబడుతుంటే.. చివరి ప్రయత్నంగానే మోకీలు మార్పిడికి ప్రయత్నిస్తారు.

మొత్తమా? పాక్షికమా?

మోకీలు మార్పిడి అనగానే ముందుగా మొత్తం మార్పిడే (టోటల్ నీ రిప్లేస్‌మెంట్) గుర్తుకొస్తుంది. ఇందులో కీలు మొత్తాన్ని తొలగించి.. దాని స్థానంలో లోహం లేదా సిరామిక్‌తో చేసిన కృత్రిమ పరికరాన్ని అమరుస్తారు. మోకీలు మొత్తం దెబ్బతిని, తీవ్రమైన నొప్పులతో బాధపడేవారికిది బాగా ఉపయోగపడుతుంది. అయితే మృదులాస్థి క్షీణించటమనేది అందరిలో ఒకేలా ఉండకపోవచ్చు. కొందరిలో కీలులో ఒక భాగంలోనే దెబ్బతినొచ్చు. ఇలాంటివారికి కీలు మొత్తాన్ని తొలగించాల్సిన అవసరం ఏముంది? దెబ్బతిన్న భాగాన్ని తీసేసి, అంతవరకే సరిచేస్తే చాలదా? సరిగ్గా ఇక్కడే పాక్షిక మోకీలు మార్పిడి పరిష్కార మార్గాన్ని చూపిస్తోంది. కీళ్లనొప్పులతో బాధపడేవారిలో 30% మందికి కీలులో మూడింట ఒకవంతు భాగమే దెబ్బతింటుంది. ఇలాంటివారికి పూర్తి మోకీలు మార్పిడి కన్నా పాక్షిక మార్పిడే ఉత్తమమనే అభిప్రాయానికి బలం చేకూరుతోంది.


రెండూ వేర్వేరే..






పూర్తి మార్పిడి

పాక్షిక మోకీలు మార్పిడిని మొత్తం మార్పిడికి ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు గానీ ఇవి రెండూ వేర్వేరు పద్ధతులే. దేని ప్రయోజనం దానిదే. పాక్షిక మార్పిడిలో దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే తొలగించి, దాని స్థానంలో కృత్రిమ పరికరాన్ని అమరుస్తారు. మిగతా ఎముక, మృదులాస్థి, కండరబంధనాల (లిగమెంట్లు) వంటివన్నీ అలాగే ఉంచుతారు. మొత్తం మోకీలు మార్పిడి మాదిరిగానే దీంతోనూ మంచి ఫలితం కనబడుతుంది. పైగా అదనపు ప్రయోజనాలూ ఉన్నాయి. మొత్తం మోకీలు మార్పిడి చేయించుకున్నవారు కాలును పూర్తిగా వంచలేరు. అదే పాక్షిక మోకీలు మార్పిడి అనంతరం కాలును పూర్తిగా వంచొచ్చు. కండర బంధనాలు అలాగే ఉండటం వల్ల కదలికలన్నీ మునుపటిలాగే ఉంటాయి. ఎలాంటి పనులైనా చేసుకోవచ్చు. కింద కూచోవాలనుకుంటే కూచోవచ్చు. పెద్ద పెద్ద పనులు చేయాలంటే చేసుకోవచ్చు. ఆటలాడాలనుకుంటే ఆడుకోవచ్చు. వ్యవసాయం చేయాలనుకుంటే చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితులూ ఉండవు. సాధారణంగా కృత్రిమ మోకీలు పరికరం 20 ఏళ్ల వరకు మన్నుతుందని అంచనా. ప్రస్తుతం మన జీవనకాలం బాగా పెరిగింది. ఎంతోమంది 80, 90ల్లోనూ మంచి ఆరోగ్యంతో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో చిన్న వయసులోనే మొత్తం మోకీలును మార్చాల్సి వస్తే మున్ముందు మరోసారి సర్జరీ చేయాల్సిన పరిస్థితి తలెత్తొచ్చు. అప్పుడు తిరిగి సర్జరీ చేయటం చాలా కష్టం. ఫలితాలూ అంత బాగా ఉండకపోవచ్చు. అందువల్ల కొద్దిభాగమే మోకీలు దెబ్బతిన్నవారికి ముందుగా పాక్షిక మార్పిడిని ప్రయత్నించటమే ఉత్తమం. అవసరమైతే వీరికి మున్ముందు మొత్తం మోకీలు మార్పిడి చేయటానికీ అవకాశముంటుంది.





పాక్షిక మార్పిడి

పాక్షిక మోకీలు మార్పిడి చేయించుకున్నాం, ఆ తర్వాత రెండో వైపున మృదులాస్థి క్షీణిస్తే? చాలామందికి ఇలాంటి అనుమానం వస్తుంటుంది. కానీ పాక్షిక మార్పిడి చేయించుకున్న 95% మందిలో 15 ఏళ్ల వరకూ కృత్రిమ పరికరం సమర్థంగా పనిచేస్తున్నట్టు అనుభవాలు చెబుతున్నాయి. అంటే మార్పిడి అనంతరం మోకీలులో రెండో వైపున మృదులాస్థి క్షీణించటమనేది పెద్దగా కనబడటం లేదనే దీనర్థం. సాధారణంగా మన

తర్వాత రెండో వైపున క్షీణిస్తే?

శరీర బరువు చాలావరకు మోకాలికి లోపలి వైపుననే (మీడియల్) పడుతుంటుంది. కాబట్టి అరుగుదల కూడా ఈ భాగంలోనే ఎక్కువ. కీళ్లనొప్పులతో బాధపడేవారిలో 95% మందికి లోపలి వైపుననే మృదులాస్థి క్షీణిస్తుండటం గమనార్హం. పాక్షిక మార్పిడి అనంతరం మన శరీరం బరువు మోకీలుపై సరి సమానంగా పడుతుంది కూడా. కాబట్టి రెండో వైపున క్షీణించే అవకాశమూ తగ్గుతుంది. ఒకవేళ రెండో వైపు భాగం కూడా 15 ఏళ్లలోపు క్షీణించే అవకాశముందని అనిపిస్తే పాక్షిక మోకీలు మార్పిడికి బదులు మొత్తం మార్పిడికే ప్రయత్నిస్తారు.

పాక్షిక మార్పిడి ఎవరికి?

- మోకీలులో ఒక వైపుననే మృదులాస్థి క్షీణించినవారికి
- రోజువారీ పనులకు నొప్పులు ఇబ్బందికరంగా పరిణమించినవారికి
- మందులు, ఫిజియోథెరపీ వంటి ఇతరత్రా చికిత్సలతో ఉపశమనం కలగనివారికి
- పడుకున్నప్పుడు కూడా నొప్పి మూలంగా మెలకువ వస్తున్నవారికి
- నిలబడినప్పుడు, నడుస్తున్నప్పుడు మోకీళ్లు స్థిరంగా ఉండకుండా కదలిపోతున్నవారికి

చిన్నవయసు వారికి కూడా..

నిజానికి పాక్షిక మోకీలు మార్పిడి గత 30 ఏళ్లుగా చేస్తున్నదే. కాకపోతే అంతగా చేసేవారు కాదు. ఎందుకంటే మొత్తం మోకీలు మార్పిడితో పోలిస్తే.. ఇది కాస్త సంక్లిష్టమైన ప్రక్రియ. తప్పులు జరిగే అవకాశం ఎక్కువ. అయితే కంప్యూటర్ నావిగేషన్ వంటి అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాక ఇలాంటి తప్పులకు ఆస్కారం బాగా తగ్గిపోయింది. ఎముక ఆకారం, కణజాలం తీరుతెన్నులు కచ్చితంగా తెలుసుకునే వీలుండటం.. వీటి ఆధారంగా ఎముకను అవసరమైన మేరకే కత్తిరించటం.. మిల్లీమీటరు వ్యత్యాసమైనా లేకుండా పరికరాన్ని అమర్చటం సాధ్యమవుతోంది. దీంతో ప్లాస్టిక్ వాషర్ మీద సరి సమానంగా ఒత్తిడి పడటం వల్ల పరికరం ఎక్కువకాలం మన్నటానికీ వీలవుతోంది. ఒకప్పుడు 65 ఏళ్లు పైబడినవారికే పాక్షిక మోకీలు మార్పిడిని సిఫారసు చేసేవారు. ఇప్పుడు చిన్నవయసు వారికీ చేస్తున్నారు. దీనికి వయో పరిమితంటూ ఏమీ లేదు.

ఎలా చేస్తారు?

పాక్షిక మోకీలు మార్పిడి నైపుణ్యంతో కూడుకున్న ప్రక్రియ. దెబ్బతిన్న భాగాన్ని కచ్చితంగా గుర్తించటం, అంతవరకే ఎముకను కత్తిరించటం చాలా కీలకం. ముందుగా ఎక్స్‌రే, అవసరమైతే ఎంఆర్ఐ పరీక్షల ద్వారా కీలు ఎంతమేరకు దెబ్బతిన్నదనేది నిర్ధరించి చికిత్సను నిర్ణయిస్తారు. రెండో వైపున కూడా మృదులాస్థి దెబ్బతిన్నట్టు, ఏసీఎల్ కండరబంధనం తెగినట్టు తేలితే పూర్తి మోకీలు మార్పిడికే మొగ్గు చూపుతారు. కంప్యూటర్ నావిగేషన్ పద్ధతి సాయంతో ఎముక స్థితి, అమరిక, కోణం వంటివి నిశితంగా గమనించి.. చర్మం మీద 5-6 సెంటీమీటర్ల కోతతో మోకాలును తెరుస్తారు. దెబ్బతిన్న భాగానికి పైన, కింద ఉండే ఎముకలను కత్తిరించి.. ప్రత్యేకమైన సిమెంటుతో పరికరాన్ని అతికిస్తారు.

సర్జరీ అనంతరం..

పూర్తి మార్పిడితో పోలిస్తే పాక్షిక మార్పిడిలో త్వరగా కోలుకునే అవకాశముంది. రెండో రోజుననే కాలు కింద ఆనించి బరువు మోపించేందుకు, నడిపించేందుకు ప్రయత్నిస్తారు. నొప్పులు అంతగా లేకపోతే రెండు, మూడు రోజుల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. 10-15 రోజుల వరకు చేతి కర్ర లేదా వాకర్ సాయంతో నడవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 3 వారాల లోపు మెట్లు ఎక్కటం వంటి పనులు చేయొచ్చు. రెండు నెలల్లో దాదాపు పూర్తిగా కోలుకునే అవకాశముంది. 2-3 నెలల వరకు కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఆ తర్వాత అన్ని పనులూ చేసుకోవచ్చు. ఇతరత్రా శస్త్రచికిత్సల్లో మాదిరిగానే దీనిలోనూ ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు ఉండొచ్చు. అంతకుమించి పెద్ద ముప్పులేవీ ఉండవు. అయితే ఎముకలు దృఢంగా లేనివారికి, పరికరం సరిగా కుదురుకోనివారికి ఆ భాగంలో ఎముక విరిగే ప్రమాదముంది. అందువల్ల ఎముకలు బలహీనంగా ఉన్నవారికి దీన్ని చేయటం తగదు. అలాగే ఏసీఎల్ కండరబంధనం తెగినవారికీ ఇది పనికిరాదు.

బాల ఆరోగ్యానికి జపాన్ పాఠాలు!



పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని అందరమూ కోరుకుంటాం. వాళ్లు బాగా తినాలని, మంచిగా ఎదగాలని ఆకాంక్షిస్తాం. కానీ పిల్లల తిండి విషయంలో ప్రతి ఇల్లూ రోజూ రణరంగాన్నే తలపిస్తుంది. తినటానికి మొండికేసే పిల్లలు కొందరైతే, పెట్టింది పూర్తిగా తినకుండా వదిలేసేవారు ఇంకొందరు. అది కావాలని, ఇది కావాలని గొంతెమ్మ కోరికలతో వేధించేవారు మరి కొందరు. దీంతో పిల్లలకు తిండి తినిపించే సరికి చాలామంది తల్లిదండ్రులకు తలప్రాణం తోకకు వచ్చినంత పనవుతుంది. మరోవైపు- సరిగ్గా తినకపోవటం వల్ల తగినన్ని పోషకాలు అందక పిల్లల ఎదుగుదల సైతం కుంటుపడుతోంది. ఒక్క మనదగ్గరే కాదు, చాలాదేశాల్లోనూ ఇలాంటి పరిస్థితి కనబడుతోంది. కానీ జపాన్ పిల్లలు మాత్రం చాలా ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుండటం విశేషం. మిగతా దేశాలతో పోలిస్తే జపాన్ పిల్లల్లో ఊబకాయం కూడా చాలా తక్కువే. దీనికి ప్రధాన కారణం అక్కడి జీవనశైలి, ఆహార పద్ధతులేనని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇంతకీ జపాన్ పిల్లల తిండి విషయంలో అక్కడివాళ్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? దీనిలోని కిటుకులేంటి?

ఆనందిస్తూ తినటం

పిల్లలు ఇష్టపడుతూ, ఆనందంగా తినేలా చేయటం చాలా జపాన్‌లోని ఇళ్లలో తరచుగా కనబడే దృశ్యం. దీంతో ఆహారం కూడా మరింత రుచిగానూ అనిపిస్తుంది. అలాగే ఆదరాబాదరాగా కాకుండా విశ్రాంతిగా, వీలైనంత వరకు తృప్తిగా తినేలా చూడటం మరో ముఖ్య విషయం. పిల్లలకు ఇష్టమైన చిరుతిళ్లు, మిఠాయిల వంటివి ఇచ్చినా.. వాటిని మితంగా, అప్పుడప్పుడు మాత్రమే ఇస్తుంటారు. దీంతో ఉత్త కేలరీలతో కూడిన పదార్థాలను తగ్గించినట్టూ అవుతోంది.

చిన్న చిన్న పళ్లాలు

ఒకేసారి పెద్దమొత్తంలో ఆహారం పెట్టేస్తే పిల్లలకు మొహం మొత్తుతుంది. అదే వారినే ఎంచుకోమంటే? తక్కువ తక్కువగానే తీసుకున్నా కూడా ఎంచుకున్నది ఇష్టంగా తింటారు. అందుకే జపాన్‌లో పిల్లలకు చిన్న పళ్లాలు చేతికివ్వటం, ఇష్టమైనవి తీసుకునేలా ప్రోత్సహించటం మంచి ప్రభావం చూపుతున్నాయి. ఎంత తీసుకోవాలనేది పిల్లలకే వదిలేస్తే తక్కువగా తీసుకోవటానికే ఇష్టపడతారు. దీంతో సమయానికి ఆకలి వేస్తుంది కూడా. ఆహారమూ వ్యర్థం కాదు.


ఆరుబయట ఆటలు

వీడియోగేమ్స్ వంటి వాటి నుంచి పిల్లలను దూరంగా ఉంచటం కష్టమే. కానీ వారికి రోజుకు కనీసం 60 నిమిషాల సేపు శారీరక శ్రమ కూడా అవసరమే. అందువల్ల పిల్లలను వీలైనప్పుడల్లా ఆరుబయట ఆడుకునేలా చూడటం మంచిది. జపాన్ పిల్లలు ఈ విషయంలో మిగతా దేశాల పిల్లల కన్నా చాలా ముందుంటున్నారు. కొందరు పిల్లలు నడిచి స్కూలుకు వెళ్తుంటే.. మరికొందరు సైకిళ్లను ఎంచుకుంటున్నారు. జపాన్ పిల్లల్లో ఊబకాయం తక్కువగా ఉండటానికి ఇదీ ఒక కారణమే.

కుటుంబంతో కలిసి భోజనం

వీలైనప్పుడల్లా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేయటం మంచి సంప్రదాయం. జపాన్‌లో దీన్ని విధిగా పాటిస్తారు. దీంతో పెద్దవాళ్లను చూసి పిల్లలు చాలా విషయాలు నేర్చుకుంటున్నారు. ఇంట్లో వండిన, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం వల్ల సహజంగానే చిరుతిళ్లు తినాలనే కోరిక కూడా తగ్గుతోంది. అలాగే పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, మంచి కొవ్వులతో కూడిన చేపలు ఎక్కువగా తీసుకోవటం.. చక్కెర, ఉప్పు తగ్గించటం వంటివి చిన్నప్పటి నుంచే అలవడుతోంది.

గొంతులోనూ మొండి గనోరియా!



మన గొంతులో కోట్లాది సంఖ్యలో బ్యాక్టీరియా ఉంటుంది. వీటిల్లో చాలావరకు మనకు ఎలాంటి హానీ కలిగించవు. కానీ ఇప్పుడు గొంతులో గనోరియా కారక బ్యాక్టీరియా తిష్ఠ వేసుకోవటం పెరిగిపోతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాదు, ముఖ రతి ద్వారా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోందని.. ఇటీవలి కాలంలో చాలాదేశాల్లో గనోరియా వ్యాప్తి పెరగటానికి ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోందని హెచ్చరిస్తున్నారు. గొంతులో గనోరియా బ్యాక్టీరియా తిష్ఠ వేసుకున్నా పైకి ఎలాంటి లక్షణాలూ కనబడవు. నిశ్శబ్దంగా లోలోపల వృద్ధి చెందుతూనే ఉంటుంది. దీన్ని గుర్తించటం, చికిత్స చేయటమూ కష్టమే. పైగా ఇప్పుడిది గొంతులోని ఇతర బ్యాక్టీరియా ద్వారా యాంటీబయోటిక్ మందులను తట్టుకునే శక్తిని సంతరించుకుంటుండటం.. ముఖ రతి ద్వారా ఇతరులకూ సోకుతుండటం మరింత కలవరపరుస్తోంది. గొంతునొప్పి, చెవి ఇన్‌ఫెక్షన్ల వంటి వాటికి యాంటీబయోటిక్ మందులను వేసుకున్నప్పుడు గొంతులోని సహజ బ్యాక్టీరియా కూడా వీటి ప్రభావానికి లోనవుతుంది. కొంతకాలానికి ఇది ఆయా మందులను తట్టుకునే సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. ఇదేమీ ప్రమాదకరమైంది కాదు. కానీ గనోరియా వంటి హానికర బ్యాక్టీరియా వీటికి తోడవ్వటమే సమస్యగా పరిణమిస్తోంది. ఇవి సహజ బ్యాక్టీరియా పక్కనే ఉంటూ.. వాటి డీఎన్ఏను తమలోకి మార్పిడి చేసుకుంటున్నాయి. దీంతో హానికర బ్యాక్టీరియాకు సైతం యాంటీబయోటిక్ మందులను తట్టుకునే సామర్థ్యం అలవడుతోంది. కొత్తగా బయటపడుతున్న గనోరియా కేసుల్లో సుమారు 39% కేసుల్లో ఇలాంటి మొండి బ్యాక్టీరియానే కనబడుతుండటం ఆందోళనకరం. దీన్ని మనం ఆపకపోతే, సరైన చికిత్స చేయకపోతే మున్ముందు మరిన్ని విపరీతాలకు దారితీస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వారాంత యోధులైనా..



రోజూ వ్యాయామం చేయటానికి కొందరికి సమయం దొరకదు. దీంతో చాలామంది వారాంత సెలవుదినాల్లో ఒకేసారి తీవ్రంగా వ్యాయామాలు చేసేస్తుంటారు. ఇలాంటి 'వారాంత యోధులకు' కండరాలు దెబ్బతినే ముప్పు ఎక్కువ. అందుకే రెండు మూడు రోజుల వరకు నొప్పులతో సతమతమవుతుంటారు. అయినప్పటికీ వీరికి వ్యాయామం వల్ల ఒనగూడే ప్రయోజనాలూ బాగానే లభిస్తున్నట్టు తాజా అధ్యయనం ఒకటి పేర్కొంటోంది. ఒకట్రెండు సార్లే అయినా వారానికి కనీసం 75 నిమిషాలు, ఒక మాదిరిగా 150 నిమిషాలు వ్యాయామాలు చేసేవారి ఆయుష్షు పెరుగుతున్నట్టు వెల్లడికావటం విశేషం. అంతగా వ్యాయామాలు చేయనివారితో పోలిస్తే ఇలాంటి వారాంత యోధులకు ఎలాంటి కారణంతోనైనా మరణించే ముప్పు 30% తగ్గుముఖం పడుతోంది. గుండెజబ్బుతో సంభవించే మరణం ముప్పు 40%, క్యాన్సర్‌తో తలెత్తే మరణం ముప్పు 18% తగ్గుతోంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారికి ఇంతకన్నా మెరుగైన ఫలితాలే కనబడుతున్నప్పటికీ.. వారాంత యోధులతో పోలిస్తే తేడా మరీ అంత ఎక్కువగా ఏమీ ఉండకపోవటం గమనార్హం. కాబట్టి రోజూ వ్యాయామానికి సమయం దొరకటం లేదని బాధపడేవారు కనీసం వారాంతాల్లోనైనా వ్యాయామాలకు ఉపక్రమించటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అయితే కఠినమైన వ్యాయామాలు చేసేముందు ఒకసారి డాక్టర్ల సిఫారసు తీసుకొని, శరీరం సహకరించినంతమేరకే వ్యాయామం చేయాలనే విషయం మరవరాదు.



ఖమర్ మోహసీన్ షేక్

రక్షాబంధన్ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన మహిళ 20 నుంచి 23 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీకి రాఖీ కడుతోంది. పాకిస్థాన్‌లో పుట్టి పెరిగిన ఖమర్ మోహసీన్ షేక్, పెళ్లి అయ్యాక భారత్‌లో స్థిరపడింది. 'నేను మొదటిసారి నరేంద్ర భాయ్‌కి రాఖీ కట్టే సమయంలో ఆయన ఆర్ఎస్ఎస్‌లో కార్యకర్తగా ఉన్నారు. ప్రధానిగా ఆయనకు ఉన్న పనులరీత్యా ఈ సంవత్సరం రాఖీ కట్టే వీలు దొరకదనుకున్నాను. రెండు రోజుల క్రితం నాకు ఫోన్ చేసి రాఖీ కట్టడానికి ఆహ్వానించినప్పుడు నా ఆనందానికి అవధులు లేవు' అని మోహసీన్ చెప్పారు.

★ మోదీకి రక్షాబంధన్ సందర్భంగా 103 సంవత్సరాల వృద్ధురాలు శరబతీ దేవి రాఖీ కట్టారు. 50 ఏళ్ల క్రితం చనిపోయిన తన సోదరుడిని గుర్తుకు తెచ్చుకుని ప్రతీ రక్షాబంధన్‌కు ఆమె బాధపడుతుండేవారు. ఆ బాధను చూడలేక ఆమె కుమారుడు శరబతి దేవి పరిస్థితిని వివరిస్తూ మోదీకి లేఖ రాశారు. స్పందించిన ప్రధాని శరబతీ దేవితో పాటు మొత్తం కుటుంబాన్ని రాఖీ కట్టడానికి దిల్లీకి ఆహ్వానించారు.





ప్రధాని నివాసంలో మోదీకి రాఖీలు కడుతున్న 103 ఏళ్ల షర్బతిదేవి ● రాష్ట్రపతిభవన్‌లో రామ్‌నాథ్‌కోవింద్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

సుడిగుండంలో కాంగ్రెస్!

మారకపోతే మనుగడకే ప్రమాదం: జైరాం రమేశ్

కోచి: కాంగ్రెస్ అస్తిత్వపరమైన తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షాలతో పార్టీకి పెనుసవాల్ ఉందని.. వారిని ఎదుర్కోవాలంటే సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఓ వార్తా సంస్థతో సోమవారం ఆయన పలు కీలకాంశాలపై మాట్లాడారు.

ఆషామాషీ కాదు.. "మోదీ, షాలను ఎదుర్కోవాలంటే ఆషామాషీ విధానాలు పనిచేయవు. వారు భిన్నంగా ఆలోచిస్తున్నారు.. భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దానికి తగ్గట్టుగా మేము మా విధానాల్లో మార్పులు చేసుకోలేకపోతే.. నిజంగానే మనుగడ కష్టమవుతుంది. 1996-2004 మధ్యలోను.. ఎమర్జెన్సీ తరువాత 1977 ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ ఎన్నికల సంక్షోభాన్ని మాత్రమే ఎదుర్కొంది. కానీ నేడు నిజంగా అస్తిత్వపరమైన తీవ్ర సంక్షోభంలో ఉంది."

కాంగ్రెస్ మారాలి.. "పాతకాలపు నినాదాలు, విధానాలు, మంత్రాలు పనిచేయవు. భారత్ మారింది.. కాంగ్రెస్ పార్టీ కూడా మారాలి. ప్రజలంతా కొత్త కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో మోదీకి గట్టి పోటీ ఇవ్వాలంటే కాంగ్రెస్ సమష్టి కృషితోనే అది సాధ్యం. సుల్తాన్ల శకం పోయింది. అయితే సుల్తాన్లు ఇంకా ఉంటే ఎలా ఉండాలో అలా వ్యవహరించాల్సి ఉంటుంది. నీతీశ్ కుమార్ ఎన్‌డీఏలోకి వెళ్లడం కూడా దేశంలో భాజపాయేతర కూటమికి ఎదురుదెబ్బ."

గుజరాత్‌లో రసవత్తర పోరు

- అహ్మద్ పటేల్ విజయానికి ఇతర పార్టీలపై కాంగ్రెస్ ఆశలు

అహ్మదాబాద్: ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో మంగళవారం జరగనున్న రాజ్యసభ ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా మారాయి. అధికార భాజపా, విపక్ష కాంగ్రెస్‌లు రెండూ ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, సర్వశక్తులూ ఒడ్డుతుండడంతో పోరు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. గత రెండు దశాబ్దాలుగా ప్రతిసారీ ఏకగ్రీవంగానే ఎన్నికలు పూర్తవుతుండగా ఈసారి మాత్రం మూడు స్థానాల కోసం నలుగురు అభ్యర్థులు బరిలో నిల్చొన్నారు. భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాజకీయ కార్యదర్శిగా ఉన్న అహ్మద్ పటేల్ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుండడం పోరును రసవత్తరంగా మార్చింది. కాంగ్రెస్‌లో సీనియర్ నేత శంకర్‌సింగ్ వాఘేలా తిరుగుబావుటా ఎగరేయడం, ఆరుగురు శాసనసభ్యులు ఆ పార్టీకి రాజీనామా చేయడం, 44 మంది శాసనసభ్యుల్ని బెంగళూరుకు తరలించడం గురించి తెలిసిందే.

ఈ ఎన్నికల్లో ఏ అభ్యర్థైనా విజయం సాధించాలంటే 45 ఓట్లు అవసరం. 182 మంది సభ్యులున్న శాసనసభలో కాంగ్రెస్‌కి ఇదివరకు 57 మంది ఎమ్మెల్యేలు ఉండేవారు. ఆరుగురు రాజీనామా చేయడం, వాఘేలాతో ఏడుగురు విడిపోవడంతో పార్టీలో ప్రస్తుతం 44 మందే ఉన్నారు. క్రాస్ ఓటింగుకు జరగకపోయినా, ఏ ఒక్కరూ 'నోటా' మీటను నొక్కకపోయినా పటేల్ విజయానికి మరొక్క ఓటు తక్కువవుతుంది. ఈ పరిస్థితుల్లో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకొంది. ఎన్సీపీకి చెందిన ఇద్దరు, జేడీ(యు)కి చెందిన ఒక ఎమ్మెల్యే కూడా చివరి క్షణంలో తనకు మద్దతు ప్రకటించినట్లు పటేల్ సోమవారం రాత్రి వెల్లడించారు. భాజపా అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా తమ పార్టీ నుంచి ఆదేశాలు అందినట్లు ఎన్సీపీ శాసనసభ్యుడు జడేజా ప్రకటించడం గమనార్హం. భాజపాలో 121 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ బలంతో ఈ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల్ని ఆ పార్టీ సునాయాసంగా గెలిపించుకోగలదు. మూడో వ్యక్తికి మాత్రం 31 ఓట్లే మిగులుతున్నాయి. 'ఇతరుల' నుంచి మిగతా మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నా పార్టీ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మూడో స్థానం కోసం బల్వంత్‌సింగ్ రాజ్‌పుట్‌ను భాజపా బరిలో దించింది. అహ్మద్ పటేల్ ఈ ఎన్నికల్లో తన విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భాజపా గూటికి త్రిపుర తృణమూల్ ఎమ్మెల్యేలు

అగర్తలా: ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కి చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీ నాయకత్వ నిర్ణయాన్ని ధిక్కరించి వీరు ఎన్‌డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు ఓటేశారు. దీంతో ఆ పార్టీ నాయకత్వం ఈ ఆరుగురు ఎమ్మెల్యేలతో తమకు ఎలాంటి సంబంధంలేదని ప్రకటించింది. వాస్తవానికి వీరు 2013లో కాంగ్రెస్ పార్టీ తరఫున త్రిపుర శాసనసభకు ఎన్నికయ్యారు. గత ఏడాది పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో వామపక్షాలతో కాంగ్రెస్ పార్టీ పొత్తును వ్యతిరేకిస్తూ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా సుదీప్ రాయ్ బర్మన్ నేతృత్వంలో భాజపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అగర్తలాలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య కేసుపై త్రిసభ్య ధర్మాసనం

11 నుంచి సుప్రీంలో విచారణ ప్రారంభం

దిల్లీ: అయోధ్య వివాదంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. జస్టిస్ దీపక్ మిశ్ర ఆధ్వర్యంలో జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో ఈ ధర్మాసనం ఏర్పాటయింది. ఈ నెల 11 నుంచి విచారణ ప్రారంభించనుంది. రామ జన్మభూమి- బాబ్రీ మసీదు పేరుతో వివాదాస్పదంగా ఉన్న 2.77 ఎకరాల భూమిని మూడు భాగాలుగా విభజించి దఖలు పరచాలని 2010లో అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ భూమిని రామ్ లల్లా (బాల రాముడు), కక్షిదారులైన సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా మధ్య సమానంగా పంపిణీ చేయాలని 2:1 మెజార్టీతో తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

ఈ వ్యాజ్యాలు ఏడేళ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయని, వీటిపై తక్షణమే విచారణ ప్రారంభించాలని భాజపా సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయోధ్యలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూజలు జరిపేందుకు తనకు ఉన్న హక్కును అమలు చేయాలని కోరుతూ మరో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. వీటిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ కేసు విచారణను త్వరగా చేపడుతామంటూ గత నెల 21న పేర్కొంది. అందుకు అనుగుణంగా త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

పేదల గుర్తింపునకు కొత్త లెక్క

- సాంఘిక ఆర్థిక కుల జనాభా లెక్కలే ప్రామాణికం
- త్వరలో మంత్రివర్గ నిర్ణయం

ఈనాడు, దిల్లీ: పేదరిక నిర్మూలన కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపికకు సాంఘిక ఆర్థిక కుల జనాభా లెక్కలు (సోషియో ఎకనామిక్ అండ్ క్యాస్ట్ సెన్సెస్-ఎస్ఈసీసీ)-2011ను ప్రామాణికంగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉన్నత స్థాయి సంఘం చేసిన సిఫార్సుల మేరకు త్వరలో దీనిపై కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఒక్కటే ఈ సమాచారం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. మంత్రివర్గం ఆమోదం లభించిన తరువాత పట్టణ పేదలకూ ఇదే సమాచారం వరిస్తుంది. జాతీయ ఆహార భద్రత, ఆరోగ్య పథకాల కింద లబ్ధిదారుల ఎంపికకూ ఇదే సమాచారాన్ని ఉపయోగిస్తారు. ఇంధన శాఖ కూడా దారిద్ర్యరేఖ అంచనాలకు బదులు ఈ సమాచారాన్నే స్వీకరించనుంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద లబ్ధిదారుల ఎంపికకు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే సమాచారాన్ని ఉపయోగిస్తున్నాయి.

ప్రస్తుతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి (బీపీఎల్) జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఇకపై అన్నింటికీ ఎస్ఈసీసీ ప్రామాణికం కానుంది. బీపీఎల్‌లో పేర్కొన్న మార్గదర్శకాలకు, ఎస్ఈసీసీ మార్గదర్శకాలకు మధ్య వైరుధ్యం తలెత్తితే ఎస్ఈసీసీ మార్గదర్శకాలనే అనుసరిస్తారు. ఎస్ఈసీసీ లెక్కలను 2015 జులైలో విడుదల చేశారు. దీని ప్రకారం గ్రామీణ జనాభాలో 62 శాతం మంది పేదలే. గ్రామాల్లో 17.9 కోట్ల కుటుంబాలు ఉండగా అందులో 2.37 కోట్ల మంది అంటే 13 శాతం ఒకే గది ఉన్న తాత్కాలిక ఇళ్లలో నివసిస్తున్నారు. 4 కోట్ల కుటుంబాల్లో 25 ఏళ్లు దాటిన వారిలో చదువుకున్నవారెవరూ లేరు.

2011లో రూపొందించిన ఎస్ఈసీసీ జాబితాను శాస్త్రీయంగా, లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించారు. మొత్తం ప్రామాణికాల్లో అయిదు వర్తిస్తే అలాంటి వారు పేదలుగా గుర్తింపు పొందుతారు. 14 ప్రామాణికాలు ఉంటే వారిని పేదరికం జాబితా నుంచి తొలగిస్తారు. ఏడు ప్రామాణికాలు ఉంటే పేదరిక స్థాయిని వర్గీకరిస్తారు.

పాక్‌లో విస్తరిస్తున్న ఐఎస్

- 18 ఏళ్ల ఉగ్రవాది వాంగ్మూలంలో ఆశ్చర్యకర వాస్తవాలు

శిఖర్‌పూర్ (పాకిస్థాన్): పాకిస్థాన్‌లో ఇప్పటికే ఉన్న పలు ఉగ్రవాద ముఠాలతో పాటు ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.) కూడా విస్తరిస్తోందా? ఆత్మాహతి దాడికి పాల్పడుతూ చివరి నిమిషంలో పోలీసులకు చిక్కిన ఉస్మాన్ అనే 18 ఏళ్ల యువకుడు ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు ఐఎస్ విస్తరణను గుర్తించారు. తూర్పు అఫ్గానిస్థాన్ నుంచి పాకిస్థాన్‌లోని దక్షిణ సింధ్ రాష్ట్రం వరకు ఇప్పటికే ఉగ్రవాదం విస్తరించింది. వివిధ రకాల జిహాదీ వర్గాలకు పాకిస్థాన్ కేంద్ర స్థానంగా ఉంది. దీన్ని అవకాశంగా తీసుకున్న ఐ.ఎస్. క్రమేణా తన ఉనికిని చాటుకుంటోంది. ఉస్మాన్ ఇచ్చిన వాంగ్మూలంలో ఐ.ఎస్.ప్రస్తావన ఏదీ లేనప్పటికీ, అతడికి శిక్షణ ఇచ్చిన సంస్థ అదే అని పోలీసులు అనుమానిస్తున్నారు. 'మధ్య ప్రాచ్యంలో ఉన్నట్టుగా ఐ.ఎస్.కు ఇక్కడ పార్టీ యంత్రాంగం లేదు. ఓ ప్రచార ఉద్యమంలా పనిచేస్తోంది. అయినా పాకిస్థాన్‌లో ఇటీవల అయిదు ఉగ్రదాడులు జరగగా అందులో నాలుగు తమ పనేనని ఐ.ఎస్. ప్రకటించడం గమనార్హం. ఉస్మాన్ పాకిస్థాన్‌లోని స్వాత్ లోయకు చెందిన వాడు. ఆయన తండ్రి తాలిబన్‌లో పనిచేశాడు. డ్రోన్ దాడిలో చనిపోవడంతో ఆయన కుంటుంబం అఫ్గానిస్థాన్‌లోని నంగర్‌హార్‌కు వెళ్లింది. అక్కడే ఉగ్రవాద ముఠాల్లో చేరాడు. గత సెప్టెంబరులో పాక్ పోలీసులకు చిక్కాడు. పాక్‌లో ఐఎస్ విస్తరణకు సూత్రధారి ఐఎస్ఐకి ఏజెంటుగా పనిచేసిన షాఫిక్ మెంగల్ అని అనుమానిస్తున్నారు. ఆయన కింద 1000 మంది ఉగ్రవాదులు పనిచేస్తున్నారని భావిస్తున్నారు.

అణ్వాయుధ నిషేధ ఒప్పందంలో భాగంకాలేం: పాక్

ఇస్లామాబాద్: అణ్వాయుధ నిషేధ ఒప్పందంలో తాము భాగస్వాములం కాలేమని పాకిస్థాన్ తెలిపింది. జులై7న జెనీవాలో 120 దేశాలు ఆమోదించిన ఈ ఒప్పందం భాగస్వాములందరి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవటంలో విఫలమైందని ఆరోపించింది. భారీ అణ్వాయుధాలు కలిగిన దేశాలు ఏవీ కూడా ఒప్పందంలో కానీ, ఒప్పందంపై జరిగిన చర్చల్లో కానీ పాల్గొనలేదని తెలిపింది. ఒప్పందానికి తాము నిబద్ధులై ఉండబోమని స్పష్టం చేసింది. అణ్వాయుధాలను నిషేధించాలనే ఒప్పందం, దానిపై జరిగిన చర్చల్లో అమెరికా, చైనా, రష్యా తదితర 8 దేశాలు పాల్గొనలేదు.

సంకల్ప దినంగా పంద్రాగస్టు

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15వ తేదీనాడు 'సంకల్ప్ పర్వ' (సంకల్ప దినం)గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు పిలుపునిచ్చింది. సామాజిక అంశాల నిమిత్తం ప్రజలు ఆరోజు తమను తాము అంకితం చేసుకోవాలనీ, సరికొత్త భారతావనిని రూపొందించడానికి ఆలోచనల్ని పంచుకోవాలనీ కోరింది. క్విట్ ఇండియా ఉద్యమం (ఆగస్టు 9) ఒక కీలక మైలురాయి అనీ, భారతదేశాన్ని బలంగా, సుసంపన్నంగా, సమ్మిళితంగా తీర్చిదిద్దడానికి ప్రతినబూనాలనీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. '2022 ఆగస్టు 15 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతాయి. అందువల్ల 2017 నుంచి 2022 మధ్యనున్న అయిదేళ్లలో ఒక సంకల్పాన్ని తీసుకుని, దానిని సాధించడానికి మనమంతా పాటుపడాలి. ఈ పంద్రాగస్టునాడు మనం తీసుకునే సంకల్పం అయిదేళ్ల తర్వాత సాధన రూపంలో కనిపించాలి. మన స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న భారతావనిని సాకారం చేయడానికి, ఆ మేరకు భారత రూపాంతరీకరణకు ఈ అయిదేళ్ల కాలం ఉపయోగపడాలి. అలాంటి సమున్నత భారతాన్ని చూసి సమరయోధులు గర్వించాలి' అని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఒక ఉత్తర్వులో పేర్కొంది. న్యూఇండియా డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి నూతన భారత నిర్మాతలుగా ప్రజలంతా ప్రతిజ్ఞ తీసుకోవాలనీ, ఇతరులూ అలా తీసుకునేలా చూడాలనీ సిబ్బంది శాఖ కోరింది.

22న బ్యాంకు సిబ్బంది సమ్మె

చెన్నై: 'బ్యాంకు ఉద్యోగుల సంఘాల ఐక్య వేదిక' (యూఎఫ్‌బీయు) ఇచ్చిన పిలుపు మేరకు తొమ్మిది సంఘాలకు చెందిన బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ నెల 22న దేశవ్యాప్త సమ్మె పాటించనున్నారు. దీనిలో దాదాపు 10 లక్షల మంది పాల్గొంటారని అంచనా. భారతీయ బ్యాంకుల సంఘానికి (ఐబీఏకి) రెండ్రోజుల క్రితమే సమ్మె నోటీసు అందజేసినట్లు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం తెలిపారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, వేర్వేరు బ్యాంకుల్ని విలీనం చేయడం, కార్పొరేట్ నిరర్థక ఆస్తుల్ని (ఎన్‌పీఏలు) రద్దు చేయడం వంటి వాటిని వ్యతిరేకిస్తూ సమ్మె పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేయడాన్ని నేరంగా ప్రకటించాలనీ, ఎన్‌పీఏల వసూలుపై పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన నివేదికను అమలు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.

పేదలకు వంటగ్యాస్ రాయితీ కొనసాగుతుంది: ధర్మేంద్ర ప్రధాన్

అగర్తల: గృహావసరాల కోసం పేదలు వినియోగించే కిరోసిన్, వంటగ్యాస్ సిలిండర్లపై రాయితీ కొనసాగుతుందని కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం నాడిక్కడ స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎదురవుతున్న వంటగ్యాస్ కొరతను అధిగమించడానికి చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు సహజ వాయువు గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగుడి నుంచి బంగ్లాదేశ్‌లోని పార్వతీపూర్ వరకు డీజిల్ చేరవేతకు గొట్టపు మార్గాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. రూ.143 కోట్లతో నిర్మించనున్న ఎల్పీజీ బాట్లింగ్ కర్మాగారానికి ప్రధాన్ శంకుస్థాపన చేశారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల లైంగిక వేధింపులపై విచారణ

రాయ్‌పూర్: ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో పాఠశాల విద్యార్థినులను సీఆర్‌పీఎఫ్ సిబ్బంది లైంగికంగా వేధించారన్న ఘటనపై విచారణ సంఘం ఏర్పాటైంది. ఈ మేరకు దంతెవాడ జిల్లా పాలనాధికారి సౌరవ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జులై 31న దంతెవాడ జిల్లాలోని పల్నార్ గ్రామంలో కేంద్ర రిజర్వ్ భద్రతా బలగాల ఆధ్వర్యంలో స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 'రక్షాబంధన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీల పేరుతో ముగ్గురు విద్యార్థినులను సిబ్బంది కొందరు లైంగికంగా వేధించారన్న వసతి గృహం వార్డెన్ ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదైంది. అయితే బాధితులు నిందితులను గుర్తించలేకపోయారు. ఘటన జరిగిన రోజు సీసీటీవీల్లో నమోదైన దృశ్యాల్ని పోలీసులు విశ్లేషిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

ఆస్పత్రికి మేధాపాట్కర్ తరలింపు

భోపాల్: సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం, నర్మదా నది పరిరక్షణల కోసం ఆమరణ దీక్ష చేపట్టిన సామాజిక ఉద్యమకారిణి మేధాపాట్కర్‌ను మధ్యప్రదేశ్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఆమెతో పాటు మరో 10 మంది ఆందోళనకారులు గత 12 రోజులుగా ధార్ జిల్లాలోని చిఖల్దా గ్రామంలో నిరవధిక నిరశనను కొనసాగిస్తుండగా వారందరి ఆరోగ్యం క్షీణించింది.

అంబులెన్స్‌ను అడ్డుకున్న భాజపా నేత

సకాలంలో చికిత్స అందక వ్యక్తి మృతి

హరియాణా: భారతీయ జనతా పార్టీకి చెందిన పురపాలక మండలి ముఖ్యనేత ఒకరు అంబులెన్స్ వాహనాన్ని 30నిమిషాల పాటు అడ్డుకోవడంతో అత్యవసర చికిత్స కోసం వెళుతున్న వ్యక్తి ఒకరు మృతి చెందారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హరియాణాలోని హిస్సార్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనలో గుండె సంబంధిత చికిత్స కోసం వెళుతున్న నవీన్‌కుమార్ మృతిచెందారు. అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి వెళుతుంటే లాల్‌బత్తీ చౌక్ సమీపంలో భాజపా నేత దర్శన్ నాగ్‌పాల్ కారును, అంబులెన్స్ వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీనిపై అంబులెన్స్ చోదకుడితో నాగ్‌పాల్ గొడవకు దిగారంటూ నవీన్‌కుమార్ సమీపబంధువు అరుణ్‌కుమార్ తెలిపారు. కారు దెబ్బతిన్నందుకు డబ్బులు చెల్లించాలంటూ అరగంటపాటు నిలిపివేశారన్నారు. ఫలితంగా ఆసుపత్రికి ఆలస్యంగా చేరుకున్నామని, సరైన సమయంలో తీసుకెళ్లకపోవడం వల్లే మృతి చెందారంటూ అరుణ్ వాపోయారు. అయితే తనపై వస్తున్న ఆరోపణలను నాగ్‌పాల్ తోసిపుచ్చారు.

దక్షిణ చైనా సముద్రంలో సైనికీకరణ వద్దు

- చైనా చర్యలను ఖండించిన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా

మనీలా

వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా కృత్రిమ దీవులను ఏర్పాటు చేయడాన్ని, వాటిపై నిర్మాణాలు చేపట్టడాన్ని, సైనికీకరణను అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఖండించాయి. చైనా పట్ల ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య(ఆసియాన్) వైఖరి మెత్తబడ్డ తరుణంలో ఈ మూడు దేశాలు ఆదివారం ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. దక్షిణ చైనా సముద్రం గుండా ఏటా సుమారు ఐదు లక్షల కోట్ల డాలర్ల నౌకా వాణిజ్యం సాగుతుంది. ఈ సముద్రంలో అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయని భావిస్తున్నారు. దాదాపు ఈ సముద్రమంతా తనదేనని చైనా వాదిస్తోంది. ఇందులో తమకూ భాగముందని వియత్నాం, మలేషియా, మరికొన్ని ఆసియాన్ సభ్యదేశాలు పేర్కొంటున్నాయి. ఆసియాన్‌లో వియత్నాం, కంబోడియా, మలేషియా, ఇండొనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, బ్రూనై, లావోస్, మయన్మార్, సింగపూర్ సభ్య దేశాలుగా ఉన్నాయి. కొన్నేళ్లుగా పలు సభ్యదేశాలకు చైనా దౌత్య, ఆర్థిక మార్గాల ద్వారా చేరువవుతూ వాటి వైఖరి మెత్తబడేలా చేస్తోంది. శనివారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఒక సదస్సు సందర్భంగా ఆసియాన్ మంత్రులు విడుదల చేసిన ప్రకటనే దీనికి నిదర్శనం. ఇందులో వారు ప్రదర్శించిన మెతక వైఖరి చైనా పైచేయి సాధించడాన్ని స్పష్టం చేస్తోంది. వివాదం విషయంలో చర్చలపై చైనా విధివిధానాలకు ఈ దేశాలు ప్రకటనలో అంగీకారం తెలిపాయి. చర్చల్లో చైనా వాదనను వియత్నాం గట్టిగా వ్యతిరేకించింది. అయితే కంబోడియా 'డ్రాగన్'కు అండగా నిలిచింది. చివరకు చైనాకు అనుకూలమైన ఫలితమే వచ్చింది.

'తీర్పును గౌరవించాలి': సదస్సు సందర్భంగా మనీలాలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు కూడా సమావేశమై వివాదంపై చర్చించారు. దక్షిణ చైనా సముద్ర వివాదంపై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ నిరుడు ఇచ్చిన తీర్పును చైనా, ఫిలిప్పీన్స్ గౌరవించాలని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా డిమాండ్ చేశాయి. ఈ సముద్రంపై చైనా వాదనలను చాలా వరకు ట్రైబ్యునల్ తోసిపుచ్చింది.

అమెరికా వెయ్యి రెట్లు మూల్యం చెల్లించక తప్పదు

- ఐరాస ఆంక్షలపై ఉత్తర కొరియా హెచ్చరిక

సియోల్/వాషింగ్టన్: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆంక్షలు విధించడంపై ఉత్తర కొరియా నిప్పులు చెరిగింది. ఈ చర్యకు ప్రేరేపించిన అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినబూనింది. అమెరికా ఇంతకు వెయ్యి రెట్లు మూల్యం చెల్లించుకొనేలా చేస్తామని హెచ్చరించింది. ఆంక్షల తీర్మానంపై అమెరికాకు వంత పాడిన దేశాలనూ జవాబుదారీ చేస్తామని హెచ్చరించింది. గత నెల్లో రెండు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించినప్పటి నుంచి ఉ.కొరియాపై అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ ఒత్తిడి పెంచుతూ వస్తున్నాయి. ఉ.కొరియా నుంచి బొగ్గు, ఇనుము, ముడి ఇనుము, సీసం, ముడి సీసం, మత్స్య సంపద ఎగుమతులతోపాటు మరికొన్ని ఇతర అంశాల్లో ఆంక్షలను విధించే తీర్మానానికి భద్రతా మండలి వారాంతంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రష్యాతోపాటు ఉ.కొరియా కీలక మద్దతుదారైన చైనా కూడా దీనికి మద్దతు పలికింది. ఆంక్షల విధింపు తమ సార్వభౌమత్వాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనని ఉ.కొరియా సోమవారం వ్యాఖ్యానించింది. తమ అణ్వస్త్ర కార్యక్రమంపై చర్చల్లో పాల్గొనబోమంటూ ప్రకటన చేసింది.



రఘునాథ్ దేవాలయాన్ని సందర్శించిన మెహబూబా

శ్రావణ పూర్ణిమ, రక్షాబంధన్‌ను పురస్కరించుకుని జమ్మూలో గల ప్రఖ్యాత రఘునాథ్ దేవాలయాన్ని జమ్మూకశ్మీరు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ సోమవారం సందర్శించారు. పలు దేవాలయాలు ఉన్న రఘునాథ్ ఆలయ సముదాయంలో పర్యటించిన ఆమెకు దేవాలయ కమిటీ ఛైర్మన్ బి.ఆర్. కుందల్ దగ్గరుండి విశేషాలను వివరించారు. అక్కడే ఉన్న రఘునాథ్ బజార్ అభివృద్ధికి రూ.5.19 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు.

అయిదుగురు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్: సరిహద్దుల్లో పాకిస్థాన్ ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఉత్తర కశ్మీర్‌లోని మాఛిల్ సెక్టార్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ వైపు నుంచి దేశంలోకి ప్రవేశిస్తున్న అయిదుగురు ఉగ్రవాదులను సైనికులు కాల్చి వేశారు. సోమవారం నియంత్రణ రేఖ వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని రక్షణమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. సరిహద్దులను దాటుకుంటూ ఓ ఉగ్రవాదుల ముఠా రావటాన్ని గమనించిన గస్తీ సైనికులు వారిని నిలువరించే యత్నం చేయగా కాల్పులకు తెగించారని, ఎదురు కాల్పులు జరపటంతో అయిదుగురు మృతి చెందారని వెల్లడించారు. వారి నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఎవరైనా ఉగ్రవాదులు తప్పించుకున్నారేమోననే అనుమానంతో సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హతులందరూ లష్కరే తోయిబాకు చెందిన వారని భావిస్తున్నారు.

మరో ఘటనలో పాక్ ఉగ్రవాది... కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఎదురు కాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాది ఉమర్‌ను భద్రత దళాలు మట్టుపెట్టాయి. గత నెల 10న అమర్‌నాథ్ యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి వెనుక అతడి హస్తం ఉందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

భారత జవాన్లపై పాక్ సైనికుల కాల్పులు: పాకిస్థాన్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద యురీ సెక్టర్‌లో భారత జవాన్లపై ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే సోమవారం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో భారత సైనికుడు ఒకరు గాయపడగా అతనిని ఆస్పత్రికి తరలించారు.

డోక్లాం నుంచి భారత్ దళాలు వెళ్లాల్సిందే!

- చైనా సైన్యం సీనియర్ కల్నల్ వ్యాఖ్య

హువైరౌ (చైనా): ఘర్షణ నివారించాలంటే డోక్లాం నుంచి భారత్ సైన్యాలు వైదొలగాల్సిందేనని చైనా సైన్యం (ప్రజా విమోచన సైన్యం-పీఎల్ఏ) సీనియర్ కల్నల్ లీ లీ అన్నారు. చైనా ప్రభుత్వం ఆహ్వానం మేరకు పర్యటిస్తున్న భారత పాత్రికేయులను ఉద్దేశించి సోమవారం బీజింగ్ శివారులోని సైనిక స్థావరంలో ఆయన మాట్లాడారు. 'భారత దళాలు చేసిన పని చైనా భూ భాగాన్ని ఆక్రమించడం కిందకే వస్తుంద'ని చెప్పారు. 'చైనా సైనికులు ఏమని భావిస్తున్నారో మీరు రాయండి. నేను సైనికున్ని. దేశ సమగ్రతను కాపాడడానికి శాయశక్తులా కృషి చేస్తాం. మాకు ఆ సంకల్పం, అంకితభావం ఉన్నాయ'ని అన్నారు. ఈ సందర్భంగా చైనా సైనిక దళాల యుద్ధ విన్యాసాలను భారత పాత్రికేయులకు ప్రదర్శించి చూపించారు. డోక్లాం వివాదానికి, దీనికి సంబంధం లేదని లీ లీ చెప్పారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన విలేకరుల సమావేశంలో రక్షణ శాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ రెన్ గువోకియాంగ్ కూడా మాట్లాడారు. డోక్లాం నుంచి భారత దళాలు వెళ్లిపోయేలా రెండు వారాల్లో చైనా ప్రభుత్వం 'చిన్న స్థాయి సైనిక చర్య' తీసుకుంటుందన్న అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ కథనంపై ఆయన మౌనం వహించారు. 'ఇది మీడియా, మేధావుల అభిప్రాయం కావచ్చు. అధికారిక సమాచారం కోసం విదేశాంగ, రక్షణ శాఖల అధికారిక ప్రతినిధులపైనే ఆధారపడండి' అని సమాధానమిచ్చారు.

చైనా విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేస్తూ 'డోక్లాం వద్ద 48 మంది భారత సైనికులు ఇంకా ఉన్నారు. బుల్డోజర్ కూడా ఉంది. సరిహద్దు పొడవునా బలగాలను మోహరించార'ని పేర్కొంది.

చరవాణిలో సమాచారం ఇక భద్రం!

కొత్త సాంకేతికతను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం

దిల్లీ: చరవాణిల (మొబైల్ ఫోన్లు) నుంచి అధికారిక సమాచారం ఇతరులకు చేరకుండా నిరోధించే కొత్త సాంకేతికతను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. చరవాణిల ద్వారా వేగులు సమాచారాన్ని తస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీన్ని నిరోధించే దిశగా చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. ఈమేరకు కొత్త సాంకేతికతను హైదరాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కేంద్రం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఇది పూర్తవుతుందని వివరించారు. భారత్‌కు మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడంతో.. వివిధ సందర్భాల్లో చరవాణిలను హ్యాక్‌చేసి కొందరు అధికారిక సమాచారాన్ని రహస్యంగా పొందుతున్నారు. కొన్ని న్యూస్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్న సైనిక సిబ్బంది చరవాణిలను పాకిస్థాన్‌కు చెందిన కొందరు హ్యాక్ చేసినట్లు సైబర్ భద్రత నిపుణులు 2015లో ఓ నివేదిక కూడా సమర్పించారు. ఈ నేపథ్యంలో చరవాణిల ఆపరేటింగ్ సిస్టమ్‌కు, అధికారిక సమాచారానికి మధ్య ఓ పొరలా పనిచేసే సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారు. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు.. చరవాణిలోని మైక్రోఫోన్, కాల్ రికార్డ్, ఎస్ఎంఎస్ వంటి సున్నిత సమాచారం బయటకు వెళ్లకుండా కొత్త సాంకేతికత నిరోధిస్తుంది.

పోలియోచుక్కల కోసం నూతన కలాలు

మైసూర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలియోచుక్కల కార్యక్రమంలో నూతన కలాలను (మార్కర్ పెన్నులు) ఉపయోగించనుంది. పిల్లలకు పోలియోచుక్కలు వేసిన అనంతరం వేలిపై వేసేందుకు సరికొత్త సిరాతో కూడిన కలాలను అభివృద్ధి చేశామని మైసూర్ పెయింట్స్, వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) ఛైర్మన్ హెచ్ ఎ వెంకటేశ్ తెలిపారు. అప్పుడే పుట్టిన పసికందుల నుంచి అయిదేళ్లలోపు చిన్నపిల్లలు ఎవరైనా తరచుగా తమ చేతివేళ్లు నోట్లోపెట్టుకోవడం అలవాటు. ఇటువంటి అంశాలను దృష్టిలో ఉంచుకునే వారికి ఎటువంటి హాని కలగకుండా ఉండేలా నూతన సమ్మేళనాలను వినియోగించి ఈ కలాలను, వాటిలో వాడే సిరాను తయారుచేశామని వారు తెలిపారు. నాణ్యతా ప్రమాణాల పరిశీలన కోసం వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రయోగశాలలకు తరలించామన్నారు. ఈ కలాలను తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టే పోలియో కార్యక్రమంలో వినియోగించనున్నారన్నారు.

నదుల పునరుజ్జీవానికి మహోద్యమం

- ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నేతృత్వంలో 'ర్యాలీ ఫర్ రివర్స్'
- తిరువనంతపురం నుంచి దిల్లీ వరకూ యాత్ర
- సెప్టెంబరు 3 నుంచి ప్రారంభం...
- ఆ నెల 13న అమరావతి, 14న హైదరాబాద్‌కు రాక

మరో ఉద్యమం!

మానవ జీవన వికాసానికీ...

సంస్కృతి, నాగరికతలు వెల్లివిరియడానికి మూలమైన నదులను పరిరక్షించుకునేందుకు,

కన్యాకుమారి నుంచి హిమాలయాల వరకూ సాగే మహోద్యమం!

నదుల పరివాహక ప్రాంతాల చుట్టూ చెట్లను నాటడం ద్వారా జీవనదులు అంతరించిపోకుండా కాపాడుకోవచ్చంటూ, ప్రజలకు అవగాహన కలిగించేందుకు 'ఇషా ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ దీనిని చేపడుతున్నారు.

> ఇదేమీ నిరసన కాదు. ఆందోళనా కాదు. నదులు ఎండిపోతుండటంపై జనాన్ని జాగృతంచేసే ప్రచారం. నీళ్లను వాడే ప్రతి ఒక్కరూ 'ర్యాలీ ఫర్ రివర్స్'లో పాల్గొనాలి.
> - జగ్గీ వాసుదేవ్



గోదావరి అధిక భాగం ఎడారిని తలపిస్తోంది. గంగమ్మ పరిస్థితి మరీ ఘోరం. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఈ నది ఉందని ప్రపంచ వన్య నిధుల సంస్థ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో చాలా జీవనదులు ఇప్పుడు ఏడాదిలో కొన్నినెలలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మరెన్నో ఉపనదులు తమ ఉనికినే కోల్పోయాయి. కావేరి, నర్మదా నదులు 40-60% కుంచించుకుపోయి, క్రమంగా జలకళను కోల్పోతున్నాయి. తగినంత ప్రవాహం లేక ఏడాదిలో నాలుగు నెలలు అసలు సముద్రం దరికైనా పోవడంలేదు. మరోవైపు... 1947తో పోల్చితే, ప్రస్తుతం ఒక్కొక్కరికి అందుబాటులో ఉన్న నీళ్లు 75% తగ్గిపోవడం గమనార్హం. ఇషా ఫౌండేషన్ పరిశోధకుల అంచనా ప్రకారం, పరిస్థితి ఇలాగే కొన సాగితే... 2030 నాటికి దేశంలోని జలావసరాలకు కటకట ఏర్పడుతుంది. కేవలం 50% నీరే అందుబాటులో ఉంటుంది. దేశంలో నాలుగోవంతు భూభాగం ఎడారిగా మారిపోయే ప్రమాదముంది. ఈ పరిస్థితిని మార్చి, జీవ నదులను కాపాడుకోవాలంటే.. ప్రతి ఒక్కరికీ నదుల ఆవశ్యకత పట్ల అవగాహన తప్పనిసరి. అందుకే... ప్రభుత్వాధినేతలు, ప్రముఖులు, ప్రజల భాగస్వామ్యంతో జగ్గీ వాసుదేవ్ 'నదుల కోసం ప్రచారం (ర్యాలీ ఫర్ రివర్స్)' చేపడుతున్నారు.

కోయంబత్తూర్‌లో ఆరంభమై...

సెప్టెంబరు 3న కోయంబత్తూర్‌లో ప్రారంభమయ్యే ఈ ర్యాలీ... కన్యాకుమారి, తిరువనంతపురం, మధురై తిరుచురాపల్లి, మధురై, బెంగళూరు, చెన్నై మీదుగా సాగుతుంది. సెప్టెంబరు 13న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి, 14న హైదరాబాద్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి ముంబయి మీదుగా అక్టోబరు 1న హరిద్వార్‌కు చేరుకుని, 2న దిల్లీలో ముగుస్తుంది. 13 రాష్ట్రాలు, 6,560 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రచార యాత్రలో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ పాల్గొంటారు. 20 ప్రధాన నగరాల్లో నిర్వహించే వైవిధ్య కార్యక్రమాల్లో శేఖర్‌కపూర్, తమన్నా, రాకేశ్ ఓంప్రకాశ్ తదితర సినీ ప్రముఖులు, ప్రభుత్వ నేతలు కూడా భాగస్వాములవుతారు. దిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి "నదుల పునరుజ్జీవ విధానపత్రం" సమర్పించడంతో ఈ ర్యాలీ ముగుస్తుంది.

ఏం చేయవచ్చు?

- ప్రతి నదికీ రెండు వైపులా కిలోమీటరు మేర మొక్కలు, చెట్లను నాటడం ద్వారా జలవనరులను పరిరక్షించుకోవచ్చని 'ఇషా' పరిశోధకులు భావిస్తున్నారు.
- నదీ పరివాహకంలోని ప్రభుత్వస్థలాల్లో స్థానికంగా బాగా ఎదిగే మొక్కలను నాటడం, తవ్వకాలు నిలిపివేయాలి.
- పరివాహకంలోని ప్రైవేటు స్థలాల్లో పండ్ల మొక్కలను పెంచాలి.

– ఈనాడు ప్రత్యేక విభాగం

మూడు దశల్లో...

'ర్యాలీ ఫర్ రివర్స్' మూడు దశల్లో సాగుతుంది.

1) ప్రభుత్వ విభాగాలతోపాటు సమాజంలోని అన్ని వర్గాలవారికి, నదులు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంపట్ల అవగాహన కలిగిస్తారు.
2) నదుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో పటిష్ఠ విధానపత్రాన్ని రూపొందిస్తారు.
3) దానిని సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేస్తారు.

- 80009 80009 ఫోన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఎవరైనా ఈ కార్యక్రమానికి తమ మద్దతు తెలపవచ్చు. పాల్గొనవచ్చు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పరిటాల సునీత. చిత్రంలో సీతక్క, అనూరాధ



మంత్రి లోకేశ్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ మంత్రి పీతల సుజాత, మహిళా నేతలు, కార్యకర్తలు

ఈ ప్రభుత్వం ఆడబిడ్డలకు రక్షణ కవచం

- చంద్రబాబు వ్యాఖ్య
- రాఖీలు కట్టిన మంత్రి సునీత తదితరులు

ఈనాడు అమరావతి: తెదేపా ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు రక్షణ కవచంలా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ముఖ్యమంత్రికి ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్మన్ అనురాధ, ఇతర నేతలు సీతక్క, దూలం రాధిక, నిర్మలాదేవి, పి.వెంకటలక్ష్మి, ఆచంట సునీత, ఇతర నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం 'అభయం' యాప్‌ను ప్రవేశపెట్టామని, వారి ఆరోగ్య రక్షకు అనేక పథకాలు తెచ్చామని చెప్పారు. రైతాంగానికి శ్రావణ పౌర్ణమి శుభసమయమని తెలిపారు.

★ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావుకు మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.




జగన్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి షర్మిల

భారత డిజిటల్ గ్రంథాలయ యాప్‌కు గ్లోబల్ అవార్డు

కోల్‌కతా: జాతీయ డిజిటల్ గ్రంథాలయ(ఎన్డీయల్) చరవాణి యాప్‌కు ఎమ్‌బిలియంత్ దక్షిణాసియా-2017 అవార్డు దక్కింది. 'అభ్యసనం, విద్య' విభాగంలో విద్యాసంబంధ అభివృద్ధిలో చరవాణి యాప్ ఆధారిత ఆవిష్కరణకుగానూ ఈ అవార్డు లభించింది. కొన్ని రోజుల క్రితం ఐఐటీ ఖరగ్‌పూర్ ఈ యాప్‌ను రూపొందించగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆమోదించింది. దేశంలో మారుమూల ప్రాంతాలకు సైతం భారతీయ భాషల్లో విద్యా విషయ, బోధనాంశాలు అందరికీ అందుబాటులో ఉంచాలన్నదే ఈ డిజిటల్ గ్రంథాలయం ప్రధాన లక్ష్యం.

మరణించిన వ్యక్తి నాడులతో పక్షవాతం బాధితులకు చికిత్స

బర్మింగ్‌హాం: పక్షవాతానికి గురై పనిచేయకుండా పోయిన కాళ్లు, చేతులతో ఇబ్బందిపడే రోగులకు ఇది ఉపశమనం కలిగించే విషయమే. ఎందుకంటే.. మరణించిన వ్యక్తి నుంచి సేకరించిన నరాలను పక్షవాతానికి గురైన వ్యక్తికి వైద్యులు విజయవంతంగా అమర్చారు. ఇలా చికిత్స చేసినవారిలో కేవలం నెలల వ్యవధిలోనే చేతుల్లో స్పందనలు రావడంతోపాటు కదలికలు చోటుచేసుకున్నాయి. బర్మింగ్‌హమ్‌లో ఎన్‌హెచ్‌ఎస్ ఆసుపత్రిలో 24 మంది రోగులపై ఇప్పటికే ఈ చికిత్స విధానాన్ని ప్రయోగించి చూశారు. ఇప్పటివరకు నరాలు తీవ్రంగా దెబ్బతిన్నవారికి చికిత్స చేయాలంటే శరీరంలోని ఇతర భాగం (కాలు) నుంచి కణజాలం సేకరించేవారు. ఇందుకోసం శరీరంపై రెండు భాగాల్లో చికిత్స చేయాల్సి వచ్చేది. దీనివల్ల శరీరంపై కణజాలం సేకరించిన భాగం వద్ద మచ్చతోపాటు, మొద్దుబారడం, నొప్పికూడా తీవ్రంగా ఉండేది. కొత్త విధానంలో కేవలం చిన్నపాటి గాటు పెట్టి చికిత్స చేస్తున్నారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువ.



ఈ ఆకర్షణీయ చెట్టు.. కాలుష్యానికి గొడ్డలి పెట్టు

బెర్లిన్: పట్టణాలు, నగరాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలనే ఆలోచన అందరికీ ఉన్నా.. చెట్లు పెంచేందుకు స్థలమే దొరకని దుస్థితి. ఈ పరిస్థితికి సమాధానంగా తమ ఆవిష్కరణతో ముందుకొచ్చింది జర్మనీకి చెందిన గ్రీన్ సిటీ సొల్యూషన్స్ అనే అంకుర సంస్థ. ఈ సంస్థ నగరాల్లోని రద్దీ కూడళ్ల వద్ద ఆకర్షణీయ చెట్లు (స్మార్ట్ ట్రీ) ఏర్పాటుచేస్తోంది. చతురస్ర ఆకారంలో ఇనుప చట్రం వంటిది ఏర్పాటుచేసి.. దాని ఉపరితలమంతటా నాచు, పాకుడు (మాస్, లిచెన్స్) ఉంచుతారు. వాతావరణంలోని నైట్రోజన్ డై ఆక్సైడ్, ఓజోన్ పరమాణువులు ఈ ఉపరితలంలో చిక్కుకుంటాయి. తాము రూపొందించిన ఆకర్షణీయచెట్టును ఒకదానిని ఏర్పాటుచేస్తే.. దాని నుంచి దాదాపుగా 275 చెట్ల నుంచి వచ్చే ఫలితాలను పొందగలమని పరిశోధకులు చెబుతున్నారు. అదే సమయంలో 275 చెట్లు నాటేందుకు అవసరమైన స్థలంతో పోల్చితే 99% తక్కువ స్థలం చాలని, 5% ఖర్చు అవసరమవుతుందని చెప్పారు. ఈ చెట్లకు సౌరఫలకల నుంచి విద్యుత్తు అందుతుంది. దాంతోపాటు ఐవోటీ ఆధారిత వ్యవస్థతో కూడిన కొద్దిపాటి నిర్వహణ కూడా అవసరం అవుతుంది.



రోమ్ కాంక్రీట్ మిశ్రమం గుట్టు తెలిసింది

వాషింగ్టన్: రోమన్లు నిర్మించిన కట్టడాల్లోని కాంక్రీట్ నాణ్యత, దృఢత్వం, సముద్రపు నీటిని తట్టుకోగలగడం వెనుకగల రహస్యాన్ని కనిపెట్టినట్లు అమెరికా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద, సముద్రపునీరు, సున్నం కలిపి రోమన్లు శక్తిమంతమైన కాంక్రీట్ తయారుచేశారు. ఈ మూడు మిశ్రమాలను కలపడం వల్ల జరిగిన రసాయనచర్య కారణంగా.. ఏర్పడిన స్ఫటికాలు కాంక్రీట్‌లోని ఖాళీలను ఆక్రమించేస్తాయి. ఫలితంగా కట్టడానికి అదనపు దృఢత్వం సమకూరుతుంది. రోమన్లు నిర్మించిన రేవు స్తంభంను పరిశోధించగా ఈ విషయం వెల్లడైంది. ప్రస్తుత కాలంలో ఉపయోగిస్తున్న కాంక్రీట్‌ను తయారుచేయడానికి వినియోగించే పదార్థాలను సముద్రపునీటితో కలిపితే.. రోమన్ల కాలం నాటి కాంక్రీట్ తరహాలో రసాయనచర్యలు చోటుచేసుకోవడం లేదు. అగ్నిపర్వతాల దిగువ ప్రాంతాల్లో దొరికే రాతిశిలల్లో (టఫ్) మాత్రం ఇటువంటి లక్షణాలు ఉన్నాయి. బహుశా ఈ కారణం చేతనే రోమన్లు కాంక్రీట్‌కోసం అగ్నిపర్వతాల నుంచి వెలువడే బూడిదను వాడి ఉండొచ్చని శాస్త్రవేత్తలు ఓ అభిప్రాయానికి వచ్చారు. "కాంక్రీట్‌ను ఎలా తయారుచేయాలనే విషయమై మా పరిశోధన కొత్త దృక్పథాలను ఆవిష్కరించింది" అని పరిశోధనకు నేతృత్వం వహించిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (బర్కిలీ) ఆచార్యుడు మేరీ జాక్సన్ పేర్కొన్నారు.



అమ్మను చూద్దామంటే.. అస్థిపంజరమే మిగిలింది

ముంబయి: ఏడాది తర్వాత తల్లిని చూద్దామని ఆదివారం అమెరికా నుంచి వచ్చిన కుమారుడికి ఆమె చనిపోయి అస్థిపంజరంగా మిగిలిన ఘటన ముంబయిలో చోటు చేసుకుంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముంబయికి చెందిన రీతురాజ్ సహాని అమెరికాలోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అక్కడే భార్యతో కలిసి ఉంటున్నారు. ఆయన ఏడాదికిగాని, ఆర్నెళ్లకు ఓసారిగాని తల్లి ఆషాసహాని(60)ని చూసి వెళ్లడానికి ముంబయి వస్తుంటారు. చివరిగా తల్లితో గతేడాది ఏప్రిల్‌లో మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆయన ముంబయిలోని అంధేరిలో బెల్ స్కాట్ టవర్ ఓషివరా ఫ్లాట్‌లో 10వ అంతస్తులో తన తల్లి ఉండే ఫ్లాట్ వద్దకు చేరుకుని బెల్ కొట్టారు. గది లోపలి నుంచి తాళం వేసి ఉంది. తలుపు తీయగా ఆమె శరీరం మొత్తం కుళ్లిపోయి అస్థిపంజరం మాత్రమే మిగిలిపోయింది. ఆయన వెంటనే పోలీసులకు సమాచారమందించారు. తమకు ఇక్కడ బంధువులు ఎవరూ లేరని పోలీసులకు తెలిపారు. ఆమె శరీరాన్ని శవపరీక్ష నిమిత్తం సిద్ధార్థ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. లోపలి నుంచి తాళం వేసి ఉన్నందున ఆమె సహజంగానే మరణించిందని భావిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ అరుణ్‌రజానే పేర్కొన్నారు.

రోజుకు రూ.50 కోట్లు తాగేస్తున్నారు!

- మద్యం వదలి... బీర్ల వైపు చూస్తున్న మందుబాబులు
- జులైలో రూ.1,574.92 కోట్ల విలువైన మద్యం విక్రయాలు
- గతేడాది జులైతో పోలిస్తే పెరిగిన ఆదాయం

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన తొలి నెల (జులై)లో రాష్ట్రంలో రోజుకు సగటున రూ.50 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. ఈ లెక్కన రోజుకు సగటున రూ.10కోట్ల మేర ప్రభుత్వాదాయం పెరిగినట్లయ్యింది. సాధారణంగా రాష్ట్రంలో రోజుకు సగటున రూ.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతాయి. గతేడాది (2016) జులై నెలతో పోల్చి చూస్తే రాష్ట్రంలో బీరు విక్రయాలు భారీగా పెరగ్గా. .మద్యం (ఐఎంఎల్) విక్రయాలు స్వల్పంగా తగ్గాయి. మరోవైపు గత నెలకు సంబంధించి మద్యం వినియోగంలో విశాఖ పట్నం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండగా... తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలు వరుసగా దాని తర్వాత స్థానాల్లో నిలిచాయి.



- గతేడాది జులై నెలతో పోలిస్తే ఈ ఏడాది జులై నెలలో 11,577 కేసుల ఐఎంఎల్ విక్రయాలు తగ్గినా ఆదాయం రూ.221.14 కోట్ల మేర పెరిగింది. 2015 జులై నెలతో పోలిస్తే ఈ ఏడాది జులై నెలలో 47,480 కేసుల బీరు విక్రయాలు తగ్గినా ఆదాయం మాత్రం రూ.16.66 కోట్ల మేర పెరిగింది. మొత్తంగా చూస్తే 2015 జులై నెలతో పోలిస్తే రూ.239.80 కోట్లు, 2016 జులై నెలతో పోలిస్తే రూ.285.87 కోట్ల మేర ఈ ఏడాది జులై నెలలో మద్యం విక్రయాలు పెరిగాయి. గతేడాది జులై నెలతో పోలిస్తే ఈ ఏడాది జులై నెలలో 30.91 శాతం మేర బీరు విక్రయాలు పెరిగాయి. విక్రయాల విలువ 48.92 శాతం మేర ఆదాయం పెరిగింది.
- జులై నెలలో రూ.1,574.93కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించగా...అందులో రూ.662.54 కోట్లు(42.06 శాతం) విలువైన మద్యం విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే తాగేశారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల్లో మద్యం వినియోగం అధికంగా ఉంది. గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మద్యం (ఐఎంఎల్) విక్రయాలు గతేడాది జులైతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. అన్ని జిల్లాల్లోనూ బీర్ల విక్రయాలు మాత్రం బాగా పెరిగాయి.
- జులై నెల 19వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గొలుసు దుకాణాలు తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికి రాష్ట్రంలో 50 వేల గొలుసు దుకాణాలుంటాయని అంచనా కాగా...వాటిలో ప్రస్తుతం 5 శాతం దుకాణాలు మాత్రమే కొనసాగుతున్నాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చినా మొదటి పదిహేను రోజుల పాటు జనావాసాల మధ్య దుకాణాలు వద్దంటూ ఎక్కడికక్కడ మహిళలు, స్థానికులు ఆందోళనలు చేయడంతో దుకాణాలు ప్రారంభం కాలేదు. అయినా మద్యం వ్యాపారం జోరు మాత్రం రాష్ట్రంలో తగ్గలేదు.



మూసివేసిన ఆలయం ఎదుట తితిదే ఈవో సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, అర్చకులు

శ్రీవారి ఆలయం తలుపులు మూసివేత

నేడు ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం

తిరుమల, ఇంద్రకీలాద్రి, అన్నవరం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ తలుపులను సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మూసివేశారు. ఈ కార్యక్రమాన్ని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు, అర్చకులు పర్యవేక్షించారు. మంగళవారం వేకువజామున 2 గంటలకు తలుపులు తెరిచి ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహించనున్నారు. 3 గంటల నుంచి శ్రీవారికి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలు నిర్వహిస్తారు. ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభిస్తారు. గ్రహణం కారణంగా పలు ఆర్జిత సేవలను తితిదే రద్దు చేసింది. సోమవారం ఆలయం తలుపులు మూసివేసే సమయానికి శ్రీవారిని 39 వేల మంది దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు తిరిగి అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారు.

దుర్గమ్మ ఆలయం మూసివేత: చంద్రగ్రహణం నేపథ్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వరాలయాన్ని సోమవారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. మంగళవారం వేకువజామున 3 గంటలకు తలుపులు తెరుస్తారు. సుప్రభాత సేవ, స్నపన, అలంకరణ పూర్తయిన తరువాత ఉదయం 8 గంటల నుంచి భక్తులను సర్వ దర్శనానికి అనుమతిస్తారు.

అన్నవరం ఆలయం..: అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయఅధికారులు తెలిపారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఎంపీ నాని

- ఆరెంజ్ ట్రావెల్స్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి

పటమట (విజయవాడ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంపీ కేశినేని నానికి వ్యాపారం చేయడం చేతగాక, మూసేసుకుని... ఇతర ఆపరేటర్లు వ్యాపారాలు చేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరెంజ్ ట్రావెల్స్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి సేవా పన్నును రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు చెల్లించకుండా ఆయన ఎగనామం పెట్టారని ఆరోపించారు. విజయవాడలో ఆరెంజ్ ట్రావెల్స్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రమాదానికి గురైన తమ బస్సుకు సంబంధించి ఇప్పటివరకు నెలకొన్న పరిణామాలను వివరించారు. విజయవాడ మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, డాక్యుమెంట్స్ తీసుకువెళ్లి తమ వాహనాన్ని విడిపించుకోమని హైకోర్టు స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చిందని వెల్లడించారు. ఆ మేరకు సోమవారం ఉదయం పటమట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాహనాన్ని విడుదల చేయాలని కోరితే, పత్రాలన్నీ తీసుకొని, పట్టించుకోకుండా వదిలేశారన్నారు. విజయవాడ పోలీసు కమిషనర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని సునీల్‌రెడ్డి చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకొచ్చేందుకు అన్ని దేశాలు వెళ్లి వస్తున్నారని... మరో పక్క ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేస్తున్న వారిపై ఆంధ్రప్రదేశ్‌లో దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం పరువు బజారు పాలవుతోందని, పెట్టుబడిదారులు రాష్ట్రంలో ముఖ్యంగా విజయవాడలో జరుగుతున్న అరాచకాలను గుర్తిస్తున్నారని, వీటిని ఆపాలని సీఎం చంద్రబాబును కోరారు.

రాష్ట్రంలో 43 శాతం విస్తీర్ణంలోనే పంటలు

- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 43 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని, గతంతో పోలిస్తే 6 లక్షల హెక్టార్లలో సాగు తగ్గిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పట్టిసీమ నుంచి గోదావరి నీటిని తేవడం వల్లే కృష్ణా డెల్టాలో సాగునీటి సంక్షోభాన్ని నివారించగలిగామని తెలిపారు. బీమా పరిహారం రూ.248 కోట్లు, పెట్టుబడి రాయితీ రూ.350 కోట్లు ఇంకా రైతుల ఖాతాలకు జమ చేయాల్సి ఉందన్నారు. తక్షణమే ఈ నిధులు అందేలా చూస్తే రైతులు పెట్టుబడులకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. పంట రుణాల మంజూరు 60 శాతం మాత్రమే ఉండటంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పలు ఆదేశాలు జారీ చేశారు.

- ఆగస్టు 9 నుంచి 15 వరకు రాష్ట్రమంతటా వర్షాలు కురిసే అవకాశం ఉందని ముందస్తు అంచనాలు చెబుతున్నాయి. వారం రోజుల పాటు పంటను కాపాడుకుంటే నెల వరకూ ఇబ్బంది ఉండదు.
- వర్షాభావ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి.
- సూక్ష్మపోషకాల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలి.
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో బోర్ల సేద్యాన్ని మరింత పెంచాలి. సూక్ష్మసేద్యం పెద్ద ఎత్తున చేపట్టాలి.
- విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
- 'ఈ-క్రాప్ బుకింగ్'లో లోపాలకు తావీయరాదు.
- శ్రావణమాసంలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తారు. వారికి పూర్తిస్థాయిలో సహకరించాలి.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌మిశ్రా దంపతులు సోమవారం దర్శించుకున్నారు. జస్టిస్ మిశ్రాకు పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు.

వెంబడించి.. వేధించిన వారికి కఠిన శిక్ష వేయండి

- హరియాణా భాజపా నేత కుమారుడి కేసులో ఐఏఎస్‌ల సంఘం డిమాండ్
- కోర్టులో 'పిల్' వేస్తానన్న స్వామి

దిల్లీ

ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె కారును హరియాణా భాజపా అధ్యక్షుడి తనయుడు వికాస్ బరాలా(23), అతడి స్నేహితుడు ఆషిష్ కుమార్ (27)లు వెంబడించి..దానిని ఢీకొట్టినంత పనిచేస్తూ ఒంటరిగా వెళుతున్న ఆమెను తీవ్ర భయాందోళనలకు గురిచేసిన ఘటనపై సర్వత్రా తీవ్ర నిరసనలు వ్యక్తమౌతున్నాయి. చండీగఢ్‌లో శుక్రవారం రాత్రి కారులో వెళుతున్న ఆమెను వారు అయిదుకిలోమీటర్ల దూరం వరకూ వెంటాడారన్న ఆరోపణలున్నాయి.

ఈ ఘటన పట్ల 'భారతీయ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు (కేంద్ర) సంఘం అత్యంత తీవ్రంగా స్పందించింది. నిందితులిద్దరికీ కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేసింది. దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న 5004 మంది ఐఏఎస్ అధికారులకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం గమనార్హం. ఆడపడుచులకు భారత్‌ను అత్యంత సురక్షితమైన ప్రదేశంగా మలచాల్సిన తక్షణావసరం ఉందని సోమవారం ట్విటర్‌లో విస్పష్ట ఉద్ఘాటన చేసింది.

నిందితులకు కఠిన శిక్ష పడాలనీ...ఈ దిశగా ఎలాంటి అవాంతరాలు, ఒత్తిడులూ వచ్చినా తాను తలొగ్గేదే లేదనీ బాధితురాలి తండ్రి, హరియాణా కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి వీరేందర్ కుందు సోమవారం స్పష్టం చేశారు. ఒకవేళ ఈ ఘటనను నీరుగార్చే ప్రయత్నమేదైనా జరిగితే తాను ఊరుకునేదే లేదనీ...వెంటనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాననీ ఆయన చెప్పారు. ఇది సుస్పష్టమైన కేసన్నారు.

ఈ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని జాతీయ మహిళా కమిషన్ సోమవారం కోరింది. దీనిపై కమిషన్ ఛైర్‌పర్సన్ లలితా కుమారమంగళం పోలీసులకు ఓ లేఖ రాశారు. ఈ ఘటనపై తాను ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) వేయనున్నట్లు భాజపా నేత సుబ్రమణ్యం స్వామి ట్విటర్‌లో తెలిపారు.

గోరక్షకులకు 'ప్రభుత్వ గుర్తింపు'

హరియాణా, ఉత్తరాఖండ్ నిర్ణయం

దిల్లీ: గోరక్షకులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని హరియాణా, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు నిర్ణయించాయి. దీని కోసం గో సేవా ఆయోగ్ (ఆవుల సంరక్షణ కమిషన్) పేరిట కమిషన్లనూ ఏర్పాటు చేశాయి. దీపావళికి ముందే 'అధికారిక గోరక్షకులను' నియమించే పనిలో పడ్డాయి. గుర్తింపు పొందిన గోరక్షకులకు ఎలాంటి అధికారాలుండాలి? అనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అయితే పోలీసులు చర్యలు తీసుకోవడానికి, లేదా విచారణ మొదలు పెట్టేందుకు సరిపడే సమాచారాన్ని అందించే బాధ్యతను వీరికి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. గుర్తింపు పొందినవారు పోలీసులకు సహాయకులుగా వ్యవహరిస్తారని, ముఖ్యంగా తమ పరిధిలో చోటుచేసుకునే అనుచిత ఘటనలపై వెంటనే స్పందిస్తారని హరియాణా ఆవుల సంరక్షణ కమిషన్ ఛైర్మన్ భానీ రామ్ మంగళ చెప్పారు.

కేంద్రం, రాష్ట్రాల్లో దోపిడీ పాలన

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చింతూరు, న్యూస్‌టుడే: కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ దోపిడీ పాలనను అవలంబిస్తున్నాయని భద్రాద్రి కొత్తగూడెం, తూర్పుగోదావరి జిల్లాల మావోయిస్టు పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి ఆజాద్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో ఆదివాసులను, దళితులను, మైనార్టీలను నిర్వాసితులుగా మారుస్తున్నారన్నారు. పోలీసు బలగాలు హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతూ దాడులు చేస్తున్నాయన్నారు. ఏపీ, తెలంగాణలు ఉమ్మడిగా కుట్రపన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో గనులు తవ్వుకునేందుకు శరవేగంతో పోలీసు క్యాంపు కార్యాలయాలు నిర్మిస్తున్నాయని ఆరోపించారు. అమరుల ఆశయాల సాధనకు పోరాటాలు సాగించాలన్నారు.



శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తేయండి

బీసీసీఐని ఆదేశించిన కేరళ హైకోర్టు

కోచి

నిషేధిత క్రికెటర్ శ్రీశాంత్‌కు ఊరట లభించింది. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించి బీసీసీఐ అతడిపై విధించిన జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు ఎత్తివేసింది. స్పాట్ ఫిక్సింగ్ కేసు నుంచి దిల్లీ కోర్టు తనను విముక్తుణ్ని చేసినా, బీసీసీఐ నిషేధాన్ని ఎత్తివేయకపోవడాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ మార్చిలో హైకోర్టును ఆశ్రయించాడు. శ్రీశాంత్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మహ్మద్ ముస్తాక్.. అతడిపై నిషేధాన్ని ఎత్తివేయాలని బీసీసీఐని ఆదేశించారు. "స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో శ్రీశాంత్ పాత్ర ఉందని చెప్పే ఆధారాలేమీ లేవు. ఐతే ఈ వ్యవహారంలో అతడి ఉదాసీనత ఖండనీయమే" అని అన్నారు. స్పాట్ ఫిక్సింగ్ కేసులో శ్రీశాంత్, అంకిత్ చవాన్, చండిలా సహా మొత్తం 36 మందిని దిల్లీ కోర్టు 2015లో నిర్దోషులుగా తేల్చింది. హైకోర్టు తాజా తీర్పును కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) స్వాగతించగా.. తీర్పును అధ్యయనం చేయాల్సివుందని బీసీసీఐ చెప్పింది. "తీర్పు ఈ రోజే వచ్చింది. బీసీసీఐ న్యాయ బృందం తీర్పును అధ్యయనం చేసి, అభిప్రాయం చెబుతుంది. ఏం చేయాలో ఆ తర్వాత నిర్ణయిస్తాం" అని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా చెప్పాడు. కోర్టు తీర్పు పట్ల కేసీఏ హర్షం వ్యక్తం చేసింది. "మొదటి నుంచీ మేం శ్రీశాంత్‌కు మద్దతుగా ఉన్నాం. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో అతడి జీవితం మళ్లీ సాధారణ స్థితికి వస్తుందని ఆశిస్తున్నాం" అని కేసీఏ కార్యదర్శి జయేష్ జార్జ్ అన్నాడు. కేరళ రంజీ జట్టు ఎంపికలో శ్రీశాంత్‌ను పరిగణనలోకి తీసుకుంటా అని అడిగినప్పుడు.. "ఇప్పుడే ఆ విషయం చెప్పలేను. దీనిపై సంఘం సమష్టిగా నిర్ణయం తీసుకోవాలి. సెలక్టర్లు అతడి ఫిట్‌నెస్‌పై తెలుసుకోవాల్సివుంది. శ్రీశాంత్ వయసు 34 ఏళ్లు. నాలుగేళ్ల నుంచి అతడు ఆడట్లేదు. ఐతే తన ప్రతిభ, అనుభవంతో కేరళ రంజీ జట్టుకు గొప్ప ఆస్తి అవుతాడు" అని చెప్పాడు.

> "దేవుడికి కృతజ్ఞతలు. నేను మళ్లీ టెస్ట్ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. మరో మూడు నాలుగేళ్లు క్రికెట్ ఆడగలను. కష్టాలు వస్తుంటాయి, పోతుంటాయి. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడమే ఇప్పుడు నా లక్ష్యం. ఇక నేను రంజీ క్రికెట్‌కు సిద్ధమవుతా"
> – శ్రీశాంత్

ఛాంపియన్స్

విరాట్.. ఇమ్రాన్‌ను అనుసరించు!



కొలంబో: స్వదేశంలో వరుసగా సిరీస్‌లు గెలిచేసింది టీమ్ ఇండియా. తర్వాత వెస్టిండీస్‌కు వెళ్లి ఆ జట్టును మట్టికరిపించేసింది. ఇప్పుడు శ్రీలంక మీదా అలవోకగా నెగ్గేసింది. మ్యాచ్‌లు హోరాహోరీగా సాగకపోవడం, భారత్ ఏకపక్షంగా గెలిచేస్తుండటం అభిమానుల్లో మ్యాచ్‌ల పట్ల ఆసక్తిని తగ్గించేస్తున్న మాట వాస్తవం! ఈ నేపథ్యంలోనే మాజీ ఆటగాడు, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్ విరాట్ భారత్‌కు కఠిన సిరీస్‌లు ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చాడు. "ఇమ్రాన్ ఖాన్ బలమైన పాకిస్థాన్ జట్టును నడిపించే సమయంలో తమకు సవాలు విసిరే జట్లతో సిరీస్‌లు పెట్టాలని బోర్డును కోరేవాడు. విరాట్ కూడా ఇప్పుడదే చేయాలి" అని ట్వీట్ చేశాడు మంజ్రేకర్.



మహేల సంగక్కర!

కుశాల్ మెండిస్

రెండు నెలల కిందట ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తన ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. మరోవైపు శ్రీలంక తన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడింది. ఈ స్థితిలో లంకతో మ్యాచ్‌లో భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. పైగా భారత్.. లంక ముందు 322 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలపడంతో ఆ జట్టు పనైపోయినట్లే అనుకున్నారంతా. కానీ అప్పుడో కుర్రాడు భారత బౌలర్లను ఎదురొడ్డి నిలిచాడు. లక్ష్యం కొండంత ఉన్నా అతను అదరలేదు.. బెదరలేదు. అసమాన ఇన్నింగ్స్‌తో లంక విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడా కుర్రాడే.. తమ దేశంలో పట్టపగ్గాల్లేకుండా సాగిపోతున్న భారత స్పిన్నర్లకు కళ్లెం వేశాడు. కళ్లు చెదిరే షాట్లతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. అసలు స్పిన్నర్లను ఎలా ఆడాలో చూపించాడు. అద్భుత ఇన్నింగ్స్‌తో.. ఏకపక్షంగా సాగిపోతున్న సిరీస్‌కు జీవం తెచ్చిన ఆ కుర్రాడే.. కుశాల్ మెండిస్.

ఈనాడు క్రీడావిభాగం

భారత్ స్కోరు 622. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకే కుప్పకూలి ఫాలో ఆన్‌లో పడింది. ఆ జట్టు ఇన్నింగ్స్ ఓటమి ఖాయమని ముందే తెలిపోవడంతో వీక్షకుల్లోనూ ఆసక్తి సన్నగిల్లిపోయింది. అలా అనాసక్తితో శ్రీలంక రెండో ఇన్నింగ్స్ చూడటం ఆపేసి ఉంటే.. ఒక గొప్ప బ్యాటింగ్ ప్రదర్శనను లైవ్‌లో చూసే అవకాశాన్ని కోల్పోయినట్లే! మ్యాచ్ చూసిన వాళ్లకు తెలుసు మెండిస్ ఇన్నింగ్స్ విలువేంటో! ముఖ్యంగా టీమ్‌ఇండియాకు కుశాల్ మెండిస్ ఎంతటి ప్రతిభావంతుడో.. అతడి బ్యాటింగ్ సామర్థ్యమేంటో బాగానే తెలిసొచ్చింది. స్పిన్‌ను అడ్డదిడ్డంగా ఆడేస్తున్న ఈ తరం బ్యాట్స్‌మెన్‌కు పాఠాలు నేర్పేలా సాగింది మెండిస్ ఆట.

శ్రీలంక స్పిన్‌లో అంత పస లేక, మన బ్యాట్స్‌మెన్ బాగా ఆడటం వల్ల భారత్ భారీ స్కోరు చేయగలిగింది కానీ.. రెండో టెస్టు జరిగిన పిచ్ అంత తేలిగ్గా ఏమీ లేదు. పిచ్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటే బ్యాట్స్‌మెన్‌ను స్పిన్నర్లు ముప్పుతిప్పలు పెట్టొచ్చన్నది శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లోనే తేటతెల్లమైంది. ఆ జట్టును 183 పరుగులకే కుప్పకూల్చేయడంతో భారత స్పిన్నర్ల ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఆ ఊపులో ప్రత్యర్థిని మరోసారి కూల్చేద్దామని ఉత్సాహంగా బరిలోకి దిగారు స్పిన్నర్లు. ఆరంభం నుంచే స్పిన్ దాడి మొదలైంది. ఓవైపు.. అశ్విన్.. మరోవైపు జడేజా దాడికి దిగారు. పైగా లంక మూడో ఓవర్లోనే వికెట్ కోల్పోయి ఒత్తిడిలో పడింది. అలాంటి స్థితిలో క్రీజులోకి వచ్చిన మెండిస్.. భారత స్పిన్ ద్వయాన్ని ఎదుర్కొన్న తీరు ఆశ్చర్యకరమే.

అంతిమంగా మ్యాచ్ గెలిచినా.. మన స్పిన్నర్లపై ఎదురు దాడి చేస్తూ మెండిస్ ఆధిపత్యం చలాయించిన తీరు.. భారత్‌నే ఆత్మరక్షణలోకి పడేసింది. ఆరంభంలో బ్యాట్స్‌మెన్ చుట్టూ మూగి ఉన్న ఫీల్డర్లను బౌండరీ హద్దుల దగ్గరికి పంపక తప్పని పరిస్థితి కల్పించాడు మెండిస్. అంత సాధికారికంగా, దూకుడుగా సాగింది అతడి బ్యాటింగ్. ముఖ్యంగా స్వీప్ షాట్లతో స్పిన్నర్ల లయను కుశాల్ దెబ్బ తీసిన తీరు అమోఘం. తొలి ఇన్నింగ్స్‌లో క్రీజులో ఉండి ఆడి ఇబ్బంది పడ్డ మెండిస్.. రెండో ఇన్నింగ్స్ చాలా వరకు పాదాన్ని ముందు పెట్టే ఆడాడు. షాట్లు ఆడేందుకు పాదాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు. బంతికి స్పిన్, బౌన్స్ అయ్యే అవకాశం ఇవ్వకుండా పిచ్ అయ్యీ కాగానే షాట్ ఆడే ప్రయత్నం చేశాడు కుశాల్. చక్కటి ఫుట్‌వర్క్‌తో, సౌకర్యవంతమైన భంగిమలో.. బ్యాట్‌ను పైనుంచి కిందికి వంచుతూ సరైన కోణంలో స్వీప్ షాట్లు ఆడాడు. మణికట్టును కూడా చక్కగా ఉపయోగించాడు. బంతి టర్న్, బౌన్స్ కావడానికి ముందే.. సాధికారికంగా స్వీప్ చేశాడతను. ఈ ప్రణాళికాబద్ధమైన ఎదురుదాడి.. ఓ దశలో భారత స్పిన్నర్లకు దిక్కుతోచని స్థితిలోకి నెట్టేసింది. అప్పుడప్పుడూ ముందుకొచ్చి కూడా బంతిని డ్రైవ్ చేసిన మెండిస్.. రివర్స్ స్వీప్ కూడా సాధికారితతో ఆడాడు.

స్పిన్నర్ల ఆత్మవిశ్వాసాన్ని, లయను దెబ్బ తీసే షాట్లలో స్వీప్ ఒకటి. ఒకప్పుడు గ్రాహం గూచ్, గ్యాటింగ్, లక్ష్మణ్, హేడెన్, ఆండీ ఫ్లవర్, సచిన్ లాంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్ ఈ షాట్‌తోనే స్పిన్నర్లపై ఆధిపత్యం చలాయించేవారు. స్వీప్ బాగా ఆడే బ్యాట్స్‌మెన్ ఎదురైతే మేటి స్పిన్నర్లకైనా ఇబ్బందే. అదే సమయంలో స్వీప్ ప్రమాదకరమైన షాట్ కూడా. సరిగ్గా ఆడకుంటే, తేడా వస్తే బంతి ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేచి ఔటయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే సాంకేతికంగా బలంగా లేని ఆటగాళ్లు ఈ షాట్‌ను ఎక్కువగా ఆడరు. ఈ తరంలో స్వీప్ ఆడేవాళ్లు తగ్గిపోయారు కూడా! మెండిస్ మాత్రం స్వీప్ షాట్లను సాధికారికంగా ఆడి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అతను బాదిన 17 బౌండరీల్లో 8 స్వీప్ షాట్లే. మెండిస్ 110 పరుగులు చేస్తే.. అందులో స్క్వేర్ లెగ్, మిడ్‌వికెట్, లాంగాన్ ప్రాంతాల్లో కలిపి 65 పరుగులొచ్చాయి. లెగ్ సైడ్ చాలా బలంగా కనిపించిన మెండిస్.. ఆఫ్ డ్రైవ్‌లు కూడా బాగా ఆడాడు. ముఖ్యంగా ఆఫ్ వికెట్ ఆవల పడ్డ ఫుల్ లెంగ్త్ బంతిని కవర్ డ్రైవ్ ఆడిన తీరు ద్రవిడ్‌ను గుర్తుకు తెచ్చింది. ఈ సిరీస్‌లో భారత్ ఎంత ఆధిపత్యం చలాయించినా.. రెండో టెస్టు చివర్లో మెండిస్ క్రీజులో ఉన్న ఆ కొన్ని గంటలు మాత్రం అతడిదే పైచేయి! స్వయంగా కోహ్లీనే మెండిస్‌ను కట్టడి చేయలేకపోయామని.. అతడి షాట్లకు ఆశ్చర్యచకితులయ్యామని చెప్పడం విశేషం.

దిగ్గజ ఆటగాళ్లు జయవర్ధనె, సంగక్కరల నిష్క్రమణ తర్వాత వాళ్ల స్థానాల్ని భర్తీ చేయడం లంకకు చాలా కష్టమైపోయింది. బ్యాటింగ్ టెక్నిక్, నైపుణ్యం, టైమింగ్, అందం.. ఇలా ఎందులోనైనా మహేల, సంగల స్థాయికి చేరువగా ఉన్న బ్యాట్స్‌మన్ ఒక్కరూ కనిపించలేదు! ఐతే ఇప్పుడు మెండిస్‌లో వారి వారసుడిని చూసుకుంటున్నారు లంకేయులు. వాళ్లిద్దరిలోని క్లాస్ ఇతడి ఆటలో కనిపిస్తోందంటున్నారు విశ్లేషకులు. 21 ఏళ్ల మెండిస్ ఇప్పటిదాకా ఆడింది 19 టెస్టులే అయినా... అతడి బ్యాటింగ్ శైలిని, నైపుణ్యాన్ని చూసిన మాజీలు శ్రీలంక జట్టుకు ఓ ఆణిముత్యం దొరికినట్లేనంటున్నారు. మరి మెండిస్ మున్ముందు ఎలా ఆడతాడో.. ఏమేరకు విజయవంతమవుతాడో.. తన కెరీర్‌ను ఎలా నిర్మించుకుంటాడో.. ఏ స్థాయికి చేరుకుంటాడో చూడాలి.

> **ఒకప్పుడు గూచ్, గ్యాటింగ్, ఆండీ ఫ్లవర్, లక్ష్మణ్, సచిన్ లాంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్ ఈ షాట్‌తోనే స్పిన్నర్లపై ఆధిపత్యం చలాయించేవారు. వారి లయను దెబ్బ తీసేవారు. ఐతే స్వీప్ ప్రమాదకరమైన షాట్. సరిగ్గా ఆడకుంటే, తేడా వస్తే బంతి ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేచి ఔటయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే సాంకేతికంగా బలంగా లేని ఆటగాళ్లు ఈ షాట్‌ను ఎక్కువగా ఆడరు. ఈ తరంలో స్వీప్ ఆడే వాళ్లు తగ్గిపోయారు కూడా! ఐతే మెండిస్ మాత్రం స్వీప్ షాట్లను సాధికారికంగా ఆడి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అతను బాదిన 17 బౌండరీల్లో 8 స్వీప్ షాట్లే.**

ఇంగ్లాండ్‌దే సిరీస్

- నాలుగో టెస్టులో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం
- మొయిన్ అలీకి ఐదు వికెట్లు



బ్రాడ్‌తో మొయిన్ అలీ

మాంచెస్టర్: మొయిన్ అలీ మాయ చేయడంతో చివరిదైన నాలుగో టెస్టులో ఆతిథ్య ఇంగ్లాండ్ 177 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. సిరీస్‌ను 3-1తో చేజిక్కించుకుంది. నాలుగో రోజు 380 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా.. అలీ (5/69) స్పిన్ మాయాజాలానికి విలవిల్లాడింది. 62.5 ఓవర్లలో 202 పరుగులకే ఆలౌటైంది. ఆమ్లా (83), డుప్లెసిస్ (61) మాత్రమే రాణించారు. అండర్సన్ మూడు వికెట్లు పడగొట్టాడు. సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 224/9తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 243 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 362 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 226 పరుగులకు ఆలౌటైంది. అలీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 362; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 226; **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్:** 243; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 202 (ఆమ్లా 83, డుప్లెసిస్ 61, మహారాజ్ 21; అలీ 5/69, అండర్సన్ 3/16)

కోహ్లి.. రిచర్డ్స్‌ను తలపిస్తున్నాడు



కొలంబో: టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి బ్యాటింగ్ చూస్తుంటే.. తనకు వెస్టిండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ గుర్తుకొస్తున్నాడని శ్రీలంక మాజీ ఆటగాడు అరవింద డిసిల్వా అన్నాడు. "కోహ్లి క్రికెట్ ఆడే విధానం, అతడి పొగరు, ఆత్మవిశ్వాసం.. చాలా వరకు రిచర్డ్స్ లాంటి దిగ్గజాల్ని గుర్తుకు తెస్తోంది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియన్లను అతను ఎదుర్కొన్న తీరు చాలా ప్రత్యేకం. గావస్కర్, కపిల్, సచిన్‌ల మాదిరే భారత క్రికెట్ రాతను మార్చి, దాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సత్తా కోహ్లికి ఉంది" అని అతను చెప్పాడు. సంగక్కర, జయవర్ధనెల నిష్క్రమణ తర్వాత శ్రీలంక క్రికెట్ పతనం తనకు ఆవేదన కలిగిస్తోందని, మళ్లీ తమ జట్టును గాడిన పెట్టాలంటే దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని డిసిల్వా అభిప్రాయపడ్డాడు.

కరువానాపై ఆనంద్ విజయం



సెయింట్ లూసియా: ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ సింక్వీఫీల్డ్ కప్‌లో తొలి విజయం సాధించాడు. ఐదో రౌండ్లో అతడు ప్రపంచ నంబర్-2 ఫాబియానో కరువానా (అమెరికా)ను ఓడించాడు. తెల్లపావులతో ఆడిన ఆనంద్ 29 ఎత్తుల్లోనే ప్రత్యర్థికి చెక్ పెట్టాడు. టోర్నీలో తన తొలి నాలుగు గేమ్‌లను ఆనంద్ డ్రాగా ముగించాడు. ఈ విజయంతో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో కలిసి ఆనంద్ (3 పాయింట్లు) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. మాక్సిమ్ వచీర్ లగ్రావె (ఫ్రాన్స్) 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.



సింధు 4.. శ్రీకాంత్ 8

దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పి.వి.సింధుకు నాలుగో సీడ్ దక్కగా.. కిదాంబి శ్రీకాంత్‌కు ఎనిమిదో సీడింగ్ లభించింది. మరో స్టార్ సైనా నెహ్వాల్ 12వ సీడ్‌గా పోటీపడుతోంది. గ్లాస్గోలో ఈనెల 21 ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీలో అజయ్ జయరాం (13వ సీడ్), సాయిప్రణీత్ (15)లకు కూడా సీడింగ్‌లు దక్కాయి. కొంతమంది ఆటగాళ్లు తప్పుకోవడంతో చివరి నిమిషంలో పురుషుల సింగిల్స్‌లో చోటు దక్కించుకున్న సమీర్‌వర్మ.. అన్‌సీడెడ్‌గా బరిలో దిగుతున్నాడు. పురుషుల సింగిల్స్‌లో సొన్ వాన్ హొ (కొరియా), మహిళల సింగిల్స్‌లో యమగూచి (జపాన్) టాప్‌సీడ్లుగా పోటీలో ఉన్నారు.

ఎరానిపై రెండు నెలల నిషేధం



రోమ్: ఫ్రెంచ్ ఓపెన్ మాజీ ఫైనలిస్ట్ సారా ఎరాని (ఇటలీ) డోపింగ్‌లో విఫలమైంది. డోప్ పరీక్షల కోసం ఆమె ఇచ్చిన శాంపిల్‌లో అనాస్ట్రోజోల్ అనే నిషిద్ధ ఔషధం వాడినట్లు తేలింది. దీంతో ఎరానిపై రెండు నెలల నిషేధాన్ని విధిస్తున్నట్లు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య వెల్లడించింది. నిజానికి ఎరానికి రెండేళ్ల నిషేధం పడాల్సి ఉంది. అయితే అనుకోకుండా ఆమె ఈ మందు వాడిందని నమ్మిన విచారణ కమిటీ.. ఎరానీకి తక్కువ శిక్షతో సరిపెట్టింది. సాధారణంగా అనాస్ట్రోజోల్ మందును రొమ్ము క్యాన్సర్ చికిత్సలో వాడతారు. 2012 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ చేరిన ఎరాని.. స్నేహితురాలు రాబెర్టా విన్సి చేతిలో ఓడింది. అదే ఏడాది సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఆమె టాప్-5లో చోటు సంపాదించింది. రష్యా స్టార్ మరియా షరపోవా కూడా డోపింగ్‌లో దొరికి శిక్ష అనుభవించిన సంగతి తెలిసిందే.

హెరాత్ ఔట్



కొలంబో: గాయాలతో, వరుస ఓటములతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న శ్రీలంకకు మరో దెబ్బ. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ రంగన హెరాత్ వెన్నునొప్పి కారణంగా మూడో టెస్టుకు దూరమయ్యాడు. ఈ సిరీస్‌లో గాయం కారణంగా ఆటకు దూరమైన నాలుగో లంక ఆటగాడతను. ఇంతకుముందు లక్మల్, గుణరత్నె, నువాన్ ప్రదీప్ కూడా గాయాలతో తప్పుకున్నారు.

పుజారా.. ద్రవిడ్‌లా

వీవీఎస్ లక్ష్మణ్

రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక పోరాడినప్పటికీ మ్యాచ్‌లో ఎప్పుడూ వెనుకబడే ఉంది. రెండో టెస్టు ఫలితంపై ఏ దశలోనూ సందేహం లేదు. సాధారణంగా ఉపఖండంలో టెస్టు ఫలితాలను తొలి ఇన్నింగ్స్‌లే నిర్దేశిస్తాయి. ఒకసారి భారత్ 600పై స్కోరు చేసి, ఆతిథ్య జట్టును 183 పరుగులకు ఆలౌట్ చేశాక.. ప్రశ్న ఎప్పుడు గెలుస్తుందన్నదే. గెలుస్తుందా లేదా అన్నది కాదు. లోతైన బ్యాటింగ్ ఆర్డర్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు భారీ స్కోరును అందించింది. ఐతే పుజారా, రహానెల ఇన్నింగ్స్‌లు అత్యంత కీలకం. వీళ్లిద్దరు భారత్ అత్యుత్తమ టెస్టు బ్యాట్స్‌మెన్ అని కెప్టెన్ కోహ్లీనే స్వయంగా చెప్పాడు. ఆ విభాగంలో కోహ్లి తప్పక ఉంటాడని కొందరు అనొచ్చు. ఐతే ఈ ఇద్దరు శతక వీరులు తమ అంకితభావం, అన్వయంతో విరాట్ సరిగానే చెప్పాడని రుజువు చేశారు. చూస్తున్నకొద్దీ పుజారా ఆటపై మక్కువ పెరుగుతోంది. అతడి పరుగుల దాహం అమోఘం. అతడు ఒకే ఒక్క ఫార్మాట్ ఆడతాడు. అనుభవంతో చెబుతున్నా.. అలా ఒకే ఫార్మాట్ ఆడే ఆటగాడు వెంటనే లయను అందుకోవడం చాలా కష్టం. కానీ పుజారా అలా చేయగలగడానికి అతడి చక్కని సన్నాహమే కారణం. ఐపీఎల్‌లో ఎవరూ అతణ్ని తీసుకోలేదు. దీంతో అతడు కౌంటీ క్రికెట్లో నాటింగ్‌హామ్‌షైర్ తరఫున ఆడాడు. అతడు ఇప్పుడు చాలా ఫిట్‌గా కనిపిస్తున్నాడు. ఓ గొప్ప ఆటగాడు మంచి ఫామ్‌ను పూర్తిగా సొమ్ము చేసుకుంటాడు. గత 15 టెస్టుల్లో పుజారా దాదాపు 1600 పరుగులు చేశాడు. అతడు నాకు రాహుల్ ద్రవిడ్‌ను గుర్తు చేస్తున్నాడు. మూడో స్థానంలో పుజారా భారత బ్యాటింగ్‌కు ఇరుసులా ఉంటున్నాడు. వృద్ధిమాన్ సాహా కూడా చాలా బాగా ఆడాడు. టర్నింగ్ పిచ్‌పై అతడు అద్భుతంగా కీపింగ్ చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క బై కూడా ఇవ్వని వికెట్‌కీపర్లు నాకు తెలిసి చాలా అరుదు. సాహా ఆత్మవిశ్వాసం అతడి బ్యాటింగ్‌లోనూ కనిపిస్తోంది. ఇప్పుడు అతడు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాల్లాగ నిఖార్సైన ఆల్‌రౌండర్.

థాంప్సన్‌కు షాక్.. 100 మీ ఛాంప్ టోరి



టోరి

లండన్: పురుషుల 100 మీ పరుగులో సంచలనాలు నమోదైనట్లే మహిళల వంద మీటర్ల పరుగులోనూ ఊహించని ఫలితాలొచ్చాయి. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, ఫేవరెట్ ఎలైన్ థాంప్సన్ (జమైకా) ఐదో స్థానంలో నిలువగా, టోరి బోవీ (అమెరికా) సెకనులో వందో వంతు తేడాతో స్వర్ణం ఎగరేసుకుపోయింది. ఆమె 10.85 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి గెలవగా, మారి జోస్ (ఐవరీ కోస్ట్, 10.86 సె), షిప్పర్స్ (నెదర్లాండ్స్, 10.96 సె) రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. థాంప్సన్ (10.98 సె) ఐదో స్థానంతో రేసు పూర్తి చేసింది. పురుషుల షాట్‌పుట్‌లో థామస్ వాల్ష్ (న్యూజిలాండ్) స్వర్ణం గెలిచాడు. అతను గుండును 22.03 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు.

ఐక్యత లేకుంటే బీసీలకు అధికారం దక్కదు

జేడీయూ నేత శరద్‌యాదవ్

ఈనాడు, దిల్లీ: ఐక్యత లేకపోతే బీసీలకు అధికారం దక్కదని జేడీయూ నేత శరద్‌యాదవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీలు రాజకీయ శక్తిగా మారాలని ఆయన పేర్కొన్నారు. మండల కమిషన్ సిఫార్సులు అమలులోకి వచ్చిన దినాన్ని పురస్కరించుకొని సోమవారమిక్కడ ఓబీసీ రాష్ట్రీయ మహాసంఘటన నిర్వహించారు. 26 రాష్ట్రాల నుంచి బీసీ నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో శరద్‌యాదవ్ మాట్లాడారు. రాజకీయ పార్టీలన్నీ బీసీలను ద్వితీయ శ్రేణి పౌరులగానే చూస్తున్నాయన్నారు. ఎన్నికల తర్వాత వారిని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలు ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారామ్ అహిర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. క్రీమీలేయర్‌ను ఎత్తివేసి బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు తెలిపారు. అలా చేసినప్పుడే మండల కమిషన్ సిఫార్సుల మేరకు 27 శాతం రిజర్వేషన్లు అందే అవకాశం ఉందన్నారు. ఓబీసీలను కేంద్రస్థాయిలో వర్గీకరించాలని బీసీకమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య డిమాండు చేశారు. బీసీల ఉద్యమాన్ని గల్లీ నుంచి దిల్లీ వరకు విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అఖిలభారత బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో బీసీల ఐక్యత పటిష్ఠంగా ఉన్నప్పుడే డిమాండ్లు సాధించుకోగలమన్నారు. ఈసందర్భంగా 9 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం శరద్‌యాదవ్‌ను సత్కరించారు. బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఆల్‌మెన్‌రాజు, నిరంజన్ పాల్గొన్నారు.

రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక సంస్థ

రూ.వంద కోట్లతో మూల నిధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రైల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తోంది. దీనికి రూ.వంద కోట్లతో మూలనిధిని సమకూరుస్తున్నారు. ఇందుకు సంబంధించి రవాణా, రహదారులు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సుమితాదావ్రా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వే మంత్రిత్వ శాఖ 49శాతం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 51శాతం నిధులు ఇస్తుంది. ఈ కార్పొరేషన్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలసి మేనేజింగ్ డైరెక్టర్‌ను ఎంపికచేస్తాయి. కేంద్ర ప్రభుత్వ గ్రూప్-ఎ సర్వీసుల్లో కనీసం 25ఏళ్ల అనుభవం ఉన్న అధికారిని ఎండీగా నియమించాల్సి ఉంటుంది. ఈ అధికారికి రైల్వే మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టుల్లో అయిదేళ్ల అనుభవం అవసరం. ఈ సంస్థల్లో రైల్వే తరపున ఒక డైరెక్టర్, ఇద్దరు పార్ట్‌టైం డైరెక్టర్లు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు పార్ట్‌టైం డైరెక్టర్లు, ఒక డైరెక్టర్ ఉంటారు.

చిట్టి ఊహలకు గట్టి రెక్కలు

- చిన్నారుల ఆలోచనల ప్రోత్సాహకానికి ఏటీఎల్‌లు
- తెలుగు రాష్ట్రాల్లో 47 ప్రయోగశాలలు సిద్ధం
- బాలల్ని ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దటమే లక్ష్యం
- అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో నీతిఆయోగ్ ప్రత్యేక కార్యక్రమం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి : చిన్నారుల లేత మెదళ్లలో ఎన్నో ఆలోచనలుంటాయి.. ఆవిష్కరణల దిశగానూ వారి ఊహాలోకం ఉంటుంది. వారి ఊహలను వాస్తవికతలోకి తీసుకొచ్చే ప్రోత్సాహం ఇప్పటివరకు లేదు. ఇక నుంచి 'ఆలోచనలు.. ఆవిష్కరణలు మీవి.. ప్రోత్సాహం మాది'అంటూ కేంద్ర ప్రభుత్వం బాలల్ని వెన్నుతడుతోంది. ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(నీతిఆయోగ్) కృషితో ఇక బాలలు ఆవిష్కర్తలుగా మారబోతున్నారు. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది బాల ఆవిష్కర్తల తయారీ లక్ష్యంగా నీతిఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏటీఐ)లో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)లను అందుబాటులోకి తెచ్చింది. సాధారణ ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు రెండోతరం ప్రయోగశాలలే పరిచయమవ్వని వేళ, ఏకంగా మూడోతరం ప్రయోగశాలలను ఏర్పాటు చేయించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 30 విద్యాలయాల్లో మూడోతరం రోబోటిక్ ప్రయోగశాలలు ఏర్పాటయ్యాయి. అవి ఈ వారంలోనే ప్రారంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం.



అటల్ మిషన్ ఇన్నోవేషన్ కార్యక్రమ లోగో

కార్యక్రమం లక్ష్యం: బాల్యదశ నుంచే చిన్నారులను సృజనశీలురుగా.. ఆవిష్కర్తలుగా మార్చడం.

13,005 దరఖాస్తులు.. 457 ఎంపిక : గడిచిన విద్యా సంవత్సరంలో అన్ని విద్యాలయాల నుంచి ఏటీఎల్‌ల మంజూరుకు దరఖాస్తుల్ని ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా 13,005 విద్యాలయాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిని వివిధ కోణాల్లో పరిశీలించి 457 విద్యాలయాల్ని మూడోతరం ప్రయోగశాలల ఏర్పాటుకు ఎంపిక చేశారు. మొదటి విడతలో 257, రెండోవిడతలో 200 ప్రయోగశాలలు మంజూరు చేశారు.

ఏపీకి 32.. తెలంగాణకు 17: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 47 విద్యాలయాల్లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలల ఏర్పాటుకు నీతిఆయోగ్ అనుమతినిచ్చింది. అందులో ఆంధ్రప్రదేశ్ విద్యాలయాలు 32 ఉండగా.. తెలంగాణలో 17 ఉన్నాయి.


గుంటూరులోని దేచవరం ఏపీ మోడల్ పాఠశాలకు చేరిన ప్రయోగశాల పరికరాలు



అటల్ టింకరింగ్ ప్రయోగశాల


గుంటూరు జిల్లా నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయం ప్రయోగశాలలో సిద్ధం చేసిన కంప్యూటర్లు

ఐదేళ్ల ప్రాజెక్టు.. తొలి ఏడాది రూ.12 లక్షలు : ఐదేళ్లపాటు ఏటీఎల్ కార్యక్రమం నడవబోతుంది. తొలివిడతగా ఈ ఏడాది రూ.12 లక్షల నిధుల్ని మంజూరు చేశారు. ఇందులో రూ.10 లక్షలు ప్రయోగశాల ఏర్పాటుకు మిగిలిన రూ.2 లక్షలు ప్రయోగశాల నిర్వహణకు వెచ్చించనున్నారు. వచ్చే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.2 లక్షల చొప్పున ప్రయోగశాల నిర్వహణకు నిధులు మంజూర్వనున్నాయి.

ప్రయోగశాలలో ఏం ఉంటాయి.. ఏం చేస్తారు: ప్రయోగశాల పూర్తిగా ఏసీతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది. 3డీ ప్రింటర్లు, సెన్సర్లు, రోబోటిక్, సైంటిఫిక్, ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లతోపాటు బహిరంగంగా బోర్డులపై మైక్రో కంట్రోలర్లు ఉంటాయి. పాఠ్యాంశంలోని అంశాలతోపాటు చదువుతో సంబంధంలేని ఆవిష్కరణలకు సైతం ఈ ప్రయోగశాలలో చోటుంటుంది. విద్యార్థుల ఆలోచనల్ని ప్రయోగశాలలో ఉండే సైన్సు నిపుణులు తెలుసుకుని వాటిని ఆవిష్కరణ రూపంలోకి తెచ్చేలా ప్రోత్సహిస్తారు. పూర్తిస్థాయిలో పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ఈ ప్రయోగశాల ద్వారా అందజేస్తారు. ఆవిష్కరణ వ్యయం ఎక్కువగా ఉంటే స్థానికంగా ఉండే అటల్ ఇంక్యూబేషన్ కేంద్రాల నుంచి ఆర్థిక సాయం తీసుకుంటారు. ప్రయోగశాలలు ఏర్పాటైన పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు వివిధ ప్రాజెక్టులు చేయించడం.. బృంద చర్చలు.. అతిథి ఆచార్యులు, శాస్త్రవేత్తలతో చైతన్యవంతమైన కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. విద్యాలయంలేని సమయంలో ఈ ప్రయోగశాలలకు ఇంజినీరింగ్ కళాశాలలు, స్థానికంగా ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వెళ్లి ఆవిష్కరణలు చేసుకోవచ్చు. ఈ ప్రయోగశాలల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలన, మదింపునకు నీతిఆయోగ్ ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున ప్రతినిధుల్ని నియమించింది.

ఈ వారంలోనే దేశవ్యాప్తంగా ప్రారంభం

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జులై 27వ తేదీన దేశవ్యాప్తంగా ఒకేసారి 457 ప్రయోగశాలలను ప్రారంభించాలని ముందుగా నిర్ణయించారు. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో ప్రయోగశాలలు సిద్ధమవ్వకపోవడంతో వాయిదా వేశారు. తాజాగా త్వరలోనే ప్రారంభించడానికి పైస్థాయి నుంచి సంకేతాలు అందాయి. ఇప్పటికే అన్నిచోట్లా ప్రయోగశాలలు సిద్ధమయ్యాయి. గుంటూరు జిల్లాలో నల్లపాడు, దేచవరం మోడల్ పాఠశాలల్లో ప్రయోగశాలలను సిద్ధం చేశారు.

నవలోకం వైపునకు తీసుకువెళ్తాయి


ఆర్.నరసింహారావు
ఏపీ ఆదర్శ పాఠశాలల రాష్ట్ర సంయుక్త సంచాలకులు

ఏటీఎల్‌లు చిన్నారుల్ని నవలోకం వైపునకు తీసుకెళ్తాయి. వారి మెదడు చురుగ్గా పనిచేసేలా.. నైపుణ్యాలతో చదువులు అభ్యసించేలా అవి ప్రోత్సహిస్తాయి. బాల ఆవిష్కర్తలను తయారు చేయడం లక్ష్యంగా ఈ ప్రయోగశాలలు నడుస్తాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి ఎక్కువ కేంద్రీయ విద్యాలయాలు ప్రయోగశాలల ఏర్పాటుకు ఎంపికవ్వడం మంచి పరిణామం. సమాజాభివృద్ధికి దోహదపడే నూతన ఆవిష్కరణలకు టింకరింగ్ ప్రయోగశాలలు కేంద్ర బిందువులుగా మారేలా కృషి చేస్తాం.


మణివన్నన్
డిప్యూటీ కమిషనర్ కేవీఎస్, హైదరాబాద్ రీజియన్

ఆహార కల్తీ నివారణపై దృష్టి: పుష్పరాజ్

ఈనాడు, అమరావతి: ప్రజలకు ఆహార భద్రతను కల్పించడం రాజ్యాంగ హక్కు. అనీ ఈ హక్కు అమలు చేసేందుకు తమ బృందం పనిచేస్తుందని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ జె.ఆర్.పుష్పరాజ్ స్పష్టం చేశారు. కమిషన్ ఛైర్మన్‌గా సోమవారం ఆయన సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ సభ్యులుగా నీలాయపాలెం విజయకుమార్, జి.కృష్ణమ్మ, స్వర్ణ గీత, ఎల్.వెంకట్రావు, ఎన్.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. వీరిని రాష్ట్ర మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత, పౌరసరఫరాల శాఖ కమిషనర్ రాజశేఖర్ తదితరులు అభినందించారు. అనంతరం పుష్పరాజ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఆహారంలో కల్తీ ఎక్కువగా జరుగుతోందని, ఇలాంటి అక్రమచర్యలు నివారించడంపై దృష్టిపెట్టి కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

జంతుహింస నిరోధక కమిటీల పనితీరుపై నివేదిక కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఏపీలోని 13 జిల్లాల్లో జంతుహింస నిరోధక కమిటీల (ఎస్‌పీసీఏ) పనితీరు, వాటి నిర్వహణ సక్రమంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ నివేదిక సమర్పించాలని ఏపీ పశుసంవర్ధకశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అక్రమ రవాణాలో దొరికిన జీవాలకు ఆశ్రయం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రదేశాలు, నీరు, దాణా ఏర్పాట్లు, ఎంత మేరకు నిధులు కేటాయించారు, ఎస్‌పీసీఏల రిజిస్ట్రేషన్ తదితర వివరాలన్ని ఆ నివేదికలో పేర్కొనాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. జంతుహింసను నిరోధించే నిమిత్తం ప్రతి జిల్లాలో ఎస్‌పీసీఏలు ఏర్పాటుచేసేలా ఏపీ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ.. 'యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్', మరొకరు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేసిన విషయం తెలిసిందే.

'స్పిరులినా' మెరుగైన ఆరోగ్యానికి చిరునామా!

- చిన్నారులు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపాలకు విరుగుడు
- కర్ణాటకలో విజయవంతమైన విధానం
- అనంతపురం, కడప అంగన్‌వాడీల్లో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత పౌష్టిక ఆహారం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉండేందుకు ఇతర అనారోగ్య సమస్యల బారిన పడకుండా చూడడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా కర్ణాటకలో విజయవంతమైన 'స్పిరులినా' గోళీలు, ద్రావణం పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత అనంతపురం, కడప నగరాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. 'స్పిరులినా' అనేది నీటిలో పెరిగే సహజ సిద్ధ నాచు. దీంట్లో అత్యంత ఎక్కువ పరిమాణంలో మాంసకృత్తులు, యాంటీ ఆక్సిడెంట్లు, వైటమిన్-బి ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి.

సహజసిద్ధంగా తయారీ

శుద్ధిచేసిన నీటిని నిల్వచేసినప్పుడు పైన వచ్చే నాచు మొక్కను పొడిగా మార్చి.. నిర్ణీత ప్రమాణాలు అనుసరించి చక్కెర, చాక్లెట్, వెనీల ఫ్లేవర్‌ను కలిసి చిన్నచిన్న గోళీలు తయారు చేస్తున్నారు. దీనిని స్పిరులినా ఫోర్టుఫైడ్ షుగర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలింతలు, గర్భిణుల కోసం మాత్రలు, సిరప్‌గా కూడా తయారుచేస్తున్నారు. తినే ఆహారానికి అదనంగా స్పిరులినా చిన్నారులకు గ్రాముల రూపంలో అంద చేస్తారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చి (ఐహెచ్ఎంఆర్) అధ్యయనంలో స్పిరులినా తీసుకున్న చిన్నారుల బరువు వయసుకు తగినట్లు పెరిగినట్లు తేలింది. స్పిరులినాను ఫుడ్ స్టాండర్డ్స్ అండ్ సేఫ్టీ అథారిటీతోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా గుర్తించింది.



నీటిలో స్పిరులినా సాగు ★ స్పిరులినా గోళీలు

కర్ణాటకలో 30 వేల మందిపై అధ్యయనం

కర్ణాటక రాష్ట్రంలోని జిందాల్ స్టీల్ కంపెనీ సామాజిక బాధ్యత కింద చిన్నారుల్లోని పౌష్టికాహార లోపాన్ని తమ వంతున తగ్గించాలని నిర్ణయం తీసుకుంది. బళ్లారి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారానికి అదనంగా 'స్పిరులినా' అందజేసింది. సందూరు, హోస్పేట, కుడిలిగా, ఇతర తాలూకాల్లో కలిపి ఆరు నెలల నుంచి 6 సంవత్సరాల మధ్య ఉన్న 30716 మందికి 180 రోజుల పాటు స్పిరులినా ఇచ్చారు. 2014-16, 2016-17 మధ్య ఎంపికచేసిన వారిలో ఈ అధ్యయనం జరిగింది. దీంతో చిన్నారుల్లో రక్తహీనత తగ్గడమే కాకుండా... బరువు పెరగడం, మానసికంగా ఎదుగుదల కనిపించింది. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అనుసరించి స్పిరులినాను ఐదు నుంచి పది గ్రాముల వరకు ప్రతి రోజూ చిన్నారులకు ఇచ్చారు. పిల్లల పౌష్టికాహారలోపాన్ని అనుసరించి దీని మోతాదును పెంచారు. స్పిరులినాను ఇవ్వటంతో జీర్ణశక్తి పది శాతం నుంచి యాభై నుంచి ఆరవై శాతానికి పెరిగినట్లు గుర్తించారు. కర్ణాటకలో ఈ పథకం అమలుకు జిందాల్ సంస్థ సీఈఓగా కర్ణాటక విశ్రాంత ఐ.ఎ.ఎస్.డాక్టర్ కేదర్ వ్యవహరిస్తున్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు కూడా అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక బడ్జెట్‌లో రూ 500 కోట్లు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ భారత వైద్య సంస్థ గౌరవ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ కె.కరుణామూర్తి(కమ్యూనిటీ మెడిసిన్), డాక్టర్ కీర్తి, అపర్ణ, శ్రీనివాస్, అహల్య (మెప్మా), సామీనా తదితరులతో కూడిన బృందం స్పిరులినా కార్యక్రమాన్ని పరిశీలించింది. కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోనూ దీన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఉల్లి రైతుకు ఊరట దొరికింది

- కర్నూలు విపణిలో రూ.2,810కు చేరిన ఉల్లి ధర
- క్వింటా రూ.3,500 వరకు పెరిగే అవకాశం

కర్నూలు: రెండేళ్లుగా సరైన ధరల్లేక, పెట్టుబడి దక్కక కుప్పకూలిన ఉల్లి రైతుకు ప్రస్తుత ధరలు ఊరటనిస్తున్నాయి. కర్నూలు మార్కెట్‌లో సోమవారం ఉల్లి క్వింటా రూ.2,810 పలికింది. ఈ నెలలో ఈ ధర రూ.3,500కు చేరే అవకాశం ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో బహిరంగ విపణిలో నిన్నమొన్నటి వరకు కిలో రూ.పది నుంచి రూ.15 వరకు పలికిన ఉల్లి నేడు కిలో రూ.30 నుంచి రూ.35 పలుకుతోంది. ఈ ధరలూ పెరిగే అవకాశాలున్నాయి. వర్షాలు బాగా కురిస్తేనే ఉల్లి ధర తగ్గే అవకాశం ఉంది.



అక్కడ అతివృష్టి... ఇక్కడ అనావృష్టి : ఉల్లి పంట బాగా సాగయ్యే మహారాష్ట్ర, గుజరాత్‌లలో ప్రస్తుతం అతివృష్టి నెలకొంది. మహారాష్ట్రలోనూ ఉల్లి క్వింటా రూ.2,300 పలుకుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉల్లి ఎక్కువగా పండించే రాయలసీమలో మూడేళ్లుగా వరుస కరవు వెంటాడుతోంది. కర్నూలు జిల్లాలోని గాజులదిన్నె, సుంకేసుల ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో ఉల్లి సాగు పూర్తిగా తగ్గింది. కొన్ని మండలాల్లో బోర్ల కింద అరకొరగా సాగు చేశారు. జిల్లాలో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 20,754 హెక్టార్లు కాగా 2016 ఖరీఫ్‌లో 13,465 హెక్టార్లు సాగయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కేవలం 8,893 హెక్టార్లలోనే వేశారు. అంటే గతేడాది ఖరీఫ్‌తో పోల్చితే 43 శాతం తక్కువ ఉల్లి సాగైనట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోనూ ఇదే కరవు పరిస్థితులు కొనసాగుతుండడంతో ప్రస్తుతం ఉల్లికి గిరాకీ పెరిగింది. జులై నెలాఖరులో ప్రారంభమైన కర్నూలు మార్కెట్‌లో తొలినాళ్లలో కనిష్ఠ, గరిష్ఠ ధరలు రూ.350 నుంచి రూ.750 వరకు పలికాయి. ప్రస్తుతం ఈ ధరలు కనిష్ఠంగా రూ.750 నుంచి గరిష్ఠంగా రూ.2,810 పలుకుతోంది. వ్యాపారులు ఈ సరకును ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. పొలాల వద్దే వ్యాపారులు క్వింటా రూ.2,500-రూ.2,600 ఇచ్చి కొనుక్కుని నేరుగా తాడేపల్లిగూడెం తరలిస్తున్నారు. మరికొందరు తెలంగాణ, చెన్నైల వైపు తీసుకెళుతున్నారు.

ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు

రైతుబజార్లలో రాయితీపై ఉల్లి సరఫరాకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విపణికి వచ్చే ఉల్లిని ప్రభుత్వమే ఏరోజుకారోజు కొనాలని ప్రణాళిక రూపొందిస్తోంది. 2015లో ఉల్లి ధరలు అనూహ్యంగా పెరిగినప్పుడు రైతుబజార్ల ద్వారా రాయితీపై అందించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00